ఈనాడు


విజయవాడ 16-2-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 187

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

శ్రీశైలం



నంద్యాల జిల్లా శ్రీశైలంలో నంది వాహనంపై ఊరేగుతున్న శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లు

ఎటు చూసినా పారవశ్యం... భక్తజన కోలాహలం.. మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శివాలయాలు రద్దీగా మారాయి.. ఆధ్యాత్మికతను పంచాయి. శ్రీశైలంలో మల్లన్న కల్యాణం వైభవోపేతంగా కనుల పండువగా సాగింది. కోటప్పకొండలో త్రికోటేశ్వరుని క్షేత్రం... విద్యుత్తు ప్రభలతో వెలుగులీనింది. జనం స్వామివారిని దర్శించుకుని... ఆ రూపాన్ని మనసుల్లో నింపుకొని తరించారు.

కోటప్పకొండ



పల్నాడు జిల్లా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ శోభ

గిరులన్నీ.. భక్త జన సిరులు

3లో

శ్రీకాళహస్తి



ఇంద్రవిమానంపై సోమస్కందమూర్తి, చప్పరంపై జ్ఞానప్రసూనాంబిక తిరువీధుల్లో విహారం

పాక్ పనిపట్టారు



ప్రపంచకప్‌లో భారత్ అలవోక విజయం

ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్

సమష్టిగా విజృంభించిన బౌలర్లు

టాస్ చేజారింది.. తొలి ఓవర్‌లోనే అభిషేక్ ఔట్. ప్రపంచకప్‌లో పాకిస్థాన్ అనగానే రెచ్చిపోయి ఆడే భారత జట్టు.. ఈసారి పోరును ఇలా ఆరంభిస్తుందని అభిమానులు ఊహించి ఉండరు! 2021 ప్రపంచకప్ ఫలితం పునరావృతం కాబోతోందా? అనే భయం...

కానీ ఇషాన్ కిషన్.. హీరోగా మారాడు. జట్టు ఒత్తిడిలో ఉంటేనేం.. పరిస్థితులు బ్యాటింగ్‌కు అనుకూలంగా లేకపోతేనేం.. బంతి విపరీతంగా స్పిన్ తిరుగుతుంటేనేం.. ప్రత్యర్థి ఆరుగురు స్పిన్నర్లను దాడికి దించితేనేం.. బ్యాట్ మీదికి బంతి రాకపోతేనేం.. అతడి ఆట అతడిదే! ఉన్నంతసేపూ పాక్ బౌలర్లకు, ఫీల్డర్లకు ఊపిరి సలపనివ్వని ఈ చిన్నోడు.. మ్యాచ్ ఫలితాన్ని శాసించే ఇన్నింగ్స్ (40 బంతుల్లో 77) ఆడేశాడు.

176 అంటే.. టీ20ల్లో పెద్ద లక్ష్యమేమీ కాదు. ఛేదన కష్టమూ కాదు. కానీ మన బౌలర్లు.. 114 పరుగులకే పాక్ జట్టును కుప్పకూల్చేశారు. 61 పరుగుల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసి టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఆ జట్టుపై అతి పెద్ద విజయాన్ని అందుకున్న టీమ్‌ఇండియా.. సూపర్-8లోకి దూసుకెళ్లింది.




అమెరికాలో శవమై కనిపించిన సాకేత్

కొద్ది రోజులుగా ఆచూకీ లేకపోవడంతో అక్కడి పోలీసుల దర్యాప్తు

మృతదేహం లభ్యం

11లో



1920లలో తీసుకున్న నిర్ణయాలు 1947లో స్వాతంత్ర్య సముపార్జనకు పునాది వేశాయి. అలాగే ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలు 2047 నాటికి వికసిత భారత్ సాకారమయ్యేందుకు పునాదిలా నిలుస్తాయి. ఇదే తరుణం.. సరైన సమయం.. అనేది ఎర్రకోటపై నుంచి నేను ఇచ్చిన పిలుపు. ఇదిప్పుడు దేశ సంకల్పంగా మారింది. దేశంలో సరికొత్త విశ్వాసం తొణికిసలాడుతోంది.

– ప్రధాని నరేంద్ర మోదీ

ప్రజాకర్షక పథకాలకు తెరదించాం

వృద్ధికి ఊతం లక్ష్యంతో కావాలనే వాటిని వదిలేశాం

- వ్యవస్థీకృత అంతరాలు సరిచేస్తున్నాం
- తదుపరి ప్రస్థానానికి బడ్జెట్ ఊతం
- వికసిత భారత్‌కు ఇది పునాది
- ఒప్పందాలతో ఎగుమతులకు ఊపు
- తెలుగు రాష్ట్రాలకూ మేలు చేశాం
- నా ఆలోచనలన్నీ దీర్ఘకాలిక దృష్టితోనే
- 'పీటీఐ' ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోదీ

దిల్లీ: ఉత్పాదకతను పెంచేలా ఖర్చులు ఉండాలనేదే తమ సర్కారు నిర్ణయించుకున్న గీటురాయి అని, అందుకే బడ్జెట్లో ప్రజాకర్షక పథకాల జోలికి వెళ్లలేదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉద్యోగావకాశాలకు, సుస్థిరాభివృద్ధికి ఊతమిచ్చేలా మౌలిక సదుపాయాలకు రికార్డుస్థాయిలో కేటాయింపులు చేశామని చెప్పారు. ఆదివారం పీటీఐ వార్తా సంస్థకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. విదేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య, రక్షణ ఒప్పందాలు, సంస్కరణలవల్ల ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలు, ప్రపంచవ్యాప్త అస్థిర పరిస్థితుల్లోనూ భారత్ వెలుగుతున్న తీరు.. తదితర అంశాలపై మోదీ సవివరంగా రాతపూర్వక సమాధానాలు ఇచ్చారు. 'స్వల్పకాలిక ప్రజాకర్షక పథకాలను మేం ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టాం. మునుపటి ప్రభుత్వాల హయాంలో నెలకొన్న వ్యవస్థీకృత అంతరాలను సరిచేయడంపై దృష్టి సారించాం. సాహసోపేత సంస్కరణలు చేపట్టాం. అభివృద్ధి చెందిన భారత్‌కు పునాదులు వేశాం. ఆ ప్రస్థానంలో తదుపరి స్థాయికి చేరేందుకు కొత్త బడ్జెట్ దోహదపడుతుంది.

(మిగతా 2లో)

కార్యకర్తల కష్టాన్ని గుర్తించేవారే సంపూర్ణ నాయకులు



జనసేన తొలి సభ్యత్వం తీసుకొని, నమోదును ప్రారంభించిన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్

జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పవన్ కల్యాణ్

కార్యకర్తల బీమాకు రూ.2 కోట్ల విరాళం

ఈనాడు, అమరావతి: క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల కష్టాన్ని గుర్తించేవారు.. పార్టీ ఉన్నతి కోసం ఉద్యమి, సాధక్, ప్రదాతలుగా మారి పనిచేసేవారే సంపూర్ణ నాయకులుగా ఎదుగుతారని జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తొలి సభ్యత్వం తీసుకున్నారు. కార్యకర్తల బీమా కోసం రూ.2 కోట్ల చెక్కును పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. ఈ నెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఐదోవిడత క్రియాశీలక సభ్యత్వ నమోదు మొదలవుతుందని.. పిఠాపురం నియోజకవర్గంలో మాత్రం వారం ముందే

(మిగతా 2లో)

దీర్ఘకాలిక లక్ష్యాలకు ప్రత్యేక నిధి

రూ.100 కోట్లతో ఏపీ వెల్త్ ఫండ్

పెట్టుబడికి ప్రైవేటు సంస్థలకూ అవకాశం

ఈనాడు, అమరావతి: దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని రూ.100 కోట్లతో ఏపీ వెల్త్‌ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నార్వే, అబుధాబి సావరిన్ నిధుల మాదిరి విధానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. ఈ తరహా విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రంగా అధికారులు పేర్కొంటున్నారు. ఈ మొత్తం భవిష్యత్తులో పెద్ద పెట్టుబడిగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే నిధితో పాటు.. ప్రైవేటు సంస్థల నుంచి నిధులు సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. ఫండ్‌పై వచ్చే లాభాలను పెట్టుబడి నిష్పత్తి ఆధారంగా చెల్లించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

(మిగతా 2లో)

నేడు రాజధానికి బిల్‌గేట్స్ బృందం

సంజీవని, సాగులో సాంకేతికత సహా పలు ప్రాజెక్టుల పరిశీలన

స్వర్ణాంధ్ర విజన్-2047పై చంద్రబాబు ప్రజంటేషన్

10లో

సుబ్బారెడ్డి సేవలోనే చిన్నప్పన్న

పేరుకే ఏపీ భవన్ లైజనింగ్ అధికారి

అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత వ్యవహారాల్లో తలమునకలు

2019 నుంచి 2023 వరకూ తితిదే వ్యవహారాల్లో జోక్యం

12లో

గ్రామీణానికి సాంకేతికత వెలుగులు!

సమృద్ధి గ్రామ్ ఫిజిటల్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం కసరత్తు


తెలుగు రాష్ట్రాల నుంచి నారాకోడూరు ఎంపిక

10లో

కలవరపెడుతున్న టీనేజ్ ప్రెగ్నెన్సీ

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకర స్థాయిలో సమస్య
- అత్యధికంగా పల్నాడులో 14.94%.. కర్నూలులో 13.50%
- కీలక శాఖల్లో ఉదాసీనతతో క్షేత్రస్థాయిలో అదుపు తప్పుతున్న పరిస్థితి

ఈనాడు – అమరావతి



చిన్న వయసులో.. పెద్ద ప్రమాదం

టీనేజ్ గ్రూప్ అంటే 13 ఏళ్ల నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు వారే. వీరిలో ఎన్నో ఆశలు, మరెన్నో లక్ష్యాలు ఉంటాయి. ఈ వయసులో గర్భం దాల్చడం వల్ల ఆశలన్నీ నీరుగారుతున్నాయి. అక్కడితో వారి జీవితం బాధ్యతల్లో బందీ అవుతోంది. ఈ ప్రభావం కుటుంబం ఎదుగుదలతోపాటు.. రాష్ట్ర ఆర్థిక, సామాజిక వ్యవస్థలు, ప్రగతిపైనా ప్రతికూల ప్రభావం చూపుతోంది.

రాష్ట్రంలో కౌమార బాలికల్లో గర్భధారణ (టీనేజ్ ప్రెగ్నెన్సీ) ఆందోళన కలిగిస్తోంది. 25 జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రాయలసీమ, దక్షిణ కోస్తా తీర ప్రాంతాల్లో పరిస్థితి మరింత అదుపు తప్పింది. బాల్య వివాహాలు.. అత్యాచారాలు.. తెలిసీ తెలియని వయసులో క్షణికావేశం.. ఇలాంటివన్నీ చిన్న వయసులో గర్భం దాల్చడానికి కారణమవుతున్నాయి. దీంతో తల్లీబిడ్డల్ని ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. మాతాశిశు మరణాల ప్రమాదమూ పెరుగుతోంది. ఈ పరిస్థితి సామాజిక, ఆరోగ్య, ఆర్థిక రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తాజాగా మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్యశాఖతో పాటు ఇతర కీలక శాఖలను ఈ అంశంపై అప్రమత్తం చేశారు.

సున్నా స్థాయికి తేవాల్సింది పోయి.. 5% బెంచ్ మార్కా?

గత ప్రభుత్వం సమస్యను తేలిగ్గా తీసుకోవడంతో రాష్ట్రంలో టీనేజ్ ప్రెగ్నెన్సీ రాష్ట్ర సగటు 8.80 శాతానికి పెరిగింది. రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ కార్యక్రమం(ఆర్‌కేఎస్‌కే) ఇతరత్రా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అవగాహన కార్యక్రమాలు సమర్థంగా అమలు కావడం లేదు. కిశోర బాలికలకు ఆరోగ్యం, లైంగిక-పునరుత్పత్తి, పోషకాహారం, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించడంలో విఫలం కావడం, మత్తు పదార్థాల కట్టడి సాధ్యం కాకపోవడం, కీలక శాఖల ఉదాసీనతతో సమస్య జటిలమైంది.

■ వాస్తవానికి టీనేజ్ ప్రెగ్నెన్సీ (మిగతా 2లో)

కార్యకర్తల కష్టాన్ని గుర్తించేవారే
సంపూర్ణ నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమవుతుందని పవన్ కల్యాణ్ తెలిపారు. 'తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థులు గెలిచారు. ఇది చిన్న గెలుపే అయినా మార్పునకు బలమైన సంకేతం. ఏపీకి చెందిన పార్టీ తెలంగాణలో పోటీ చేయడమేంటని కొందరు విమర్శించినా.. జనసైనికులే వారి మాటల్ని తిప్పికొట్టారు. బాధ్యతాయుతమైన యువతను నాయకత్వం దిశగా తీసుకెళ్లడమే మా లక్ష్యం. అందులోభాగంగానే మున్సిపల్ ఎన్నికల్లో దివ్యాంగురాలైన నీత, చెప్పులు కుట్టుకునే సత్యనగేశ్, అంధుడైన కల్యాణ్ వెంకటేశ్‌కు పోటీచేసే అవకాశం లభించింది' అని వివరించారు.

ఉద్యమి.. సాధక్.. ప్రదాత: 'క్రియాశీలక సభ్యుడు, వాలంటీర్ అనే పదాలు పెద్దగా నచ్చలేదు. దృఢచిత్తంతో, కార్యసాధనలో ఎదురయ్యే ఒడుదొడుకుల్ని తట్టుకుని పట్టు వదలకుండా ముందుకు కదిలేవారిని ఉద్యమి అంటారు. ఇక నుంచి సభ్యత్వం తీసుకునే వారిని 'ఉద్యమి' అనే గౌరవప్రదమైన పేరుతో పిలుద్దాం. క్షేత్రస్థాయిలో తన పరిధిలోని సమూహంలో ప్రేరణ కలిగించి.. పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాల పట్ల ఆకర్షితుల్ని చేసి ఉద్యమిలుగా తయారుచేసే బాధ్యత తీసుకునే వారికి 'సాధక్' అనే పేరు నిర్ణయించాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు. 'జనసేన అంటే అంతులేని అభిమానం, పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం, నాయకత్వంపై నమ్మకం ఉన్నా.. ఎంతోమంది తమకున్న పరిమితుల వల్ల రాజకీయాల్లోకి క్రియాశీలకంగా రాలేకపోవచ్చు. పదవి ఆశించకుండానే... పార్టీకి అండగా నిలుస్తూ, సభ్యులకు తోడ్పాటు అందిస్తారు. ఇలాంటివారికి 'ప్రదాత' అనే పేరుతో సముచిత గౌరవం, గుర్తింపు ఇస్తున్నాం' అని వివరించారు. క్రియాశీలక సభ్యత్వాన్ని ఉద్యమి మెంబర్‌షిప్‌గా ప్రకటిస్తున్నామన్నారు.

13 లక్షలకు చేరిన సభ్యత్వం: '2020 సంవత్సరంలో క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90వేలు నమోదు చేశాం. ఎన్నికలకు ముందు ఆ సంఖ్య ఆరు లక్షలకు చేరింది. ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు నమోదు చేశాం. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని గుర్తించేలా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అవకాశాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కూటమిలో ప్రధాన భాగస్వామ్య పక్షంగా.. ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీశ్రేణులు కృషిచేయాలి' అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వాలు చేర్పించినవారితో పవన్ కల్యాణ్ కొద్దిసేపు మాట్లాడారు. పేరుపేరునా పలకరిస్తూ స్వయంగా అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పి.హరిప్రసాద్, జనసేన ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ఇంటర్వ్యూ ప్రచార ఎత్తుగడ: కాంగ్రెస్

దిల్లీ: ప్రధాని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూను ఓ ప్రచార ఎత్తుగడగా కాంగ్రెస్ కొట్టిపడేసింది. ఎంతో జాగ్రత్తగా సమాధానాలను రూపొందించారని, అమెరికా ముందు మోకరిల్లారనే విమర్శల్ని కప్పిపుచ్చుకునేందుకు తాపత్రయ పడ్డారని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.



జాగ్రత్త గురూ.. చూశారా కారు!

ముల్లును ముల్లుతోనే తీయాలంటారు కదా.. అలాగే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సర్కిల్ పోలీసులు ప్రమాదాలపై అవగాహనకు ఓ వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదానికి గురైన వాహనాలను ప్రదర్శిస్తూ.. వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లా మీదుగా వెళ్లే 16వ నంబరు జాతీయ రహదారిపై డేంజర్ జోన్లను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదానికి గురై ధ్వంసమైన వాహనాలను.. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు కనిపించేలా పెట్టారు. రాత్రిళ్లు కనిపించేలా వాటికి రేడియం స్టిక్కర్లు వేసి జాగ్రత్తలు తీసుకున్నారు. - ఈనాడు, కాకినాడ

దీర్ఘకాలిక లక్ష్యాలకు ప్రత్యేక నిధి

(మొదటి పేజీ తరువాయి)

- పారదర్శకత.. పెట్టుబడిలో విలువల ఆధారంగా నార్వే ఫండ్ నిర్వహిస్తోంది. ఈ నిధులను పొగాకు, ఆయుధ రంగాల్లో ఎట్టిపరిస్థితుల్లో పెట్టుబడికి అంగీకరించదు. ఫండ్ నిర్వహణలో ఆదర్శంగా ఉంటోంది.
- పశ్చిమాసియా దేశాల(యూఏఈ, సౌదీ, కువైట్)లో ఆయిల్ నుంచి వచ్చే ఆదాయాన్ని ఇతర రంగాల్లో పెట్టుబడులుగా వినియోగిస్తున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇదే తరహాలో 'ఏపీ వెల్త్ ఫండ్'ను వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా విధి విధానాలను రూపొందిస్తోంది.

ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం

రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఫండ్ ఉంటుంది. ఇందులో పెట్టుబడి పెట్టేందుకు ప్రైవేటు వర్గాలను ప్రభుత్వం ఆహ్వానించనుంది. మొత్తం నిధులను దేశంలో వివిధ ప్రాజెక్టుల, సాంకేతికరంగ సంస్థల్లో పెట్టుబడి పెట్టనుంది. వచ్చిన లాభాన్ని పెట్టుబడుల ఆధారంగా ఆయా సంస్థలకు అందించనుంది. ఏ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టాలి? ఎప్పుడు ఎంత పెట్టుబడి పెట్టాలనేది ఫండ్ ద్వారా రాష్ట్రప్రభుత్వమే నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేట్ పెట్టుబడుల నుంచి నిధులు సేకరించి.. డీప్‌టెక్ (ప్రధానంగా డీపీఐ, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్) రంగాల్లో పెట్టుబడి పెట్టాలని భావిస్తోంది.

- ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్) ఏర్పాటుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏపీ వెల్త్ ఫండ్ కూడా ఇలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.
- కేరళ ప్రభుత్వం కేఐఐఎఫ్‌బీ పేరిట ఫండ్ ఏర్పాటు చేసింది. కేవలం మౌలికసదుపాయాల కోసం మాత్రమే ఆ మొత్తాన్ని వినియోగిస్తోంది.

ఆటోనే పసుపు ప్రాసెసింగ్ యూనిట్!



ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను అర్థం చేసుకున్న రైతు.. ఓ ఆటోనే పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌గా మార్చుకున్నారు. ఇంటింటికీ వెళ్లి కొనుగోలుదారుల కళ్లముందే పసుపు కొమ్ములను మరాడించి విక్రయిస్తున్నారు. తెలంగాణలోని నిజామాబాద్‌కు చెందిన రమేష్ రెండున్నర ఎకరాల్లో పసుపు పండించారు. గిట్టుబాటు కాకపోవడంతో.. ఆటో కొని, దానికి ఓ మరను, జనరేటర్‌ను అమర్చుకున్నారు. ఊరూరా తిరుగుతూ ఎవరు అడిగితే వారి ఇంటి ఎదుటే పసుపు మరపట్టించి ఇస్తున్నారు. కళ్లముందే కల్తీ లేని పసుపు దొరుకుతుండటంతో ప్రజలూ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తన పంట అయిపోయాక తక్కువ ధరకు నిజామాబాద్ నుంచి పసుపు కొని తెచ్చి మరీ.. నెల్లూరు నగరంలో ఇలా విక్రయిస్తున్నారు. కిలోకు రూ.350 చొప్పున.. రోజూ 40 నుంచి 50 కిలోల పసుపు విక్రయిస్తున్నట్లు రమేష్ వెల్లడించారు. - ఈనాడు, నెల్లూరు

నాటి వైభోగం.. నేటి జ్ఞాపకం



శ్రీలక్ష్మి

గోకర్ణం, గంగాళం, ముక్కుపొడుం మీనా, ధూమం అరలు, శకుంతలపాత్ర, పూలబుట్టలు, కావడి పెట్టె, మర చెంబులు.. ఏంటివన్నీ అనుకుంటున్నారా? మన తాత ముత్తాతలు రోజూ ఉపయోగించిన వస్తువులు. కాలక్రమేణా మన జీవితం నుంచి కనుమరుగైన ఇవన్నీ ప్రస్తుతం ఓ ఇంట్లో కనువిందు చేస్తున్నాయి. బాపట్ల జిల్లా రేపల్లెలోని ఉపాధ్యాయురాలు శ్రీలతకు పురాతన వస్తువులు సేకరించడం ఓ అభిరుచి. గత 25 ఏళ్లుగా తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి 200లకు పైగా ప్రాచీన ఇత్తడి, కంచు, రాగి వస్తువులు సేకరించారు. కొన్నింటిని ఉపయోగిస్తున్నారు కూడా. వస్తువుల అరుగుదలను బట్టి అవి ఎంత ప్రాచీనమైనవో తెలుసుకుంటానని శ్రీలక్ష్మి వివరించారు.

– ఈనాడు, అమరావతి
– న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్



ముక్కుపొడుం మీనాలు



ఇత్తడి దీప కుందులు



పురాతన తాళం



గ్లాసు



గోకర్ణం

ప్రజాకర్షక పథకాలకు తెర దించాం

(మొదటి పేజీ తరువాయి)



మా ప్రాధాన్యాలు, పాలనకు చక్కని ప్రతిబింబంలా బడ్జెట్ నిలుస్తోంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పయనాన్ని ఇది వేగవంతం చేస్తుంది. మారిపోతున్న ప్రపంచంలో అవకాశాలను మన యువత అందిపుచ్చుకునేలా దీనిని రూపొందించాం. 'ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు' అనే బలవంతపు భావన నుంచి ఈ బడ్జెట్ రాలేదు. వికసిత దేశంగా ఎదగాలనే భారత్ ఆరాటానికి ప్రతీకగా ఇది రూపొందింది. 'మేం సిద్ధం' అనే భావన నుంచి ఇది వచ్చింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశ రక్షణ రంగాన్ని ఆధునికీకరించాల్సి ఉండటంతో దానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాం" అని మోదీ వివరించారు.

విదేశీ పెట్టుబడిదారుల్లో పెరిగిన విశ్వాసం

"భారత్‌లో ఇప్పుడు రాజకీయ సుస్థిరత ఉంది. అందుకే విదేశీ పెట్టుబడిదారులకు భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోంది. చాలా దేశాలు మనతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. భారత్‌లో తయారీ రంగం, సేవా రంగం, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు బలంగా ఉన్నందువల్లే ఇతర దేశాలతో సాధికారతతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరిపే స్థాయికి చేరాం. 38 దేశాలతో ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం. పెరుగుతున్న పెట్టుబడులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటివాటివల్ల వృద్ధి 7 శాతంగా ఉంటుందని ఆర్థిక సర్వే అంచనావేసింది. ఇలాంటి వ్యయం వల్ల దీర్ఘకాలికంగా ఆర్థిక వృద్ధికి ఎంతో ఊతం లభిస్తుంది. అందుకే ఈసారి వీటికి రూ.12.2 లక్షల కోట్లు కేటాయించాం. రైళ్లు, రహదారులు, విద్యుత్తు వంటి రంగాలపై ఎక్కువ ఖర్చు చేయనున్నాం. తాత్కాలిక ప్రజాకర్షణల ద్వారా కాకుండా ప్రజల జీవన నాణ్యతను పెంచి దేశాభివృద్ధిని వేగవంతం చేయాలనే మా సంకల్పాలను ఇవి చాటుతున్నాయి. భవిష్య తరాలను మదిలో పెట్టుకుని విప్లవాత్మక మార్పుల్ని తీసుకువస్తున్నాం. వేలల్లో విమానాలకు ఆర్డర్లు ఇచ్చాం. విమానాశ్రయాల్ని రెట్టింపు చేశాం. సరకు రవాణా నడవాలు, ఓడరేవులు, తీరప్రాంతాల అనుసంధానానికి పెద్దపీట వేశాం.

దక్షిణాదికి హైస్పీడ్ రైళ్లు, కారిడార్లు

భారతీయ రైల్వేకు రూ.3 లక్షల కోట్లు కేటాయించాం. హైస్పీడ్ రైళ్లతో అనుసంధానతకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చాం. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలకు భారీ లబ్ధి కలిగించే 'దక్షిణ హైస్పీడ్ డైమండ్ కారిడార్'తో సహా ఏడు కొత్త కారిడార్లు నిర్మించేందుకు ప్రాధాన్యం ఇచ్చాం. ప్రయాణికుల రైళ్లు నడిచే మార్గాలపై రద్దీ తగ్గించడానికి సరకు రవాణా కారిడార్లను విస్తరిస్తున్నాం. దశాబ్దం క్రితంతో పోలిస్తే హైవేలకు కేటాయింపులు 500% పెరిగాయి. బయోఫార్మా, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ వంటివాటిలో పెట్టుబడులు పెంచడం ద్వారా ఉద్యోగాల సృష్టికి దోహదపడుతున్నాం.

సంస్కరణలతో జీవితాలు మెరుగు

విశ్వాసంపై ఆధారపడిన పాలనకు మా ప్రాధాన్యం ఈసారి బడ్జెట్లోనూ కొనసాగింది. కాగితపు పనిని మేం గణనీయంగా తగ్గించాం. చిన్నచిన్న నేరాలను శిక్షల నుంచి తప్పించాం. అనేక సడలింపులు తెచ్చాం. బడ్జెట్లలో గణాంకాల కంటే ప్రజల జీవితాలపై బలమైన ప్రభావం చూపడానికి ఇవన్నీ దోహదపడతాయి. జాతి నిర్మాణం, ఆర్థికంగా బలోపేతం కావడమనేవి మమ్మల్ని నడిపించే మార్గదర్శక సూత్రాలు. ప్రపంచంలో క్లిష్ట పరిస్థితులున్నా మనం మాత్రం అభివృద్ధి ప్రస్థానంలో దేదీప్యమాన తారలా నిలుస్తామని రుజువు చేసుకున్నాం. ఇది భారత్‌కు చరిత్రాత్మక అవకాశమని ప్రజలు భావిస్తున్నారు.

మార్గసూచీ స్పష్టం

ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా కలిపి పాతికేళ్లు అధికారంలో ఉన్నాను. మా పని ముక్కలుముక్కలుగా ఉండదని నా తీరు చాటుతుంది. విస్తృత వ్యూహం, కార్యాచరణ, సమర్థ అమలు, దేశాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలోచించడం, దీర్ఘకాలిక దృక్పథం, ఒక్కో ఏడాది పురోగమనంలో ప్రస్థానం కొనసాగించడాన్ని నేను ఆచరిస్తాను. ప్రతి బడ్జెట్లోనూ స్పష్టమైన మార్గసూచీ ఉంది.

యూపీయే పాలనలో ఆర్థిక అవ్యవస్థ

కేంద్రంలో యూపీయే సర్కారు అధికారంలో ఉన్నప్పుడు ఆర్థిక అవ్యవస్థ కొనసాగింది. అందువల్లనే ఏ చర్చల్లోనూ విశ్వాసంతో ముందడుగు వేయలేకపోయేది. ఏ చర్చలూ కొలిక్కి వచ్చేవి కావు. ఇప్పుడు అనేక దేశాలు, కూటములతో వరస ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. త్వరలోనే మరో మూడు ఖరారు కానున్నాయి. సున్నా టారిఫ్‌తోనే ఎగుమతులు చేయగలుగుతున్నాం. ఇవన్నీ ఈమధ్య కుదిరినవే కావచ్చు. పోటీపడే దేశీయ పరిశ్రమ, విశ్వాసంతో కూడిన అడుగులతో చేస్తున్న ప్రయత్నాలకు తుది ఫలితం ఇవి. ఒక దశాబ్దం క్రితం మనం ఎక్కడున్నామో గుర్తుచేసుకోవాలి. యూపీయే కొన్ని ఒప్పందాలకు ప్రయత్నించినా అనిశ్చితి, అస్థిరతల కారణంగా ఏవీ సాకారం కాలేదు. సుదీర్ఘ చర్చలు జరిగినా ఫలితం స్వల్పంగానే ఉండేది.

రాబోయే దశాబ్దికి మూడు ప్రాధాన్యాలు

సంస్థాగత సంస్కరణల్ని మరింతగా ముందుకు తీసుకువెళ్లడం, నవకల్పనల్ని బలోపేతం చేయడం, సులభతర పాలన. రాబోయే దశాబ్దానికి ఈ మూడూ నా ప్రాధాన్యాలు. మేం చేపట్టిన సంస్కరణలు సామాన్యులకు ఎంతో లబ్ధి కలిగిస్తున్నాయి. పాలనను సరళతరం చేయడం వల్ల ప్రజలు, వ్యాపారవేత్తలు సునాయాసంగా, విశ్వాసంతో పనులు చేసుకోగలుగుతారు. దళారుల ప్రమేయాన్ని తగ్గించగలిగాం. సంస్కరణలు అనగానే అది ఆర్థిక వ్యవస్థకు, పరిశ్రమలకు సంబంధించినవిగా అనుకుంటారు. సామాజిక రంగంలో సంస్కరణలూ ముఖ్యమే. జీఎస్టీ సంస్కరణలు దీనికి ఉదాహరణ. యూపీఐ చెల్లింపులు మరో మేలైన సంస్కరణ. రక్షణ రంగంలో పదేళ్లలో తెచ్చిన సంస్కరణలు 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఫలితాలనిచ్చాయి. కొత్త బడ్జెట్లోనూ రూ.7.85 లక్షల కోట్లను ఈ రంగానికి కేటాయించాలని ప్రతిపాదించాం. మునుపటి కంటే 15% కేటాయింపులు పెంచిన ఏకైక శాఖ ఇదే" అని మోదీ చెప్పారు.

నేనొక పట్టాన సంతృప్తి చెందను

మేం వచ్చాక నియమాల ఆధారిత వ్యవస్థ తీసుకువచ్చి, విధానాలతో నడిచే పాలన అందించాం. రాజకీయ సుస్థిరత సాధించాం. సంస్కరణలకు పెద్దపీట వేశాం. దాంతో పెట్టుబడులకు ప్రపంచ దేశాలు ముందుకు వచ్చాయి. ఈయూతో ఒప్పందం కుదుర్చుకోవాలని మునుపటి ప్రభుత్వాలు ప్రయత్నిస్తే దానిని మేం సాకారం చేశాం. 38 దేశాలతో మనకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలున్నాయి. ఇదొక మైలురాయి. తయారీదారులకు, సేవారంగానికి ఇవి మహత్తర అవకాశాలు కల్పిస్తున్నాయి. కొత్త మార్కెట్లలోకి మనం ప్రవేశించగలుగుతున్నాం. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పురోగతితో నేను పూర్తిగా సంతృప్తి చెందడం లేదు. నా స్వభావమే అంత. నిరంతరం ఏదో చేయాలని తపిస్తుంటాను. ప్రజాసేవలో ఇలాంటి శ్రమ తప్పదు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తుల అప్‌లోడ్ చాలా ఖరీదు!

- నగరాలు, పట్టణాల్లో ఎల్‌టీపీల భారీ వసూళ్లు
- చోద్యం చూస్తున్న కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు

ఈనాడు, అమరావతి: అనుమతులు తీసుకోని లేఔట్లలో ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్లలో అదనపు అంతస్తుల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేఔట్ రెగ్యులరైజేషన్, బిల్డింగ్ పీనలైజేషన్ పథకాలు (ఎల్ఆర్ఎస్, బీపీఎస్) లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్ల (ఎల్‌టీపీ)కు కాసులు కురిపిస్తున్నాయి. వీరు ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు ప్రజల నుంచి భారీగా సేవా రుసుములు వసూలు చేస్తున్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నిర్దిష్టంగా రుసుముల్ని నిర్ణయించని కారణంగా ఒక్కో దరఖాస్తుపై రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు గుంజుతున్నారు. దీన్ని నియంత్రించాల్సిన పుర, నగరపాలక సంస్థల కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు చోద్యం చూస్తున్నారు.

పాపం పురపాలక శాఖదే..

ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు గతంలో రూ.5 వేల వరకు సేవా రుసుములు వసూలు చేసేవారు. ఇప్పుడు దాన్ని ఎల్‌టీపీలు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచేశారు. సంబంధిత పోర్టల్‌లో ఎల్‌టీపీల ద్వారానే దరఖాస్తులు అప్‌లోడ్ చేయించాలని ప్రకటించిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ.. వాటి సేవా రుసుములను నిర్ణయించకపోవడమే వసూళ్లకు కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది మార్చి 30తో గడువు ముగియనున్న బీపీఎస్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 28 వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. ఏప్రిల్ 23తో ముగిసే ఎల్ఆర్ఎస్‌కు 66 వేలకు పైగా దరఖాస్తులు పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. గడువు ముగిసే నాటికి రెండు పథకాల్లో కలిపి మరో 30 వేలకు పైగా దరఖాస్తులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

గజం విలువ ఆధారంగా సేవా రుసుములు

- స్థలం విలువ ఆధారంగా దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు ఎల్‌టీపీలు రుసుములు నిర్ణయిస్తున్నారు. గజం విలువ తక్కువ ఉన్న ప్రాంతాల్లో రూ.10 వేలు, ధర ఎక్కువ ఉంటే రూ.20 వేల వరకు లాగేస్తున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, కాకినాడ, ఏలూరు తదితర ప్రాంతాల్లో కొందరు భారీగా వసూళ్లు చేస్తున్నారు. నగరాలకు ఆనుకుని ఉన్న లేఔట్లలో రూ.25 వేల వరకు తీసుకుంటున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి.
- క్రమబద్ధీకరణ ప్రక్రియ సజావుగా పూర్తవ్వాలంటే కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులనూ చూసుకోవాలని కొందరు ఎల్‌టీపీలు దరఖాస్తుదారుల నుంచి అదనంగా మరో రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఈ తతంగం నడుస్తోంది. ప్రత్యేకించి ప్రథమ, ద్వితీయ శ్రేణి పురపాలక సంఘాల్లో ఎల్‌టీపీలతో కొందరు పట్టణ ప్రణాళిక అధికారులు కుమ్మక్కవుతున్నారు.

వార్డు ప్లానర్లదీ అదే దారి..

స్వర్ణ వార్డు కార్యాలయాల్లోనూ ప్లానింగ్ సెక్రటరీలు కొందరు ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను అప్‌లోడ్ చేయడానికి అడ్డదార్లు తొక్కుతున్నారు. ప్రజలను ప్రైవేట్ ఆఫీసులకు, కంప్యూటర్ సెంటర్లకు వెళ్లాలని సూచిస్తున్నారు. అక్కడ మళ్లీ వీరే దరఖాస్తులు అప్‌లోడ్ చేసి, సేవా రుసుముల కింద రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. నంద్యాల పురపాలక సంఘం పరిధిలో కొందరు ప్లానింగ్ సెక్రటరీలపై వచ్చిన ఇలాంటి ఫిర్యాదులపై అధికారులు విచారణకు ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నంలోనూ పలువురు వక్రమార్గం పడుతున్నారు. ఎల్‌టీపీలు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఉద్దేశంతో ప్లానింగ్ సెక్రటరీల సాయం తీసుకోవాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రజలకు సూచించింది. దీనిలోనూ అక్రమ వసూళ్ల దందాపై దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముప్పైకి చేరువవుతున్నారా?



మీరు ముప్పై ఏళ్లకు చేరువవుతుంటే ఓ ప్రధానమైన విషయంపై దృష్టి పెట్టాలి. అదేంటంటే.. పదవీవిరమణ ప్రణాళికను రూపొందించుకోవడం. ఇందుకోసం క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్), లేదా నేరుగా ఈక్విటీ(షేర్ల)ల్లో 30 ఏళ్ల పాటు మదుపు చేయాలి. ఇలా చేస్తే మీరు రిటైర్ అయ్యేనాటికి చక్రవడ్డీ ప్రభావంతో మీ పెట్టుబడి భారీ నిధిగా మారి మీకు ఉపకరిస్తుంది.

– ప్రేక్షా బైడ్, స్టాక్‌మార్కెట్ నిపుణురాలు

కలవరపెడుతున్న టీనేజ్ ప్రెగ్నెన్సీ

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యం సున్నా స్థాయిలో ఉండాలి. కానీ, చేసేది లేక 2025-26లో 5 శాతానికి తగ్గించాలని బెంచ్ మార్కుగా అధికారులు నిర్దేశించారు. క్రమంగా సున్నా స్థాయికి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

- బెంచ్ మార్కు కంటే తక్కువగా విశాఖపట్నం జిల్లాలో మాత్రమే 3.98% టీనేజ్ ప్రెగ్నెన్సీ నమోదైంది. మిగిలిన జిల్లాల్లో 5% నుంచి 12% మించే సమస్య ఉంది. అత్యధికంగా పల్నాడులో 14.94%, కర్నూలు జిల్లాలో 13.50%, టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు నమోదయ్యాయి.

రాష్ట్రంలో 'టీనేజ్ ప్రెగ్నెన్సీ' సమస్య ఇలా.. 2025-26 (జనవరి)లో

సమస్య స్థాయి	తీవ్రత(%)	ప్రభావిత జిల్లాలు
ప్రమాదకర	12–15	నెల్లూరు, ప్రకాశం, అనంతపురం, బాపట్ల, కర్నూలు, పల్నాడు
చాలా ఎక్కువ	10–12	ఏలూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, శ్రీసత్యసాయి, నంద్యాల
ఎక్కువ	8–10	అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, గుంటూరు
మధ్యస్థం	5–8	అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, అనకాపల్లి, ఎన్టీఆర్, వైఎస్సార్ కడప
తక్కువ	3.98	విశాఖపట్నం

క్షేత్రస్థాయిలో ప్రతిబంధకాలు ఇవే..

- గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటు.
- బాల్య వివాహాలు పూర్తిస్థాయిలో అరికట్టలేకపోవడం.
- లైంగిక-పునరుత్పత్తి విద్య, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన లేమి.
- టీనేజ్ ప్రెగ్నెన్సీకి గురైనవారు అబార్షన్లకు అర్హతలేని వారిని ఆశ్రయించడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడం.
- తొమ్మిది నెలలు వచ్చినా కాన్పు కాకపోవడం, సి-సెక్షన్ సర్జరీలతో ప్రమాదకర పరిస్థితులు.
- తల్లీబిడ్డల్లో పోషకాహార లోపం, రక్తహీనత, తక్కువ బరువు సమస్యలు రావడం.
- బిడ్డ ఎదగకుండా ప్రసవించడం వల్ల శిశువు ఎదుగుదల లోపాలు.
- ప్రసవ సమయంలో రక్తస్రావం ఎక్కువైతే తట్టుకోలేకపోవడం, మరణాలు.

టీనేజ్ ప్రెగ్నెన్సీతో ప్రాణాలకు ముప్పు ఎక్కువ

– డాక్టర్ లక్ష్మి శిరీష శాఖమూరి, ప్రసూతి వైద్య నిపుణురాలు, విజయవాడ



బాల్య వివాహాలు, యుక్త వయసు రాకుండా గర్భధారణ శ్రేయస్కరం కాదు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాలూ ఇందుకు అంగీకరించవు. శరీరంలో అంతర్గత వ్యవస్థలు, గర్భాశయం పూర్తిస్థాయిలో సన్నద్ధం కాని చిన్న వయసులో గర్భం దాలిస్తే శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయి. గర్భధారణ సమయంలో హైపర్ టెన్షన్, ఎనీమియా లాంటి సమస్యలు వస్తాయి. కాన్పు కష్టమై.. అధిక శాతం సిజేరియన్‌లకు ఆస్కారం ఉంటుంది. ప్రసవ సమయంలో రక్తస్రావం వల్ల తల్లికీ, బిడ్డకు ఇబ్బందులు ఎదురవుతాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తక్కువ బరువు, పోషకాల లోపంతో పుట్టిన బిడ్డకు భవిష్యత్తులోనూ అనారోగ్య సమస్యలకు ఆస్కారం ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

16–2–2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
చతుర్దశి: సా. 5-26 తదుపరి అమావాస్య
శ్రవణ: రా. 8-58 తదుపరి ధనిష్ఠ
వర్జ్యం: రా. 1-06 నుంచి 2-45 వరకు
అమృత ఘడియలు: ఉ. 10-01 నుంచి 11-42 వరకు
దుర్ముహూర్తం: మ. 12-36 నుంచి 1-22 వరకు తిరిగి 2-54 నుంచి 3-39 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.31; సూర్యాస్తమయం: సా.5.57

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	30.0
ఆదిలాబాద్	16.7	34.6
అనంతపురం	17.5	35.2
రాజమహేంద్రవరం	17.5	36.0
హైదరాబాద్	18.1	32.7
కడప	19.0	34.0
విజయవాడ	19.4	33.5
విశాఖపట్నం	19.8	31.2
శ్రీకాకుళం	20.0	30.0
గుంటూరు	20.0	34.0
తాడేపల్లిగూడెం	20.0	34.0
కర్నూలు	20.2	34.6
నరసాపురం	21.2	32.0
ఒంగోలు	21.4	33.5
సూర్యాపేట	22.0	33.0
నెల్లూరు	22.2	33.3





శ్రీశైలంలో కనులపండువగా సాగుతున్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ప్రభోత్సవం ◆ పాగాలంకరణలో మెరిసిపోతున్న శ్రీశైల మల్లన్న ఆలయం

కమనీయం.. శ్రీశైల మల్లన్న కల్యాణం

- **వైభవంగా పాగాలంకరణ**

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మల్లన్న కల్యాణం కమనీయంగా సాగింది. క్షేత్ర పరిధిలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఆదివారం రాత్రి 12.00 గంటలకు స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఈ వేడుక జరిగింది. క్షేత్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ తెరలపై సామాన్య భక్తులు తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో కీలకమైన పాగాలంకరణ రాత్రి 10.00 గంటల నుంచి మొదలైంది. బాపట్ల జిల్లా చీరాల మండలం హస్తినాపురానికి చెందిన పృథ్వీ సుబ్బారావు స్వయంగా తెచ్చిన పాగాతో పాటు ఇతర భక్తులు సమర్పించిన పాగాలను స్వామివారికి అలంకరించారు. పాగాలను సమర్పించే భక్తులు నియమంతో భక్తిని మేళవించి సంవత్సరంలో 365 మూరల పొడవుతో నేస్తారు. ఓ వ్యక్తి దిగంబరుడై వీటిని అలకరించారు. ఈ సమయంలో ఆలయంలో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. వేలమంది భక్తులు పాగాలంకరణను వీక్షించి తన్మయం చెందారు. ఇదే సమయంలో గర్భాలయంలో శ్రీమల్లికార్జునస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అంతకుముందు సాయంత్రం 5.30 గంటలకు శ్రీస్వామి అమ్మవార్లకు ఆలయ పురవీధిలో ప్రభోత్సవం జరిగింది. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో నంది వాహనసేవ నేత్రపర్వంగా సాగింది. మహాశివరాత్రి పర్వదినం వేళ శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం వేకువజామున 2.20 గంటలకు భక్తులను దర్శనాలకు అనుమతించారు. పాతాళగంగ స్నానఘాట్లు, ఆలయంలో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రూ.500 టికెట్లు, ప్రత్యేక పాస్‌లు ఉన్న భక్తులకు దర్శనానికి 2 గంటల సమయం, ఉచిత దర్శనానికి 6 గంటల సమయం పట్టింది. వీఐపీలకు తగిన ప్రాధాన్యం ఇస్తూనే, సామాన్య భక్తులు త్వరగా దర్శనం చేసుకునేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. శివరాత్రి రోజు సుమారు లక్ష మందికి పైగా భక్తులు శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. శివరాత్రి జాగారం చేయడానికి సుమారు 2.50 లక్షల మంది భక్తులు శ్రీశైలం చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఇంద్ర విమానాన.. స్కంద పరివార విహారం



శ్రీకాళహస్తిలో ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పత్ర, పుష్ప, ఫలాలతో ఆకట్టుకున్న ఆలయ అలంకరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అన్ని మాస శివరాత్రుల్లో కెల్లా అత్యంత విశిష్టంగా భావించే మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం శ్రీకాళహస్తిలో సోమస్కందుడు ఇంద్రవిమానంపై రాజసాన్ని ప్రదర్శిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆయన వెంట దేవేరి జ్ఞానాంబిక చప్పరంపై కొలువుదీరి చతుర్మాడ వీధుల్లో విహరించారు. అమృతోత్పాదనలో ఆవిర్భవించిన గరళాన్ని కంఠాన దాచి, జగత్తును సంరక్షించి జగద్రక్షకుడయ్యాడు పరమేశ్వరుడు. అందుకు కృతజ్ఞతగా దేవతల రాజైన ఇంద్రుడు తన విమానంలో స్వామివారిని ఆసీనులను చేసి, ఊరేగిస్తూ సేవ చేయడం ఈ ఉత్సవ విశిష్టత. ఈ విశేషోత్సవం సందర్భంగా ప్రత్యేక తిరువాభరణాలతో ఉత్సవమూర్తులను అలంకరించారు. సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక, వినాయకుడు, శ్రీవల్లీ దేవయాని సమేత సుబ్రహ్మణ్య స్వామి, భక్త కన్నప్ప, చండికేశ్వరమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. శ్రీకాళహస్తి పట్టణం భక్తులతో కిక్కిరిసిపోయింది. పత్రాలు, పుష్పాలు, ఫలాలు, కూరగాయలతో చేసిన ఆలయ అలంకరణ కనువిందు చేసింది.

కోటప్పకొండపై వైభవంగా శివరాత్రి వేడుకలు



కోటప్పకొండ ఆలయ సమీపంలో ప్రభల వెలుగులు

ఈనాడు, నరసరావుపేట: మహాశివరాత్రి పర్వదినాన పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శివనామ స్మరణతో మారుమోగింది. శనివారం రాత్రి ఒంటిగంటకు బిందెతీర్థంతో తొలిపూజ ప్రారంభమైంది. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం మేళతాళాలు, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ త్రికోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే అరవిందబాబు వెండిప్రభ అందజేశారు. వారి వెంట హోం మంత్రి అనిత, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, దర్శి తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి ఉన్నారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు త్వరగా పూర్తికావాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని హోం మంత్రి అనిత తెలిపారు. అంతకుముందు ఆలయ ఈవో చంద్రశేఖర్, వంశపారంపర్య ధర్మకర్త మల్రాజు రామకృష్ణ కొండలరావు తదితరులు ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. ఆలయం వద్ద 70-100 అడుగుల ఎత్తున్న ప్రభలు విద్యుత్తు దీపాల అలంకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పట్టువస్త్రాలతో గొట్టిపాటి రవికుమార్, వెండిప్రభతో అరవిందబాబు, అనిత, జీవీ ఆంజనేయులు తదితరులు

వలీని త్వరలో కలుస్తా... కోవాబన్ రుచి చూస్తా: లోకేశ్

ఈనాడు, అమరావతి: కర్నూలుకు చెందిన వలీ అనే చిరువ్యాపారిని త్వరలో కలుస్తానని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. "వలీ.. మిమ్మల్ని త్వరలో కలుసుకుంటాను. మీ కోవాబన్ రుచిచూస్తాను. మీపై కొందరు చేసిన ఆరోపణలు కలచివేశాయి. మత సామరస్యాన్ని దెబ్బతీసే ప్రవర్తనకు మన సమాజంలో స్థానం లేదు. ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావానికి తెలుగు సమాజం ప్రతీకగా నిలిచింది. మీకు అండగా ఉంటాను" అని లోకేశ్ హామీ ఇచ్చారు. మేడారం జాతరలో కోవాబన్నులు విక్రయిస్తున్న వలీని కొందరు యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు ఇబ్బందిపెట్టారు. సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియో వైరల్ అయ్యింది.

ఏపీ నీటి వినియోగంపై వాస్తవ విరుద్ధంగా బోర్డు లెక్కలు

కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

ఈనాడు, హైదరాబాద్: నీటి వినియోగానికి సంబంధించి కృష్ణా బోర్డు వాస్తవ విరుద్ధంగా లెక్కలు నమోదు చేసిందని తెలంగాణ ఆక్షేపణ వ్యక్తం చేసింది. ఈ నెల ఆరో తేదీన ఏపీ ఈఎన్సీకి బోర్డు రాసిన లేఖలో పేర్కొన్న వినియోగ వివరాలు తప్పుగా ఉన్నట్లు గుర్తించాలంటూ కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా లేఖ రాసింది. కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి తమ వద్ద నమోదైన లెక్కలు, అభ్యంతరాలను తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఓవీ రమేష్ బాబు ఆ లేఖలో పేర్కొన్నారు.



మహాశివరాత్రి సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలోని పుష్కరిణిలో భక్తజన సందోహం

విశాఖ తీరంలో పుణ్యస్నానాలు



మహాశివరాత్రి సందర్భంగా విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ భక్తజనంతో కళకళలాడింది. ఉదయం సముద్రంలో పుణ్యస్నానాలు చేయడానికి వచ్చినవారితో తీరం జనసంద్రాన్ని తలపించింది. భక్తుల సౌకర్యార్థం బీచ్‌లో ఫ్లడ్‌లైట్లతో పాటు తాత్కాలిక స్నానపు గదులు ఏర్పాటుచేశారు.

– ఈనాడు, విశాఖపట్నం


ఈనాడు

పిల్లల డ్రైవింగ్ ప్రాణాంతకం!

స్నేహితుల ముందు గొప్పలు పోవడానికో, సామాజిక మాధ్యమాల్లో అందరినీ ఆకర్షించాలనో చాలామంది మైనర్లు వాహనాలతో రోడ్డెక్కుతున్నారు. నూనూగు మీసాల వయసులో రయ్యిన దూసుకుపోతూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఇతరుల ప్రాణాలమీదికీ తెస్తున్నారు. తాజాగా బెంగళూరులో ఏడుగురు ఇంటర్ విద్యార్థులు జాతీయ రహదారిపై కారును వేగంగా దౌడు తీయిస్తూ ఘోర దుర్ఘటన పాలై అందరూ చనిపోయారు. తనదారిన తాను వెళ్తున్న మరో యువకుడి జీవితాన్నీ చిదిమేశారు. ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో ఒక మైనర్ కారుతో ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. నిరుడు దిల్లీలో పదిహేనేళ్ల బాలుడు ఇలాగే రెండేళ్ల చిన్నారిని పొట్టనపెట్టుకున్నాడు. పుణెలో ఒక మైనర్ మద్యం మత్తులో ఖరీదైన కారును ఇష్టారీతిగా నడిపి ఇద్దరు టెకీలను బలిగొన్నాడు. గతంలో కరీంనగర్ జిల్లాలో కారు తోలాలన్న పదహారేళ్ల కుర్రాడి సరదా- రోడ్డు పక్కన కొలిమి పని చేసుకుంటున్న నలుగురు మహిళలను కబళించింది. పిల్లలకు బండ్లు అందుబాటులో ఉంచకూడదన్న కనీసపాటి తెలివిడిని ప్రదర్శించని తల్లిదండ్రుల నిర్లక్ష్యం- వారికి కడుపుకోతను మిగులుస్తూ, మరెన్నో కుటుంబాల ఉసురుపోసుకుంటోంది!

మైనర్ల డ్రైవింగ్ వల్ల 2023-24లో దేశవ్యాప్తంగా దాదాపు పన్నెండు వేల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తమిళనాడులో అలాంటివి అత్యధికంగా రెండు వేలు నమోదైతే, ఏపీలో వాటి సంఖ్య 766, తెలంగాణలో 361గా లెక్కతేలింది. మారాం చేస్తున్నారనో, ఇంటి పనుల కోసమనో కొంతమంది తల్లిదండ్రులే పిల్లలకు బండ్లు అప్పగిస్తున్నారు. మరికొందరైతే పది పన్నెండేళ్ల సంతానానికి డ్రైవింగ్ నేర్పుతూ బైక్‌లూ స్కూటీలపై వారు సొంతంగా పాఠశాలలకు వెళ్లేందుకు ప్రోత్సహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల్లో రెండు శాతం మంది నిత్యం ఇలాగే వస్తుంటారని అంచనా! కొన్ని చోట్ల ప్రమాదకరంగా ముగ్గురు నలుగురు కలిసి ప్రయాణించే దృశ్యాలూ చూపరులకు దడ పుట్టిస్తుంటాయి. పిల్లలు అడిగారని అధిక సీసీ బండ్లు కొనిస్తున్న అమ్మానాన్నలూ ఉన్నారు. జాయ్‌రైడ్లు, రేసింగులంటూ ఆ బైకులపై వాయువేగంతో వెళ్లే కుర్రాళ్లు ఇతర ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నారు. సోషల్ మీడియాలో లైకుల కోసం మతిమాలిన స్టంట్ల రీళ్లు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. కుటుంబానికీ దేశానికీ బలం కావాల్సిన యువశక్తులు ఇలా దారితప్పడం సమాజానికి శ్రేయస్కరం కాదు!

సరైన మానసిక పరిణతి లేని వయసులో వాహనాలు నడుపుతున్నవారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. కొండొకచో వారి తల్లిదండ్రులకు జైలు శిక్షలు పడేలా చూస్తున్నారు. వాహన రిజిస్ట్రేషన్లనూ రద్దు చేయిస్తున్నారు. అయినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాకపోతుండటం దురదృష్టకరం. చిన్నపిల్లలు బండ్లు తోలడానికి సంబంధించి 2024లో తెలంగాణలో పదివేల కేసులు నమోదైతే, నిరుడు తొలి ఆర్నెల్లలోనే ఆ సంఖ్య 12వేలు మించిపోయింది. ఒక్క హైదరాబాద్‌లోనే కిందటేడాది ఎనిమిది వేల మంది పిల్లలు ఇలా ట్రాఫిక్ పోలీసులకు చిక్కారు. ఏపీలోనూ చాలా పట్టణాల్లో ఇదే దుస్థితి నెలకొంది. రోడ్డు ప్రమాద మరణాల్లో ఎక్కువ శాతానికి నెలవుగా ఇండియా ఇప్పటికే పరువు మాస్తోంది. పిల్లల డ్రైవింగ్ వల్ల రోడ్లు మరింతగా రక్తసిక్తమవుతున్నాయి. ఈ విషాద వృష్టిని నివారించాలంటే- పిల్లలను మితిమీరి గారాబం చేసే ధోరణిని తల్లిదండ్రులు విడిచి పెట్టాలి. నిర్దిష్ట వయసు, మానసిక దృఢత్వం, ట్రాఫిక్ నియమాలపై సంపూర్ణ అవగాహన వచ్చే వరకు బండ్లు తోలకూడదన్న సంగతి చిన్నారులకు అవగతమయ్యేలా పాఠశాలల్లో రహదారి భద్రతా పాఠాలను విరివిగా బోధించాలి!



తొలి భారతీయ చిత్రం రాజా హరిశ్చంద్రకి నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలే కాదు ప్రాసెసింగ్‌తో పాటు అన్నీ నా చేతులతో చేశాను. ఆ రోజుల్లో ఇతర చిత్ర నిర్మాతల్లాగా పాశ్చాత్య ప్రేక్షకులు నా మనసులో లేరు. భారతీయులకు భారతీయ కథను చెప్పడమే నా ఆశయం.

– దాదా సాహెబ్ ఫాల్కే

దూరదృష్టి

'రాబోవు నాపదలను/ లేబోనీయకయె ముందు తెలిసి మెలంగున్/ ప్రాబల్యము గలవాడే/ శోభిలు నిల నతడె' అంటూ దూరదృష్టితో మెలిగితే ఆపదలను తప్పించుకోగలరని వర్ణించాడొక కవి. దూరదృష్టితో వ్యవహరించడమంటే, భవిష్యత్తును ఊహించగలిగే శక్తిగా భావించకూడదు. ధర్మాన్ని కేంద్రంగా చేసుకుని, వర్తమానంలో తీసుకునే నిర్ణయాల ద్వారా భవిష్యత్తును శ్రేయోమార్గంలో నడిపించే వివేకవంతమైన చర్య అది. అలాంటి కార్యాల వల్లే లోకహితం జరుగుతుంది.

ముందుచూపుతో సమస్యలను పసిగట్టి పరిష్కరించిన, విపత్తులను దీటుగా ఎదుర్కొన్న వివేకుల గురించి పురాణాలు వివరించాయి. దూరదృష్టికి పరిపూర్ణ నిదర్శనం శ్రీకృష్ణుడు. కురుక్షేత్ర యుద్ధం మొదలవకముందే దాని ఫలితం ఆయనకు తెలుసు. పాండవుల విజయంతో పాటు, చెల్లించాల్సిన మూల్యాన్నీ ముందే ఊహించాడు. కాబట్టే రాయబారిగా హస్తినాపురికి వెళ్లాడు. శాంతి చర్చలు విఫలమైనప్పుడు మాత్రమే యుద్ధాన్ని అంగీకరించాడు. భీష్ముడు, ద్రోణుడు వంటి అజేయుల్ని ఎదుర్కోవాల్సి ఉందని తెలిసీ, ధర్మాన్ని నిలపడానికి కఠిన నిర్ణయాలు తీసుకోవాలని బోధించాడు. జరగబోయేదాన్ని మాత్రమే ఊహించలేదాయన. ధర్మ పరిరక్షణ బాధ్యతనూ స్వీకరించాడు.



అంతర్యామి

సీతమ్మ జాడ తెలుసుకోవడమే తనకు అప్పజెప్పిన కార్యమైనప్పటికీ ఆమెకు శ్రీరాముడి అంగుళీయకాన్ని అందించి తిరిగి వెళ్లిపోలేదు హనుమంతుడు. రావణుడి సైన్య బలాన్ని, స్వర్ణలంక కోట నిర్మాణాన్ని, ద్వారాల స్థితిగతుల్లాంటి అంశాల్ని సునిశితంగా పరిశీలించాడు. భవిష్యత్తులో లంకపై యుద్ధానికి వెళ్లేటప్పుడు ఎదుర్కోబోయే పరిస్థితుల్ని అంచనా వేశాడు. ఆయన ముందుచూపే యుద్ధ సమయంలో శ్రీరాముడి సైన్యానికి పెద్ద బలంగా మారింది. దూరదృష్టికి మరో మంచి ఉదాహరణ విభీషణుడు. రావణుడి పనులు ధర్మవిరుద్ధమైనవని, రాక్షసజాతి వినాశనం తప్పదని ముందే గ్రహించి, సీతాదేవిని తిరిగి అప్పజెప్పమని సోదరుణ్ని హెచ్చరించాడు. కలగబోయే దుష్పరిణామాలను నిండుసభలో వివరించాడు. తన హితబోధలు పెడచెవిన పెట్టినందుకే అన్ననూ, జన్మభూమినీ వదిలి, శ్రీరాముడి శరణు కోరాడు. అది విభీషణుడి పిరికితనం కాదు. ధర్మాన్ని దర్శించగలిగిన అతడి దూరదృష్టికి తార్కాణం.

కఠోపనిషత్తు ప్రకారం నచికేతుడు యమధర్మరాజును కలిసినప్పుడు తాత్కాలిక సుఖాలను తిరస్కరించి, శాశ్వతమైన శ్రేయస్సును ఎంచుకున్నాడు. బాలుడైనప్పటికీ జీవిత సారాన్ని గ్రహించి భవిష్యత్తుకు సరైన మార్గాన్ని ఎంచుకోవడం నిజమైన దూరదృష్టికి ఉదాహరణ. ముందుచూపు అంటే... భవిష్యత్తు ధర్మబద్ధంగా ఉండటానికి వర్తమానంలో ఆలోచించాల్సిన, వ్యవహరించాల్సిన తీరు పట్ల స్పష్టత కలిగి ఉండటం. రేపు ఏమవుతుందో తెలుసుకోవడం కన్నా, భవిష్యత్తులో ధర్మం నిలవాలంటే నేడు మనం నడవాల్సిన మార్గమేంటో తెలుసుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ముళ్లదారిలో పయనించి కష్టాలను ఎదుర్కోవడం కన్నా, మంచి మార్గాన్ని ఎంచుకుని అంతర్యామిని ప్రార్థించడం జీవితాన్ని అర్థవంతం చేస్తుంది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

గ్రామీణ ప్రగతికి సాంకేతిక సాయం

ఆంధ్రప్రదేశ్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ(ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను వినియోగించడానికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఆ దిశగా బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం రాష్ట్ర భవిష్యత్తును మలుపుతిప్పే చారిత్రక పరిణామం. దీన్ని సమర్థంగా అమలులోకి తీసుకురావడంతో పాటు సాంకేతికతను సంస్థాగతం చేసి, జవాబుదారీతనాన్ని నెలకొల్పడం ద్వారా రాష్ట్రాన్ని రూపాంతరం చెందించడం తక్షణావసరం.

కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతాలు రాష్ట్రాన్ని పాడిపంటలతో సస్యశ్యామలం చేస్తున్నాయి. చేపలు, రొయ్యల పెంపకం కేంద్రాలు, ఉద్యాన పంటలతో అలరారే ప్రాంతాలతో పాటు అనావృష్టి పీడిత ప్రదేశాలూ ఇక్కడ ఉన్నాయి. ఏపీలో సుమారు 85లక్షల హెక్టార్ల మేర సాగుకు అనువైన భూమి ఉన్నా- కోస్తాలో వరదలు, తుపానులు తీవ్ర నష్టాలను కలిగిస్తున్నాయి. సాగర తీరాలు కోతకు గురవుతున్నాయి. సముద్ర జలాల వల్ల నేల ఉప్పుదేరుతోంది. రాయలసీమలో అనావృష్టి, రొయ్యల చెరువులకు వైరస్‌లు, వ్యాధుల బెడద వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయి. దాంతో ఆయా కుటుంబాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా ప్రతికూల ప్రభావం



పడుతోంది. ఈ వైపరీత్యాలను అధిగమించడం ద్వారా అధిక ఉత్పాదకతనూ, విస్తృత మార్కెట్లనూ సాధించాల్సి ఉంది. అందుకు తక్షణమే ఏఐ వంటి సాంకేతికతలను సమర్థంగా వినియోగించాలి.

అధిక ఆదాయాల కోసం...

కృష్ణా-గోదావరి డెల్టాలో తుపానులు, అతివృష్టి, అనావృష్టి, కాలువలు పూడుకుపోవడం వంటి వైపరీత్యాలతో పంటల దిగుబడి దెబ్బతింటోంది. అందునా నష్టం సంభవించిన తరవాత ఆదుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారు తప్పితే, నష్ట నివారణపై దృష్టి సారించడం లేదు. ఇక్కడే 'ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్' అక్కరకొస్తుంది. మునుపటి పరిస్థితులకు సంబంధించిన సమాచారం, ఏఐ, మెషీన్ లెర్నింగ్, స్టాటిస్టికల్ మోడలింగ్‌ల ద్వారా భావి పరిణామాలను అంచనావేసే పరిజ్ఞానమిది. ఉపగ్రహ సమాచారంతో వరద రాకడ, నష్టభయం గురించి ముందే అంచనావేసి ప్రజలను హెచ్చరించవచ్చు. ఇదంతా జిల్లా స్థాయిలో జరగాలి. మరోవైపు సెన్సర్లు, ఉపగ్రహాల సాయంతో నేలలో లవణీయతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, చవుడు భూములను సాగులోకి తీసుకురావాలి. మొబైల్ కెమెరాలు, డ్రోన్ల ద్వారా తెగుళ్లు, చీడపీడల ముప్పును ముందే గుర్తించి, ఏఐతో విశ్లేషించి రైతులకు తగిన పరిష్కారాలు సూచించాలి.

ఏఐ, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలను ఎంతగా సద్వినియోగం చేసుకుంటే రైతాంగానికి అంతగా మేలు చేయవచ్చు. ఏ వారానికి ఆ వారం సమాచారాన్ని సేకరించి వచ్చే నెలలో ఎదురుకాగల ముప్పును ముందుగానే గుర్తించి తగిన పరిష్కారాలతో సిద్ధం కావాలి. ఇలా ఏఐను మౌలిక వసతిగా ఉపయోగించడం ద్వారా తక్షణ లబ్ధి చేకూరేది చేపలు, రొయ్యల పెంపకం రంగానికే. దేశం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలు, చేపల్లో 34శాతం ఏపీ నుంచే ఉంటున్నాయి. కాబట్టి రొయ్యల చెరువులను జాగ్రత్తగా కాపాడుకోవడం, ఆరోగ్యవంతమైన రొయ్యలను సాగు చేయడం పెంపకందారులతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకూ మేలు చేస్తుంది. రొయ్యల చెరువుల్లో నీరు కలుషితమైనా, రొయ్యలు తరచూ వ్యాధులకు గురైనా ఎగుమతి మార్కెట్ దెబ్బతింటుంది. గిరాకీ సైతం తగ్గిపోతుంది. దీన్ని నివారించడానికి ముందస్తు హెచ్చరికలు సరిపోవు. చెరువులోని నీటి నాణ్యతపై నిరంతరం నిఘా వేసి, తెగుళ్లను ముందే పసిగట్టే వ్యవస్థ కూడా ఉండాలి. తద్వారా కొనుగోలుదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవచ్చు. రొయ్యల నాణ్యత బాగోలేదని ఒకసారి మన ఆర్డర్లు రద్దయితే, దానివల్ల జరిగే నష్టం చాలాకాలం పాటు ఉంటుంది. దీన్ని నివారించడానికి 'ఆక్వా ఇంటెలిజెన్స్ గ్రిడ్' ఎంతగానో ఉపకరిస్తుంది.

ఇక అనావృష్టి పీడిత రాయలసీమకు వేరుసెనగ వంటి వర్షాధార పంటలే ప్రధాన ఆదాయ వనరు. అవి దెబ్బతింటే రైతులపై రుణభారం పెరిగిపోతుంది. దాంతో వారు జీవనోపాధి కోసం వలసబాట పడతారు. దీన్ని నివారించేలా రాయలసీమ జిల్లాలకు ప్రత్యేకించిన వాతావరణ సమాచారం, నేలలో తేమ, నాట్లు వేయడానికి అనువైన సమయం వంటి వివరాలను ఏఐ సాయంతో రైతులకు వేగంగా తెలియజేయాలి. రుణాలు, బీమా క్లెయిమ్ సదుపాయాలను సకాలంలో అందించాలి. అర్హులను గుర్తించడానికి ఏఐ తోడ్పాటు తీసుకోవాలి.

గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ

ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాలు చిరుధాన్యాలు, కాఫీ, ఉద్యాన పంటలు, పసుపు, అటవీ ఉత్పత్తులకు నిలయాలు. డెల్టా ప్రాంతాల్లో అనుసరించే అభివృద్ధి వ్యూహానికి భిన్నమైన ప్రణాళికను ఇక్కడ అనుసరించాలి. స్థానికులకు నమ్మకమైన సమాచారం అందించాలి. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ వసతులను విస్తరించాలి. పంట కోతల తరవాత వాటిల్లే నష్టాలను అరికట్టడానికి అగ్ర ప్రాధాన్యమివ్వాలి. శీతలీకరణ గిడ్డంగులు ఉన్నప్పటికీ... చేపలు, రొయ్యలు, పండ్లను వీలైనంత త్వరగా మార్కెట్లకు తరలించాలి. ఇందుకు అనువైన రూట్లు, మార్కెట్లో ధరలు తగ్గే ప్రమాదం, మంచి ధర పలికే సమయాల గురించి తెలియజేయడానికి ఏఐని ఉపయోగించాలి. సంబంధిత ప్రభుత్వ విభాగాలు, ఉత్పత్తిదారుల మధ్య సమర్థంగా సమన్వయం నెరపడం ద్వారా పై లక్ష్యాలను సాధించవచ్చు. కేవలం పైలట్ ప్రాజెక్టులతో సరిపుచ్చకుండా, అనుకున్నది సాధించడానికి సంస్థాగతమైన అండదండలు అవసరం. కాబట్టి, ప్రభుత్వం ఈ విషయంలో పూర్తి శ్రద్ధ తీసుకోవాలి. డెల్టా, ఆక్వాకల్చర్, మెట్ట ప్రాంతాల అభివృద్ధికి సంబంధిత ప్రభుత్వ విభాగాలు కలిసికట్టుగా ప్రణాళికలు చేపట్టి ఏఐ సాయంతో వేగిరమే అమలు చేయాలి. డిజిటల్ పరిజ్ఞానాల సాయంతో నీటి కేటాయింపు, సరఫరా, శీతల గిడ్డంగుల నిర్వహణ, సకాలంలో సరకుల బట్వాడాలో సమస్యలను పరిష్కరించాలి. తెగుళ్ల ప్రమాదాన్ని ముందే పసిగట్టి నివారణ చర్యలు తీసుకోవడం, వాతావరణ మార్పులను తట్టుకునేలా రాష్ట్ర సాగు రంగాన్ని బలోపేతం చేయడం అత్యావశ్యకం. ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ఉపయోగపడుతూ గ్రామీణాభ్యుదయానికి అమోఘ సాధనమవుతుందని ఆశిద్దాం.



డాక్టర్ షేక్ ఎన్.మీరా
డైరెక్టర్, ఐకార్-అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్

'ఆరాటం ముందు ఆటంకం ఎంత.. సంకల్పం ముందు వైకల్యం ఎంత..' అనే పాట విల్మాను చూసే రాశారేమో అనిపిస్తుంది. ఇరవై రెండు మంది సంతానంలో ఒకరిగా పుట్టిన ఈ అమ్మాయి విధికి ఎదురీదడం అంటే ఏంటో చేసి చూపించింది. పేదరికానికి తోడు పోలియో వ్యాధి విల్మాను అసహాయ పరిస్థితుల్లో పడేశాయి. ఎడమకాలు మొత్తంగా చచ్చుబడిపోయింది. 'తోటివారంతా ఆడుకుంటుంటే నేనొక్కదాన్నే ఎందుకిలా ఖాళీగా కూర్చోవాలి' అని తనను తాను కొన్ని వేలసార్లు ప్రశ్నించుకుంది. అసలు నడవడమే సాధ్యం కాదన్నారు వైద్యులు. కానీ, 'ద ఫాస్టెస్ట్ ఉమన్ ఇన్ ద వరల్డ్' అన్న టైటిల్ సంపాదించుకుంది ఆమె. ఎలా...అన్నదే అసలు కథ!

నడవలేవన్నారు...



విల్మా రుడాల్ఫ్ అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలో 1940 జూన్ 23న జన్మించింది. నాలుగేళ్ల వయసులో ఆమెకు పోలియో సోకింది. వైద్యులు నడవలేదని తేల్చేసినా తల్లి మాత్రం విల్మాకి నువ్వు నడవగలవంటూ ధైర్యాన్ని నూరిపోసింది. విల్మా కోసం ప్రత్యేకంగా షూ తయారు చేయించింది. అమ్మ మాటే నమ్మిన విల్మా ఆ బూట్లు వేసుకుని నడవడానికి విశ్వప్రయత్నం చేసేది. ఎన్నోసార్లు కిందపడేది. తోబుట్టువులు వంతులవారీగా ఆమెకు సాయం చేసేవారు. మేమున్నామని ధైర్యం చెబుతూ ప్రోత్సహించేవారు. కొన్నాళ్లు బ్రేసెస్ సాయంతో నడిచింది. కొన్నాళ్లు ఒంటికాలితో ఎగిరి దూకేది. పట్టుదలగా ప్రయత్నించి చివరికి నడవగలిగింది. అప్పుడు వాళ్లమ్మకు విల్మాపై నమ్మకం ఏర్పడి, 'ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావు' అని అడిగింది. 'ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరిగెత్తగల మహిళగా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను' అని చెప్పింది విల్మా.

మొదటిసారి పరుగు పందెంలో పాల్గొన్నప్పుడు చివరి స్థానంలో నిలిచింది. అయినా నిరాశపడలేదు, ఇతరులతో పోల్చుకోలేదు. ఎందుకంటే ఆమె ఎప్పుడూ తనతో తానే పోటీ పెట్టుకునేది. ప్రతిరోజూ నిన్నటికన్నా ఏమైనా మెరుగుపడ్డానా అని చూసుకునేది. అలా పదహారేళ్ల వయసులో మెల్‌బోర్న్‌లో జరిగిన ఒలింపిక్ గేమ్స్‌కి ఎంపికై 400 మీటర్ల రిలే పోటీలో కాంస్య పతకం నెగ్గింది. ఆ తరవాత ఒలింపిక్స్‌లో ట్రాక్, ఫీల్డ్ విభాగంలో మూడు స్వర్ణ పతకాలు నెగ్గి ప్రపంచ రికార్డు సృష్టించింది. అలా సాధించిన 'మొదటి అమెరికా మహిళ' అయింది. ఇరవై రెండేళ్లకే ఆటనుంచి రిటైర్ అయ్యి యూనివర్సిటీలో చేరి చదువు కొనసాగించింది. స్కూలు టీచరుగా పనిచేస్తూనే ఒక ఫౌండేషన్ ప్రారంభించి పలు కమ్యూనిటీ సెంటర్లను ఏర్పాటుచేసి పిల్లల్ని అథ్లెటిక్స్‌లో పాల్గొనేలా ప్రోత్సహించింది. వర్ణవివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి ప్రేరణ అయింది. ఒలింపిక్ హాల్ ఆఫ్ ఫేమ్‌లోనే కాకుండా అమెరికాలో పలుచోట్ల విల్మా పేరు కనిపిస్తుంది. క్యాన్సర్‌తో 54 ఏళ్లకే కన్నుమూసిన ఈ సాహసి జీవితం 'విల్మా రుడాల్ఫ్- ఒలింపిక్ ఛాంపియన్' అనే పేరుతో డాక్యుమెంటరీగా వచ్చింది. ఆమె జీవిత చరిత్ర 'విల్మా: ద స్టోరీ ఆఫ్ విల్మా రుడాల్ఫ్' ఎందరికో స్ఫూర్తినిస్తోంది.

– పి.పవిత్ర



వేగంగా విస్తరణ

జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) విస్తరణలో గత పదేళ్లలో చాలా ప్రగతి నమోదైంది. 2004-14 మధ్య ఏడాదికి సగటున 4,174 కి.మీ.మేర పనులు జరిగాయి. 2014-25 మధ్య ఏటా 9,704కి.మీ. నిర్మితమయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పదివేల కి.మీ. మేర నిర్మించాలనేది లక్ష్యం. కాగా, మొన్న డిసెంబరు చివరి నాటికి 4,938 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి. గడచిన దశాబ్ద కాలంలో ఎన్‌హెచ్‌ల నిర్మాణంలో పురోగతి వివరాలు...

మొత్తం ఎన్‌హెచ్ నెట్‌వర్క్ (కి.మీ.లో)	
2013-14	91,287
2025-26 (డిసెంబరు నాటికి)	1,46,572

వినియోగంలోకి వచ్చిన హైస్పీడ్ కారిడార్లు (కి.మీ.లో)	
2013-14	550
2025-26 (డిసెంబరు నాటికి)	5,364

రహదారులూ హైవేలపై మూలధన వ్యయం (రూ.లక్షల కోట్లలో)	
2014-15	0.53
2025-26 (బడ్జెట్ అంచనాలు)	3.06

(ఆధారం: కేంద్ర రోడ్డు రవాణా శాఖ నివేదిక)

నాణ్యతతో రాజీ... ప్రజారోగ్యానికి ఏదీ పూచీ?

నీట్-పీజీలో గతంలో జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 50వ పర్సంటైల్, ఇతర వర్గాల వారికి 40వ పర్సంటైల్ కనీస అర్హతగా ఉండేది. తద్వారా అభ్యర్థుల మౌలిక స్థాయి పరిజ్ఞానాన్ని నిర్ధారించేవారు. అయితే, 2022 నుంచి వరసగా ఈ కనీస అర్హతను కుదిస్తూ సున్నాకు తగ్గించారు. అంటే మార్కులు ఎంత తక్కువ వచ్చినా ప్రవేశ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందన్న మాట. మరి 'కనీస అర్హత లేనప్పుడు ప్రవేశ పరీక్ష ఎందుకు?' అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది.



దేశంలో అత్యంత తీవ్ర పోటీ నెలకొన్న ప్రవేశ పరీక్షల్లో నీట్-పీజీ ఒకటి. ఏటా సుమారు రెండు లక్షల మంది ఎంబీబీఎస్ పూర్తి చేసిన యువ వైద్యులు ఈ పరీక్ష రాస్తుంటారు. ఇందులో మొత్తం 800 మార్కులకుగాను 200 ప్రశ్నలు అడుగుతారు. 'ప్రత్యేక వైద్య శిక్షణ'కు ప్రధాన ద్వారం వంటి నీట్-పీజీలో మంచి ర్యాంక్ సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు ఏళ్ల తరబడి శ్రమిస్తుంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న పరీక్షలో కనీస అర్హతను సున్నాకు కుదించడం... మొత్తం ఎంపిక విధాన స్వరూపాన్నే ప్రభావితం చేయగల ప్రమాదముంది!

పేద అభ్యర్థులకు లాభమేంటి?

దేశవ్యాప్తంగా ప్రస్తుతం 52వేలకు పైగా పీజీ సీట్లు ఉన్నాయి. అందులో దాదాపు 27వేల సీట్లు ప్రైవేట్, డీమ్డ్ వైద్య కళాశాలల్లోవే. గడచిన సంవత్సరాల్లో 6-8 వేల వరకు పీజీ వైద్యవిద్య సీట్లు ఖాళీగా మిగిలిపోయిన సందర్భాలున్నాయి. అయితే, ఇవి ఎక్కువగా అధిక ఫీజులుండే ప్రైవేట్ సీట్లే కావడం గమనార్హం. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కీలక క్లినికల్ విభాగాలు మాత్రం పూర్తిగా నిండుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో పీజీ సీట్లు ఏ, బీ, సీ అనే విభాగాల వారీగా ఉంటాయి. ఏ-కేటగిరీ సీట్లను ప్రభుత్వం నిర్ణయించే ఫీజుతో మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. బీ-కేటగిరీ సీట్ల ఫీజులు ఏడాదికి రూ.10-20 లక్షల వరకు ఉంటాయి. ఇక సీ-కేటగిరీ లేదా యాజమాన్య కోటా సీట్లలో చేరితే... కొన్ని క్లినికల్ కోర్సులు పూర్తయ్యేసరికి రూ.2-3 కోట్ల వరకు ఖర్చవుతుంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో కనీస అర్హతను తొలగిస్తే అధిక ఫీజులు చెల్లించగలిగిన అభ్యర్థులు సీట్లు పొందడం సులభమవుతుంది. కానీ, బీ-కేటగిరీ ఫీజు కూడా భరించలేని ప్రతిభావంతులైన పేద అభ్యర్థులకు ఈ మార్పు వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు!

ఒక పేద విద్యార్థి కాస్త మెరుగైన ర్యాంక్ సాధించినా, ఏ-కేటగిరీ సీటు రాకపోతే అతడి చదువు అక్కడితో ఆగిపోవచ్చు. అదే సమయంలో తక్కువ మార్కులు వచ్చిన ధనిక అభ్యర్థి సీ-కేటగిరీలో చేరగలుగుతాడు. ఇది వ్యక్తుల మధ్య పోలిక కాదు; వ్యవస్థలోని ఆర్థిక అసమానత గురించిన ప్రశ్న. మరో కీలక విషయం- 800 మార్కుల్లో 300 మార్కులు సాధించిన అభ్యర్థి, 120 మార్కులు సాధించిన అభ్యర్థి మధ్య విషయ పరిజ్ఞానంలో తేడా ఉంటుంది. అందుకోసమనే గతంలో కనీస అర్హతను చూసేవారు. ఇప్పుడా ప్రమాణం లేకపోవడం అభ్యర్థుల ఎంపిక నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇక్కడ అండర్ గ్రాడ్యుయేట్ వైద్యవిద్యను కూడా పరిశీలించాలి. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో మెడికల్ కాలేజీలు ఉన్నాయి. శిక్షణ నాణ్యత అన్నిచోట్లా ఒకేలా లేదు. అధికారిక తనిఖీల్లో ఇది అనేకసార్లు వెలుగులోకి వచ్చింది కూడా. ఇలాంటి పరిస్థితుల్లో పీజీ ప్రవేశ పరీక్షకు కనీస ప్రమాణమంటూ ఉండాలి కదా? కానీ, అసలు ప్రమాణాన్నే పూర్తిగా తొలగించడం సమస్యను మరింత సంక్లిష్టం చేస్తుంది. పీజీ శిక్షణ అనేది వైద్యుడి జీవితంలో అత్యంత కీలకమైన దశ. జనరల్ మెడిసిన్, సర్జరీ, అనస్థీషియా వంటి విభాగాలు నేరుగా రోగుల ప్రాణాలతో సంబంధం ఉన్నవి. ఇక్కడ శిక్షణలో లోపం ఉంటే దాని ప్రభావం అంతిమంగా సమాజంపైనే పడుతుంది.


ప్రభుత్వం పునరాలోచించాలి

దేశవ్యాప్తంగా సర్కారీ వైద్యుల పోస్టులు పెద్దసంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 25-30శాతం పోస్టులు భర్తీ కాలేదు. నీట్-పీజీ సీట్లకు కనీస అర్హతను తొలగించడం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కాబోదు. వైద్యుల సంఖ్య పెరగడం అవసరమే కానీ, నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదు కదా? వైద్యవిద్య అనేది కేవలం డిగ్రీ కాదు. అది ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో ముడిపడిన బాధ్యత. ఈరోజు మనం తీసుకునే విధాన నిర్ణయం రేపటి వైద్యుల స్థాయిని నిర్ణయిస్తుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ విధానంపై పునరాలోచించాలి. సీట్లు ఖాళీగా ఉండటానికి మూల కారణాలేంటో సమీక్షించాలి. లేకపోతే మెరిట్‌కు విలువ తగ్గిపోతుంది. ఎంపిక వ్యవస్థ బలహీనపడి... దీర్ఘకాలంలో దాని ప్రభావం ప్రజారోగ్యంపై పడుతుంది. వైద్యవిద్యలో ప్రమాణాలతో రాజీ పడితే, చివరికి దాని మూల్యం సమాజమే చెల్లించాల్సి వస్తుంది. అందుకే నీట్-పీజీలో 'జీరో కటాఫ్' నిర్ణయాన్ని పునఃసమీక్షించడం అత్యవసరం.

– డాక్టర్ ఎం.రమాదేవి
వైద్యవిద్య ఆచార్యులు, ఆరోగ్యరంగ విశ్లేషకులు

చింటూ మారిపోయాడా?

చింటూ అయిదో తరగతి చదువుతున్నాడు. తను ఏ పనీ సొంతంగా చేసుకోడు. ప్రతిదానికీ అమ్మానాన్నలనే అడుగుతుంటాడు. ఏదైనా పని చెబితే ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకుంటాడు. చిన్న సమస్య వస్తే చాలు ఏడ్చేస్తాడు. స్కూల్లో తనకేదైనా కావాల్సి వస్తే ఎవరినీ అడగకుండా మౌనంగా ఉండిపోతాడు. ఒకరోజు స్కూల్లో.. 'రేపుమనం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా ఎవరి పనులు వారే చేయాలి' అని చెప్పారు టీచర్. అది వినగానే చింటూకు ఒక్కసారిగా భయమేసింది. ఇంటికెళ్లాక వాళ్లమ్మతో.. 'మీ సాయం లేకుండా నేనెలా పనులు చేసుకోగలనమ్మా!' అన్నాడు చింటు. ముందు భయం వదిలేసి ధైర్యంగా ప్రయత్నించు. నువ్వు తప్పకుండా చేయగలవు' అని చెప్పింది



అమ్మ. మరుసటి రోజు స్కూల్లో షూ వేసుకోవడం, టై కట్టుకోవడం లాంటి పోటీలు నిర్వహించారు. కానీ చింటూకు అస్సలు రావడం లేదు. అందరిదీ అయిపోయింది కానీ తను మాత్రం అలాగే నిలబడిపోయాడు. తరవాత డ్రాయింగ్ పోటీ జరిగింది. అందరూ బొమ్మలు గీయడం మొదలు పెట్టారు కానీ తనకు ఏం గీయాలో తెలియట్లేదు. కాసేపు ఆలోచించి.. తరగతి కిటికీలోంచి చూస్తూ కనిపిస్తున్న చెట్లు, భవనాలు, పక్షులను చక్కగా గీశాడు. దానికి టీచర్ల నుంచి మంచి ప్రశంసలు కూడా అందుకున్నాడు. దాంతో చాలా సంతోషించాడు చింటు. 'నేను ఎప్పుడూ ఇలా ఫీల్ అవ్వలేదు. ఇదంతా చాలా బాగుంది. ఎవరి మీదా ఆధారపడకుండా మన పనులు మనం చేసుకోవడం, సొంతంగా ఆలోచించడం పెద్ద కష్టమేం కాదు' అనుకున్నాడు చింటు. ఇంటికి వెళ్లాక అదే విషయం అమ్మానాన్నలతో చెప్పాడు. 'ఇక నుంచి స్కూల్‌కు రెడీ అవ్వడం, లంచ్‌బాక్స్ పెట్టుకోవడం.. ఇలా నా పనులన్నీ నేనే చేసుకుంటానమ్మా! మరీ అవసరమైతేనే మిమ్మల్ని అడుగుతాను' అన్నాడు. దాంతో అమ్మానాన్నలు కూడా చాలా ఆనందించారు.

– నివేష్

నేనెవర్ని?

1. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'వేరు'లో ఉంటాను కానీ 'కారు'లో లేను. 'తల'లో ఉంటాను కానీ 'కల'లో లేను. 'గానం'లో ఉంటాను కానీ 'గాయం'లో లేను. ఇంతకీ నేనెవర్ని?
2. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'సోది'లో ఉంటాను కానీ 'ఆది'లో లేను. 'మతి'లో ఉంటాను కానీ 'స్థితి'లో లేను. 'వాన'లో ఉంటాను కానీ 'మన'లో లేను. 'కారం'లో ఉంటాను కానీ 'కాలు'లో లేను. నేనెవర్ని?

జవాబు: 1.వేతనం 2.సోమవారం


ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం ఫిబ్రవరి 16, 2026

మల్లేశ్వరుని కల్యాణం.. మురిసింది భక్తజనం


ఇంద్రకీలాద్రిపై కల్యాణ క్రతువులో మంగళసూత్రాలు చూపిస్తున్న అర్చకులు


రామలింగేశ్వరునికి హారతి


యనమలకుదురులో ప్రభల ఊరేగింపు


నాగలింగేశ్వరస్వామి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే కృష్ణానదీ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై గంగాపార్వతీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. యనమలకుదురులో ప్రభల ఊరేగింపు ఆకట్టుకుంది. - ఈనాడు, అమరావతి


దుర్గాఘాట్‌లో భక్తుల జల్లు స్నానాలు


ముక్త్యాలలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

అంధకారంలోనే ప్రయాణం!

- రూ.40లక్షలతో సెంట్రల్ లైటింగ్ వేసేదెప్పుడో?
- తాడిగడప మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణి

ఈనాడు, అమరావతి, కానూరు, న్యూస్‌టుడే

విజయవాడ నుంచి నిత్యం కానూరు సిద్ధార్థ ఫ్లైవంతెన మీదుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం బందరు రోడ్డుకు ప్రత్యామ్నాయంగా మారిందీ దారి. కానీ రాత్రయితే పెనమలూరు పోలీస్‌స్టేషన్ నుంచి ఫ్లైవంతెన మీదుగా తాడిగడప వందడుగుల రోడ్డు వరకూ చిమ్మచీకట్లు అలముకుంటున్నాయి. అత్యంత ప్రమాదకరంగా వాహనదారులు రాత్రివేళ ఫ్లైవంతెన మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రి 7గంటల నుంచి తెల్లవారుజామున 5గంటల మధ్యలో భయం భయంగానే ఈ ఫ్లైవంతెన మీద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఫ్లైవంతెన ఆరంభమై ఏడాది దాటిపోయినా ఇంతవరకూ కనీసం ఒక్క వీధి దీపం కూడా ఏర్పాటు చేయలేదు. తాడిగడప మున్సిపల్ అధికారుల పనితీరుకు ప్రత్యక్ష నిదర్శనమిది.

వైకాపా హయాంలో ఐదేళ్లు ఆగిపోయిన కానూరు సిద్ధార్థ కళాశాల ఫ్లైవంతెనను కూటమి ప్రభుత్వం రాగానే 2024 నవంబరులో తుది దశ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకటి రెండు నెలల్లో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామంటూ.. మున్సిపల్ అధికారులు ప్రకటించారు. రూ.40 లక్షలు కూడా మంజూరయ్యాయని తెలిపారు. రహదారికి పక్కనున్న డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే లైటింగ్ ఏర్పాటు చేస్తామంటూ తెలిపారు. పోలీసుస్టేషన్ నుంచి వందడుగుల రోడ్డు వరకు రూ.కోటిన్నరతో డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. సెంట్రల్ లైటింగ్ త్వరగా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతుంటే అధికారులు స్పందించడం లేదు.


రాత్రయితే ఫ్లైవంతెనపై చీకటిలోనే సాగుతూ..

నిధులు ఎటువైపు మళ్లించేశారో..

సెంట్రల్ లైటింగ్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయంటూ గతంలో చెప్పిన అదే అధికారులు ఇప్పుడు నిధులు లేవని, పరిశీలిస్తున్నామంటూ సెలవిస్తుండడం గమనార్హం. ఆ నిధులను.. వేరే పనులకు మళ్లించేసినట్లు తెలుస్తోంది. నగరంతో శివారు ప్రాంతాలను కలిపే ప్రధానమైన అనుసంధానం కానూరు ఫ్లైవంతెనే. అందుబాటులోకి వచ్చి 15నెలలు దాటుతున్నా.. చీకటిలోనే పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా.. యంత్రాంగంలో కనీస చలనం లేకపోవడం దారుణం.

పరిశీలించి.. నిర్ణయం తీసుకుంటాం..

-షేక్‌నజీర్, తాడిగడప మున్సిపల్ కమిషనర్

సిద్ధార్థ ఫ్లైవంతనపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సంబంధించి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. దీనిని పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటాం. డ్రైనేజీ పనులు ఇటీవలే పూర్తయ్యాయి.

పీజీ మెడికల్ మాప్‌అప్ రౌండు సీట్ల వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కన్వీనర్ కోటా నాన్ సర్వీస్ కేటగిరీ మూడో విడత కౌన్సెలింగ్ (మాప్‌అప్) సీట్ల వివరాలను విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం వెల్లడించింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల్లో చేరాలని సూచించింది. తరగతులు గత ఏడాది డిసెంబరు 22వ తేదీ నుంచి మొదలైన విషయం తెలిసిందే.

జిల్లాలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈనెల 16న సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ కూడా అందుబాటులో ఉంటుందని వివరించారు. అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. ఇందులో అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు.

చూస్తే బాగు.. తూస్తే తరుగు

మోసం చేస్తున్న వ్యాపారులు ✪ అరకొర తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు

ఈనాడు, అమరావతి

వినియోగదారుల అవగాహన రాహిత్యాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. బ్రాండెడ్ వస్తువుల పేరుతో నకిలీవి అంటగడుతున్నారు. ఎమ్మార్పీకి మించి అడ్డగోలుగా అమ్మేయడం.. తప్పుడు తరాజులతో బురిడీ కొట్టించడమే పరమావధిగా జేబులు నింపుకొంటున్నారు. తూనికలు కొలతల శాఖ అరకొర తనిఖీలతో మమ అనిపిస్తోంది.


దుకాణాల్లో తనిఖీలు చేస్తూ..

ఎందెందు వెతికినా...

★ పోరంకికి చెందిన రాజేశ్ ఫోన్ కొనేందుకు విజయవాడ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌కి వెళ్లారు. కంపెనీ తయారీనే నిలిపేసిన శాంసంగ్ గురు ఫోన్ ఇప్పటికీ అక్కడ అమ్ముతున్నారు. రూ.1700 తీసుకుని నకిలీ ఫోన్ అంటగట్టారు. దానికి బిల్లు, వారెంటీ, గ్యారెంటీ లేదు. ఫోన్లు, ఛార్జర్లు, ఇయర్‌ఫోన్లు, బడ్స్ అన్ని ఇక్కడ దొరుకుతాయి. అసలైన బ్రాండ్ వస్తువుల్లా ఉండే నకిలీ వస్తువులను మాయ చేసి అమ్మేసి దోచేస్తున్నారు.

జిల్లా	నమోదైన కేసులు	రూ.లక్షలు జరిమానా
ఎన్టీఆర్	831	58.7
కృష్ణా	749	35.6
మొత్తం	1,580	94.3

★ అర్జునరావు కానూరులోని మాంసం దుకాణంలో కిలో మటన్ కొన్నారు. దుకాణంలో తూకంలో కిలోకి 7 గ్రాములు ఎక్కువే ఉంది. అనుమానంతో రైతుబజార్‌లోని మార్కెటింగ్‌శాఖ తరాజులో తూకం వేస్తే 897 గ్రాములే ఉంది. ఉమ్మడి జిల్లాలో 50శాతం పైగా దుకాణాల్లో ఇలాగే దోపిడీ చేస్తున్నారు. ఎలక్ట్రికల్ కాటాల్లో కేజీల మోడ్‌ను లీటర్లుగా మార్చి ఏమారుస్తున్నారు.

★ ఆటోనగర్ బస్టాండ్ సమీపంలోని ఓ శీతల పానీయాల దుకాణంలో రూ.10 శీతల పానీయం సీసాకు రూ.15 వసూలు చేస్తున్నారు. అంటే వారికి కంపెనీ ఇచ్చే మార్జిన్ కంటే రూ.50శాతం అదనం. ఉమ్మడి జిల్లాలో లెక్కకు మించిన దుకాణాల్లో ఇదే పరిస్థితి. విజయవాడ పీఎన్‌బీఎస్ మొదలు ఉమ్మడి జిల్లాలో చాలా బస్టాండ్లలో తాగునీరు, మజ్జిగ, లస్సీ, స్నాక్స్ ఏ వస్తువైనా ఎమ్మార్పీకి మించే వసూలు చేస్తున్నారు.

వాటివైపు చూడరేం..

☆ జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదులు మినహాయిస్తే.. బంగారం దుకాణాలు, పెట్రోలు బంకుల్లో తనిఖీల్లేవు. ఉమ్మడి జిల్లాలో 28 మంది సిబ్బందికి 12 మందే ఉన్నారు. మోసాలు ఎలా గుర్తించాలో ప్రజల్లో అవగాహన కల్పించడం లేదు. మోసం జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలన్న కనీస పరిజ్ఞానం లేదు.

☆ కొలతల్లో తేడాలు, ఇతర మోసాలపై వినియోగదారులు 1917 నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా తూనికలు కొలతలశాఖ ఉప నియంత్రికులు బి.సాయిరామ్ తెలిపారు.

ఒకటే ఊరు.. రెండు పేర్లు..



గోడపై బాపులపాడు, హనుమాన్ జంక్షన్..

ఒకే గ్రామానికి రెండు పేర్లు ఉండటమనేది బహుశా ఎక్కడా ఉండదు. గతంలో ఒక పేరు ఉండి, మార్పు, చేర్పుల తర్వాత మరొక పేరు వాడుకలోకి రావడం చాలా ప్రాంతాల్లో చోటుచేసుకుంది. కానీ బాపులపాడు గ్రామం రెండు పేర్లతో చెలామణిలో ఉండడం ఆసక్తికరమే. బాపులపాడు కొన్ని దశాబ్దాల నుంచి హనుమాన్‌జంక్షన్‌గా ప్రాచుర్యం పొందుతోంది. నాలుగు రోడ్ల కూడలి ఉండడం, అభయాంజనేయస్వామి కొలువుదీరడంతో క్రమేణా హనుమాన్‌జంక్షన్‌గా మారిపోయింది. మండల కేంద్రంగా ఉండడంతో ప్రభుత్వ రికార్డులు, అధికారిక వ్యవహారాల్లోనూ ఇప్పటికీ బాపులపాడు పేరుతోనే కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. బ్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్, తపాలా కార్యాలయం మాత్రం హనుమాన్‌జంక్షన్ పేరుతో ఏర్పాటయ్యాయి. దీంతో ఇటీవల శివారులో నిర్మించిన స్వాగత గోడపై రెండు పేర్లతోనూ సూచికలు ఏర్పాటు చేయడం గమనార్హం. - హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

అశోక్ లేల్యాండ్ నకిలీ విడిభాగాల అమ్మకాలు

- ★ ఆటోనగర్‌లోని 3 దుకాణాల్లో పోలీసుల సోదాలు
- ★ షాపుల యజమానులపై కేసు నమోదు

ఈనాడు, అమరావతి: ఆటోనగర్‌లో నకిలీ స్పేర్‌పార్ట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ అశోక్ లేల్యాండ్‌కు సంబంధించి నకిలీ విడిభాగాలు విక్రయిస్తున్న మూడు దుకాణాలపై పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న సోనీ మోటార్ పార్ట్స్, వీరా క్లచ్ సెంటర్, విజయకృష్ణ ఆటోమొబైల్స్‌లో కంపెనీకి చెందిన నకిలీ స్పేర్ పార్ట్స్ అమ్ముతున్నట్లు, కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని అశోక్ లేల్యాండ్‌కు చెందిన ప్రతినిధి నితూకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు ఆటోనగర్‌లోని ఈ దుకాణాల్లో శనివారం రాత్రి తనిఖీలు చేశారు. పలు విడిభాగాలు దొరికాయి. ఇవి అసలు వాటికి నకిలీలని గుర్తించారు. దీంతో ఆ దుకాణాల యజమానులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని 318 (4)తో పాటు కాపీరైట్ యాక్ట్‌లోని 63, 64 సెక్షన్లు, ట్రేడ్ మార్క్ చట్టంలోని 103, 104 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆటోనగర్‌లో ఇంకా ఎక్కడైనా దుకాణాల్లో ఈ తరహాలో నకిలీ విడిభాగాలు అమ్ముతున్నారా? అని విచారిస్తున్నారు.

నా ప్రాణం నువ్వే కన్నా.. నువ్వూ పెట్టుకో నాన్నా..



గొల్లపూడి రహదారిలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న చిన్నారికి ప్రమాదం జరగకుండా హెల్మెట్ పెట్టడం హర్షణీయమే. కానీ బండి నడిపేవారూ శిరస్త్రాణం పెట్టుకుంటేనే ఇంటికి రక్ష అని గుర్తించాలి. -ఈనాడు, అమరావతి




విజయానందం...

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం శ్రీలంకలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియా జట్టు విజయం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా విజయవాడ బెంజిసర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న అభిమానులు. - ఈనాడు, అమరావతి

కనకదుర్గమ్మ వారధిపై తప్పిన ప్రమాదం

కంటెయినర్ నుంచి ఊడిపడిన డీజిల్ ట్యాంకు ✪ 3 కి.మీ మేర నిలిచిన ట్రాఫిక్


భారీగా నిలిచిపోయిన వాహనాలు


వారధిపై నిలిచిన కంటెయినర్


ఊడిపడిన డీజిల్ ట్యాంక్

తాడేపల్లి, మంగళగిరి అర్బన్, కృష్ణలంక, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని కనకదుర్గమ్మ వారధిపై ఆదివారం మధ్యాహ్నం భారీ ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న భారీ కంటెయినర్ లారీ డీజిల్ ట్యాంకు బోల్టులు విరిగి ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో కంటెయినర్ నిలిచిపోయింది. ఆ సమయంలో వెనుక ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. శివరాత్రి పర్వదినం నేపథ్యంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో విజయవాడ వైపు సుమారు 3 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. తాడేపల్లి, విజయవాడ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కంటెయినర్‌ను బయటకు తీసుకువచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో వారధిపై వెళ్లే మార్గంలో మరో కారు మొరాయించి ఆగిపోయింది.

అద్దె ఫోన్ నంబర్లతోనే వ్యవహారాలు

మ్యూల్ ఎకౌంట్స్ కేసులో బయటకొస్తున్న కోణాలు

ఈనాడు, అమరావతి

పోలీసులకు తమ జాడ ఎక్కడా దొరక్కుండా నిందితులు 'అద్దె' నంబర్లను ఉపయోగించారు. చట్టవిరుద్ధ లావాదేవీలు, సంభాషణలు, సందేశాలకు ఈ నంబర్లపైనే ఆధారపడ్డారు. నిందితులు ఉపయోగించిన నంబర్ల కాల్ రికార్డ్స్ తీసిన పోలీసులు షాక్ తిన్నారు. ఆ నంబర్లు ఏవీ నిందితులకు సంబంధించినవి కాకకపోవడమే దీని కారణం. వాటితోనే మ్యూల్ వ్యవహారాలు నడిపించారు. విజయవాడలో గతవారం వెలుగుచూసిన మ్యూల్ ఎకౌంట్ల వ్యవహారంలో పలు కోణాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఆ నంబర్లతోనే అన్నీ.. ఈ కేసులో అరెస్టయిన కీలక నిందితులు రవికుమార్ (ఏ1), అతని సోదరుడు స్టీవెన్ (ఏ2).. యనమలకుదురులోని చిన్నగదిని అద్దెకు తీసుకుని డిజిటల్ మార్కెటింగ్ పేరుతో అద్దె ఖాతాల వ్యవహారాలను నడిపించారు. గత తొమ్మిది నెలలుగా ఇక్కడి నుంచే చెన్నైలోని తమ బంధువుకు చెప్పినట్లు చేసేవారు. చెన్నైలో ఉన్న సూత్రధారి జాడ ఇంతవరకు బయటకు రాలేదు. అనామకులతో ఖాతాలు తెరిపించిన సమయంలోనే వారి నుంచి సిమ్‌లు తీసుకున్నారు. ఆ ఖాతాలకు ఈ నంబర్లను లింక్ చేయించారు. సూత్రధారితో నిందితులు అద్దె ఖాతాలు తెరిపించిన వారి సిమ్‌లతోనే సంభాషణలు సాగించారు.

బ్యాంక్ స్టేట్‌మెంట్లు వస్తేనే.. నిందితులు స్థానికంగా మొత్తం 36 బ్యాంకు ఖాతాలు తెరిపించారు. వీటిలో పొదుపు, కరెంట్ ఖాతాలు ఉన్నాయి. ఇవి కాకుండా చెన్నై నుంచి ఇచ్చిన 113 ఖాతాల ద్వారా కూడా ఏ1, ఏ2 లావాదేవీలు నిర్వహించినట్లు తేలింది. స్థానిక ఎకౌంట్లలో పడిన సొమ్మును.. బదిలీ చేసేందుకు ఇతర ఖాతాలను కూడా సూత్రధారి ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. పోలీసులు ఇప్పటికే సంబంధిత బ్యాంకులకు వివరాల కోసం లేఖలు రాశారు. ఇవి వస్తేనే ఏయే ఖాతాల నుంచి లావాదేవీలు జరిగాయి? ఎక్కడికి ఈ సొమ్ము అంతిమంగా తరలింది? చివరి లబ్ధిదారులు ఎవరు? అన్న వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కస్టడీకి తీసుకుంటే వివరాలు

నిందితులు వారు నిర్వహించిన రోజువారీ లావాదేవీల వివరాలను ల్యాప్‌ట్యాప్‌లో గూగుల్ షీట్‌లో నమోదు చేసేవారు. అవి చెన్నైలోని సూత్రధారికి వెళ్తుంటాయి. నిందితులను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసులు ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అసలు సూత్రదారి.. గూగుల్ క్లౌడ్‌లో ఉన్న ఆ వివరాలను తొలగించడంతో ల్యాప్‌టాప్‌లోనూ వివరాలు డిలీట్ అయ్యాయి. రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు త్వరలో కస్టడీకి తీసుకోనున్నారు. చెన్నైలోని వ్యక్తి పైన ఎవరున్నారు?.. తదితర వివరాలు వీరిని లోతుగా విచారిస్తేనే తెలిసే అవకాశం ఉంది.

ఆలస్యంగా వచ్చిందని.. విద్యార్థినిని రాత్రివేళ గెంటేసి..

- ☛ గుణదల బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో అడ్డగోలు వ్యవహారం
- ☛ తండ్రి ఫిర్యాదుపై చర్యలు తీసుకోకుండా తాత్సారం

ఈనాడు, అమరావతి

తిరుపతి నుంచి చదువుకునేందుకు వచ్చిన ఓ విద్యార్థిని పట్ల హాస్టల్ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. ఆలస్యంగా వచ్చిందని రాత్రి సమయం అన్న కనీస ఆలోచన లేకుండా బయటికి గెంటేశారు. ఒంటరిగా ఎక్కడికి వెళతుందని తండ్రి ఫోన్ చేసి ప్రాధేయపడినా నియంతృత్వంగా వ్యవహరించి ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్ణయం తీసుకున్నారు. జరిగిన విషయంపై అన్ని స్థాయిల్లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేరు.

ప్రశ్నించినందుకు వేధింపులు: దసరా సెలవులకు ముందు హాస్టల్‌కు ఆహార నాణ్యత, మెనూ గురించి ఉన్నతాధికారులు తనిఖీకి వచ్చారు. సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు సూచించారు. సమస్యలు చెప్పేందుకు సదరు విద్యార్థిని వారి నుంచి నంబర్ తీసుకుంది. వారికి ఫిర్యాదు చేస్తుందన్న ఉద్దేశంతో వేధింపులు మొదలయ్యాయి. భోజనానికి వచ్చిన ప్రతిసారి 'ఇంట్లో తినడానికి గతి ఉండదు కానీ ఇక్కడ మాత్రం రుచులు కావాలి' అంటూ కిచెన్ సిబ్బంది సూటిపోటి మాటలతో నరకం చూపించారు.

✪ దీంతో విద్యార్థిని తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలోనే దసరా సెలవు ఇవ్వడంతో తిరుపతి వెళ్లింది. వ్యక్తిగత సమస్యలతో వారం ఆలస్యంగా రాత్రి వేళ హాస్టల్‌కు తిరిగి వచ్చింది. ఆలస్యంగా రావడంతో నీ పేరు తొలగించామని రాత్రి వేళ గెంటేశారు. మరో దారి లేక విద్యార్థిని రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ తెలిసిన వారింట్లో తలదాచుకోవాల్సి వచ్చింది.

హాస్టల్‌లో చేర్చుకున్నారు కానీ.. ✪ ఈ అంశంపై విద్యార్థిని తండ్రి డివిజన్ మొదలు రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఫిర్యాదు చేశారు. విచారణలో హాస్టల్ అధికారులదే తప్పని నిర్ధారించారు. విద్యార్థినిని హాస్టల్‌లో చేర్చుకున్నా ఇప్పటికీ బాధ్యులపై కనీస చర్యలు తీసుకోలేదు. పైగా కిచెన్ సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్లు తప్పుడు ఉత్తర్వులు జారీ చేసి మిన్నకున్నారు. తల్లిదండ్రులను మోసం చేశారు.

✪ దీనిపై కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. విద్యార్థినికి అన్యాయం జరిగిందా లేదా అన్న విషయం పరిశీలించి హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట!

ఇబ్రహీంపట్నం గ్రామీణం(గుంటుపల్లి), న్యూస్‌టుడే

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద అధికారులు మత్స్యకారులందరికీ బీమా పథకం వర్తింపజేశారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో చేపల వేటలో మృతి చెందిన మత్స్యకారులకు రూ.10 లక్షలు బీమా పరిహారం అందజేస్తారు. మత్స్యకారుడు సాధారణ మరణంతో పాటు ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన వారికి కార్మిక శాఖ ద్వారా రూ.2 లక్షల చొప్పున బీమా ప్రకటించారు. అయితే దీనికి ఈ- శ్రమ్ కార్డు తప్పని సరిగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

పీఎంఎంఎస్‌వైకు అర్హులు ఎవరు?

మత్స్య సహకార సంఘాల్లో సభ్యులై ఉండాలి. చేపల వేట లైసెన్సు ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తోంది. చేపల వేట సమయంలో మరణించిన మత్స్యకారుడికి రూ.10 లక్షలు బీమా అందజేస్తారు. కార్మిక శాఖ ద్వారా ఈ- శ్రమ్ కార్డు పొందితే సాధారణ, ఇతర ప్రమాదాల్లో మత్స్యకారుడు మృతి చెందితే రూ.2 లక్షల చొప్పున పరిహారాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఇస్తారు.

అవసరమైన పత్రాలు

ఆధార్ కార్డు, మరణ ధ్రువపత్రం, శవపంచనామా పత్రం, రేషన్ కార్డు, మత్స్య సహకార సంఘం ధ్రువపత్రం, సంఘం తీర్మాన పత్రం సమర్పించాలి. వీటిని మత్స్య శాఖ జిల్లా కార్యాలయంలోని అధికారులకు కాని, రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని గానీ కలిసి నకళ్లను వారికి ఇవ్వాలి. తర్వాత అధికారులు వాటిని పరిశీలించి విజయవాడ రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు.

జిల్లాలో గుర్తింపు పొందిన మత్స్యకారులు	1500 మంది
నదీ తీర సహకార సంఘాలు	21
చేపల చెరువు సంఘాలు	84


నదీతీరంలో పడవలకు లంగరు వేశారిలా..

సద్వినియోగం చేసుకోండి

పీఎంఎంఎస్‌వై పథకాన్ని మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలి. చేపల వేటలో మత్స్యకారుడు చనిపోతే రైతు సేవా కేంద్రాల్లో కాని, మత్స్య అభివృద్ధి శాఖ అధికారులను తక్షణమే సంప్రదించాలి. మత్స్య సంపద ఉత్పత్తి, నిల్వలు, విక్రయాలు నిర్వహించుకోవడానికి వివిధ పథకాలను అర్హులైన వారికి సబ్సిడీలపై అందజేస్తారు.

- చక్రాణి, జిల్లా మత్స్య శాఖ అధికారిణి


స్వామివారి ప్రభ వద్ద పూజలు తిలకిస్తున్న జనాలు


భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

రామలింగేశ్వరా రక్షమాం..

కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. అనంతరం గ్రామ మండపం వద్ద దేవస్థాన ప్రభకు ఎడ్లు కట్టి ఊరేగించారు. దీన్ని రూ.4,05,000 రావి భవిత్ పాట పాడి దక్కించుకున్నారు. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అట్టహాసంగా ప్రభోత్సవం..: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణకు ప్రభలు విద్యుత్తు దీపాలతో అట్టహాసంగా బయలుదేరాయి. పెద్ద ప్రభలు 41 ఉండగా, చిన్న ప్రభలు, చిన్నారులు చేసిన ప్రభలు మరో 20 వరకు గిరి సేవలో తరించాయి. రాత్రి మొత్తం ప్రభోత్సవం కొనసాగింది.

ప్రముఖులు రాక..: స్వామి వారిని బందరు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దంపతులు, విజయవాడ నగర సీపీ రాజశేఖర్‌బాబు, కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దంపతులు, కృష్ణా జిల్లా పూర్వపు ఎస్పీ గంగాధర్, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, పలువురు పోలీసు, దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు దర్శించుకున్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గా ఘాట్‌లో భక్తులు పుణ్యస్నానాలకు ఆదివారం పోటెత్తారు. వేకువజామున నుంచే పుణ్యస్నానాలకు, పితృ తర్పాణాలు సమర్పించే వారు ఘాట్‌కు తరలి వచ్చారు. ప్రకాశం బ్యారేజీ పైనుంచి దుర్గాఘాట్‌కు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.


ప్రభ ఊరేగింపు

ప్రజల్లో చైతన్యం తెచ్చేలా నార్నె లేఖలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేలా నార్నె వెంకటసుబ్బయ్య.. పత్రికలకు రాసిన లేఖలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని డాక్టర్ సమరం అన్నారు. హేతువాత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అధ్యక్షతన ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'శాస్త్రీయ సమాజం కోసం లేఖాస్త్రాలు' అనే పేరుతో నార్నె రూపొందించి పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సమరం మాట్లాడారు. ఈ పుస్తకంలో పలు అంశాలపై ముక్కుసూటిగా రాయడం జరిగిందని ప్రశ్నలతోనే సమాజం ముందుకు పోతుందని చెప్పారు. వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సమస్యలను వెలుగులోకి తీసుకురావడం గొప్ప విషయమన్నారు. మనోహర్ నాయుడు, జమీందార్, దిలీప్, మోతుకూరి వెంకటేశ్వర్లు, రాజు, కనకరాజు, పూర్ణగాంధీ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకం చూపుతున్న డాక్టర్ సమరం, పక్కన వెంకటసుబ్బయ్య, మనోహర్‌నాయుడు, జమీందార్, దిలీప్ తదితరులు

ఆకట్టుకుంటున్న వస్త్రాల ప్రదర్శన

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహించే నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పండగలు, వివాహాల నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే చేనేత ఉత్పత్తులు, సరికొత్త డిజైన్లు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల చీరలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు తదితర ఉత్పత్తులను 50 శాతం వరకు తగ్గించి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల సిల్క్ చీరలు పలు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని, నగర, సమీప ప్రాంతాల ప్రజలు సందర్శించాలని కోరారు.



పూల్ సెమీస్‌లోకి 'కేఆర్‌యూ' నెట్‌బాల్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య కృష్ణా విశ్వవిద్యాలయం (కేఆర్‌యూ) జట్టు పూల్ 'సి'లో సెమీ ఫైనల్‌లో ప్రవేశించింది. రెండో రోజైన ఆదివారం పోటీలు రసవత్తరంగా జరిగాయి. కృష్ణా వర్సిటీ జట్టు... మాధవ విశ్వవిద్యాలయం (రాజస్థాన్) జట్టుపై, ఆపై జేఎన్‌టీయూ (హైదరాబాద్) జట్టుపై గెలిచి పూల్ సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

☛ పూల్ 'బి'లో అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్సిటీ (బిలాస్‌పూర్) జట్టు.. ఆదికవి నన్నయ్య వర్సిటీ (ఏపీ) జట్టుపై, రాజీవ్ గాంధీ ప్రొద్యోగికి (ఎంపీ) జట్టు.. జనార్దన్ రాయ్ నగర్ రాజస్థాన్ విద్యాపీఠ్ (రాజస్థాన్)పై గెలిచింది.

☛ పూల్ సెమీస్‌లోకి 'కేఆర్‌యూ' నెట్ బాల్ జట్టుపూల్ 'డి'లో కేరళ వర్సిటీ (కేరళ) జట్టు... డాక్టర్ భీమ్ రావ్ అంబేడ్కర్ (ఉత్తరప్రదేశ్) జట్టుపై, భారతీదాసన్ (తమిళనాడు) జట్టు... వీర్ నర్మద్ సౌత్ గుజరాత్ వర్సిటీ (గుజరాత్) జట్టుపై, మంగుళూరు (కర్ణాటక) జట్టు... కోటా (రాజస్థాన్) జట్టుపై, గోండ్వానా (మహారాష్ట్ర) జట్టు... ఉస్మానియా (తెలంగాణ) జట్టుపై, కాలికట్ (కేరళ) జట్టు... శివాజీ వర్సిటీ (మహారాష్ట్ర) జట్టుపై విజయం సాధించాయి.

☛ టీఎన్‌పీఈఇ (చెన్నై), సావిత్రిబాయి పులే (మహారాష్ట్ర), ఆర్‌టీఎంఎన్‌యూ (మహారాష్ట్ర), హరియాణా స్పోర్ట్స్ (హరియాణా), హేమచంద్ యాదవ (ఛత్తీస్‌గఢ్), బెంగళూరు (కర్ణాటక), అటల్ బిహారీ వాజపేయి (బిలాస్‌పూర్), కేరళ వర్సిటీ (కేరళ) జట్టు తమ ప్రత్యర్థి జట్లపై గెలిచాయి. పోటీలను తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కృష్ణా వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ, రెక్టార్ మండవ వెంకట బసవేశ్వరరావు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జె.నవీన లావణ్యలత, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ పాల్గొన్నారు.


మంగుళూరు (కర్ణాటక), గోండ్వానా (మహారాష్ట్ర) వర్సిటీ జట్ల మధ్య మ్యాచ్


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ

ప్రయోగాత్మకంగా కియోస్క్ మెషిన్ల ద్వారా టికెట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ప్రయోగాత్మకంగా టెంపుల్ కియోస్క్ మెషిన్ల ద్వారా దర్శనం, ప్రసాదం, సేవల టికెట్లను భక్తులు నేరుగా తీసుకునే విధానాన్ని ఆదివారం ప్రారంభించారు. కరూర్ వైశ్యా బ్యాంక్ అధికారులు ఏర్పాటు చేసిన మెషిన్లు కనకదుర్గానగర్, లిఫ్టులు, ఘాట్ రోడ్డు మార్గంలో సమాచారం కేంద్రం వద్ద వీటిని ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వీటి పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత ఎన్ని దర్శనం టికెట్లు కావాలో ఎంటర్ చేస్తే దానికి సంబంధించిన మొత్తం భక్తుడి ఖాతా నుంచి కట్ అయిన వెంటనే టికెట్ బయటకు వస్తుంది. దాన్ని తీసుకొని భక్తుడు దర్శనం చేసుకోవచ్చని ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రంగారావు, సూపరింటెండెంట్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు


టికెట్ తీసుకుంటున్న భక్తుడు, పక్కన ఈవో శీనానాయక్, ఏసీ రంగారావు

మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్యకు నివాళి

దుర్గాఅగ్రహారం(సీతారాంపురం), గాంధీనగర్: మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య(93) మృతితో రాజకీయ, సామాజిక, వ్యాపార వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఏఎంసీ విజయవాడ మాజీ ఛైర్మన్ పాండురంగారావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్, కాంగ్రెస్ నాయకులు గురునాథం, రాజేశ్వరరావు, దోనేపూడి శంకర్, కె.పోతన, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ తదితరులు ఆదివారం వెంకయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, నగర కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు

చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

గుంటూరు(గోరంట్ల), న్యూస్‌టుడే: చర్మ వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడంతో తేలికగా ఉపశమనం పొందవచ్చని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులో స్కిన్ వర్క్స్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఆసుపత్రి గుంటూరుకు రావడం హర్షణీయమన్నారు. డాక్టర్ మాన్య సిందూర మాట్లాడుతూ చర్మ సమస్యలకు లేజర్ టెక్నాలజీ, ఇమ్యునోథెరపీ, కాస్మెటిక్, రీకన్‌స్ట్రక్టివ్ విధానాలతో కూడిన చికిత్సలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. చర్మ వ్యాధులకు తక్కువ సమయంలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ఉగ్రనరసింహారెడ్డి, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ టీడీ జనార్దన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీఐఐసీ ఛైర్మన్ దేగల ప్రభాకరరావు, రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, నగర డిప్యూటీ మేయర్ సజీల, వైద్యులు గొట్టిపాటి లక్ష్మి, ఉప్పుటూరి అంజలి, ఉప్పుటూరి హేమంత్, లక్ష్మీప్రియ, తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల పింఛన్ పెంచాలి


మాట్లాడుతున్న శివనాగమల్లేశ్వరరావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వి.శివనాగమల్లేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులకు ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛన్ కంటే తమకు తక్కువ పింఛను వస్తోందని, కేవలం రూ.2 వేలతో జీవనం ఎలా సాగించాలని వాపోయారు. తమకు జీవన భృతి కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, వైద్యఖర్చుల పరిమితి ఐదు లక్షలకు పెంచాలని కోరారు. సూపర్ లగ్జరీలో ప్రయాణాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు జి.సీతారామారావు, సాయి భాస్కరప్రసాద్, పి.రమేష్, వెంకట రామయ్య, మురళీకృష్ణ, సీహెచ్ ప్రసాద్, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ అండర్-12 జిల్లా పోటీలు



గన్నవరం బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి అండర్-12 బాలబాలికల రగ్బీ పోటీలు, జిల్లా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. పోటీలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిశోర్, సీనియర్ వాకర్స్‌తో కలిసి రగ్బీ క్రీడ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలకృష్ణారావు ప్రారంభించినట్లు క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పెద్దఅవుటపల్లి, నున్న, విజయవాడ ఎంఎస్ఆర్ జట్లను ఏపీఆర్‌డీసీ డైరెక్టర్ శివశంకర్‌తో కలిసి అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.

- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

అంతిమ యాత్రలో హల్‌చల్‌పై కేసు

భవానీపురం, న్యూస్‌టుడే: రౌడీషీటర్ అంతిమ యాత్రలో హల్‌చల్ చేసిన నలుగురిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురంలో నివాసం ఉంటున్న జనపాల ఫణీంద్ర అలియాస్ పావురం ఈనెల 3న రోడ్డు ప్రమాదంలో గాయపడి 12వ తేదీన చనిపోయాడు. అతడి అంతిమయాత్రను 13వ తేదీన భవానీపురం నుంచి కృష్ణలంక వరకు నిర్వహించారు. పావురంపై కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అంతిమ యాత్రలో డీజేలు, సైలెన్సర్లు తొలగించిన వాహనాలతో రౌడీషీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు హల్‌చల్ చేశారు. అంతిమ యాత్రలో ట్రాఫిక్ అంతరాయం కలిగించడం, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు డీజేలు నిర్వహించి హల్‌చల్ చేసిన సాయి, సూర్య, నవీన్, కోడిలపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెనకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

అమరావతిలో బిల్‌గేట్స్ పర్యటనకు ఏర్పాట్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో ఆయన సమావేశం కానున్నారు. సచివాలయంలో ఆర్టీజీఎస్‌లో సాంకేతిక వినియోగం, రియల్ టైం గవర్నెన్స్ విధానం-ఫలితాలు, ఉండవల్లిలో రైతులతో సమావేశం, వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ల వినియోగం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి ఆదేశాల మేరకు అధికారులు బిల్‌గేట్స్ పర్యటించే మార్గాల్లో సుందరీకరణ పనులు చేపట్టారు. కృష్ణానది కరకట్ట, సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ-3) ఫేజ్-1, 2.. రాష్ట్ర సచివాలయానికి వెళ్లే ఎన్-9 మార్గంలో సుమారు 10 కి.మీ. మేర రహదారులను శుభ్రపరిచారు. అతిథులను ఆకర్షించేలా డివైడర్లకు రంగులు వేస్తున్నారు. కరకట్టపై ఇరువైపులా మట్టిని చదును చేయించారు. వీవీఐపీలు ప్రయాణించే మార్గంలో ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి శుభ్రపరిచారు. కృష్ణా కరకట్ట, సీడ్‌యాక్సెస్ రోడ్డు, ఎన్-9 రోడ్డులో ఆహ్లాదకర పూల మొక్కలతో సుందరీకరిస్తున్నారు. ఏడీసీ ఇంజినీరింగ్, గ్రీనరీ విభాగం అధికారులు నిరంతరం పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఉండవల్లిలో కలెక్టర్ పరిశీలన.. ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను బిల్‌గేట్స్, చంద్రబాబు తదితరులు పరిశీలించనున్న నేపథ్యంలో అధికారులు ఆమేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమావేశ వేదిక, సీసీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడే డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, రైతులతో సమావేశం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. క్షేత్ర పరిశీలనలో కలెక్టర్‌తోపాటు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకురాలు ఎం.పద్మావతి, ఉద్యానశాఖ ఉపసంచాలకురాలు రవీంద్రబాబు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.


ఉండవల్లి వ్యవసాయ క్షేత్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

'బడ్జెట్‌లో పద్దులు సవరించాలి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీసేలా ఉందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లోని పద్దులను సవరించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చినట్లు, పరిశ్రమలు పెట్టినట్లు, యువతకు ఉపాధి కల్పించినట్లు మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశం మొత్తంగా చూస్తే 25 శాతం పెట్టుబడులు మన రాష్ట్రానికే కుప్పలు తెప్పలుగా వచ్చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రసంగం సాగిందని ఎద్దేవా చేశారు. కానీ బడ్జెట్ చూస్తే మంత్రి చెప్పిన దానికి పూర్తి విరుద్ధంగా ఉందని ఏ రంగానికి నిధుల పెంపుదల లేదన్నారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న సంక్షేమ, వ్యవసాయ రంగానికి, చివరకు విద్యా రంగానికి కూడా కోత పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో గడిచిన 20 మాసాల్లో జరిగిన అభివృద్ధి సున్నా అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఇది కార్పొరేట్లకు ఊడిగం చేసే బడ్జెట్ అని విమర్శించారు. బుడమేరు ఆధునికీకరణకు నిధులు ఏవని ప్రశ్నించారు. సీపీఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోయి సత్యబాబు, పి.కృష్ణ, కె.దుర్గారావు, నారాయణ, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


నిరసన ప్రదర్శనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కాశీనాథ్, రమణారావు, సత్యబాబు తదితరులు

17న యూటీఎఫ్ ఆధ్వర్యంలో చలో విజయవాడ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్టినా కనీసం ఉద్యోగులు, పీఆర్సీ గురించి కనీస ప్రస్తావన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గవర్నర్‌పేటలోని కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని కానీ 20 నెలల కాలంలో ఒక డీఏతో రెండేళ్లు సరిపెట్టారని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టుకార్డు ఉద్యమం, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి పీఆర్సీ కమిషనర్ నియామకం గురించి ప్రస్తావన లేదన్నారు. మధ్యంతర భృతి 29 శాతం ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, బకాయిలు చెల్లించాలని, హెల్త్ కార్డు, మెడికల్ బిల్లుల సమస్యలు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రణభేరి 2.0 పేరుతో 17న చలో విజయవాడ చేపట్టామన్నారు. పెద్దఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎం.సుందరయ్యలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోహర్‌కుమార్, పక్కన శ్రీనివాసరావు, సుందరయ్య

ఆకట్టుకున్న అఖండ నాదార్చన

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గవర్నర్‌పేటలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వరఝరి, దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో 12 గంటల అఖండ నాదార్చన జరిగింది. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ నాదార్చన నిరాటంకంగా రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. చిన్నారి విష్ణుభట్ల లక్ష్మీసంహిత ఆలపించిన కృతులు ప్రేక్షకులను అలరించాయి.



సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కృతులు ఆలపిస్తున్న చిన్నారి లక్ష్మీసంహిత

ధర వరలు

వంకాయలు-18/22, టమాటా-13, బెండ-26, పచ్చిమిర్చి-44, కాకర-32, బీర-26/28, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజీ-14, క్యారెట్-28, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-26, దోస-16/26, సొర-12/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-22, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు(కట్ట)-2.50, కంద-36, బీట్‌రూట్-24, కీరదోస-44, బీన్స్-52/56, క్యాప్సికమ్-60, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22(నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (కిలో రూ.ల్లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ తిరువూరు పట్టణం 17వ వార్డులోని డ్రెయిన్లలో మురుగు, చెత్త వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రభాకర్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ★ తిరువూరు పట్టణం 6వ వార్డులోని డ్రెయిన్లలో పిచ్చి మొక్కలు పెరిగి దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికుడు సాయి కుమార్ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి దోమల మందు పిచికారీ చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

క్రికెట్‌లో ఉన్నతంగా రాణించాలి

జగ్గయ్యపేట గ్రామీణం : గుంటూరు జిల్లాలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్-12 క్రికెట్ పోటీలకు మండలంలోని షేర్‌మహమ్మద్‌పేట డీవైఎఫ్ఐ నాయకుడు బడే మియా-షహనాబ్ కుమారుడు షేక్ ఫాదిల్ ఎంపికయ్యారు. ఫాదిల్ క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని సీపీఎం మండల కార్యదర్శి సోమోజు నాగమణి తెలిపారు. టోర్నమెంట్‌లో మంచిగా రాణించి రానున్న రోజుల్లో క్రికెట్‌లో ఉన్నత స్థానం సాధించాలన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి బి.కాలనీ వద్ద ఉన్న సెయింట్ థామస్ చర్చి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎన్టీటీపీఎస్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి తెదేపా సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద సీతారామయ్య తదితరులు

మైనార్టీల సంక్షేమం.. అభివృద్ధికి కృషి

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని రాజుపేటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జరిగిన అన్నదానంలో ముస్లిం సోదరులకు ఆయన స్వయంగా వడ్డించారు. తిరువూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుబ్రమ్మణ్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు

సమీపిస్తున్న గడువు.. నమోదు చేసుకుంటే మేలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

రైతులకు భూహక్కు పత్రాలు ఎంత ముఖ్యమో. .తమ భూముల్లో సాగు చేసిన పంటలను ప్రభుత్వం గుర్తించేందుకు ఈ- పంట నమోదు అంతే అవసరం. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను మద్దతు ధరకు ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో పంట పాడైపోతే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందాలన్నా, పంటల బీమా పథకం వర్తించాలన్నా, సాగైన పంటలకు రాయితీలు, అవసరమైన ఎరువులు కావాలన్నా ఈ- పంట నమోదు తప్పనిసరి. ఇన్ని వివరాలు ఎందుకంటే ప్రస్తుతం సాగైన రబీ పంటలకు సంబంధించి నమోదు గడువు ఈ నెల 20న ముగుస్తోంది. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ప్రధానంగా వరి, మొక్కజొన్నకు వ్యవసాయాధికారులు ఈ- పంట నమోదును రెండు నెలలుగా చేస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు అన్నదాతలు గడువులోగా ఈ- పంట నమోదు చేసుకుంటే మేలు.

మొబైల్ యాప్‌లో..

ఈ- పంటలో సాగు వివరాలను ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులే నమోదు చేశారు. ఇకపై రైతులే స్వయంగా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకునేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. అన్నదాతలు తమ స్మార్ట్ ఫోన్‌లో ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆధార్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, ఎంపిన్‌ను సెట్ చేసుకోవాలి. ఆధార్ నంబరు ఆధారంగా వెబ్‌ల్యాండ్‌లో అనుసంధానమైన రైతుకు చెందిన అన్ని భూకమతాలు ఆ యాప్‌లో కనిపిస్తాయి. దీని ద్వారా ఇప్పటి వరకు వీఏఏలు నమోదు చేయని పంటల వివరాలను సకాలంలో నమోదు చేసుకోవచ్చు. ఇందుకు రైతులు తప్పనిసరిగా పొలంలో ఉండాలి. 20 మీటర్ల జియో రిఫరెన్సు హద్దులతో పొలంలో పంటతో సహా చిత్రం తీసుకోవచ్చు.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఆదివారం వరకు ఈ-పంట నమోదు వివరాలు..

మండలం పేరు	వరి (ఎకరాల్లో)	మొక్కజొన్న (ఎకరాల్లో)
తిరువూరు	18,003	633
ఎ.కొండూరు	4095	5964
గంపలగూడెం	8447	6453
విస్సన్నపేట	5745	2413
రెడ్డిగూడెం	5473	1624



గంపలగూడెం మండలం తునికిపాడులో ఈ- పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

అంచనాలను దాటి..

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో రబీలో ఇప్పటి వరకు 41,763 ఎకరాల్లో వరి, 17,087 ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు వీఏఏలు ఈ-పంటలో నమోదు చేశారు. అయిదు మండలాల్లో వ్యవసాయాధికారుల అంచనాలను దాటి వరి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. ఇప్పటి వరకు నీటి లభ్యత అనుకూలంగా ఉండటంతో రైతులు ఆసక్తి చూపారు.

శివారు కాలనీలకు అందని.. తాగునీరు



విస్సన్నపేట శివారు రాజీవ్‌నగర్ కాలనీలో కుళాయి నీరు సక్రమంగా అందడం లేదని, వచ్చిన ఆరకొర నీరు మురుగుగా ఉంటుందని నివాసితులు వాపోతున్నారు. ... వన ఉండడంతో మురుగు నీటిలోనే తాగు నీరు పట్టుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారుల స్పందించి సమస్యను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని ఏసీపీ ప్రసాదరావు సూచించారు. 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న మహిళా పోలీసు బృందానికి కంభంపాడులో ఘన స్వాగతం పలికారు. ... ప్రదాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎ.కొండూరు ఎస్సై మహాలక్ష్మమ్మ, సిబ్బంది, తెదేపా మండల అధ్యక్షుడు పీక్లా నాయక్, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ రెడ్డి, ఎలిసెటి చంద్రం పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: డ్రగ్స్‌పై దండయాత్ర సైకిల్ ర్యాలీ తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి ఆదివారం సాయంత్రం ప్రవేశించింది. ఈ మేరకు బృంద సభ్యులకు ఎస్సై శాతకర్ల, సిబ్బంది, కాకర్ల గ్రామస్థులు మన స్వాగతం పలికారు.



తిరువూరులో ఎస్సై శాతకర్ల, సిబ్బంది



కంభంపాడులో యాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న అధికారులు, గ్రామస్థులు

గోమాతల యజమానులకు సత్కారం

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను శివాలయంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో గ్రామానికి చెందిన గోమాతల యజమానులను నిర్వాహకులు సత్కరించారు. సనాతన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు అన్నారు. గోవులు పెంచుతున్న యజమానులతో పాటు పలువురు కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. గోమాతకు పూజలు చేశారు.



సన్మానం అందుకున్న వారితో నిర్వాహకులు

లారీల రాకపోకలతో ఇబ్బందులు



ఆందోళన చేస్తున్న అరుణానగర్ వాసులు

కొండపల్లి, న్యూస్‌టుడే: క్వారీ లారీల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అరుణానగర్ వాసులు వాపోతున్నారు. ఈ మేరకు స్థానికులంతా ఆదివారం రహదారిపై నిరసన తెలిపారు. క్రషర్లు, క్వారీ, సిమెంటు కంపెనీలకు వెళ్లే లారీలు అరుణానగర్ మీదుగా అడవి క్వారీకి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. గతంలో పురపాలిక అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన స్పందించ లేదని చెబుతున్నారు. లారీలను అడ్డగిస్తుంటే.. అడ్డు వచ్చిన వారిని తొక్కిస్తామని డ్రైవర్లు మాట్లాడడం దారుణమన్నారు. పదేళ్లుగా బాధలు పడుతున్నా తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పారిశ్రామికవాడ నుంచి వెళ్లే రహదారిలోనే ఆయా లారీల వారికి మార్గం చూపే విధంగా అధికారులు చొరవ చూపాలని కోరారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాలు బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద శర్మ కుమారుడు వి.ఎన్.వి.ఎల్.ఎన్.జి.శర్మ రూ.4 లక్షలు విలువ చేసే బంగారు బొట్టు, నత్తు, బులాకీని ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. 29.700 గ్రాముల బరువు ఉన్న వాటిని దుర్గమ్మ ఎదుట ఉంచి పూజ చేయించిన అనంతరం ఈవో శీనా నాయక్‌కు అప్పగించారు. ఆశీర్వచన మండపంలో దాత కుటుంబానికి వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



ఈవో శీనానాయక్‌కు ఆభరణాలు అందజేస్తున్న వి.ఎన్.వి.ఎల్.జి.శర్మ, కుటుంబ సభ్యులు

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. తాడేపల్లికి చెందిన నృత్యాచార్య స్వర్ణలత శిష్య బృందం ప్రదర్శించిన శివతాండవం, శంకర శ్రీగిరి తదితర భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. తెనాలికి చెందిన నాట్యాచారిణి ఆర్.వసంత దుర్గ శిష్య బృందం ప్రదర్శించిన గణేష్ స్తుతి, మహిషాసురమర్దిని స్తోత్రం భక్తుల్లో ఉత్తేజాన్ని నింపింది. నృత్య కళాకారులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?



చెవుటూరు గ్రామంలో ప్రధాన రహదారికి అనుసంధానంగా ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో గంగానమ్మ బజారుకు వెళ్లే రోడ్డుతో అనుసంధానంగా దీన్ని మధ్యలో కాలువకు ఏర్పాటు చేసిన తూము విరిగిపోయి గుంత ఏర్పడింది. దీంతో రాత్రి వేళ ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



తిరువూరులో..



మేడూరులో జీవన్ముక్తేశ్వర స్వామి



కొత్తపల్లి గుడిలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు



పోలిశెట్టిపాడులో అభిషేకం



సంగమం వద్ద శివుని విగ్రహం

హర హర మహాదేవ శంభో శంకర

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శివనామస్మరణతో తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ఆలయాలు మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. పితృదేవతలకు పిండ ప్రదానాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానమాచరించారు. అనంతరం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అన్నదానాలు జరిగాయి. **- న్యూస్‌టుడే యంత్రాంగం**



జి.కొండూరులో ప్రభ



గుంటుపల్లి కాశీ విశ్వేశ్వర విశాలాక్షి ఆలయంలో దేవినేని ఉమా



సంగమం వద్ద భక్తుల పుణ్య స్నానాలు



గొల్లపూడి ఘాట్ వద్ద భక్తుల కోలాహలం



వెల్వడం బాలకోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు



కొండపర్వలో అన్నసంతర్పణ



గుంటుపల్లి రేవులో గజ ఈతగాళ్ల పర్యవేక్షణలో..

విశ్వశాంతి కల్యాణ మహోత్సవం

కొండపల్లి, న్యూస్‌టుడే : స్థానిక బి.కాలనీ వద్ద ఉన్న గిరివిరేశ్వర ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విశ్వశాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆదివారం శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణ వేడుక నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



రెడ్డిగూడెంలో..

వైభవంగా శివ కల్యాణం

మైలవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి, ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీ భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శివ కల్యాణం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎస్వీ సుధాకర్ రావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ ప్రాంగణంలో శివయ్య కల్యాణం కనులపండువగా ఆదివారం నిర్వహించారు. రుత్వికులు వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య మల్లేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కృష్ణా జలం, పంచామృతాలతో అభిషేకాన్ని నిర్వహించారు. లింగోద్భవకాలంలో గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు అందజేశారు.



వెల్వడం: ప్రభల ఊరేగింపులో ఎమ్మెల్యే తదితరులు



కొండపర్వలో మల్లయ్య స్వామి..



కొండపల్లి: క్రతువులో పాల్గొన్న భక్తులు



మైలవరం శివాలయంలో శివ కల్యాణం

ఇకపై స్వర్ణ గ్రామం.. వార్డులు



రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామ, వార్డులుగా (ఎస్‌జీఎస్‌డబ్ల్యూ) మార్పు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు గ్రామ సచివాలయాలుగా ఉండగా ఇకపై స్వర్ణ గ్రామాలుగా పిలవనున్నారు. తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో 67 గ్రామ సచివాలయాలు, తిరువూరు పట్టణంలో 20 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ కార్యాలయాలపై ఉన్న బోర్డుల్లో అధికారులు పేర్లు మార్పు చేయాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, గంపలగూడెం**

ఎర్ర వంతెన వద్ద లారీ బోల్తా

కొండపల్లి: కొండపల్లి ఎర్ర వంతెన వద్ద ఆదివారం ఉదయం లారీ పడిపోయింది. వంతెనకు అనుసంధానంగా నూతన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మైలవరం నుంచి కొండపల్లి వైపు వస్తున్న లారీ వంతెన వద్దకు రాగానే డ్రైవర్‌కు మార్గం అర్థం కాక ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ పక్కకు ఒరిగి పడిపోయింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం వల్ల నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ఘటన స్థలంలో లారీ

అన్నదానానికి విరాళం

నందిగామ గ్రామీణం: దాములూరు కూడలి శివాలయంలో అన్నదానానికి అదే గ్రామానికి చెందిన కొత్త వీరన్న ఆదివారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామీణ వైద్యుల సంక్షేమసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి, డివిజన్ నాయకులు మార్కపూడి దేవదాసు, సైదులు, మధు, నరేంద్ర అభినందించారు.

ఆలయం సమీపంలో మద్యం అమ్మకాలు

సామాజిక మాధ్యమాల్లో వీడియో ★ అడ్డుకున్న ఎక్సైజ్ అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే : విచ్చలవిడిగా మారిన మద్యం అమ్మకాలతో వ్యాపారులు మరింత బరితెగిస్తున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను మండలంలోని వెల్వడంలో మూడ్రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. దాన్ని ఆసరాగా తీసుకున్న గొలుసు కట్టు దుకాణదారులు, ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రాంతానికి సమీపంలో పట్టాలు కట్టి మరీ ఆదివారం దుకాణం తెరిచి విక్రయాలు ప్రారంభించారు. భక్తులకు కనిపించేలా మద్యం సీసాలు ఏర్పాటు చేశారు. ఈ నిర్వాకం, అధికారుల తీరుపై సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అయ్యింది. దీనిపై స్పందించిన ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాస్ అక్కడ నుంచి మద్యం బాక్సులు తొలగించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇటువంటి అమ్మకాలపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సిద్ధంగా మద్యం బాక్సులు

పట్టాలెక్కనున్న చింతలపూడి ఎత్తిపోతల పథకం

● బడ్జెట్లో నిధుల కేటాయింపుతో రైతుల్లో హర్షం

మైలవరం, న్యూస్‌టుడే

ఎగువ రాష్ట్రం నుంచి సాగర్ నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులకు చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తితో చెక్ పడనుంది. తెదేపా హయాంలో మొదలు పెట్టిన ఈ పథకాన్ని వైకాపా పూర్తిగా అటకెక్కించింది. తిరిగి కూటమి ప్రభుత్వంలో పట్టాలెక్కుతోంది. తొలి ఏడాది దీనికి కొంతమేరకే నిధులు కేటాయించగా తాజా బడ్జెట్‌లో భూసేకరణతో పాటు కాలువల ఆధునికీకరణకు నిధులు ఇవ్వడంతో త్వరితగతిన పూర్తవుతుందన్న ఆశాభావం రైతుల్లో ఏర్పడుతోంది.

రాష్ట్ర విభజనతో..

జిల్లాలోనే ప్రధాన మెట్ట ప్రాంతంగా ఉన్న మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు పూర్తిగా, నందిగామ నియోజకవర్గానికి పాక్షికంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా సాగునీటి ఇబ్బందులను ఎన్నెస్పీ ద్వారా తీర్చుకుంటుండగా రాష్ట్ర విభజనతో సాగర్‌పై ఆశలు క్రమేపీ అడుగంటుతున్నాయి. ఈ ఏడాది ఆ ఇబ్బంది కాస్తా మరింత ఎక్కువ కాగా కేటాయింపుల్లో కనీసం సగం నీరు కూడా సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విభజన అనంతరం సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి పనులు పరుగు పెట్టించారు. ఏడాదిన్నరలోనే దాదాపు సగానికి పైగా పూర్తవగా, 2019లో ప్రభుత్వం మారడంతో పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. సాగర్ ఎడమ కాలువ పరిధిలోని మూడో జోన్‌లో ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను అందించాలన్న ఆశయం నీరుగారింది.

జిల్లాలో ఎత్తిపోతల ప్రవాహమిలా..

బ్రాంచి కాలువ	మైలవరం (37.5 కి.మీ)
మేజర్లు	జమలాపురం, జక్కంపూడి, రేపూడి- 1, రేపూడి- 2, గానుగపాడు, వెల్వడం, మూలపాడు
ఆయకట్టు	సుమారు 1.20 లక్షల ఎకరాలు

జీవం పోసినట్లు..

గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో కొద్ది మొత్తంలో నిధులు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో రూ.430 కోట్లు ప్రకటించడం ఎత్తిపోతలకు జీవం పోసినట్లు అయ్యింది. దీని ద్వారా ఎన్నెస్పీ మూడో జోన్‌లోని 95వ కి.మీ వద్ద సాగర్ కాలువల్లోకి వచ్చే గోదావరి నీరు రెడ్డిగూడెం మండల పరిధిలోని మద్దులపర్వ వద్ద నుంచి నూజివీడు, మైలవరం బ్రాంచి కాలువల్లోకి ప్రవహించనుంది. అక్కడి నుంచి మేజర్లు, మైనర్ల ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టుకు నీరందనుంది.

వందేళ్లు బతికినా.. ఈ గౌరవం దక్కేనా!

పథనంథిట్ట: "ఈ చిన్నారి భౌతికకాయాన్ని మనం ఖననం చేస్తున్నా.. అవయవ దానమనే మహోన్నతమైన చర్యతో ఇతరుల రూపంలో ఆమె చిరంజీవిగానే ఉంటుంది" అని కేంద్ర మంత్రి సురేశ్ గోపి అన్నారు. కేరళ రోడ్డుప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌గా మారిన పది నెలల చిన్నారి అలిన్ షెరిన్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం పథనంథిట్ట జిల్లాలోని మల్లప్పల్లిలో రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. అలిన్ గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కళ్లు ఇతర చిన్నారులకు అమర్చేందుకు తల్లిదండ్రులు సమ్మతించిన విషయం తెలిసిందే. కేరళ రాష్ట్రమంతా బరువెక్కిన హృదయాలతో ఈ చిరు అవయవ దాతకు నివాళులు అర్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు తాను అంత్యక్రియలకు హాజరై దేశం తరఫున అలిన్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు కేంద్రమంత్రి సురేశ్‌గోపి తెలిపారు. పలువురు రాష్ట్ర మంత్రులు, నేతలు హాజరయ్యారు.


చిన్నారి అలిన్ షెరిన్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

బ్లడ్ క్యాన్సర్ విస్తుపోయేలా.. బాంధవ్యం కొనసాగుతోంది!

ఈటీవీ భారత్: ప్రేమించిన యువతికి బ్లడ్ క్యాన్సర్ ఉందని పెళ్లికి ముందే తెలిసినా అతడు వెనకడుగు వేయలేదు. స్వయానా ఆ యువతే వద్దని వారించినా.. ఆమె మెడలో తాళి కట్టి గత పదకొండేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకొంటూ చికిత్స చేయిస్తున్నాడు. కర్ణాటకలోని బెళగావి జిల్లాకు చెందిన విష్ణు, లక్ష్మి పీయూసీ వరకు చదివారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన వీరిద్దరూ రామదుర్గలోని ఒక ప్రైవేట్ కంపెనీలో కలిసి పనిస్తున్న సమయంలో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత లక్ష్మికి ప్రాణాంతక బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయినా.. 2014లో విష్ణు ఆమెను పెళ్లాడాడు. లక్ష్మి చికిత్సకు ఇప్పటివరకు దాదాపు రూ.15 లక్షలు ఖర్చయ్యాయి. ఆమె ఎంతకాలం జీవిస్తుందో కచ్చితంగా చెప్పలేమని, పిల్లలు వద్దని వైద్యులు సూచించారు. ఈ జంట గురించి తెలిసి చిక్‌పేట్ మాజీ ఎమ్మెల్యే ఆర్.వి.దేవరాజ్ ఓ ఇల్లు ఇప్పించి అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ ఈ దంపతులు స్థానిక మురికివాడ విద్యార్థులకు చదువు చెబుతూ.. దాతల నుంచి సేకరించిన వస్త్రాలు, పుస్తకాలు, చెప్పులను వారికి పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఆదివారం ఆ పిల్లలను స్థానిక దర్శనీయ ప్రదేశాలకు తీసుకెళ్తున్నారు.




అమెరికాతో చర్చలకు జెనీవాకు ఇరాన్ విదేశాంగ మంత్రి

దుబాయ్: అమెరికాతో అణు చర్చల కోసం ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం కూడా వెళ్లింది. అక్కడ అరాఘ్చి స్విట్జర్లాండ్, ఒమన్ విదేశాంగమంత్రులతో భేటీ అవుతారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్‌నూ కలుస్తారు. ఇరాన్ అణు ఒప్పందానికి రాకపోతే.. ఆ దేశం తీవ్ర చర్యల్ని ఎదుర్కొనాల్సి ఉంటుందని అమెరికా హెచ్చరిస్తున్న నేపథ్యంలో అరాఘ్చి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఒమన్‌లోని మస్కట్‌లో గతవారం అమెరికా-ఇరాన్ మధ్య తొలిదఫా చర్చలు జరిగిన సంగతి తెలిసిందే.

ఆసుపత్రిలో చేరిన పంజాబ్ సీఎం

చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆదివారం మొహాలీలోని ఓ ఆసుపత్రిలో చేరారు. మహాశివరాత్రి సందర్భంగా సంగ్రూర్‌లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు నీరసంగా అనిపించడంతో వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



స్పీకర్ తొలగింపులో స్వేచ్ఛగా నిర్ణయం

- అది సభాగౌరవానికి సంబంధించిందన్న నెహ్రూ
- 9న అవిశ్వాసం నేపథ్యంలో తెరపైకి ఆనాటి పరిణామం

దిల్లీ: పార్లమెంటు చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ స్పీకర్ తొలగింపు తీర్మానం సభ ముందుకు వచ్చినప్పుడు దానిపై పార్టీలకు అతీతంగా ఎంపీలు స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవచ్చని ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తేల్చిచెప్పారు. పార్టీ అనుబంధాలు, విప్‌లకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని, సభా గౌరవానికి సంబంధించిన అంశంగానే దానిని చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాపై విపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం మార్చి 9న చర్చకు రానున్న నేపథ్యంలో ఆనాటి పరిణామాలను రాజకీయ వర్గాలు మరోసారి గుర్తు చేసుకుంటున్నాయి. 1954 డిసెంబరు 18న అప్పటి స్పీకర్ జి.వి.మావలంకర్‌ను తొలగించాలంటూ విపక్షాలు తీర్మానాన్ని ప్రతిపాదించాయి. 50 మందికి పైగా సభ్యులు మద్దతివ్వడంతో చర్చ చేపట్టారు. సభ్యులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని నెహ్రూ చెప్పడంతోపాటు విపక్షానికి ఎక్కువ సమయం ఇవ్వాలని సభాపతిని కోరారు.

స్థాయి తగ్గించుకుంటున్నాం

"మెజారిటీ పార్టీ నేతగా కాకుండా అధికారపక్ష నేతగా సభనుద్దేశించి మాట్లాడాలనుకుంటున్నా. ఆధిక్యం ఉన్న పార్టీ సభ్యులైనా ఏ ఒక్కరూ విప్‌నకు, మరేదైనా ఆదేశానికి కట్టుబడాల్సిన పనిలేదు. నచ్చినట్లు ఓటు వేయవచ్చు. ఇది పార్టీ అంశం కాదు.. సభకు సంబంధించింది. పార్టీతో ప్రమేయం లేకుండా దీనిని చూడాలి. గౌరవ సభాపతిపై, సభ గౌరవంపై ఆధారపడిన తీవ్రమైన అంశంగానే దీనిని పరిగణిద్దాం. స్పీకర్ గురించి మనం చెప్పేది, చేసేది తిరిగి మనందరికీ వస్తుంది. ఈ అంశం సభ ముందుకు వచ్చినప్పటి నుంచి నాకెంతో విచారం కలిగింది. స్పీకర్ పనితీరుపై అందరిలో ఒకే అభిప్రాయం ఉండకపోవచ్చు. ఆయన నిర్ణయాలు కొందరికి నచ్చకపోవచ్చేమో. అంతమాత్రాన ఆయన చిత్తశుద్ధిని సవాల్ చేయడం పూర్తిగా భిన్నం. దీనిద్వారా మనం దేశానికి హాని చేస్తున్నాం.. అల్పత్వాన్ని ప్రదర్శించి, ప్రపంచం ముందు మనస్థాయి తగ్గించుకుంటున్నాం. స్పీకర్‌కు వ్యతిరేకంగా తీర్మానం రావడం అసాధ్యమని నేను చెప్పడంలేదు. రాజ్యాంగ నిబంధనను, విపక్షాల హక్కును కాదనడం లేదు. ఇక్కడ చట్టబద్ధ హక్కు కంటే.. ఔచిత్యం, అవసరం ఎంతమేరకు అనేదే పాయింటు. పార్లమెంటు గౌరవ మర్యాదలను కాపాడటం ముఖ్యం. విపక్ష ఆరోపణల్లో పస లేదు" అని స్పీకర్‌ను నెహ్రూ సమర్థించారు. ఓటింగులో తీర్మానం వీగిపోయింది.

10 నెలల్లో అదనంగా 50 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం

గత ఏడాదికంటే 54% అధికం


ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి పదినెలల్లో 50వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం అదనంగా అందుబాటులోకి వచ్చినట్లు కేంద్ర విద్యుత్తుశాఖ తెలిపింది. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 జనవరి 31 నాటికి దేశవ్యాప్తంగా అన్ని ఉత్పత్తిమార్గాల్లో కలిపి నికరంగా 52,537 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యం పెరిగినట్లు వెల్లడించింది. ఇందులో 39,657 మె.వా. పునరుత్పాదక ఇంధనం ఉన్నట్లు తెలిపింది. అందులోనూ 34,955 మె.వా. సౌర, 4,613 మె.వా. పవన విద్యుత్తు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తంలో సాధించిన 34,054 మెగావాట్ల సామర్థ్యంతో పోలిస్తే ఇది 54.27% అధికమని తెలిపింది. దీంతో దేశం మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యం 5,20,510.95 మెగావాట్ల సామర్థ్యానికి చేరినట్లయిందని పేర్కొంది. ఇందులో శిలాజాధారిత ఇంధన ఉత్పత్తి సామర్థ్యం 2,48,541.62 మెగావాట్లు, శిలాజేతర ఇంధన ఉత్పత్తి సామర్థ్యం 2,71,969.33 మెగావాట్లు అని తెలిపింది. శిలాజేతరంలో అణు ఇంధనం 8,780 మెగావాట్లు, పునరుత్పాదక ఇంధనం 2,63,189.33 మెగావాట్లు ఉన్నట్లు పేర్కొంది.

కాశీ విశ్వనాథుడికి 62 ఆలయాల కానుకలు

వారణాసి: మహాశివరాత్రి సందర్భంగా దేశవిదేశాల్లోని 62 ప్రసిద్ధ ఆలయాల నుంచి కాశీవిశ్వనాథ క్షేత్రానికి పవిత్ర జలం, నైవేద్యం, వస్త్రాలు, మట్టి కానుకలుగా అందాయి. శ్రీ మాతా వైష్ణో దేవీ ఆలయ బోర్డు, ముంబయిలోని సిద్ధివినాయక ఆలయం, గుజరాత్‌లోని ద్వారకాదీశ్ క్షేత్రం, రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారా దేవస్థానంతోపాటు శ్రీలంకలోని శ్రీలక్ష్మీ ఆలయం నుంచి కూడా ఈ కానుకలు అందినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. మలేసియా నుంచి కూడా కానుకలు అందాయని ఆలయ ప్రధాన కార్యనిర్వాహక అధికారి విశ్వభూషణ్ తెలిపారు.

వాణిజ్య ఒప్పందం పేరుతో

భారత రైతులకు ద్రోహం



- కేంద్రంపై రాహుల్ ధ్వజం
- ప్రధాని మోదీకి 5 ప్రశ్నలు

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కళ్లారా చూస్తున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి 'ఎక్స్' వేదికగా రాహుల్ 5 ప్రశ్నలు సంధించారు.

■ డీడీజీ (డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటి? జన్యుమార్పిడి చేసిన (జీఎం) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడమా? ఇది మన పాల ఉత్పత్తిని అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా?

■ జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ నూనె దిగుమతికి అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా?

■ మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటి? కాలక్రమేణా పప్పుధాన్యాలతో పాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా?

■ వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే జన్యుమార్పిడి పంటలపై భారత్ తన వైఖరిని మార్చడమా? ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడం వల్ల భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోదా?

■ ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

ఇది ఆషామాషీ విషయం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని రాహుల్ పేర్కొన్నారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తంచేశారు.



మీరు సృష్టించే విలువకే ఆదాయం

మీరు కార్యాలయంలో
వెచ్చించే సమయానికి మీకు
డబ్బులు రావు.
మీరు సృష్టించే విలువకే ప్రతిఫలం
వస్తుంది. తీరికలేకుండా గడపటం
చాలా సులువైన విషయం.
ఉపయోగపడేలా ఉండటమే ముఖ్యం.
పనిప్రదేశంలో గంటలకొద్దీ గడపడం
వల్ల కాక..ఫలితాల సాధన ద్వారానే
మీ విలువ పెరుగుతుంది.

– వివేక్ బింద్రా,
12 ప్రపంచ రికార్డుల సృష్టికర్త

బంగ్లా ప్రధానిగా రేపు తారిఖ్ రెహమాన్ ప్రమాణం



ఢాకా: బంగ్లాదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ ఆ దేశ ప్రధానిగా మంగళవారం ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని భారత ప్రధాని మోదీకి ఆహ్వానం అందినట్లు సమాచారం. అయితే ఆ రోజు ముంబయిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో పాల్గొనాల్సిన కార్యక్రమాలు మోదీకి ఉన్నాయి. దీంతో భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా.. ప్రమాణ స్వీకారానికి హాజరుకానున్నారు. భారత్ సహా 13 దేశాలకు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఆహ్వానాలు పంపినట్లు తెలుస్తోంది. భారత్-బంగ్లా మధ్య సంబంధాలు ఇటీవల దెబ్బతిన్న సంగతి తెలిసిందే. గురువారం జరిగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్‌పీ విజయం సాధించగానే తారిఖ్ రెహమాన్‌కు మోదీ ఫోన్ చేసి అభినందించిన సంగతి తెలిసిందే.

ఒకరు బీఏ, మరొకరు ఇంటర్..

5 ఏళ్లు వైద్యులుగా చలామణి!

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అంబేడ్కర్ నగర్ జిల్లా బస్ఖారీ పట్టణంలో గత అయిదేళ్లుగా కొనసాగుతున్న నకిలీ వైద్యుల ఆసుపత్రి గుట్టు రట్టయింది. ఈ క్లినిక్‌ను నడుపుతున్న యోగేశ్‌వర్మ (32) బీఏ పట్టభద్రుడు కాగా, అతడి సహాయ వైద్యుడిగా పనిచేస్తున్న శుభం విశ్వకర్మ (22) ఇంటర్ వరకు చదువుకున్నాడు. యోగేశ్ తండ్రి జలాల్‌పుర్ ఆసుపత్రిలో వార్డు బాయ్ కావడంతో తండ్రికి సహాయంగా వెళ్లి వైద్యపరమైన కొన్ని మెళకువలు నేర్చుకున్నాడు. దీంతో ఏకంగా ఆసుపత్రినే ప్రారంభించి శస్త్రచికిత్సలు సైతం చేస్తూ వచ్చాడు. శుభం ఇతడికి జత కలిశాడు. ప్రసవం కోసం ప్రియాంక అనే యువతి ఈనెల 5న వీరి ఆసుపత్రిలో చేరింది. ఆమెకు సిజేరియన్ శస్త్రచికిత్స చేయగా, తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. యోగేశ్, శుభంలను శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు క్లినిక్‌ను సీజ్ చేశారు.


యోగేశ్ వర్మ, శుభం విశ్వకర్మ

మహారాష్ట్రలో 'శివాజీ-టిప్పు సుల్తాన్' వివాదం

- భాజపా-కాంగ్రెస్ మధ్య రాళ్ల దాడి.. 9 మందికి గాయాలు

ముంబయి/పుణె: ఛత్రపతి శివాజీతో టిప్పు సుల్తాన్‌ను పోలుస్తూ కాంగ్రెస్ నేత హర్షవర్ధన్ సప్కాల్ చేసిన వ్యాఖ్యలు మహారాష్ట్రలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ పుణెలో భాజపా కార్యకర్తలు స్థానిక కాంగ్రెస్ భవన్ వెలుపల ఆదివారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఇరు వర్గాలు పరస్పరం రాళ్లతో దాడి చేసుకున్నాయి. తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఇందులో ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలతో పాటు పోలీసులు, పాత్రికేయులు కూడా ఉన్నారు. మాలేగావ్ మున్సిపల్ కార్పొరేషన్ ఉప మేయర్ షాన్-ఎ-హింద్ నిహాల్ అహ్మద్ కార్యాలయంలో టిప్పు సుల్తాన్ ఫొటోను పెట్టడాన్ని శివసేన కార్పొరేటర్లు, హిందూ సంస్థలు వ్యతిరేకించడంతో ఈ వివాదం ప్రారంభమైంది. దీనిపై సప్కాల్ మాట్లాడుతూ, శివాజీతో టిప్పు సుల్తాన్‌ను పోల్చారు. శివాజీ స్వరాజ్య ఆలోచనను అనుసరిస్తూ టిప్పు సుల్తాన్ కూడా బ్రిటిషర్లపై పోరాడారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై భాజపా నేతలు మండిపడ్డారు. శివాజీతో టిప్పు సుల్తాన్‌ను పోల్చడాన్ని తప్పుబట్టారు. వివాదంపై మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సచిన్ సావంత్ స్పందించారు. భాజపా ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తోందని ఆరోపించారు. టిప్పు సుల్తాన్ గురించిన విషయాలను గతంలో భాజపా నాయకులు బహిరంగ ప్రదేశాల్లో, అధికారిక వేదికల్లో సమర్థించారని, ఇప్పుడేమో వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు.


పుణెలో భాజపా కార్యకర్తల ఆందోళన

చమురు కొనుగోళ్లపై రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవు: జైశంకర్



ఇంటర్నెట్‌డెస్క్: రష్యా నుంచి చమురు దిగుమతులపై భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవన్నారు. అది జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని, భారత్ ఈ విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్నారు. జర్మనీలోని మ్యూనిక్ భద్రతా సమావేశంలో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు బదులిస్తూ.. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉంటుందన్నారు. 'ఇంధన సమస్యల విషయానికొస్తే.. ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉంది. భారత్‌లోని చమురు కంపెనీలు యూరప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను కూడా పరిశీలిస్తాయి. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి.. వారి ప్రయోజనాలకు తగ్గట్లు నిర్ణయాలు తీసుకుంటాయి' అని అన్నారు. అమెరికాతో ఇటీవల ఇండియాకు వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో భారత దిగుమతులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు ఆ దేశం కట్టుబడి ఉందంటూ అమెరికా ప్రకటించింది. ఈ విషయంలో భారత్ మాత్రం స్పందించలేదు. తాజాగా జైశంకర్ వ్యాఖ్యలతో అమెరికాకు సమాధానమిచ్చినట్లైంది.

భారత్ మాకు హామీ ఇచ్చింది: రుబియో

రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేసే దిశగా భారత్ తమకు స్పష్టమైన హామీ ఇచ్చిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. మ్యూనిక్‌లో నిర్వహించిన భద్రతా సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్‌తో మేము జరిపిన సంభాషణల్లో, రష్యా నుంచి అదనంగా ఇంధనం కొనుగోలు చేయబోమన్న హామీ లభించింది" అని రుబియో పేర్కొన్నారు.


చర్చల వేళ.. ఆగని ఉక్రెయిన్, రష్యా దాడులు

కీవ్: ఓవైపు శాంతి చర్చలకు సిద్ధమవుతూనే.. ఉక్రెయిన్, రష్యాలు దాడులకు తెగబడుతున్నాయి. నల్ల సముద్రంలో రష్యా ఓడరేవు తమన్‌పై ఆదివారం ఉదయం ఉక్రెయిన్ భారీస్థాయిలో డ్రోన్ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. ఓ చమురు నిల్వ చేసే ట్యాంకర్, గొడౌన్, కొన్ని టెర్మినల్స్ ధ్వంసమయ్యాయి. రష్యా కూడా ఉక్రెయిన్ తీరంలోని ఒడెసా రేవు పట్టణంపై డ్రోన్ల దాడి చేసింది. దీంతో ఆ నగరంలోని విద్యుత్తు, తాగునీటి సదుపాయాలకు అంతరాయం కలిగింది. అమెరికా మధ్యవర్తిత్వంతో జెనీవాలో మంగళ, శుక్రవారాల్లో ఉక్రెయిన్, రష్యా మరో దఫా శాంతి చర్చలకు సిద్ధమవుతున్నాయి. ఇటీవల అబుధాబీలో ఈ రెండు దేశాల మధ్య జరిగిన రెండు రౌండ్ల చర్చలు అంతగా ఫలితమివ్వలేదు.


ఉక్రెయిన్‌లోని రైల్వే మౌలిక సదుపాయాల కేంద్రంలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న సైనికులు

రాహుల్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు: అమిత్ షా

గాంధీనగర్: అమెరికా, బ్రిటన్, ఐరోపాలతో కుదిరిన వాణిజ్య ఒప్పందాలపై రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేసి, రైతుల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి అమిత్ షా ధ్వజమెత్తారు. భారత రైతులకు ఈ ఒప్పందాలు హాని కలిగిస్తాయనే మాటలు హాస్యాస్పదమన్నారు. ప్రధాని మోదీ, ఆయన నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ప్రతి ఒప్పందంలో రైతుల ప్రయోజనాలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని స్పష్టంచేశారు. దేశంలోని తొలి కేంద్ర బ్యాంకు డిజిటల్ కరెన్సీ(సీడీబీసీ) ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో అమిత్ షా ఆదివారం ప్రారంభించారు. విదేశీ ఒప్పందాలతో దేశ పాడి పరిశ్రమకు నష్టం కలుగుతుందన్న రాహుల్ వ్యాఖ్యలను అమిత్ షా ఖండించారు. దేశ పాడిపరిశ్రమను తమ ప్రభుత్వం మరింత దృఢంగా తీర్చిదిద్దిందన్నారు. కాంగ్రెస్ పాలనలో దేశం పేదరికాన్ని అనుభవించిందని గుర్తుచేశారు.



సైన్యానికి బదులు పొట్టను పెంచుతున్నారు..

హంగరీ ప్రధానిపై జెలెన్‌స్కీ విమర్శలు


ఇంటర్నెట్ డెస్క్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్‌పై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర విమర్శలు చేశారు. రష్యాతో యుద్ధంలో కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి హంగరీ వెనుకడుగు వేస్తుండడంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. విక్టర్ ఓర్బన్ ప్రాంతీయ భద్రత కంటే దేశీయ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఐరోపా దేశాల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన దేశంలో సైన్యాన్ని పెంచకుండా.. పొట్టను పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

ఏఐ సదస్సుకు భారత్ సరైన వేదిక: ఐరాస చీఫ్

ఐరాస: భారత్ విజయవంతమైన ఆర్థిక వ్యవస్థ అని, ప్రపంచ వ్యవహారాల్లో దేశ ప్రభావం రోజురోజుకూ పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐ గ్లోబల్ సదస్సుకు ఆతిథ్యమిచ్చేందుకు భారత్ సరైన వేదిక అని ఆయన తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 20 వరకు దిల్లీ వేదికగా జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' గురించి ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎప్‌స్టీన్ వివాదంలోకి కపిల్ సిబల్

- కాంగ్రెస్, భాజపా మధ్య మాటల యుద్ధం



ఇంటర్నెట్‌డెస్క్: ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాద అంశంపై కాంగ్రెస్-భాజపా మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అమెరికా విడుదల చేసిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ పేరు కనిపించడంతో ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే తాజాగా ఈ వివాదంలో కాంగ్రెస్ మాజీ నేత కపిల్ సిబల్ వచ్చి చేరారు. దీంతో హస్తం పార్టీని ఇప్పుడు భాజపా లక్ష్యం చేసుకొంది. 'ఎప్‌స్టీన్‌తో కాంగ్రెస్ నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్' ఎలాంటిది? ఎప్‌స్టీన్ నిధులు సమకూర్చిన ఐఐఈ నుంచి కపిల్ సిబల్ అవార్డును ఎందుకు స్వీకరించారు?' అని భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా సామాజిక మాధ్యమం వేదికగా ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి పార్లమెంటులో మాట్లాడటం చాలాఇష్టం కదా? దీని గురించి ఇప్పుడు ఆయన ఏమైనా చెబుతారా? అని పూనావాలా ఎద్దేవా చేశారు. అంతకు ముందు 'ఎప్‌స్టీన్ సహకారంతో ఇచ్చిన అవార్డును గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కపిల్ సిబల్ అందుకున్నారు' అని భాజపా జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఆరోపించారు.

కాంగ్రెస్ ఎదురుదాడి

భాజపా నేతల ట్వీట్లపై కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఎదురుదాడికి దిగారు. భాజపాకు చెందిన ప్రదీప్ భండారి, షెహజాద్ పూనావాలా కలిసి కపిల్ సిబల్ పేరు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉందని తప్పుడు ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. భాజపా షేర్ చేసింది 59 పేజీల డాక్యుమెంట్ అని, అందులో కాన్ఫరెన్స్‌ల నుంచి ఫ్యాషన్ షోల వరకు అనేక కార్యక్రమాలను జాబితా చేశారన్నారు. కపిల్ సిబల్ పేరు 55వ పేజీలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్' కార్యక్రమం కింద ఉందన్నారు. కానీ భాజపా నేతలు అంత దూరం చదవడానికి ఇష్టపడలేదని, పేరు చూడగానే ఉత్సాహపడిపోయి, ప్రతిపక్షాలను ఈ గందరగోళంలోకి లాగాలని ఒక కట్టుకథను అల్లారని విమర్శించారు. తద్వారా తమ సొంత నేత హర్దీప్ సింగ్ పూరీ చుట్టూ అల్లుకున్న ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారని ఆరోపించారు.

శివరాత్రి వేళ.. శిర్డీసాయికి స్వర్ణహారం

ఈటీవీ భారత్: మహారాష్ట్రలోని శిర్డీ సాయిబాబా ఆలయానికి ఓ భక్తుడు 59 గ్రాముల బంగారంతో తయారుచేసిన రూ.8,42,520 విలువైన స్వర్ణహారాన్ని సమర్పించారు. ఇదే రాష్ట్రంలోని బీడ్ జిల్లా కోరార్‌బన్‌కు చెందిన ధనరాజ్ ముండే ఈ కానుకను సాయిబాబా సంస్థాన్ సీఈవో గోరక్ష్ గడిల్కర్‌కు అందజేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం శిర్డీ సాయిబాబా ఆలయానికి భక్తులు భారీగా వచ్చారు. బాబా సమాధి దగ్గర భక్తుల సందర్శనార్థం మహాశివుని ప్రతిమను ఏర్పాటు చేశారు. ఉపవాసం పాటిస్తున్న భక్తుల కోసం 13 వేల కిలోల సగ్గుబియ్యం కిచిడీ తయారు చేయించారు.



సద్భావం, సామాజిక సామరస్యాలకు కేంద్రం భారత్

- ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్

గోరఖ్‌పుర్: సద్భావం, సామాజిక సామరస్యాలకు భారత్ ప్రపంచ కేంద్రంగా విలసిల్లుతోందని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ పేర్కొన్నారు. మన దేశ నాగరికత మనుషుల మధ్య ఆర్థిక సంబంధాల మీద కాకుండా ఏకత్వం, పరస్పర అనుబంధ భావన మీద నిర్మితమై ఉందని ఆయన అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్ ప్రావిన్సు ఆరెస్సెస్ కార్యకర్తలు ఆదివారం నిర్వహించిన సమాజిక్ సద్భావ్ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. పౌరులందరూ దేశాన్ని మాతృదేవతగా భావిస్తారని, సాంస్కృతిక ఐక్యత వల్లే దేశంలోని భిన్న ఆచారాలు, సంప్రదాయాలు, వేషధారణలు ప్రజల మధ్య విభజనలు సృష్టించలేకపోయాయని భాగవత్ అన్నారు.

జర్మనీలో మునీర్‌కు ఇబ్బందికర పరిస్థితి

- ఐడీ చూపించండని అడిగిన సిబ్బంది

ఇంటర్నెట్‌డెస్క్: పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్‌కు జర్మనీలో ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. అక్కడి భద్రతా సిబ్బంది ఆయనను ఐడీ కార్డు చూపించాలని కోరారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. మ్యూనిక్ భద్రతా సమావేశంలో పాల్గొనేందుకు మునీర్ తన బృందంతో కలిసి జర్మనీకి వచ్చారు. వేదిక వద్దకు వెళ్తుండగా.. భద్రతా అధికారిణి ఆయన్ను ఆపేందుకు ప్రయత్నించారు. 'ఆగండి.. మీ ఐడీ ఎక్కడ?.. మీ కార్డును కన్పించేలా ఉంచండి' అని ఆమె అన్నారు. దీంతో మునీర్ కొద్దిగా ఇబ్బంది పడ్డారు. దీనిని దౌత్యపరమైన ఇబ్బందిగా కొందరు కామెంట్లు పెడుతుండగా.. మరికొందరు ఉన్నతస్థాయి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సాధారణమేనని పేర్కొన్నారు. మరోవైపు.. ఈ కార్యక్రమానికి ఆసిమ్ మునీర్‌ను ఆహ్వానించడంపై జర్మనీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పాక్ సైన్యం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతోందని కొన్ని రాజకీయ సంస్థలు ఆరోపించాయి. వేదిక వద్ద నిరసనలు తెలిపాయి.



పరిశ్రమ నిపుణుల ప్రొఫెసర్ల నియామకంలో తమిళనాడు ముందంజ: యూజీసీ

దిల్లీ: వివిధ రంగాల పరిశ్రమల నిపుణులను ఉన్నత విద్యాసంస్థల్లో ప్రొఫెసర్లుగా నియమించుకోవడంలో తమిళనాడు ముందుందని విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) వెల్లడించింది. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఆయా రంగాల్లో నిపుణులైన వారిని విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లుగా నియమించుకోవడానికి 2022లో యూజీసీ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ క్రమంలో తమిళనాడులోని విశ్వవిద్యాలయాలు 395 మంది పరిశ్రమల నిపుణులను ప్రొఫెసర్లుగా నియమించుకుని మొదటి స్థానంలో నిలవగా.. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా మహారాష్ట్ర(193), గుజరాత్(179), కర్ణాటక (170)లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా కలిపి మొత్తం 349 యూనివర్సిటీలు 1,841 మంది నిపుణులను ఈ విధంగా నియమించుకున్నాయి. ఈ విధానం వల్ల విద్యా కోర్సులు, పాఠ్యాంశాల ప్రణాళిక మెరుగుపడతాయని, బయటి మార్కెట్‌కు అనుగుణంగా పరిశ్రమల అవసరాలు తీరుతాయని, క్షేత్రస్థాయిలోని అనుభవాలు తరగతి విద్యార్థులకు తెలుస్తాయని యూజీసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

చిన్న నగరాల్లో చిన్నారులకు రోబోటిక్స్...



పిల్లలకు చదువుల్లో సాయపడానికి అమ్మలు టీచరమ్మలుగా మారడం ప్రతి ఇంట్లోనూ చూస్తాం. వీళ్లు స్కూల్లో చెప్పిన పాఠాల్ని చదివిస్తూ, సందేహాలు నివృత్తి చేస్తూ ఉంటారు. కానీ తమ పిల్లలకు రోబోటిక్స్ నేర్పేందుకు స్టెమ్ ఎడ్యుకేటర్‌గా మారారు విశాఖకు చెందిన నాగశిల్ప సీతంరాజు. ఆపై మరో అడుగు ముందుకేసి 'బ్రెయినీ బోట్జ్' అంకుర సంస్థను స్థాపించారు. దీనిద్వారా పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ హార్ట్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తిచేశా. తర్వాత అక్కడే 17 ఏళ్లపాటు ఫైనాన్స్, ఐటీ రంగాల్లో పనిచేశా. 2017లో భారత్‌కు తిరిగొచ్చి విశాఖలో స్థిరపడ్డాం. అప్పటికి మా పెద్దబ్బాయి నాలుగో తరగతి చదువుతున్నాడు. అమెరికాలో పిల్లలకు రోబోటిక్స్‌లో ప్రయోగాలు, పోటీలు ఎక్కువగా జరుగుతుండేవి. మేం వచ్చేటప్పటికి కీలక అంశాలు నేర్చుకుంటున్నాడు. వాటిని కొనసాగించడానికి ఇక్కడ అలాంటి వనరులు కనిపించలేదు. పిల్లల ఆసక్తిని గమనించి నేనే ఈ పాఠాలను నేర్పాలనుకున్నా. అమెరికా, లండన్‌లలో... లెగో ఈవీ3, రాస్‌బెర్రీ పై సర్టిఫైడ్ ఎడ్యుకేటర్ కోర్సులతోపాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వివిధ సర్టిఫికేషన్ కోర్సులు పూర్తిచేశా. 2017లో మా పిల్లలతోపాటు స్నేహితుల పిల్లలకూ రోబోటిక్స్ నేర్పించడం ప్రారంభించా. వాళ్లను పోటీలకూ తీసుకెళ్లేదాన్ని. ఈ విషయం తెలిసి ఇతర పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులకూ రోబోటిక్స్ పాఠాలు చెప్పమంటూ నన్ను సంప్రదించాయి.



అంకుర సంస్థగా మారి...

కొవిడ్ సమయంలో శిక్షణ తరగతులు నిలిచిపోయాయి. స్టెమ్, రోబోటిక్స్‌కు డిమాండ్ పెరగడంతో 2024లో మళ్లీ ఇటుగా అడుగులు వేయాలనుకున్నా. గాయత్రి వాడవల్లితో కలసి 'బ్రెయినీ బోట్జ్' స్థాపించా. ఎంబీఏ చేసిన గాయత్రి... వివిధ సంస్థల్లో పనిచేశారు. ఏఐ, ఎంఎల్‌లో సర్టిఫికేషన్ కోర్సులు పూర్తిచేశారు. ఇద్దరం స్టెమ్ అండ్ రోబోటిక్ క్లబ్(ఎస్ఆర్‌సీ) ఏర్పాటుచేసి... నగరంలోని లాసెన్స్ బే కాలనీలో ప్రతి శనివారం గంటన్నరపాటు తరగతులు చెబుతున్నాం. వర్క్‌షాప్‌లు, బూట్‌క్యాంప్‌లనూ నిర్వహిస్తాం. 7-14 ఏళ్ల పిల్లలకు ఈ నైపుణ్యాలు నేర్పిస్తున్నాం. ప్రాథమిక స్థాయి నుంచి అర్థం చేసుకోవడానికి వివిధ రకాల కిట్‌లు ఉపయోగిస్తాం.

సర్క్యూట్‌లూ, రోబోల తయారీ తదితరాలు నేర్పిస్తాం. పిల్లల్లో బిల్డింగ్, కోడింగ్, పరిశోధన తదితర ఆసక్తులు గమనించి సంబంధిత టాస్క్‌లు కేటాయిస్తాం. తొలిరోజుల్లో ఇబ్బంది పడే చిన్నారులపైన ప్రత్యేక దృష్టి పెడతాం. కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఆవిష్కరణల్లో నైపుణ్యాలు అందించే కార్యక్రమాలు ఉంటాయి. విద్యార్థులకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించి, దాన్ని చేరుకోవడానికి ఏయే మార్గాలున్నాయో వివరిస్తాం. దీంతో వాళ్లే పరిష్కారాలు కనుగొంటారు. ఇవన్నీ బృందంగా చేసేలా ప్రోత్సహించడంతో ఒత్తిడి ఉండదు.

పొరుగు రాష్ట్రాలకూ...

ప్రస్తుతం మా బృందంలో తొమ్మిది మంది పనిచేస్తున్నారు. విశాఖలోని కొన్ని పాఠశాలల్లో సేవలు అందిస్తున్నాం. పాఠ్య ప్రణాళికలో భాగంగా వారానికి రెండు తరగతులు బోధిస్తాం. కొన్ని పాఠశాలల్లో సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. హైదరాబాద్, బెంగళూరులోనూ కొన్ని పాఠశాలలకు వర్క్‌షాప్స్ నిర్వహించాం. ఇప్పటివరకు దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చాం. టైర్-2, టైర్-3 నగరాల్లో స్టెమ్ విద్య అందుబాటులోకి తీసుకురావడం మా ప్రధాన లక్ష్యం. త్వరలో శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర ప్రాంతాలకు విస్తరించాలనేది మా ప్రణాళిక. విశాఖలో 'స్టెమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' నిర్మిస్తున్నాం.

పోటీల్లో పాల్గొంటూ...

ఆసక్తి ఉన్న విద్యార్థులను అంతర్జాతీయ పోటీలకూ పంపిస్తాం. వీళ్లకు నెలలపాటు శిక్షణ ఇచ్చి, ప్రాజెక్టులు చేయిస్తాం. అమెరికా, యూకే, జపాన్, యూఏఈ తదితర దేశాలకు పంపిస్తాం. వీఈఎక్స్ రోబోటిక్స్, సీపీసీ, బీఐఈఏఐ తదితర అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది మేలో అమెరికాలో జరగనున్న పోటీలకు మా పిల్లలు ఎంపికయ్యారు. 'ఆరోహ' పేరుతో స్థానికంగానూ ఇలాంటి పోటీలు ప్రారంభించాం.

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

డియర్ వసుంధర

నాకు ఇద్దరబ్బాయిలు. చిన్నవాడికి 17 ఏళ్లు. ఎప్పుడూ అన్నయ్యనే ప్రేమిస్తావు, నన్ను కాదు అంటుంటాడు. వాడికి ఎక్కువ సమయం కేటాయించినా, తనకి నచ్చినవే వండి పెట్టినా ఇదే మాట. ఇద్దరూ నాకు సమానమే అని ఎంత చెప్పినా వినడు. వాడికి నమ్మకం కుదిరేలా ఇంకా ఏం చేయాలి? - ఓ సోదరి

పెద్దోడంటేనే ఇష్టమట!



డా. స్వాతి పైడిపాటి, మానసిక నిపుణురాలు

మీరు చెప్పిన సమస్య చాలా ఇళ్లల్లో కనిపిస్తూనే ఉంటుంది. ఇద్దరు పిల్లలు ఉన్నప్పుడు అక్కాచెల్లెళ్లు, అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు... ఇలా ఎవరి మధ్య అయినా ఈ పోలిక వస్తూనే ఉంటుంది. ఇది రావొద్దు అంటే... ముందు నుంచీ పిల్లల మధ్య చక్కటి అనుబంధం, సఖ్యత ఏర్పడేలా చూడాలి. వాళ్లిద్దరూ ఎక్కువ సమయం కలిసి ఉండేలా, పని చేసేలా అవకాశాలు కల్పించాలి. అది తల్లిదండ్రులుగా మీ బాధ్యతే! ముఖ్యంగా ఈ వయసులో తెలిసీ, తెలియక అపోహలు పెంచుకుంటారు. అందులోనూ చిన్నవాళ్లు అమ్మానాన్నల ప్రేమంతా తమకే దక్కాలి, తమనే గారాబం చేయాలని ఆశిస్తుంటారు. కాబట్టి, మీరే కొంచెం ఓపిగ్గా ఉంటూ అర్థమయ్యేలా చెప్పాలి. అవసరమైతే పెద్దబాబుకి అర్థమయ్యేలా పరిస్థితిని వివరించి, అతని సాయం కోరండి. వాళ్ల మధ్య అనుబంధం పెరిగేలా ఇద్దరూ కలిసి చేసే పనులను పురమాయించండి. చిన్నబాబుకి అవసరమైన సాయం చేస్తూ తనకు తోడుగా ఉండమనండి. అప్పుడు చిన్నబ్బాయిలో మార్పు మెల్లగా మొదలవుతుంది. అయితే ఈ క్రమంలో పెద్దవాడినీ నిర్లక్ష్యం చేయకూడదు. మీరు దాన్నీ గమనించుకోవాలి.

తేనెతో ఇలా చేశారా?



అందానికి తేనెని వాడటం కొత్త విషయమేమీ కాదు కదూ! చాలావరకూ ఫేస్ ప్యాక్‌ల్లో వాడుతుంటాం. కానీ సబ్బు, ఫేస్‌వాష్‌లకు బదులుగా క్లెన్సర్‌గా వాడారా? ఇది క్లెన్సింగ్‌లో చాలా బాగా ఉపయోగపడుతుంది. కాబట్టే, సోషల్‌మీడియాలో 'హనీ క్లెన్సర్' ట్రెండ్ నడుస్తోంది.

అంటే ఏమీ లేదు... సబ్బు, ఫేస్‌వాష్ స్థానంలో ముఖం శుభ్రతకు దీన్ని వాడటమే. ముఖాన్ని నీటితో కడిగి, ఓ స్పూను తేనెను పట్టించి కొన్ని సెకన్లపాటు మర్దనా చేయాలి. ఆపై గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. తరవాత నచ్చిన మాయిశ్చరైజర్ రాస్తే సరి. తేనెకి సహజ క్లెన్సర్ పేరు. పైగా ఇది మురికిని పోగొట్టడమే కాదు... మిగతా ఫేస్‌వాష్‌లా చర్మాన్ని పొడిబారనీయదు కూడా. అంతే కాదు, తేమని అందిస్తూనే తాజాగానూ ఉంచుతుంది. దీనిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలెక్కువ. దీంతో మొటిమలు, ఎరుపుదనం వంటివాటిని దూరంగా ఉంచుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే, అమ్మాయిలు తెగ ప్రయత్నిస్తున్నారు. అయితే సహజ తేనేనా కాదా అన్నది చూసుకోవాలి. ఓసారి ప్రయత్నించి చూడండి మరి.

ఇల్లంతా సువాసనలు...

ఒక పువ్వు లేదంటే మరేదైనా సువాసనని చూసినప్పుడు మనసు కూడా తేలిక పడినట్లు అనిపిస్తుంది కదా! ఆ అనుభూతి కోసమే చాలాసార్లు ఇంట్లో స్ప్రేలు కొడుతుంటాం. రూమ్ ఫ్రెషనర్లతో గదులు, బాత్రూమ్‌లను నింపేస్తుంటాం. కానీ అవి అనారోగ్యాలకు కారణం అవొచ్చు. అందుకే సహజంగా వీటిని ప్రయత్నిస్తే మేలు.



- నిమ్మకాయని సగానికి కోయండి. దానిలో అయిదారు లవంగాలను గుచ్చండి. ఇది ఘాటు, చెడు వాసనల్ని పీల్చి ఆ ప్రదేశానికి సహజ సువాసనల్ని అందిస్తుంది. అంతేకాదు, ఇది ఒకరకమైన దోమలు, ఈగల్నీ దూరంగా ఉంచుతుంది.
- ఒక చిన్న గిన్నెలో బేకింగ్ సోడా తీసుకోండి. దానికి 5-10 చుక్కలు నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్ చేర్చి, బాత్రూమ్, షూ ర్యాక్‌ల్లో ఉంచండి. దుర్వాసన మాయం అవుతుంది.
- ఒక కప్పు నీటిలో స్పూను రబ్బింగ్ ఆల్కహాల్ లేదా వినెగర్ చేర్చండి. ఆపై నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్‌నీ 10 చుక్కలు కలిపితే సరి. దీన్ని ఏదైనా స్ప్రే బాటిల్‌లో పోసుకుని అవసరమైనప్పుడు ఇంట్లో చల్లితే సరి. ఏ రూమ్ ఫ్రెష్‌నర్‌కీ ఇది తీసిపోదంటే నమ్మండి.
- ఒక్కోసారి ఎంత శుభ్రం చేసినా కబోర్డులనుంచి కాలంతో సంబంధం లేకుండా ముతక వాసన వస్తూనే ఉంటుంది. అలాంటప్పుడు దూది ఉండలకి కొంచెం ఫ్యాబ్రిక్ ఫ్రెషనర్‌ని కలిపి వాటిని అక్కడక్కడా పెట్టండి. లేదంటే ఒక చిన్న గిన్నెలో బియ్యం తీసుకుని, సబ్బును తురిమి, ఆ పొడిని కలపాలి. దీన్ని ఉంచినా దుర్వాసన దూరం అవుతుంది.

మీకు తెలుసా!



పాలిచ్చే తల్లుల్ని ఒత్తిడీ, ఆందోళనా, డిప్రెషన్ వంటివి ఆవరిస్తే... ఇవి పాల ఉత్పత్తినీ తద్వారా శిశువు ఎదుగుదలనీ ప్రభావితం చేస్తాయట. పాలల్లో కార్టిసాల్ స్థాయులు పెరుగుదలే ఇందుకు కారణమంటున్నాయి అధ్యయనాలు.

26/11 దర్యాప్తు బృందంలో పనిచేశా!

ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ... ప్రస్తుతం మన జీవితాల్లోనూ భాగమైపోయాయి. రెండు దశాబ్దాలుగా ఈ అంశాల్లో బోధన, పరిశోధన చేస్తున్నారు శ్రుతి మంత్రి. ప్రస్తుతం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్- హైదరాబాద్‌లో సీనియర్ అసోసియేట్ డైరెక్టర్‌గా ఉన్నారీమె. తన కెరియర్ గురించి ఆమె ఏం చెబుతారంటే...

ప్రేరణ



శ్రుతి

పుట్టి పెరిగింది ముంబయిలో. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్స్‌లో ముంబయి యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ చేశా. అక్కడే కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేశా. డిఫెన్స్ యూనివర్సిటీగా ప్రఖ్యాతి గాంచిన యూకేలోని క్రాన్‌ఫీల్డ్ యూనివర్సిటీ నుంచి సైబర్ సెక్యూరిటీలో మాస్టర్స్ చేశా.

- ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ... అంశాలు నన్ను మొదట్నుంచీ ఆకర్షించేవి. సిస్టమ్ సెక్యూరిటీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అంశాలపైన పరిశోధన చేసేదాన్ని. ఇంటర్నెట్ వచ్చిన కొత్తల్లో డివైస్ లాగిన్, యూజర్‌నేమ్ వంటి అంశాల్లో సైబర్ దాడులు జరిగేవి. పోలీసు, దర్యాప్తు సంస్థల అవసరాల రీత్యా ఈ విభాగంలో అప్పట్లో కోడ్ రాసేదాన్ని. 26 నవంబరు, 2008 ముంబయి దాడుల దర్యాప్తు బృందం, సైబర్ ఫోరెన్సిక్ విభాగంలో పనిచేశా. ఆ తర్వాత మహారాష్ట్ర 'యాంటీ టెర్రరిజం స్క్వాడ్'కు ఇంటర్నెట్ మోసాలపైన అవగాహన కల్పించా. తర్వాత కొన్నేళ్లు కంప్యూటర్ పాఠాలు చెప్పా.
- కంప్యూటర్స్‌కు సంబంధించిన విషయాల్ని నేర్చుకోవడానికి మ్యాథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ ప్రధానం. నిత్యం కొత్త సాంకేతిక అంశాలు నేర్చుకుంటా. ఏడేళ్లుగా ఐఎస్‌బీ- డేటా సైన్స్ విభాగంలో ఉన్నా. మా పరిశోధనలతో పరిశ్రమలు, ప్రభుత్వాలకు సైబర్ సెక్యూరిటీ అంశాల్లో మార్గనిర్దేశం చేస్తున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగంతో కలిసి పనిచేస్తున్నాం. ఫేక్‌న్యూస్‌పైన జర్నలిస్టుల్లో అవగాహన పెంచుతున్నాం. టెక్నాలజీ అభివృద్ధితోపాటు సైబర్ నేరాలూ పెరుగుతున్నాయి. మనుషులే ఈ వ్యవస్థలో బలహీనమైన లింకు. దీనిపైన అవగాహన కల్పిస్తున్నాం.

ఆ ఛాలెంజ్‌లను స్వీకరించొద్దు!

- సోషల్ మీడియా వినియోగదారుల్లో 18-24 ఏళ్ల వాళ్లే ఎక్కువ. ఇక్కడ పెట్టే పోస్టులు వీళ్లని ముప్పులోకి నెట్టేస్తాయి. 'ట్రావెల్ చేస్తున్నా' అని ఫొటోలు పెడితే... ఇంటి దగ్గర లేరు, ఒక్కరే ఉన్నారు... ఇలాంటివి తెలుస్తాయి. మహిళలపై జరిగే నేరాలపై 'రెడ్‌డాట్ ఫౌండేషన్' సేకరించిన డేటాను మేం విశ్లేషించాం. అధిక శాతం అత్యాచారాలు, హత్యలకు వాళ్ల సోషల్ మీడియా మెసేజ్‌లు, చాటింగ్‌లేనని తెలిసింది. ఆన్‌లైన్లో కొన్ని ఛాలెంజ్‌లు వస్తాయి. ఉదాహరణకు కొవిడ్‌లో 'శారీ ఛాలెంజ్' వచ్చింది. వెర్రిగా అందరూ ఫొటోలూ పెట్టారు. అవి దుర్వినియోగం అవుతాయి. ఇది నేరగాళ్ల పని. ఇవన్నీ గమనించుకుని మనల్ని మనం రక్షించుకోవడం ముఖ్యం.
- సైబర్ సెక్యూరిటీ... మహిళలకు అనుకూల రంగం. ఉన్నచోట నుంచే నచ్చిన సమయంలో పనిచేయొచ్చు. సైబర్ సైకాలజీ, ఫోరెన్సిక్, అనలిస్ట్, ఎథికల్ హ్యాకింగ్... వంటి విభాగాల్లో అవకాశాలు దీని పరిధిలోకి వస్తాయి. మహిళలకు మల్టీ టాస్కింగ్ నైపుణ్యం ఉంది. కెరియర్‌లో రాణించాలంటే టీమ్, నెట్‌వర్క్ చాలా ముఖ్యం

పిడికిలి బిగించి... పంచ్!

రక్ష



మనపైన దాడి చేయడానికి వచ్చే వ్యక్తి చేయిని ఒక చేత్తో పట్టుకుని మెలి తిప్పాలి. ఇంకో చేతి పిడికిలిని గట్టిగా బిగించి... కింది నుంచి పైవైపునకు తెస్తూ గడ్డం కింది భాగంలో గట్టిగా పంచ్ ఇవ్వాలి. సరిగ్గా కొట్టిన సమయానికే పట్టుకున్న అతడి చేతిని విడిచిపెడితే దబ్బున కింద పడతాడు. నోరు, దంతాలు, నాలుకకు గాయాలవుతాయి. కింద పడగానే ముఖంమీద రెండు దెబ్బలు కొట్టి అక్కణ్నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయాలి.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

కళ తెచ్చే కాంతులివి..!



ఇల్లు కట్టుకోవడం అంటే నాలుగు గోడలు ఓ తలుపు ఉంటే చాలు అనుకునే రోజులు కావివి. గది చిన్నదే అయినా... దాని ఇంటీరియర్ అదిరిపోవాలని కోరుకుంటున్నారు. వినియోగదారుల అభిరుచి తెలుసుకున్న ఇంటీరియర్ డిజైనర్లు వాళ్లని మెప్పించేందుకు కొత్త ప్రయోగాలెన్నో చేస్తున్నారు. ముఖ్యంగా సీలింగ్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అందులోనూ సాఫ్ట్ కోవ్ లైటింగ్‌తో ఫాల్స్ సీలింగ్, ఉడెన్ ప్యానెల్, మినిమల్ పీఓపీ, బ్యాక్‌లిట్, లేయర్డ్ సీలింగ్ వంటి మోడళ్లకే ఓటేస్తున్నారు. ఎందుకంటే బెడ్‌రూమ్ పైకప్పు ఎత్తు తక్కువగా ఉన్నా, బడ్జెట్‌లో హుందాగా అలంకరించుకోవాలన్నా ఇవి చక్కని ఎంపిక. అంతేకాదు, ముదురు రంగుల్ని కాకుండా గోధుమ, బూడిద వర్ణంతోపాటు మరెన్నో లేత రంగులకి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. సింగిల్ లేయర్ పెయింటింగ్స్‌తో కాంతి తక్కువ ఇచ్చే లైట్లను అమర్చుకుంటే... ట్రెండీ లుక్‌తో గదికి పాజిటివ్ వైబ్ వచ్చేస్తుంది. ఇవి మనసుకి ప్రశాంతతను ఇవ్వడమే కాదు... హాయిగా నిద్ర పట్టేలా చేస్తున్నాయట. అంతేనా, ఇవి గదిని విశాలంగా కనిపించేలా చేస్తుండటంతో అందరూ వీటిపై మనసు పారేసుకుంటున్నారు. మీకూ నచ్చాయా?

స్వీట్ హోమ్









సాధారణ కళాకారిణి నుంచి డిజైనర్‌గా!



ఎండిపోయిన వెదురును పనికిరానిదిగానే చూస్తాం. కానీ, కాస్త వినూత్నంగా ఆలోచిస్తే దాన్ని కూడా అలంకరణ వస్తువులుగా మలచొచ్చు అంటారు సరోజిని. అలా తన ఆలోచనల నుంచి పుట్టిన 'సృష్టి బ్యాంబూ పీజీ గ్రూప్' వందల మందికి ఆసరానిస్తోంది. ఈమె గురించి తెలియాలంటే...

ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా, తుండపాడు ప్రాంతం సరోజినిది. పదో తరగతి చదువుతున్నప్పట్నుంచే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ మీద మక్కువ ఏర్పడిందట ఈమెకు. వెదురుతో చేసే వస్తువుల్ని చూసి... తనూ ఈ కళను నేర్చుకోవాలని అనుకున్నారు. అయితే దగ్గర్లో ఎక్కడా శిక్షణ కేంద్రం లేదు. భువనేశ్వర్‌లోని హస్తకళా శిక్షణ కేంద్రంలో చేరారు. శిక్షణ తీసుకుంటూనే ఇంటర్ కూడా పూర్తిచేశారు. తర్వాత అగర్తలలో అడ్వాన్స్‌డ్ బ్యాంబూ క్రాఫ్ట్స్ కోర్సు చేశారు. దాంతోపాటు అహ్మదాబాద్‌లో డిజైనింగ్ కోర్సు కూడా పూర్తిచేశారు. తిరిగి వచ్చి తుండపాడులో వెదురు వస్తువుల్ని తయారుచేసి అమ్మడం మొదలుపెట్టారు. దాన్నే జీవనాధారంగా మలుచుకున్నారు కూడా. అయితే, ఈ కళని మరింత మందికి చేరువ చేయాలి, మహిళల్ని ఆర్థిక సాధికారతవైపు నడిపించాలన్న ఆలోచన సరోజినిది. తనకి దగ్గర్లో ఉన్న జామూర్ఘూడికి వెళ్లారట. అక్కడ తన తల్లితో కలిసి ఓ తయారీ యూనిట్‌ను స్థాపించారీమె. ఆసక్తి ఉన్న పదిహేను మంది మహిళలకు దీనిలో శిక్షణ ఇచ్చారు. ఉపాధి కూడా కల్పించడం మొదలుపెట్టారు.

ప్రభుత్వం తరఫున...

సరోజిని దగ్గర శిక్షణ తీసుకుని... ఇంటివద్దే ఉంటూ సంపాదన బాట పట్టారు మహిళలు. వాళ్లని చూసి, తమకూ ఈ కళను నేర్పమని అడిగారట ఇంకొందరు. అలా చుట్టుపక్కల ప్రాంతాల వాళ్లూ రావడంతో 2019లో 'సృష్టి బ్యాంబూ పీజీ గ్రూప్' అనే సంస్థను స్థాపించారీమె. ఇప్పుడు అక్కడ పనిచేస్తున్న వాళ్ల సంఖ్య 60కు పైమాటే. వీళ్లంతా కలిసి ఎండిన వెదురుతో జగన్నాథ స్వామి విగ్రహాలూ, గృహోపకరణాలూ, జంతువులూ, పక్షుల బొమ్మలూ, పెన్ స్టాండ్‌లూ... ఇలా ఒకటేమిటి కాదేదీ కళకు అనర్హం అన్నట్లు దాదాపు 150 వస్తువుల్ని తయారుచేస్తున్నారు. ఆమె సేవల్ని గుర్తించిన ప్రభుత్వం పలు పురస్కారాల్నీ అందించింది. అంతేకాదు ప్రభుత్వ బ్యాంబూ డిజైనర్‌గానూ నియమించుకుని... రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శిక్షణా కార్యక్రమాల్ని ఏర్పాటుచేసింది. దాంతో ఇప్పటివరకూ పదిహేను వందల మందికి పైగానే మహిళలకు బ్యాంబూ డిజైనింగ్‌ని నేర్పారు సరోజిని. 'ఈ తరహా హస్త కళలు తయారుచేస్తున్న వాళ్లకి ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహం తక్కువ. మార్కెటింగ్ సదుపాయాలూ తక్కువే. వాళ్లకు సహాయం అందిస్తే మహిళల్లో ఆర్థిక సాధికారత సాధ్యం అవుతుంది' అంటారు 50 ఏళ్ల సరోజిని.

ద్రాక్షని శుభ్రం చేస్తున్నారా?

ఈ సీజన్లో వచ్చే ద్రాక్షపండ్లంటే పిల్లల నుంచి పెద్దలవరకూ అందరికీ ఇష్టమే. కానీ సమస్యల్లా వాటిపైన పిచికారీ చేసే రసాయన క్రిమిసంహారకాలతోనే. అందుకే వాటిని తినే ముందు తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి.



ముందుగా ఒక పాత్రలోకి తీసుకుని పండ్లను గుత్తుల నుంచి విడదీసి... చేతులతో శుభ్రంగా కడగండి. దీనివల్ల వాటిపైన ఉండే దుమ్మూధూళీ, పొరగా ఏర్పడ్డ కొన్ని రసాయనాలు పోతాయి.

రెండో దశలో వంట సోడాను తీసుకోండి. లీటరు నీటిలో టీ స్పూను వంట సోడాను కలిపి, అందులో పండ్లని పావుగంటసేపు ఉంచండి. క్రిమి సంహారకాలను శుభ్రపరచడంలో ఇది మెరుగ్గా పనిచేస్తుంది. ఆపై ద్రాక్షని మంచినీటితో కడగండి. బేకింగ్ సోడాకు ఉన్న ఆల్కలైన్ స్వభావం రసాయనాలను తొలగిస్తుంది.

- ఇప్పుడు వినెగర్ తీసుకోండి. ఇది పండ్లపై ఉండే రసాయనాలతోపాటు బ్యాక్టీరియా వంటి సూక్ష్మ జీవుల్నీ శుభ్రపరుస్తుంది. మూడు వాటాల నీటికి, ఒక వాటా వినెగర్‌ని కలపండి. ఆ నీటిలో ద్రాక్షపండ్లను 5-10 నిమిషాలు ఉంచండి. తర్వాత మంచి నీటితో శుభ్రం చేస్తే సరి. బేకింగ్ సోడా, వినెగర్ లేకున్నా రాళ్ల ఉప్పుతోనూ ద్రాక్ష పండ్లను శుభ్రం చేయొచ్చు. కడిగాక వాటిని క్లాత్‌తో తుడిచి తింటే సరి.

రూ.621 కోట్లతో ఆలయాల పునరుద్ధరణ: మంత్రి ఆనం



కోటేశ్వరుని సన్నిధిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

చేజర్ల, న్యూస్‌టుడే: ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శక్తిపీఠాలు, జ్యోతిర్లింగాలు, స్వయంభూ క్షేత్రాల్లో భక్తులు మహాశివుణ్ని దర్శించుకునేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోటితీర్థంలోని కోటేశ్వరాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం పెరుమాళ్లపాడులో మాట్లాడారు. పురాతన ఆలయాల పునరుద్ధరణలో భాగంగా 495 ఆలయాలకు సర్వశ్రేయోనిధి ద్వారా రూ.621 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. 679 గ్రామాల్లో ఆలయాలు, భజన మందిరాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.113 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీపధూప నైవేద్యం పథకాన్ని 5,821 ఆలయాలకు వర్తింపజేసినట్లు వివరించారు.

ఆలయాల్లో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశాం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: మహాశివరాత్రి రెండు రోజుల ముందే భక్తులకు ఇబ్బంది లేకుండా పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేశామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఎక్స్ వేదికగా ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేసిన ఉప ముఖ్యమంత్రి... వివిధ ఆలయాల్లో భక్తులకు కల్పించిన సదుపాయాలు, సౌకర్యాలను వివరించారు. "శ్రీశైలానికి గిరి ప్రదక్షిణ మార్గంలో కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మించి ప్రారంభించాం. కోటప్పకొండలో గిరిప్రదక్షిణ మార్గంలో కొత్త రోడ్డు నిర్మాణానికి అనుమతిచ్చాం. ప్రధాని మోదీ సహకారం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా చిన్న, పెద్ద ఆలయాలకు రోడ్లు సౌకర్యం కల్పించేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. ఆలయాల అభివృద్ధికి, ధర్మపరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేస్తున్నా" అని ఉప ముఖ్యమంత్రి వివరించారు. 'శ్రీశైలం జ్యోతిర్లింగ క్షేత్రం, శ్రీకాళహస్తి వాయులింగ క్షేత్రంతోపాటు పంచారామ క్షేత్రాలతో అలరారుతున్న పుణ్యభూమి మనది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి ప్రతి క్షేత్ర పవిత్రతను కాపాడుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 ప్రముఖ శైవక్షేత్రాల్లో ప్రభుత్వం అధికారికంగా శివరాత్రి వేడుకలు నిర్వహిస్తుండడమే ఇందుకు నిదర్శనం' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

బీసీ ఉద్యమ నేత ఐలాపురం వెంకయ్య మృతి



విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: బీసీ ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య (93) కన్నుమూశారు. వయోభారంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. పేద కుటుంబంలో జన్మించిన వెంకయ్య కష్టపడి ఎదిగి విజయవాడలో మూడు దశాబ్దాల క్రితమే హోటల్ ఐలాపురాన్ని స్థాపించారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన గతంలో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. బీసీల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారు. శాలివాహన సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. విద్యాసంస్థలకు ఫర్నిచర్, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, అన్నదాన సత్రాలు ఏర్పాటుతో పాటు దేవాలయాలు, చర్చిలు, మసీదులకు విరాళాలు ఇచ్చారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన కుమారుడు రాజా సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా పనిచేశారు.

బీసీల హక్కుల సాధనకు కృషి చేశారు: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల సాధనకు ఆయన నిరంతరం కృషి చేశారని కొనియాడారు.

జగన్ సంతాపం: వెంకయ్య మృతి పట్ల వైకాపా అధినేత జగన్ సంతాపం తెలిపారు.

గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు రూ.1,876 కోట్లు: మంత్రి కొండపల్లి

ఈనాడు, అమరావతి: గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు రూ.1,876 కోట్లు కేటాయించినట్లు సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రైజ్ ప్రోగ్రామ్‌కు రూ.72 కోట్లు, మహిళా కిసాన్ సశక్తికరణ కార్యక్రమానికి రూ.30 కోట్లు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థకు రూ.15 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

దానిమ్మ జ్యూస్ తీరేవేరు



అనేక పండ్ల రసాలతో పోలిస్తే దానిమ్మ పండ్ల రసం ఎంతో ప్రయోజనకరం. ఈ మేరకు ఓ అధ్యయనం తేల్చింది. దాని ప్రకారం.. ఈ పండ్ల రసంతో రక్తనాళాల్లో పూడికలు 30 శాతం తగ్గాయి. రక్తపోటు 12 శాతం తగ్గింది. ఎల్‌డీఎల్ కొవ్వు ఆక్సీడేషన్ 90 శాతం వరకూ తగ్గుముఖం పట్టింది. అకాల వృద్ధాప్యాన్ని ఎదుర్కొంటున్న వారు కూడా దానిమ్మ పండ్ల వినియోగంతో ఆ సమస్య నుంచి బయటపడొచ్చు.

– ఆండ్రూ పనేలా, జీవనశైలి సలహాదారు

గ్రామీణానికి సాంకేతికత వెలుగులు!

- సమృద్ధి గ్రామ్ ఫిజిటల్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం కసరత్తు
- ప్రయోగాత్మకంగా దేశంలో 3 గ్రామాల్లో అమలు
- తెలుగు రాష్ట్రాల నుంచి నారాకోడూరు ఎంపిక
- 22న ప్రారంభించనున్న కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా



నారాకోడూరులో ఏర్పాటు చేసిన సమృద్ధి కేంద్రం ★ సమృద్ధి కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్త్ ఏటీఎం ★ విద్యార్థుల కోసం నెలకొల్పిన స్కిల్‌ల్యాబ్

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, చేబ్రోలు: గ్రామీణ భారతంలో డిజిటల్ అంతరాన్ని తగ్గించి, ఆధునిక సాంకేతిక సేవలను పల్లెవాసులకు చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో టెలికమ్యూనికేషన్ విభాగం(డీవోటీ) ప్రయోగాత్మకంగా సమృద్ధి గ్రామ్ ఫిజిటల్ సర్వీసెస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. వీటి ద్వారా విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ తదితర సేవలను (కొన్ని ఉచితంగా, మరికొన్ని నామమాత్రపు ఫీజుతో) గ్రామాలకు చేరువ చేయడానికి సిద్ధమవుతోంది. ఇందుకు తొలివిడతగా దేశంలో మూడు గ్రామాలను ఎంపిక చేసింది. అందులో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు ఒకటి. ఇక్కడ సమృద్ధి కేంద్రం ఏర్పాటుకు కార్పస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో, మిగిలిన రెండు ప్రయోగాత్మక గ్రామాలైన మధ్యప్రదేశ్‌లోని అరి-ఉమ్రీలో డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని చౌరావాలాలో ఐ-నోవేట్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో డీవోటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. గతేడాది అక్టోబర్‌లో సంతకాలూ పూర్తికాగా, అప్పటినుంచి నారాకోడూరులో మూడుసార్లు గ్రామసభలు నిర్వహించి పనులు ముమ్మరం చేశారు. ఈ పల్లెను ఎంపిక చేయడానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకున్నారు. ఈ సమృద్ధి కేంద్రాన్ని ఈ నెల 22న కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించనున్నట్లు సమృద్ధి కేంద్రం నోడల్ అధికారి, గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు 'ఈనాడు'తో చెప్పారు.

హెల్త్ ఏటీఎంతో 60 రకాల పరీక్షలు

నారాకోడూరులోని సచివాలయ భవనంలో సమృద్ధి కేంద్రం ఏర్పాటైంది. ఇందులో హెల్త్ ఏటీఎం ఏర్పాటు చేశారు. దీనిద్వారా 60 రకాల పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారా వైద్యులకు ఆ వివరాలు చేరడానికి, వారి నుంచి సలహాలు, సూచనలు పొందే సౌకర్యమూ కల్పించారు.

✦ ఈ కేంద్రంలో స్కిల్ ల్యాబ్ పెట్టారు. ఇక్కడ విద్యార్థులు ఏఆర్, వీఆర్ టెక్నాలజీ సాయంతో 3డీ కింద అవసరమైన సమాచారం, వైజ్ఞానిక అంశాలను తెలుసుకునే ఏర్పాట్లు చేశారు.

✦ వ్యవసాయ రంగానికి సంబంధించి డ్రోన్ టెక్నాలజీ ద్వారా రైతులు తమ పొలాలకు పురుగుమందులు పిచికారీ చేసుకోవడానికి వీలుగా మరో విభాగం, ఈజీ మార్ట్‌లో రైతులు, స్థానికులు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించుకోవడానికి ఇంకో విభాగం ఏర్పాటు చేశారు.

✦ గ్రామంలోని ప్రతి ఇంట్లో టీవీని కంప్యూటర్‌గా మార్చుకుని, ఇంటర్‌నెట్ వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక బాక్సులనూ ఏర్పాటు చేశారు.

ప్రధాన సేవలు ఇవే..

విద్య, నైపుణ్యం: స్మార్ట్ తరగతి గదులు, ఏఆర్/వీఆర్ ఆధారిత అభ్యాసం, డిజిటల్ నైపుణ్యం

వ్యవసాయం: ఐవోటీ ఆధారిత నేల పరీక్ష, డ్రోన్ సహకారం, స్మార్ట్ ఇరిగేషన్ వ్యవస్థలు

ఆరోగ్య సంరక్షణ: టెలీ కన్సల్టేషన్లు, ఆరోగ్య ఏటీఎం తదితరాలు

ఈ-గవర్నెన్స్: పౌరసేవలు, డాక్యుమెంటేషన్, ఫిర్యాదుల పరిష్కారానికి సహాయపడడం

ఈ-కామర్స్: ఓఎన్‌డీసీ, డిజిటల్ మార్కెటింగ్

ఆర్థిక సహకారం: డిజిటల్ బ్యాంకింగ్, చెల్లింపులు

కనెక్టివిటీ: గ్రామీణ నెట్‌వర్క్, పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్లతో భారత్‌నెట్ ఎఫ్‌టీటీహెచ్‌ను బలోపేతం చేయడం.

'యువగళం' గుర్తు.. సైకిల్!



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రను ప్రారంభించి మూడేళ్లు పూర్తి కావడంతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తెదేపా ఎమ్మెల్యేలు ఆ సందర్భం గుర్తుండిపోయేలా చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విడతల వారీగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైకిళ్లు అందజేశారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే, మంత్రి నారాయణ 6,500 సైకిళ్లు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 3,132 సైకిళ్లను సిద్ధం చేయిస్తున్నారు. విద్యార్థుల అవసరాల దృష్టిలో పెట్టుకొని వాటికి క్యారియర్లు, బుట్టలు ఏర్పాటు బిగిస్తున్నారు. త్వరలో వీటిని బాలికలకు అందజేయనున్నారు. 2023 జనవరిలో 'యువగళం' ప్రారంభించిన విషయం తెలిసిందే.

–ఈనాడు, నెల్లూరు; న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలక సంస్థ, వెంకటాచలం)

← పంపిణీకి సిద్ధం చేసిన సైకిళ్లు

క్లిక్ చేసేముందు కాస్త ఆలోచించు బ్రో!

- ట్రాఫిక్ ఉల్లంఘనల పేరిట ఫోన్లకు నకిలీ ఈ-చలానాలు
- లింక్‌లు పంపిస్తూ ఖాతాలు ఖాళీ చేస్తున్న మోసగాళ్లు

ఈనాడు, అమరావతి: ట్రాఫిక్ ఉల్లంఘనల పేరుతో నకిలీ చలానాలు పంపిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు సైబర్ కేటుగాళ్లు. వీరు పంపించే చలానాలు అసలు వాటికి ఏమాత్రం తీసిపోని రీతిలో ఉండడంతో ఎక్కువ మంది బోల్తా పడుతున్నారు.

చిన్న మొత్తంతో ఎర వేసి..

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు మీ వాహనంపై చలానా పెండింగ్‌లో ఉందంటూ.. ట్రాఫిక్ పోలీసు, రవాణాశాఖ పేరుతో మోసగాళ్లు ఎస్ఎంఎస్, వాట్సప్ ద్వారా సందేశాలు పంపిస్తారు. వెంటనే జరిమానా మొత్తాన్ని చెల్లించాలని అందులో పేర్కొంటారు. చెల్లింపుల కోసం ఈ మెసేజ్‌లో ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయమని సూచిస్తారు.

✦ ఇది నిజమైనదే అని నమ్మించడానికి అందులో తక్కువ మొత్తాన్నే చూపిస్తారు. ఆ లింక్‌పై క్లిక్ చేస్తే.. నకిలీ వెబ్‌సైట్‌లోకి వెళ్తుంది. అందులో డెబిట్, క్రెడిట్ కార్డుల నంబర్లు, ఓటీపీలు నమోదు చేయమని అడుగుతుంది. ఈ వివరాలు నమోదు చేసిన వెంటనే సైబర్ మోసగాళ్లు ఖాతా ఖాళీ చేసేస్తారు.

✦ కొన్ని సందేశాల్లో ఏపీకే ఫైళ్లను పంపిస్తుంటారు. జరిమానా సరిచూసుకునేందుకు, చెల్లించేందుకు దీనిపై క్లిక్ చేయమని అడుగుతారు. నిజమే అని నమ్మి క్లిక్ చేస్తే మొబైల్‌లోకి మాల్‌వేర్ ప్రవేశించడంతో పాటు దాని నియంత్రణ పూర్తిగా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్తుంది.



అసలైనదని బోల్తాపడి..

✦ విజయవాడ నగరానికి చెందిన ఒక వ్యక్తికి వాట్సప్‌లో ట్రాఫిక్ ఉల్లంఘన పేరుతో ఈ-చలానా వచ్చింది. దానిపై క్లిక్ చేయగానే.. అతని క్రెడిట్ కార్డుల నుంచి విడతల వారీగా రూ.1.78లక్షలు మాయమయ్యాయి.

✦ నగరానికి చెందిన ఓ ఎగ్జిక్యూటివ్‌కు ఇటీవల గుర్తు తెలియని నంబరు నుంచి వాట్సప్‌లో ట్రాఫిక్ చలానా వచ్చింది. అది పెండింగ్‌లో ఉందని మరో మెసేజ్ వచ్చింది. దీంతో అందులో ఉన్న ఏపీకే ఫైల్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేశాడు. కొద్ది సేపటికే.. రెండు క్రెడిట్ కార్డుల నుంచి రూ.2.10 లక్షల లావాదేవీలు జరిగినట్లు సందేశం వచ్చింది.

మాయగాళ్ల వలలో పడొద్దు

☛ ట్రాఫిక్ ఉల్లంఘనల పేరుతో సెల్‌ఫోన్లకు వచ్చే చలానాలకు స్పందించొద్దు. ట్రాఫిక్ పోలీసు, ఆర్టీఏ పేర్లతో వచ్చే సందేశాల్లోని లింక్‌లపై క్లిక్ చేయొద్దు.

☛ ఆ చలానా వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లలోకి వెళ్లి సరిచూసుకోవాలి.

☛ బ్యాంకింగ్ వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దు. నకిలీ వెబ్‌సైట్లలో ఎట్టిపరిస్థితుల్లో నమోదు చేయొద్దు.

ఏప్రిల్ 1 నుంచి కొత్త రైల్వే జోన్!

- మూడు డివిజన్లకు పరిమితం కానున్న ద.మ.రైల్వే
- విశాఖపట్నం కేంద్రంగా ద.కోస్తా జోన్ కార్యకలాపాలు

ఈనాడు, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. కొత్త రైల్వే జోన్‌కు అపాయింటెడ్ డేను కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిసింది. ఏప్రిల్ 1 నుంచి నూతన రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభింపజేయాలని రైల్వేశాఖ భావిస్తున్నట్లు ద.మ.రైల్వే వర్గాలకు సంకేతాలు అందినట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే ఆరు డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న ద.మ.రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లకే పరిమితం అవుతుంది. మిగతా విజయవాడ, గుంటూరు, గుంతకల్లుతో పాటు తూర్పు కోస్తా జోన్‌లోని కొంతభాగంతో కలిపి కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్‌తో కలిపి దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటవుతుంది.

ఉన్న సమయం తక్కువే..


కొత్త జోన్‌కు ఏప్రిల్ 1 అపాయింటెడ్ డే అంటే.. ఇంకా ఆరు వారాలే ఉంది. కొత్త జోన్ ప్రారంభానికి ఇంత తక్కువ సమయం సాంకేతికంగా సరిపోతుందా అన్న కోణంలోనూ రైల్వేబోర్డులో చర్చ జరిగినట్లు తెలిసింది. సాధ్యాసాధ్యాలపై కొద్దిరోజుల్లోనే స్పష్టత వస్తుందని.. నెలాఖరుకల్లా కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ రావచ్చంటూ ద.మ.రైల్వే ప్రధాన కార్యాలయం అధికారులు అంటున్నారు. డివిజన్ల వారీగా విభజన, సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, ఆదాయ వ్యయాలు, రైళ్ల నిర్వహణ సహా పలు అంశాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రైల్వేబోర్డుకు తొమ్మిది నెలల క్రితమే చేరింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నూతన జోన్‌కు కేంద్ర మంత్రివర్గం 2025 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. కొన్ని నెలల నుంచే కొత్త జోన్ జీఎం, విభాగాధిపతులను బోర్డు దశలవారీగా నియమిస్తోంది.

మార్పులు చేర్పులు ఇవే..

గుంతకల్లు డివిజన్‌లో ఉన్న రాయచూరు-వాడి 108 కి.మీ.ల సెక్షన్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు పరిమితం కానుంది. విష్ణుపురం-పగిడిపల్లి, విష్ణుపురం-జాన్‌పహాడ్ 142 కి.మీ.ల మార్గాలు ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉండగా.. అవి సికింద్రాబాద్‌కు బదిలీ అవుతాయి. 46 కి.మీ.ల మోటుమర్రి-కొండపల్లి మార్గం సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోకి వెళతాయి.



గూళ్లకు వస్తున్న పక్షులు



కొమ్మకొమ్మకూ పక్షులే

కదిలివచ్చిన పక్షి అల.. కొమ్మకొమ్మకూ కొత్త కళ!

మార్కాపురం జిల్లా కనిగిరి మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మూడు చెట్లు వేల పక్షులకు ఆవాసంగా మారాయి. రోజూ వేకువజామున గింజల కోసం వెళ్లి... సాయంత్రం తిరిగి గూళ్లకు చేరుకుంటాయి. చెట్లను వదిలి వెళ్లి, వచ్చేటప్పుడు గుంపులుగా విహరిస్తూ సందడి చేస్తాయి. వీటి అరుపులే స్థానికులకు అలారంలా మారాయి. మున్సిపల్ సిబ్బంది సైతం వీటికి హాని కలగకుండా చూస్తున్నారు. పక్షులు లేనప్పుడు బోసిపోయినట్లు కనిపించే చెట్లు.. వాటి రాకతో నిండుదనం సంతరించుకున్నట్లు అనిపిస్తుంది.

– న్యూస్‌టుడే, కనిగిరి

నేడు రాజధానికి బిల్‌గేట్స్ బృందం

- సంజీవని, సాగులో సాంకేతికత సహా పలు ప్రాజెక్టుల పరిశీలన
- స్వర్ణాంధ్ర విజన్-2047పై చంద్రబాబు ప్రజెంటేషన్



ఈనాడు, అమరావతి: గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్నారు. ఆయనతో పాటు ఫౌండేషన్‌కు చెందిన ఆరుగురు ప్రతినిధుల బృందం సచివాలయానికి రానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లతో వారు సమావేశమవుతారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని బిల్‌గేట్స్ సందర్శిస్తారు. ఆర్టీజీఎస్ విధానాలు, సాధిస్తున్న ఫలితాల్ని గేట్స్‌కు చంద్రబాబు వివరిస్తారు. అనంతరం బిల్‌గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు సమావేశమవుతారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై అధికారులు ప్రజెంటేషన్ ఇస్తారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై చంద్రబాబు ప్రజెంటేషన్ ఇస్తారు. మెడ్‌టెక్ జోన్, డయాగ్నోస్టిక్ సేవలు, సాగులో సాంకేతికత వినియోగం సహా తదితర ప్రాజెక్టుల గురించి వివరిస్తారు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి తెలియజేస్తారు. అనంతరం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని చంద్రబాబుతో కలిసి గేట్స్ బృందం సందర్శించనుంది. డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపడుతున్న సాగు విధానాన్ని వీరు పరిశీలిస్తారు.

గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో సేవలు: మంత్రి సత్యకుమార్

వైద్యారోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్యసేవలు అందిస్తామని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. "వ్యాధులను ముందుగానే పసిగట్టి వ్యక్తిగతంగా అప్రమత్తం చేయడం, హెల్త్‌కార్డుల రూపకల్పన, డిజిటల్ ఆరోగ్య సేవలు తదితర రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకుంటాం. ప్రస్తుత విధానాల్ని సమీక్షించి.. చేపట్టాల్సిన సంస్కరణలపై ఇప్పటికే 10 మంది అంతర్జాతీయ నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ వేశాం. ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో [illegible] సెంటర్ నెలకొల్పుతాం" అని ఓ ప్రకటనలో వివరించారు.

శ్మశానవాటికలో మంత్రి నిమ్మల శ్రమదానం



వ్యర్థాలను తొలగిస్తున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లు, న్యూస్‌టుడే: శివరాత్రి పర్వదినాన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శ్మశానవాటికలో శ్రమదానం చేసి వ్యర్థాలు తొలగించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలోని ఆరు గ్రామాల్లో శ్మశానవాటికల అభివృద్ధికి రూ.1.25 కోట్లు మంజూరయ్యాయి. యలమంచిలి, ఆగర్తిపాలెం, పూలపల్లి గ్రామాల్లో ఆయా పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఆగర్తిపాలెం శ్మశానవాటిక ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి, వ్యర్థాలు పేరుకుపోయినట్లు గుర్తించిన మంత్రి వాటిని తొలగించే పని చేపట్టగా స్థానికులు కూడా ఆయనను అనుసరించారు. మానవ సేవే మాధవసేవగా భావించి శివరాత్రి రోజున శ్మశానవాటికను శుభ్రం చేసినట్లు మంత్రి నిమ్మల తెలిపారు.

ప్రధానమంత్రి జన్ వికాస్ యోజన ద్వారా రూ.300 కోట్లు

గుంటూరు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఈనాడు, అమరావతి: బడ్జెట్‌లో ప్రధానమంత్రి జన్ వికాస్ యోజన ద్వారా రాష్ట్ర మైనారిటీల సంక్షేమానికి రూ.300 కోట్లు కేటాయించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని గుంటూరు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో మైనారిటీలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఉర్దూ భాషాభివృద్ధికి రూ.7.78 కోట్లు, ఉర్దూ ఘర్, ఉర్దూ గ్రంథాలయాల అభివృద్ధికి రూ.2.85 కోట్లు, మైనారిటీ నిరుద్యోగుల శిక్షణకు రూ.3.97 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం పథకాన్ని 15 శాతం మైనారిటీలకు వర్తింపజేస్తున్నారు" అని మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు.

పలాసలో కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో వలసలు తగ్గుతాయి: ఎమ్మెల్యే గౌతు శిరీష

ఈనాడు, అమరావతి: బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర సహా అన్ని ప్రాంతాలకూ సమాన ప్రాధాన్యం ఇచ్చారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 7 గ్రోత్ డ్రైవర్లను గుర్తించిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు విజన్ కారణంగా భోగపురం విమానాశ్రయం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. "శ్రీకాకుళం జిల్లా నుంచి వలసల నివారణకు పలాసలో కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. దీనివల్ల పలాస చుట్టుపక్కల ప్రాంతాల్లో దాని అనుబంధ పరిశ్రమలు వస్తాయి. స్థానిక యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలు, పక్క రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి తప్పుతుంది. వైకాపా ప్రభుత్వ వేధింపుల కారణంగా ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, హెచ్‌సీఎల్, ఐబీఎం లాంటి 14 దిగ్గజ సంస్థలు విశాఖను వదిలి వెళ్లిపోయాయి" అని గౌతు శిరీష పేర్కొన్నారు.



పంచెపై ఎంబ్రాయిడరీ చేస్తున్న సరస్వతి



ఎంబ్రాయిడరీలో ఓం నమఃశివాయ వేస్తూ..

శ్రీకాళహస్తీశ్వరునికి ఎంబ్రాయిడరీ వస్త్రాలు

లలితా సహస్రనామాలు, అష్టోత్తర నామాలు వేసిన చీరాల మహిళ

బాపట్ల జిల్లా చీరాల పట్టణానికి చెందిన చుండూరి సరస్వతి శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల కోసం ఎంబ్రాయిడరీతో తీర్చిదిద్దిన వస్త్రాలు సిద్ధం చేశారు. స్వామికి అష్టోత్తర నామాలు వేసిన పంచెను, అమ్మవారికి పార్వతీ అష్టోత్తరం, ఖడ్గమాల, శ్రీలలితా సహస్ర నామాలు వేసిన చీరను ఈనెల 18న ఆలయంలో అందించనున్నారు. ఏడాది పాటు రోజు 2 గంటలు కష్టపడి, భక్తితో ఎంబ్రాయిడరీ చేసినట్లు చెప్పారు. ముందుగా నామాలను పెన్నుతో రాసి, ఆ తర్వాత మిషన్‌పై ఎంబ్రాయిడరీ కుట్టినట్లు వివరించారు. గతేడాది శ్రీశైలం ఆలయానికీ ఈ తరహా వస్త్రాలనే అందజేసినట్లు తెలిపారు.



పంచెపై శ్రీకాళహస్తీశ్వర అష్టోత్తరం

– న్యూస్‌టుడే, చీరాల అర్బన్

తెనాలి కోర్టులో నేటి నుంచి తెలుగులో తీర్పులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఏకా పవన్‌కుమార్ వారం రోజుల పాటు తెలుగులో తీర్పులు వెలువరించనున్నట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని, 16వ తేదీ నుంచి 7 రోజులపాటు తెలుగులోనే తీర్పులు ఇవ్వనున్నారని పేర్కొంది.



వీరికి మెగ్నీషియంతో అధిక ప్రయోజనం

హృదయ సంబంధిత సమస్యలు లేదా మధుమేహంతో బాధపడేవారు తగుమోతాదులో మెగ్నీషియంను తీసుకోవడంతో ప్రయోజనం పొందవచ్చు. ఎందుకంటే గుండె లయ క్రమబద్ధంగా కొనసాగడానికి మెగ్నీషియం తోడ్పడుతుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పాలకూర, బాదం గింజలు, జీడిపప్పు, పల్లీలు, డార్క్ చాక్లెట్లు, అవకాడో వంటి వాటి నుంచి మెగ్నీషియం అధికంగా లభిస్తుంది.

– ఎరిక్ బెర్గ్, కీటో ఆహార సలహాదారు

ప్రైవేటు బస్సులకు పన్ను ఊరట!

- ప్రస్తుతం త్రైమాసికానికి సీటుకు రూ.4 వేలు
- రూ.2,500కు తగ్గించే యోచన
- వందల ట్రావెల్స్ బస్సులు మళ్లీ ఏపీకి వస్తాయని అంచనా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వివిధ నగరాలకు, పొరుగున ఉన్న రాష్ట్రాలకు నిత్యం పరుగులు పెట్టే ట్రావెల్స్ బస్సుల్లో.. ఎక్కువగా నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవే ఉంటున్నాయి. ఏపీకి చెందిన అనేక ట్రావెల్స్ సంస్థలు తమ బస్సులను ఆయా రాష్ట్రాలకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాయి. ఇదేమంటే అక్కడ పన్నులు తక్కువని, ఏపీలో సీటుకు, త్రైమాసికానికి రూ.4 వేల చొప్పున అధికంగా ఉందని పేర్కొంటున్నాయి. దీంతో ఇక్కడ పన్నులను తగ్గించి, రిజిస్ట్రేషన్ల కోసం ఇతర రాష్ట్రాలకు బస్సులు వెళ్లకుండా చూసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పన్ను తగ్గించడంతో రాబడి తగ్గినా, ఇతర రాష్ట్రాల నుంచి బస్సులు మళ్లీ ఏపీకి రావడం వల్ల, బస్సుల సంఖ్య పెరిగి ఆదాయం పెరుగుతుందని అంచనావేస్తున్నారు.

పన్ను ఎక్కువంటూ ఇతర రాష్ట్రాలకు..

◆ గతంలో ట్రావెల్స్ బస్సులు ఏయే రాష్ట్రాల్లో నడపాలనుకుంటున్నారో.. ఆ రాష్ట్రాల రవాణాశాఖకు పన్ను చెల్లించాల్సి ఉండేది.

◆ కేంద్రం 2021లో వన్ నేషన్.. వన్ పర్మిట్ విధానాన్ని తీసుకొచ్చింది. త్రైమాసికానికి రూ.90 వేలుగానీ, ఏడాదికి రూ.3 లక్షలుగాని చెల్లిస్తే, దేశంలో ఎక్కడికైనా బస్సులు నడిపేలా ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) జారీచేస్తున్నారు.

◆ ఆ బస్సు ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయిందో అక్కడ హోమ్ ట్యాక్స్ కూడా చెల్లించాల్సి ఉంటుంది.

◆ మన రాష్ట్రంలో హోమ్ ట్యాక్స్.. సీటుకు, త్రైమాసికానికి రూ.4 వేలు చొప్పున ఉంది. అంటే 40 సీట్లు ఉండే బస్సుకు త్రైమాసికానికి రూ.1.60 లక్షలు చెల్లించాలి. ఈ లెక్కన ఏడాదికి రూ.6.40 లక్షలు అవుతోంది.

◆ అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే హోమ్ ట్యాక్స్.. ఏడాదికి రూ.40 వేలు మాత్రమే. నాగాలాండ్‌లో ఏడాదికి రూ.56 వేలు. ఒడిశాలో సీటుకు ఏడాదికి రూ.3,800 చొప్పున.. 40 సీట్లు ఉండే బస్సుకు రూ.1.52 లక్షలు మాత్రమే.

◆ ఇలా ఆయా రాష్ట్రాల్లో పన్నులు తక్కువగా ఉండటంతో.. నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు బస్సులు నడుపుతున్నారు.

◆ గతంలో ఏపీలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్రావెల్స్ బస్సులు వెయ్యి వరకు ఉండగా, ఇప్పుడు 280కి తగ్గిపోయాయి.

సీటుకు రూ.1,500 తగ్గించేలా..

◆ ఏపీలో హోమ్ ట్యాక్స్ తగ్గిస్తే.. తమ బస్సులను ఇక్కడికి తీసుకొచ్చి రీ-రిజిస్ట్రేషన్ చేసుకుంటామని కొంతకాలంగా ట్రావెల్స్ బస్సుల యజమానులు చెబుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. పన్ను తగ్గింపుపై కొన్ని ప్రతిపాదనలు తయారుచేసింది.

◆ ప్రస్తుతం సీటుకు, త్రైమాసికానికి రూ.4 వేలు చొప్పున ఉన్న పన్నును, రూ.2,500కి తగ్గించాలని భావిస్తోంది.

◆ సీటుకు త్రైమాసికానికి రూ.1,500 చొప్పున తగ్గడంతో.. ఒక్కో బస్సుపై ఏడాదికి దాదాపు రూ.2.40 లక్షలు పన్ను భారం తగ్గుతుంది.

◆ దీనివల్ల ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన బస్సుల్లో దాదాపు 500 వరకు ఏపీకి వచ్చి, రీ-రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇక్కడ హోమ్ ట్యాక్స్ చెల్లించేందుకు మొగ్గుచూపుతాయని అధికారులు భావిస్తున్నారు.

◆ ప్రస్తుతం ఏఐటీపీ బస్సులు చెల్లించే పన్ను ద్వారా ఏటా రూ.17 కోట్లు వస్తుండగా, కొత్తగా పన్ను తగ్గించినా. ఇక్కడ బస్సుల సంఖ్య పెరిగి రాబడి ఏటా రూ.26 కోట్లకు చేరుతుందని అంచనా.

◆ త్వరలో ట్రావెల్స్ బస్సుల యజమానుల సంఘాలతో సమావేశం నిర్వహించి, పన్ను తగ్గింపుపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

రాష్ట్రంలో తిరిగే బస్సులపై భారం తగ్గింపు

◆ రాష్ట్రంలో మాత్రమే తిరిగే బస్సులకు వేర్వేరు ఫీజులు ఉన్నాయి. వీటిని ఒకే ఫీజుగా మార్చాలని భావిస్తున్నారు.

◆ ఒక జిల్లాలో మాత్రమే తిరిగే బస్సులకు సీటుకు, త్రైమాసికానికి రూ.1,120, రెండు జిల్లాల మధ్య తిరిగే వాటికి రూ.1,510, రాష్ట్రమంతా తిరిగే వాటికి రూ.3,285 చొప్పున ఫీజులు ఉన్నాయి.

◆ తాజాగా ఈ బస్సుల్లో వేటికైనా సీటుకు, త్రైమాసికానికి రూ.1,500 చొప్పున ఖరారు చేయాలని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి దుర్మరణం

అందరూ విద్యార్థులే.. బెంగళూరులో దుర్ఘటన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: కర్ణాటకలో వరుస రహదారి ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి బెంగళూరులోని మాదనాయకనహళ్లి పోలీసుఠాణా పరిధిలోని జిందాల్ కూడలి వద్ద సంభవించిన ఘోర ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు అసువులు బాశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొడ్డబళ్లాపురకు చెందిన హర్షిత్(20) రాత్రి 8.30 గంటలకు స్నేహితుల దగ్గరకు వెళుతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి కారులో బయటకు వెళ్లాడు. అనంతరం నలుగురు స్నేహితులను ఎక్కించుకున్నాడు. తర్వాత అంతా బెంగళూరు వైపు వెళ్లారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో తుమకూరు వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు జిందాల్ కూడలి వద్ద డివైడర్‌పైకి దూసుకెళ్లి బెంగళూరు నుంచి వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులూ మృత్యువాత పడ్డారు. ఈ నెల 13న హొసకోట - దాబస్‌పేట రహదారిలోని ఎం.సత్యవర వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

రేణుకాచౌదరికి సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరికి సభాహక్కుల ఉల్లంఘన నోటీసు జారీ అయింది. ఆమె గత ఏడాది డిసెంబరు 1న శీతాకాల సమావేశాల సమయంలో తన కారులో పార్లమెంటు ప్రాంగణంలోకి ఓ కుక్కను తీసుకురావడంతోపాటు పార్లమెంటు సభ్యుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంగా సభా హక్కుల ఉల్లంఘన కమిటీ ఈ నోటీసు జారీ చేసింది. ఈ కుక్క కరిస్తే ఎలా అని ఆరోజు విలేకర్లు అడిగిన ప్రశ్నకు.. 'ఇది కరవదు. నిజంగా కరిచేవారు లోపలున్నారు' అని రేణుకాచౌదరి వ్యాఖ్యానించారు. ఇది పార్లమెంటు సభ్యులను అవమానించడమేనని పేర్కొంటూ భాజపాకు చెందిన సభ్యులు.. రాజ్యసభ ఛైర్మన్‌కు సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నేతృత్వంలోని సభాహక్కుల కమిటీ ఆ ఫిర్యాదును పరిశీలించి దానిపై రేణుకాచౌదరి నుంచి లిఖితపూర్వకంగా అభిప్రాయం కోరాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 23లోపు సమాధానం ఇవ్వాలని ఆమెకు నోటీసు జారీ చేసింది. తాను పార్లమెంటుకు వస్తుండగా కారు కిందపడబోయిన కుక్కను రక్షించే ఉద్దేశంతో వెంటనే తన కారులో ఎక్కించుకొని వచ్చానని, అందులో మరో ఉద్దేశం లేదని ఆనాడే రేణుకాచౌదరి మీడియాతో చెప్పారు.

అమెరికాలో శవమై కనిపించిన సాకేత్

- కొద్ది రోజులుగా కనిపించకపోవడంతో అక్కడి పోలీసుల దర్యాప్తు
- మృతదేహం లభ్యం

ఈనాడు, బెంగళూరు: అమెరికాలో చదువుకోవడానికి వెళ్లి కనిపించకుండా పోయిన కర్ణాటక విద్యార్థి సాకేత్ శ్రీనివాసయ్య (22) మృతిచెందినట్లు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్య కార్యాలయం ప్రకటించింది. ఆదివారం విడుదల చేసిన ప్రకటన మేరకు సాకేత్ కనిపించకపోవడంతో అతడి మిత్రులు పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. గత సోమవారం కళాశాల క్యాంపస్ సమీపంలోని లేక్ అంజా వద్ద అతడిని చివరిసారిగా చూసినట్లు పోలీసులకు చెప్పడంతో వారు ఆ పరిసరాల్లో గాలింపు చేపట్టారు. పార్క్‌ఫీల్డ్ ప్రాంతంలో సాకేత్ మృతదేహంతో పాటు అతడి బ్యాగ్, ల్యాప్‌టాప్, పాస్‌పోర్ట్‌లను గుర్తించారు. 'సాకేత్ ఎప్పుడూ ఒత్తిడికి లోనైనట్లు కనిపించలేదు. కానీ కనిపించకుండా పోయిన రోజు కళాశాలకు నైట్‌డ్రెస్‌లో వెళుతుంటే ఆశ్చర్యం వేసి అడిగాను. తన మీద తనకు ఆసక్తి పోయిందని చెప్పాడు. రెండు వారాలుగా అన్నం తినడం మానేసి చిప్స్, కుకీస్ మాత్రమే తింటుండేవాడు' అని సాకేత్ రూమ్‌మేట్ బనీత్‌సింగ్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. సాకేత్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని భారత దౌత్య కార్యాలయం పేర్కొంది. సాకేత్ కుటుంబానికి సహకరించాలని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీకి కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ లేఖ రాశారు.



సాకేత్ శ్రీనివాసయ్య

ఎవరీ సాకేత్?: సామాజిక మాధ్యమాల్లో సాకేత్ రాసుకున్న ప్రకారం.. ఆయన ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పూర్తి చేశారు. అక్కడే అండర్ గ్రాడ్యుయేట్ రీసర్చర్‌గా, యంగ్ రీసెర్చ్ ఫెలోగా పనిచేసి, డాక్టర్ రెడ్డీస్, యూనిలీవర్ వంటి సంస్థల్లో ఇంటర్న్‌గా కొంత కాలం విధులు నిర్వర్తించారు. అనంతరం అమెరికా వెళ్లి బర్క్‌లీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా క్యాంపస్‌లో కెమికల్ అండ్ బయో మాలిక్యులర్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ కోసం చేరారు.

వెయ్యి కిలోల గంజాయి పట్టివేత

పాడేరు, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి రవాణా చేస్తున్న వెయ్యి కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేశామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డీఎస్పీ అభిషేక్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి జి.మాడుగుల మండలం మత్స్యపురం కూడలి వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒడిశా నుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 17 బస్తాల్లో వెయ్యి కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఐదుగురిని అరెస్టు చేశామని, డ్రైవర్ పరారీలో ఉన్నారని డీఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు.





ఊడలతో మర్రిమాను

◆ వనంలా విస్తరించిన తిమ్మమ్మ మర్రిమాను

అడవంత చెట్టు!

ఈ దట్టమైన అడవి ఒకే ఒక చెట్టు సృష్టి. శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలంలోని గూటిబైలులోని తిమ్మమ్మ మర్రిమాను ఘనత ఇది. 660 ఏళ్లుగా చరిత్రను సుస్థిరం చేసుకుంటూ ఏటికేడు విస్తరిస్తోంది. 1989లోనే 1,775 ఊడలతో మూడెకరాల్లో విస్తరించి గిన్నిస్ బుక్ రికార్డులోకెక్కింది. దీంతో 1990లో ఈ వృక్షరాజాన్ని అటవీశాఖ ఆధీనంలోకి తీసుకుంది. ప్రస్తుతం 6,998 ఊడలతో 8.7 ఎకరాల్లో తన సామ్రాజ్యాన్ని విస్తరించింది. ప్రతి ఊడ ప్రధాన మొదలులా పెరిగిన తీరును సందర్శకులు చూసేందుకు చెట్టు కింద అధికారులు ప్రత్యేక దారులు వేశారు. చల్లని నీడలో తిరుగుతూ మర్రిమాను సౌందర్యాన్ని ఆస్వాదించొచ్చు. శతాబ్దాల వృక్షంపై ఎస్కేయూ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రసాదరావు మాట్లాడుతూ.. 'ఫైకస్ జాతికి చెందిన మర్రి, రావి వంటి చెట్లు వెయ్యేళ్లకు పైగా జీవిస్తాయి. కాలుష్య రహిత పరిస్థితుల్లో నీటి ఎద్దడి తట్టుకొని సుదీర్ఘ కాలం మనగలుగుతాయి. తిమ్మమ్మ మర్రిమాను ఉన్న ప్రాంతం బాగుంది అందుకే ఇన్నేళ్లుగా పచ్చగా ఉంటోంది' అని వివరించారు. అన్నట్లు.. ఈ చెట్టుకింద ఉన్న తిమ్మమాంబ ఆలయంలో ఏటా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, కదిరి

రైతు ప్రాణం తీసిన విద్యుత్తు తీగ



మగ్దూమ్ అలీ

ఊట్కూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన తెలంగాణ నారాయణపేట జిల్లాలో చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. ఊట్కూరు మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన రైతు మగ్దూమ్ అలీ(54) తిప్రాస్‌పల్లి శివారులో ఉన్న పొలంలో వేరుసెనగ సాగు చేశారు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు తీగలతో కంచె ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆయన శనివారం సాయంత్రం పొలానికి వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. భార్య షాహిదాబేగం ఫోన్ చేసినా స్పందించలేదు. వెంటనే ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వెళ్లి చూడగా ఆయన కంచె వద్ద విద్యుదాఘాతానికి గురై పడి ఉన్నారు. వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేలికైన విద్యుత్తు టవర్లు!

- కొత్త వ్యవస్థను ఆవిష్కరించిన సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్సీ
- వీటితో లైన్ల పునరుద్ధరణ ఎంతో సులువు

ఈనాడు, చెన్నై: వరదలు, తుపాన్లు, భూకంపాల లాంటి విపత్తుల సమయాల్లో విద్యుత్తు టవర్లు ధ్వంసమైతే తాత్కాలికంగానైనా సరఫరా పునరుద్ధరించడానికి ఇంజినీర్లు పడే శ్రమ అంతాఇంతా కాదు. ఇక కొండలు, పర్వతాలు, లోయల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తితే విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు కొన్ని నెలల సమయంపడుతుంది. పైగా ఆ సామగ్రిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. ఈ సమస్యల నుంచి గట్టెక్కేందుకు చెన్నైలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్- స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సెంటర్(సీఎస్ఐఆర్- ఎస్ఈఆర్సీ) అద్భుత ఆవిష్కరణ చేసింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో చేసిన ఈ వ్యవస్థను సిద్ధం చేసింది. ఈ 'అత్యవసర విద్యుత్తు పునరుద్ధరణ వ్యవస్థ(ఈపీఆర్ఎస్)'ను తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లోని కిషన్‌పుర్-పంపోర్ సెక్షన్ల మధ్య గతేడాది పరీక్షించి.. మంచి ఫలితాలు సాధించింది.

తేలికపాటి సామగ్రితో..

తేలికపాటి సామగ్రితో క్లిష్ట పరిస్థితుల్లోనూ విద్యుత్తు టవర్లను బిగించడమే 'అత్యవసర విద్యుత్తు పునరుద్ధరణ వ్యవస్థ(ఈపీఆర్ఎస్)' ప్రత్యేకత.


◆ ఒకసారి టవర్ వేస్తే 33కేవీ నుంచి 800కేవీ లైన్లనూ వాటి మీదుగా తీసుకోవచ్చు. ఇప్పుడున్న సాంకేతికతతో ఇంతటి భారీ టవర్లు వేయాలంటే 3 నెలలు పడుతుంది. అదే ఈపీఆర్ఎస్‌తో 2 రోజుల్లోనే తాత్కాలిక టవర్లు ఏర్పాటు చేయొచ్చని శాస్త్రవేత్తలు నిరూపించారు.

◆ శాశ్వత టవర్లను నిర్మించాక ఈపీఆర్ఎస్ సామగ్రిని వేరే చోటుకు తీసుకెళ్లొచ్చు.

◆ పూర్తి స్వదేశీ సామగ్రినే కావడంతో గతంలో కంటే 40% డబ్బు ఆదా అవుతుంది.

◆ టవర్ల పరికరాల కోసం అల్యూమినియం వాడటంతో బరువు 85% తగ్గింది. బరువు తగ్గడంతో ఎక్కడికైనా తరలించడం సులువవుతోంది.

◆ 'యూఎస్, కెనడా తర్వాత అత్యవసర విద్యుత్తు పునరుద్ధరణ వ్యవస్థ ఉంది మన దేశంలోనే. ఈ సాంకేతికతకు పేటెంట్ పొందాం. యూఎస్, కెనడాలోనూ పేటెంట్లకు దరఖాస్తు చేసుకున్నాం. ఈ వ్యవస్థను ఎగుమతి కూడా చేయనున్నాం' అని సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్సీ డైరెక్టర్ ఆనందవల్లి తెలిపారు.



800 కేవీ సామర్థ్యంతో తీగలు తరలించేలా ఏర్పాటు చేసిన టవర్ ◆ తక్కువ కేవీ తీగల్ని తరలించేందుకు వినియోగించే తాత్కాలిక టవర్

రాజన్న క్షేత్రం.. శివరాత్రి వైభవం



హనుమకొండ వేయి స్తంభాల గుడిలో రుద్రేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

ఈనాడు, సిరిసిల్ల- న్యూస్‌టుడే, వేములవాడ: మహా శివరాత్రి సందర్భంగా తెలంగాణలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. హరహరమహాదేవ ధ్వానాలతో మార్మోగాయి. పర్వదినాన ముక్కంటిని కనులారా దర్శించుకోవాలని.. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ప్రముఖ శివాలయాలైన వేములవాడ, హనుమకొండ రుద్రేశ్వరాలయం సహా అన్ని క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో గుడులకు తరలివచ్చిన భక్తులు పుణ్యస్నానాలు, అభిషేకాలతో తరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భీమేశ్వరాలయంలో మహా శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మహా లింగార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి లింగోద్భవ సమయంలో రాజన్న, భీమేశ్వర గర్భాలయాల్లో మూలవిరాట్‌లకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 1.50 లక్షల మందికి పైగా భక్తులు స్వామివారి దర్శనాలు చేసుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. వేములవాడలో శివయ్యకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి.. స్వామి వారికి అభిషేకాది పూజలు చేయించారు.

మీ బహుమతులు మాకొద్దు!

భువనగిరిలో ఓ వార్డు ఓటర్ల నిరసన



వార్డులోని ఓ వీధిలో ఓటర్లు పడేసిన చీరలు, హాట్ బాక్స్‌లు, కుక్కర్లు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పంపిణీ చేసిన బహుమతులు తమకు వద్దంటూ.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణం 1వ వార్డు ఓటర్లు వాటిని వీధుల్లో పెట్టి నిరసన తెలిపిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన స్వరూపరాణి పంచిన చీరలు, హాట్ బాక్స్‌లు, కుక్కర్లను వీధిలో పెట్టారు. దాడులకు పాల్పడుతున్న ఆమె అనుచరులు, బంధువుల నుంచి రక్షణ కల్పించాలని వార్డులోని కొందరు ఆదివారం ప్రదర్శనగా వెళ్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బహుమతులు తీసుకుని భారాస అభ్యర్థి ఏలె భువనేశ్వరికి ఓటు వేశారని ఆరోపిస్తూ శనివారం రాత్రి స్వరూపరాణి అనుచరులు వార్డులోని ఓ వీధిలో ఇళ్లపైకి గాజు సీసాలు విసిరి దూషించారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులను గుర్తించి వెంటనే శిక్షించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. కాగా, ఇళ్లపై గాజు సీసాలు విసిరిన ఘటనతో తనకు, తన అనుచరులకు, బంధువులకు ఎలాంటి సంబంధం లేదని స్వరూపరాణి వివరణ ఇచ్చారు. ఓటర్లకు హాట్ బాక్స్‌లు, కుక్కర్లు, చీరలు పంపిణీ చేయలేదని స్పష్టం చేశారు.


పదవులు శాశ్వతం కాదు

- ప్రజల హృదయాలను గెలిచిన వారే నిజమైన నాయకులు: భట్టి విక్రమార్క

మధిర, మధిర పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని.. వారి కష్టసుఖాల్లో తోడు ఉండేవారే నిజమైన నాయకులుగా గుర్తింపు పొందుతారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ కౌన్సిలర్లతో ఆదివారం ఆయన ప్రత్యేకంగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. 'పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి.. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదు.. అవి కేవలం తోకలు వంటివి మాత్రమే' అని ఆయన వ్యాఖ్యానించారు. నాయకత్వం అంటే కేవలం అధికారం చలాయించడం కాదని.. ప్రజల హృదయాలను గెల్చుకోవడమని వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటిస్తారని వెల్లడించారు. సీనియర్ కౌన్సిలర్ కోనా ధనికుమార్‌కు విప్ జారీ అధికారాన్ని అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. గెలిచిన నూతన కౌన్సిలర్లను ఈ సందర్భంగా ఆయన అభినందించి సత్కరించారు.

ప్రభుత్వ బడుల్లో చదవడం అదృష్టమనేలా తీర్చిదిద్దుతాం

మధిరలో తేళ్ల వసంతయ్య మెమోరియల్(టీవీఎం) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల 48వ వార్షిక సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటుచేసి ప్రభుత్వ బడిలో చదవడం తమ అదృష్టమనేలా నాణ్యమైన విద్య, వసతులతో తీర్చిదిద్దుతామని చెప్పారు. నేటి తరానికి స్ఫూర్తినిచ్చేలా పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావాలని సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా మధిరలోని శ్రీమృత్యుంజయస్వామి ఆలయం(శివాలయం)లో భట్టి విక్రమార్క, నందిని దంపతులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులందరి పేర్లు, వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు.



మధిర శివాలయంలో పూజలు చేస్తున్న భట్టి దంపతులు. పక్కన మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు తదితరులు

సేవాలాల్ మహారాజ్ మార్గం ఆదర్శనీయం: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆదర్శనీయమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సేవాలాల్ జయంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఆయనకు లోకేశ్ నివాళి అర్పించారు. సమాజానికి సేవాలాల్ చేసిన సేవల్ని గుర్తుచేశారు.

మాజీ ఎంపీ రత్నాబాయి మృతి



రంపచోడవరం, న్యూస్‌టుడే: రాజ్యసభ మాజీ సభ్యురాలు తడపట్ల రత్నాబాయి (79) పోలవరం జిల్లా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఆదివారం రాత్రి కన్నుమూశారు. కాంగ్రెస్ పార్టీలో ఆమె సీనియర్ నాయకురాలిగా ఉన్నారు. 1972లో ఎల్లవరం (ప్రస్తుత రంపచోడవరం) నియోజకవర్గంలో మొదట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2007లో జీసీసీ ఛైర్మన్‌గా, 2009లో రాజ్యసభ సభ్యురాలిగా, 2014లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రత్నాబాయి కొన్నాళ్లుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఆమెకు ఆరోగ్యం క్షీణించడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భర్త సత్యనారాయణ పీసీసీ సభ్యులుగా పని చేశారు. ఇద్దరు కుమారులు ఉన్నారు.

మావోయిస్టులు లొంగిపోవాలి తెలంగాణ డీజీపీ

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన పిలుపు మేరకు అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు వెంటనే లొంగిపోవాలని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయనొక ప్రకటనలో కోరారు.

లక్ష్మీనరసింహస్వామి అఖండ జ్యోతి యాత్ర ప్రారంభం



పూజల్లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, భాజపా తెలంగాణ ప్రధాన కార్యదర్శి గౌతంరావు, యాత్ర కమిటీ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు

బర్కత్‌పుర, యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి 32వ అఖండ జ్యోతి యాత్ర ఆదివారం హైదరాబాద్ బర్కత్‌పురలోని యాదాద్రి భవన్ వద్ద ప్రారంభమైంది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, యాదగిరిగుట్ట ఈవో భవానీశంకర్, అఖండ జ్యోతి యాత్ర కమిటీ ఛైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంఎంటీఎస్ రెండో దశ పనుల్లో భాగంగా రూ.600 కోట్లతో హైదరాబాద్ నగరం నుంచి యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ ప్రాజెక్టు చేపట్టనుందని వెల్లడించారు. యాదగిరిగుట్ట పంచనారసింహుల వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి 28 వరకు నిర్వహిస్తామని ఆలయ ఈవో భవానీశంకర్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 24న ఎదుర్కోలు, 25న స్వామివారి తిరుకల్యాణం, 26న దివ్యవిమాన రథోత్సవం, 27న మహాపూర్ణాహుతి, 28న గర్భాలయంలోని మూలవరులకు విశేష అభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని వివరించారు. బ్రహ్మోత్సవాలకు రూ.2 కోట్ల బడ్జెట్ కేటాయించామని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి, ప్రధాన పూజారి కాండూరి వెంకటాచార్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి సేవలోనే చిన్నప్పన్న

- పేరుకే ఏపీ భవన్ లైజనింగ్ అధికారి
- అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత వ్యవహారాల్లో తలమునకలు
- 2022లో ఏపీ భవన్‌లో ప్రత్యేకాధికారి పోస్టు
- సుబ్బారెడ్డి ఆదేశాలు లేకుండా ఆ కీలక స్థానాలు సాధ్యమేనా?
- ఆ ఉత్తర్వులను జీవోఐఆర్‌లో పెట్టకుండా దాచిన వైకాపా ప్రభుత్వం
- 2019 నుంచి 2023 వరకూ తితిదే వ్యవహారాల్లో చిన్నప్పన్న జోక్యం
- సుబ్బారెడ్డితో సంబంధం లేకపోతే ఏపీ భవన్ అధికారికి తితిదేలో ఏం పని?

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలక నిందితుడైన కదురు చిన్నప్పన్న.. అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సేవలోనే తరించారు. ఆయనకు అంతమించి నమ్మినబంటు అప్పటికి తిరుగులేని ఆధారాలతో తేటతెల్లమయ్యింది. సుబ్బారెడ్డి తరఫున ఆయన వ్యవహారాలన్నీ చక్కబెట్టే చిన్నప్పన్నను 2019లో వైకాపా అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే తొలుత దిల్లీలోని ఏపీ భవన్‌లో లైజనింగ్ అధికారిగా నియమించారు. మూడేళ్ల తర్వాత ఏపీ భవన్ ప్రత్యేకాధికారి హోదా ఇచ్చారు. నెలకు రూ.75 వేల పారితోషికంతో పాటు అదనంగా ప్రొటోకాల్‌లోని 'ఏ' కేటగిరి కింద పలు అలవెన్సులు కల్పించారు. 2019 అక్టోబరు నుంచి 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే వరకూ చిన్నప్పన్న ఈ పోస్టుల్లో కొనసాగారు. పేరుకే దిల్లీలో అధికారి.. కానీ సుబ్బారెడ్డి వ్యక్తిగత పనులు చక్కబెట్టటమే అతని ప్రధాన విధి. దీన్ని బట్టి సుబ్బారెడ్డి సిఫార్సులతోనే చిన్నప్పన్న తొలుత ఏపీ భవన్ లైజనింగ్ అధికారిగా, ఆ తర్వాత ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారనేది స్పష్టమవుతోంది. ప్రభుత్వ ఖజానా నుంచి జీతభత్యాలు చెల్లించేందుకు చిన్నప్పన్నకు ఆ పోస్టులిప్పించి తన సేవలకు వినియోగించుకున్నట్లు అర్థమవుతోంది.

రహస్యంగా పొడిగింపు జీవో

◆ చిన్నప్పన్నను ఏపీ భవన్‌లో స్పెషల్ లైజనింగ్


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
GENERAL ADMINISTRATION (PROTOCOL-II) DEPARTMENT

ఏపీభవన్ లైజనింగ్ అధికారిగా చిన్నప్పన్నను నియమిస్తూ 2019 అక్టోబరు 10న జారీ చేసిన ఉత్తర్వులు



ఏపీ భవన్ ప్రత్యేక అధికారిగా చిన్నప్పన్నను నియమిస్తూ 2022 అక్టోబరు 7న జారీ చేసిన ఉత్తర్వులు

అధికారిగా నియమిస్తూ 2019 అక్టోబరు 10న అప్పటి సాధారణ పరిపాలన ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులిచ్చారు. చిన్నప్పన్న ఇచ్చిన వినతిని పరిగణనలోకి తీసుకుని ఆయన్ను ఆ పోస్టులో నియమించాలంటూ నాటి ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజేయ కల్లం 2019 ఆగస్టు 13న పంపించిన నోట్ ఆధారంగా నియామకం చేపడుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడేళ్ల కాలపరిమితితో రూ.75 వేల పారితోషికం, ఎలవెన్స్‌లు కల్పిస్తూ చిన్నప్పన్నను ఏపీ భవన్ స్పెషల్ లైజనింగ్ అధికారిగా నియమించారు. సుబ్బారెడ్డి జోక్యం లేకుండా, ఆయన సిఫార్సు చేయకుండా ఏకంగా ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు నోట్ పంపిస్తారా?

◆ 2022 అక్టోబరు 10తో ఏపీ భవన్ లైజనింగ్ అధికారిగా పదవీ కాలం పూర్తయిపోతుండటంతో తనను ఏపీ భవన్‌లో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (స్పెషల్ సెక్రటరీ టూ ఏపీ గవర్నమెంట్ ఇన్ ఏపీ భవన్)గా మూడేళ్ల కాలపరిమితితో నియమించాలని చిన్నప్పన్న సెప్టెంబరు 22న ప్రభుత్వానికి లేఖ రాశారు. నాటి ప్రభుత్వం ఆఘమేఘాలపై స్పందించింది. చిన్నప్పన్నను రెండేళ్ల కాలపరిమితితో ఏపీ భవన్ ప్రత్యేకాధికారిగా నియమిస్తూ 2022 అక్టోబరు 7న నాటి సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్ విభాగం) రేవు ముత్యాలరాజు ఉత్తర్వులిచ్చారు. సుబ్బారెడ్డి ప్రమేయం లేకుండా చిన్నప్పన్నను అంత కీలక పోస్టులో నియమిస్తారా?

◆ చిన్నప్పన్న పేరుకే ఏపీ భవన్‌లో అధికారైనప్పటికీ.. ఆయన అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత పనులు చక్కబెట్టటంలో తలమునకలై ఉంటారని విస్తృతంగా ప్రచారం ఉండటంతో 2022 అక్టోబరు 7న జారీ చేసిన జీవోను ప్రభుత్వం జీవోఐఆర్‌లో అప్‌లోడ్ చేయకుండా రహస్యంగా ఉంచింది. నెలన్నర తర్వాత 2022 నవంబరు 17న ఏపీ ఈ-గెజిట్ పోర్టల్‌లో ఆ జీవో అప్‌లోడ్ చేసింది.

సుబ్బారెడ్డి, చిన్నప్పన్న బంధానికి నిదర్శనాలివీ..

◆ 'తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్ 2022 మే 15న చిన్నప్పన్నను దిల్లీలో కలవగా నెయ్యి టెండరు కావాలంటే కిలోకు రూ.25 చొప్పున లంచమివ్వాలని డిమాండ్ చేశారు. పొమిల్ జైన్ నిరాకరించటంతో 2022 మే 16న భోలేబాబా డెయిరీపై చిన్నప్పన్న నాటి తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డికి ఓ ఫిర్యాదు ఇచ్చారు. దాన్ని ఆయన అప్పటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యంకు అందజేసి విచారించాలని ఆదేశించారు' అని సిట్ అభియోగ పత్రంలో వెల్లడించింది. అప్పటికే ఏపీ భవన్‌లో లైజనింగ్ అధికారిగా ఉన్న చిన్నప్పన్నకు తితిదే వ్యవహారాలతో ఏం పని? నెయ్యి సరఫరా టెండర్లు దక్కాలంటే లంచమివ్వాలని ఎందుకు, ఎవరి ఆదేశాలతో డిమాండ్ చేశారు? చిన్నప్పన్న భోలేబాబాపై ఫిర్యాదిస్తే.. సుబ్బారెడ్డి వెంటనే దాన్ని ప్రొక్యూర్‌మెంట్ సుబ్రమణ్యానికి అందజేసి విచారించాలని ఎందుకు ఆదేశించినట్లు?

◆ చిన్నప్పన్న 2022 మే నెలలో ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ డెయిరీ ఎండీ జగ్‌మోహన్ గుప్తాను దిల్లీ నార్త్ ఎవెన్యూలోని ఎంపీ నివాస్‌కు పిలిపించుకుని తితిదేకు నెయ్యి సరఫరా టెండరు దక్కాలంటే కిలోకు రూ.7 చొప్పున లంచమివ్వాలని అడిగారు. అంగీకరించిన జగ్‌మోహన్ గుప్తా 2022 నుంచి 2023 డిసెంబరు వరకూ దఫదఫాలుగా చిన్నప్పన్నకు రూ.50 లక్షలు చెల్లించారు. ఆ కాలవ్యవధిలో చిన్నప్పన్న ఏపీ భవన్ లైజన్ అధికారిగా, ప్రత్యేకాధికారి పోస్టుల్లో కొనసాగుతున్నారు. తితిదే నెయ్యి టెండర్లు దక్కించుకోవటం కోసం ఎవరైనా ఏపీ భవన్ లైజనింగ్ అధికారికి లంచం ఇస్తారా?

◆ మీ పీఏ చిన్నప్పన్న కిలోకు రూ.25 చొప్పున లంచం అడుగుతున్నారని భోలేబాబా డైరెక్టర్ పొమిల్ జైన్ 2022 మే 25న సుబ్బారెడ్డిని కలిసి చెప్పారు. అప్పుడైనా చిన్నప్పన్న తన పీఏ కాదని, అతనికి తితిదే వ్యవహారాలకు ఎలాంటి సంబంధమూ లేదని సుబ్బారెడ్డి ఎందుకు పొమిల్ జైన్‌కు చెప్పలేదు? చిన్నప్పన్నపై ఫిర్యాదివ్వాలని ఎందుకు సూచించలేదు?

◆ తితిదేకు నెయ్యి, ఇతర సరకులు సరఫరా చేసే సంస్థలు, వాటి యజమానుల ఫోన్ నంబర్లు, కొనుగోలు కమిటీ నిర్ణయాలు, సిఫార్సుల వివరాలను ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎం సుబ్రహ్మణ్యం ఎప్పటికప్పుడు చిన్నప్పన్నకు పంపించేవారు. తితిదే పాలకమండలి సమావేశాల ఎజెండాను ముందు అతనికే పంపేవారు. భోలేబాబా డెయిరీ ప్లాంట్ తనిఖీకి వెళ్లిన బృందం సభ్యులు కూడా చిన్నప్పన్న ఆదేశాల్నే పాటించారు. అప్పటికి ఏపీ భవన్ అధికారిగా ఉన్న చిన్నప్పన్నకు సుబ్బారెడ్డితో ఏ సంబంధమూ లేకపోతే అతనికి నాటి తితిదే అధికారులు ఈ వివరాలన్నీ ఎందుకు పంపించినట్లు?

చిన్నప్పన్న పేరుకే ఏపీ భవన్‌లో లైజనింగ్ అధికారని.. ఆయన సేవలు మాత్రం వైవీ సుబ్బారెడ్డికే అందించారనడానికి ఇంతకంటే నిదర్శనాలు ఇంకేం కావాలి?

months. On 15.05.2022, Shri Kailash Chand Mangla contacted KaduruChinnappanna (A-24) and after confirming time, Shri Kailash Chand Mangla and Pomil Jain (A-3), Director, M/s Bhole Baba Oroganic Dairy Milk Private Limited (A-7) met KaduruChinnappanna (A-24) at New Delhi. During the meeting, KaduruChinnappanna (A-24) as PA to then Chairman, TTD demanded Rs.25/- per Kg of ghee as commission for supply of ghee to TTD. Shri Pomil Jain (A-3) did not incline to pay the commission amount.

2022 మే 15న చిన్నప్పన్న భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్‌ను లంచం అడిగారని అభియోగపత్రంలో పేర్కొన్న సిట్

Investigation revealed that after awarding of the above ghee tender in favour of M/s. Premier Agri Foods Private Limited, KaduruChinnappanna (A-24) used to contact Shri Jagmohan Gupta, Managing Director of the said company regularly either through WhatsApp or through normal calls. As demanded by KaduruChinnappanna (A-24) as stated above, he used to ask Shri Jagmohan Gupta for payment of commission amount to him. On different dates between end of 2022 and end of 2023, Shri Jagmohan Gupta paid in total Rs.50,00,000/- in cash to KaduruChinnappanna (A-24) as undue advantage during the said period through Shri Aman Gupta and Shri Vijay Gupta who were employees of Shri Jagmohan Gupta during relevant period and stationed at New Delhi. Shri Aman Gupta and Shri

2022 నుంచి 2023 వరకూ ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ఎండీ జగ్‌మోహన్ గుప్తా నుంచి చిన్నప్పన్న రూ.50 లక్షలు లంచంగా తీసుకున్నారని అభియోగపత్రంలో పేర్కొన్న సిట్



సుబ్బారెడ్డితో చిన్నప్పన్న

ఆదిత్యుని సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

శ్రీకాకుళం నగరం, విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఆదివారం శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆయలం, విశాఖపట్నంలోని సింహాద్రి అప్పన్న స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ముందుగా ఆయా ఆలయాల ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేద పండితులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవోలు కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్(సూర్యనారాయణస్వామి దేవస్థానం), వెంకటరావు(అప్పన్న ఆలయం)లు స్వామివార్ల శేషవస్త్రాలు, చిత్రపటాలు ఇచ్చారు. అప్పన్న ఆలయంలో జస్టిస్ సంజయ్ కరోల్ కప్ప స్తంభం ఆలింగనం చేసుకొని, బేడామండపం ప్రదక్షిణం చేశారు. అరసవల్లిలో ఆయన వెంట శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పీడీజే) జునైద్ అహ్మద్ మౌలానా, శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు జడ్జి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి కె.అనురాగ్ ఉన్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్‌కు సూర్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో ప్రసాద్. చిత్రంలో శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు



జస్టిస్ సంజయ్ కరోల్‌కు సింహాద్రి అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఈవో వెంకటరావు

కాలచక్ర మ్యూజియానికి నిర్లక్ష్యపు గ్రహణం



అమరావతి ఆర్టీసీ బస్టాండు ఎదురుగా నిర్మించిన కాలచక్ర మ్యూజియం

బౌద్ధారామాల చరిత్ర భావితరాలకు తెలియజేసేందుకు పల్నాడు జిల్లా అమరావతిలో ఏర్పాటు చేసిన కాలచక్ర మ్యూజియంపై నిర్లక్ష్యం కమ్ముకుంది. ఒకప్పుడు పర్యాటకులు, జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల సమావేశాలతో కళకళలాడిన ఈ మ్యూజియం నిర్వహణ కరవై దయనీయ స్థితికి చేరింది. విలువైన కళాఖండాలు, శిల్పసంపద పరదాల మాటుకు చేరాయి. 3వ శతాబ్దంలో అమరావతిలో విలసిల్లిన బౌద్ధగాథలు తెలియజేసే శిల్పకళారూపాలు చీకటి గదుల్లో మగ్గుతున్నాయి. బుద్ధుని జీవిత ఘట్టాలు, బౌద్ధ చిహ్నాలు, పూర్ణకుంభం ఆనవాళ్లు దీనావస్థలో ఉన్నాయి. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం ఈ మ్యూజియం అభివృద్ధికి నిధులు కేటాయించింది. తరువాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోగా, మ్యూజియం మూతపడింది. కూటమి ప్రభుత్వం స్పందించి మ్యూజియాన్ని అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఈనాడు, న్యూస్‌టుడే, అమరావతి



సున్నపు రాతిపై చెక్కిన అద్భుత శిల్పాలు



మ్యూజియం లోపల 3వ శతాబ్దం నాటి శిల్పాలకు పరదాలు

'అగ్నివీర్' నియామకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: సైన్యంలో నియామకాల కోసం ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించినట్లు రిక్రూట్‌మెంట్ అధికారి, గుంటూరు డైరెక్టర్ కర్నల్ రజత్ సువర్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్‌లో వివిధ విభాగాల్లో నియామకాలకు ఈ నెల 13న నోటిఫికేషన్‌ను (www.joinindianarmy.nic.in) వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు తెలిపారు. గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం పరిధిలోని కర్నూలు, ఎస్పీఎస్ నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి, మార్కాపురం జిల్లాలకు చెందిన అవివాహిత యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్ (పదో తరగతి ఉత్తీర్ణులు), ట్రేడ్స్‌మన్ (ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులు) విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు రెండు విభాగాలకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గరిష్ఠ వయోపరిమితిని 21 నుంచి 22 ఏళ్లకు పెంచినట్లు చెప్పారు. ఐటీఐ, డిప్లొమా, ఎన్‌సీసీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఉంటాయన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 2 చివరి గడువని తెలిపారు.

రేపటి నుంచి హైదరాబాద్‌లో బయో ఆసియా-2026

ఈనాడు, హైదరాబాద్: గ్లోబల్ టెక్-బయో రంగంలో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు తెలంగాణ వేదికగా 'బయో ఆసియా-2026' సదస్సు సన్నద్ధమవుతోంది. ఆధునిక వైద్యం, పరిశోధనలకు ఇందులో పెద్దపీట వేయనున్నారు. జీవశాస్త్రంలో వస్తున్న మార్పులు, లైఫ్ సైన్సెస్ రంగంలో నిరంతర వృద్ధిని సాధించడమే లక్ష్యంగా సదస్సులో కీలక చర్చలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా అధునాతన చికిత్సలను సామాన్యుల చెంతకు తీసుకెళ్లడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై దిగ్గజ శాస్త్రవేత్తలు దిశానిర్దేశం చేయనున్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సును ఈ నెల 17న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సుమారు 50 దేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

రోజుకు రూ.8 చెల్లిస్తే.. రూ.60 లక్షల ప్రమాద బీమా

కొత్త పథకాన్ని ప్రారంభించిన ఎస్‌బీఐ

ఈనాడు, హైదరాబాద్: తమ ఖాతాదారుల కోసం ఎస్‌బీఐ కొత్త ప్రమాదబీమా పథకాన్ని ప్రారంభించింది. ఖాతాదారులు ఏడాదికి రూ.3 వేలు చెల్లిస్తే రూ.60 లక్షల బీమా అందిస్తోంది. అంటే రోజుకు రూ.8.2. ఖాతా నుంచి ఈ పథకానికి రూ.3 వేలు తీసుకోవడానికి అంగీకారం తెలపాలి. ఒకసారి అంగీకారపత్రం ఇస్తే ఏటా ఆటోమేటిక్ రెన్యువల్(పొడిగింపు) సౌకర్యాన్ని కల్పిస్తోంది. బీమా తీసుకున్న వ్యక్తి రోడ్డుప్రమాదం, విపత్తులు, పాముకాటు వంటి వాటివల్ల మరణిస్తే.. మరణ ధ్రువీకరణ పత్రాన్ని బ్యాంకులో సమర్పిస్తే రూ.60 లక్షల ప్రమాద బీమా పరిహారాన్ని నామినీ ఖాతాలో జమచేస్తారు. కుటుంబ యజమాని చనిపోతే ఇద్దరు పిల్లల చదువులకు రూ.20 వేల పరిహారం అదనంగా ఇస్తారు. అంత్యక్రియలకు రూ.10 వేలు, అంబులెన్స్‌కి రూ.1500 ఇస్తారు. ఆత్మహత్య చేసుకున్నా, డ్రగ్స్ తీసుకుని మరణించినా, ఇతర ఏ వ్యాధులు సోకి మరణించినా ఈ బీమా వర్తించదు.

4 నగరాలు.. రూ.2 వేల కోట్ల లక్ష్యం

- కొత్త ఆర్థిక సంవత్సరంలో 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'కు కార్యాచరణ
- 3 ఏళ్లలో రూ.6వేల కోట్లతో ప్రజలకు మెరుగైన వసతులు

ఈనాడు, అమరావతి: కొత్త ఆర్థిక సంవత్సరంలో 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' (యూసీఎఫ్) కింద రూ.2వేల కోట్లు సమీకరించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మూడేళ్లలో రూ.6వేల కోట్లతో నగరాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచనున్నారు. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'కు రాష్ట్రంలో రాజధాని అమరావతితోపాటు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలు ఎంపిక చేయనున్నారు. నగరపాలక సంస్థల ద్వారా వీటిలో ప్రజలకు ప్రస్తుతం అందిస్తున్న సేవలు, మెరుగుపరిచేందుకు అవకాశాలు, కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టులపై ప్రాథమిక నివేదికలు రూపొందిస్తున్నారు. నాలుగు నగరాలకు రెండు, మూడు నెలల్లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు సిద్ధం కానున్నాయి.

◆ నగరాల్లో పెరుగుతున్న జనాభాకు తగిన సదుపాయాలు కల్పించేందుకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల సాయం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25% నిధులు కేంద్రం సమకూర్చనుంది. మరో 25% నిధులు రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థలు అందించాలి. మిగిలిన 50% నిధులు రుణాలు, బాండ్ల కింద సమీకరించాలి.

◆ రాష్ట్రంలో ఎంపిక చేయనున్న నాలుగు నగరాల్లో కొత్త ఆర్థిక సంవత్సరం(2026-27)లో చేపట్టబోయే పనుల కోసం కేంద్రం నుంచి రూ.500 కోట్లు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థలు మరో రూ.500 కోట్లు అందించనున్నాయి. ఇతర ఆర్థిక సంస్థల నుంచి 1,000 కోట్లు సేకరించనున్నారు. 2027-28, 2028-29 వరకు ఇదే విధానంలో రూ.2వేల కోట్ల చొప్పున నిధులు సమీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

◆ డీపీఆర్‌ల తయారీ తర్వాత ప్రైవేటు సంస్థలు ప్రాజెక్టుల నిర్వహణకు ముందుకొస్తే పీపీపీ విధానంలో కేటాయించాలని తెలిపింది. ప్రభుత్వం, నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి ప్రాజెక్టు ద్వారా ఎంతో కొంత ఆదాయం తిరిగి వచ్చేలా ప్లాన్ చేయాలని కేంద్రం నిర్దేశించింది. దీనివల్ల రుణం మొత్తాన్ని దశలవారీగా ఆర్థిక సంస్థలకు తిరిగి చెల్లించొచ్చని పేర్కొంది.

సంస్కరణల ఆధారంగా కేంద్రం నిధులు

అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు ఎంపికయ్యే నగరాల్లో కేంద్రం నిర్దేశించిన సంస్కరణలు విధిగా అమలు చేయాలి. వాటి ఆధారంగా కేంద్రం 25% నిధులు విడుదల చేయనుంది. సుపరిపాలన, ప్రజలకు డిజిటల్ సేవలు, సమగ్ర ఆర్థిక నిర్వహణ, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ చర్యల వంటివి సంస్కరణల్లో ఉన్నాయి.

ర్యామ్, చిప్‌ల కొరతతో.. ఎలక్ట్రానిక్ పరికరాల ధరలకు రెక్కలు

- ఏఐ కంపెనీల విస్తరణతో భారీగా ఏర్పాటవుతున్న డేటా సెంటర్లు
- అందుకు అనువైన హెచ్‌బీఎంపై దృష్టిసారిస్తున్న తయారీదారులు
- ఫలితంగా గ్యాడ్జెట్లలో వాడే చిప్‌ల ఉత్పత్తిపై ప్రభావం

ఈనాడు, అమరావతి: మీరు మొబైల్ మార్చాలని.. కొత్త ల్యాప్‌టాప్ కొనాలని.. కంప్యూటర్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవాలని ఆలోచిస్తున్నారా..? ఒక్క నిమిషం ఆగండి. ఈ ఏడాది వాటి ధరలు 5 శాతం నుంచి 20 శాతం వరకు పెరగనున్నాయి. గతంలో ఎన్నడూ చూడనిస్థాయిలో ఎలక్ట్రానిక్స్ రంగం ర్యామ్ (ఆర్ఏఎం), మెమొరీ స్టోరేజ్ చిప్‌ల కొరతతో సంక్షోభాన్ని ఎదుర్కోవడమే ఇందుకు కారణం. ఏఐని ఎక్కువ మంది వినియోగిస్తుండటంతో కృత్రిమ మేధ కంపెనీలు భారీగా విస్తరణ బాట పడుతున్నాయి. డేటా సెంటర్ల నుంచి మెమొరీ చిప్‌లకు అపరిమిత డిమాండ్ కారణంగా వాటి తయారీదారులు ఏఐ కంపెనీలకు సరఫరా చేయడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో సాధారణ వినియోగదారుల కోసం రూపొందించే చిప్‌ల (గ్యాడ్జెట్లలో వినియోగించేవి) సరఫరా తగ్గి అవి ఖరీదైనవిగా మారుతున్నాయి.

93 శాతం వారి చేతుల్లోనే..

ప్రపంచవ్యాప్తంగా ర్యామ్, మెమొరీ చిప్‌లు తయారు చేసే ప్రధాన కంపెనీలు మూడు మాత్రమే ఉన్నాయి. అవి.. దక్షిణ కొరియాకు చెందిన సామ్‌సంగ్, ఎస్‌కే హైనిక్స్, అమెరికాకు చెందిన మైక్రాన్. ఈ మూడు కంపెనీలు కలిసి ప్రపంచంలోని డిర్యామ్ (డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమొరీ) ఉత్పత్తిలో 93 శాతం తమ నియంత్రణలో పెట్టుకున్నాయి. గూగుల్ జెమిని, చాట్ జీపీటీ, ఓపెన్ ఏఐ, మెటా, మైక్రోసాఫ్ట్ కోపైలట్ వంటి ఏఐ సంస్థలకు భారీస్థాయిలో ర్యామ్, స్టోరేజ్ అవసరం. వీటికి సాధారణ ర్యామ్ కాకుండా హెచ్‌బీఎం (హై బ్యాండ్ విడ్త్ మెమొరీ), సోకామ్ మెమొరీ మాడ్యూల్స్ అవసరం. ఈ సంస్థల నుంచి వస్తున్న భారీ ఆర్డర్ల కారణంగా సాధారణ ఫోన్లలో వాడే ర్యామ్ ఉత్పత్తిని ఆయా కంపెనీలు తగ్గించాయి. హెచ్‌బీఎం తయారీపై ఎక్కువగా దృష్టిపెట్టాయి. ర్యామ్, చిప్‌ల కొరతతో మార్కెట్లో వాటి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గత ఏడాది ఆగస్టులో రూ.6 వేలకే దొరికిన మెమొరీ స్టిక్ ఇప్పుడు సుమారు రూ.15 వేలకు చేరింది. డీడీఆర్ 5 మెమొరీ స్టిక్స్ ధరలు ప్రస్తుతం రూ.40 వేల నుంచి ప్రారంభమవుతున్నాయి. 32 జీబీ స్టిక్ ధర అయితే రూ.లక్ష పైనే ఉంది.

స్మార్ట్‌ఫోన్ల ధరలపై తీవ్ర ప్రభావం

ప్రస్తుతం కొత్తగా వచ్చే ఆండ్రాయిడ్ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్లు.. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 ప్రాసెసర్‌తో పనిచేస్తున్నాయి. క్వాల్‌కామ్ ప్రతి చిప్‌పై 30 డాలర్ల మేర ధర పెంచింది. దీనికి ప్రధాన కారణం.. ఏఐ అభివృద్ధి కోసం చేసే పరిశోధనలు, ఎన్‌పీయూ (న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్)పై ఖర్చు పెరగడమే. భారతీయ కరెన్సీలో ఒక చిప్‌సెట్ ధర రూ.25 వేలు ఉంటుంది. దిగుమతి సుంకాలు, పన్నులు కలిపితే ఈ ధర రూ.30 వేల వరకు చేరుతుంది. దీంతో ఫోన్లలో వాడే ర్యామ్, స్టోరేజ్ ధరలు 100% నుంచి 200% వరకు ఎగబాకాయి. రెండేళ్ల వరకు ఈ ప్రభావం ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.


ఈ బడ్జెట్.. రాష్ట్రాభివృద్ధికి సరైన రోడ్‌మ్యాప్

- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను మేళవించి, ప్రజలకు వివరించాలి
- పార్టీ నేతలకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమ మనే మూడు సూత్రాల ఆధారంగా బడ్జెట్ రూపొందించారని అభినందించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సమ్మిళితం చేసి ప్రజలకు తెలియజేయాలని పార్టీ నేతలకు నిర్దేశించారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.3.32 లక్షల కోట్ల వ్యయం, 11.25% వృద్ధిరేటు లక్ష్యంగా బడ్జెట్‌ను ప్రతిపాదించడం సాహసోపేతమైన చర్య. సంక్షేమ పథకాలకు గత కేటాయింపులు కొనసాగిస్తూనే, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు' అని మాధవ్ వెల్లడించారు.

కేంద్ర పథకాలతో మిళితం చేసి..

'గూగుల్ లాంటి దిగ్గజసంస్థల భాగస్వామంతో సుమారు రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులకు ఈ బడ్జెట్ ప్రాధాన్యమిచ్చింది. కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నట్లుగా సెమీ కండక్టర్స్ మిషన్ 2.0, రేర్ ఎర్త్ కారిడార్ వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు ఊతమిస్తుంది. రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యానసాగు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.30వేల కోట్లతో ప్రణాళిక రూపొందించడం అభినందనీయం' అని మాధవ్ తెలిపారు. ప్రగతిశీల ఆలోచనలతో రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఈ బడ్జెట్ కేటాయింపులను, డబుల్ ఇంజిన్ సర్కారు విజయాలను ప్రధాన మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు మాధవ్ సూచించారు.



నిద్రను దెబ్బతీసే అలవాట్లు

మనకు తెలియకుండానే కొన్నిరకాల అలవాట్లు మన నిద్రను దెబ్బతీస్తాయి. అవి.. ✦ మధ్యాహ్నం రెండు తర్వాత తీసుకునే కాఫీలు ✦ నిద్రకు ముందు ఫోన్లో వీడియోలు చూడటం ✦ బాగా పొద్దుపోయాక చేసే భోజనం ✦ వేడిగా ఉండే పడకగది ✦ మద్యం తీసుకోవడం ✦ నిద్రపోయే ముందూ ఒత్తిడితో ఉండటం ✦ రోజూ ఒకే సమయానికి నిద్రపోకపోవడం.

ఈ అలవాట్లు మార్చుకుంటే వారం రోజుల్లోనే మీ శక్తిస్థాయిల్లో మార్పులు చోటుచేసుకుంటాయి.

– మైఖేల్ మొరెలి, ఫిట్‌నెస్ నిపుణుడు

శివరాత్రి వేళ.. పుష్కరాలకు సన్నాహాలు

గోదావరి తీరంలో అధికారుల ట్రయల్ రన్

ఈనాడు, రాజమహేంద్రవరం: వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు సన్నాహక చర్యల్లో భాగంగా.. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా రాజమహేంద్రవరంలో గోదావరి తీరాన భక్తుల రద్దీని అధికారులు శాస్త్రీయంగా అంచనా కట్టారు. నిర్దేశిత ప్రదేశంలో భక్తుల సంఖ్యను ఏఐ సాంకేతికతతో గణించి, రద్దీ నియంత్రణ, బందోబస్తు, పర్యవేక్షణపై ఓ అంచనాకు వచ్చారు. ఇందుకోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 140, అమరావతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ సహకారంతో పుష్కరాల, కోటిలింగాల రేవుల పరిధిలో 30 చొప్పున సీసీ కెమెరాలు అమర్చారు. ఇవి అందించిన చిత్రాలు, వీడియో పుటేజీల ఆధారంగా ఈ రెండు రేవుల వద్దకు 1,45,736 మంది వచ్చినట్లు లెక్కించారు. ఒక్కో ఘాట్‌కు గంటలవారీగా ఎంతమంది వచ్చారో కూడా విశ్లేషించారు. మొత్తంగా మూడు కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా ఈ ప్రక్రియను పర్యవేక్షించారు.

◆ ఘాట్‌ల వద్ద చిన్నారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ట్యాగ్‌లు వేశారు. ఎవరైనా తప్పిపోతే యాప్ ద్వారా వారు ఎక్కడున్నారో గుర్తించవచ్చు. దీనిపై ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆదివారం 80 మంది వాలంటీర్లను నియమించగా, తప్పిపోయిన ముగ్గురు చిన్నారులను వారు వెంటనే తల్లిదండ్రులకు అప్పగించారు.


◆ పోలీసు విధుల కోసం ఈ-డిప్లాయ్‌మెంట్ పేరుతో ప్రత్యేక యాప్‌ను వినియోగించారు. సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశానికి వెళ్లి డ్యూటీ పాస్‌పైనున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. ఈ యాప్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లింది. దీంతో పర్యవేక్షణ సులువైంది.



చిన్నారికి క్యూఆర్ ట్యాగ్ కడుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీరు



కంట్రోల్ రూం నుంచి రద్దీని పరిశీలిస్తున్న రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ రాహుల్



భారత్ × పాకిస్థాన్ మ్యాచ్.. ఎంతో హైప్.. ఎంతో ఉత్కంఠ. క్రికెట్ ప్రపంచం దృష్టంతా అటే. ఎప్పుడు ప్రపంచకప్ జరిగినా ఇదే కథ. కథను కూడా అంతే. కథకు అదే క్లైమాక్స్.. పాకిస్థాన్‌కు అదే వేదన. ఎప్పటిలాగే తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన టీమ్‌ఇండియా.. చిరకాల ప్రత్యర్థిని చిత్తు చిత్తుగా ఓడించింది. మాటలు కట్టిపెట్టి 'మ్యాచ్‌ను బహిష్కరించినా బాగుండు' అనుకుని ఉంటుంది పాకిస్థాన్. అవమానం, అవమానం.. ఎంతో రచ్చ చేసిన ఆ దేశానికి ఇది ఘోర అవమానమే. జట్టు ఇషాన్ కిషన్.. అటు బౌలర్లు రెచ్చిపోయిన వేళ.. కనీస ప్రతిఘటన లేకుండా పాక్ దాసోహమంది.

ఇషాన్ భారత్ హీరో. పిచ్ బ్యాటింగ్‌కు అంత తేలికగా లేకున్నా.. తన సహజశైలిలోనే విరుచుకుపడ్డ ఈ ఓపెనర్ ఓ మెరుపు ఇన్నింగ్స్‌తో.. పాక్ స్పిన్ వ్యూహాన్ని ఛేదించాడు. అతడి శ్రమను బౌలర్లు వృథా పోనివ్వలేదు. పేసర్లో, స్పిన్నర్లో పాక్ లైనప్‌ను మడత పెట్టేశారు. ఛేదనలో చాలా ముందే ఆ జట్టు పనైపోయింది. హ్యాట్రిక్ విజయాలు సాధించిన టీమ్‌ఇండియా.. టీ20 ప్రపంచకప్ సూపర్-8కు దూసుకెళ్లింది.


బాబర్ అజామ్ బౌల్డ్

ఛాంపియన్

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

అఫ్గానిస్థాన్ × యూఏఈ
వేదిక: దిల్లీ, ఉ॥ 11.00

ఇంగ్లాండ్ × ఇటలీ
వేదిక: కోల్‌కతా, మ॥ 3.00

శ్రీలంక × ఆస్ట్రేలియా
వేదిక: పల్లెకెలె, రా॥ 7.00

శివమెత్తిన భారత్

చెలరేగిన ఇషాన్
విజృంభించిన బౌలర్లు

- పాకిస్థాన్ చిత్తు చిత్తు
- సూపర్-8లో టీమ్‌ఇండియా

కొలంబో

టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా వరుసగా మూడో విజయాన్నందుకుంది. ఆదివారం ఏకపక్షంగా సాగిన గ్రూప్-ఎ పోరులో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (77; 40 బంతుల్లో 10×4, 3×6) ధనాధన్ ఇన్నింగ్స్‌తో భారత్ మొదట 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. సయిమ్ అయూబ్ (3/25), తారిఖ్ (1/24) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఛేదనలో పాకిస్థాన్ తేలిపోయింది. బుమ్రా (2/17), హార్దిక్ (2/16), అక్షర్ (2/29), వరుణ్ (2/17) ధాటికి 18 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్ (44; 34 బంతుల్లో 6×4, 1×6) టాప్ స్కోరర్.

చేతులెత్తేసిన పాక్: లక్ష్యం చిన్నదేమీ కాకపోయినా.. అసాధ్యమైంది కూడా కాదు. కానీ పాక్ ఏ దశలోనూ పోటీలో లేదు. ఛేదన మొదలైన పది నిమిషాల్లోనే ఆ జట్టు ఎదురీదాల్సిన పరిస్థితుల్లో నిలిచింది. పాక్ స్పిన్నర్ల హవా సాగిన పిచ్‌పై.. ఆ జట్టు టాప్ ఆర్డర్ వెన్ను విరిచారు భారత పేసర్లు. హార్దిక్ తొలి ఓవర్లోనే ఫర్హాన్‌ను ఔట్ చేస్తే.. బుమ్రా రెండో ఓవర్లో సయిమ్, సల్మాన్ ఆఘాలను వెనక్కి పంపాడు. 13/3తో పాక్ కష్టాల్లో కూరుకుపోయింది. ఆ తర్వాత స్పిన్నర్ల మాయ మొదలైంది. అయిదో ఓవర్లో బాబర్ అజామ్ (5)ను అక్షర్ ఔట్ చేయడంతో పాక్


హార్దిక్ 2/16

34/4తో పరిమితమైంది. ఆ దశలో ఉస్మాన్ ఖాన్, షాదాబ్ (14) నిలబడి, పరిస్థితిని కాస్త చక్కబెట్టారు. ఉస్మాన్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 10 ఓవర్లకు పాక్ స్కోరు 71/4. కానీ అక్షర్ బౌలింగ్‌లో ఉస్మాన్‌ను ఇషాన్ స్టంపౌట్ చేయడంతో పాక్ పతనం మళ్లీ మొదలైంది. తర్వాతి ఓవర్లో నవాజ్‌ను దూబె, ఆ తర్వాతి ఓవర్లో షాదాబ్‌ను తిలక్ వర్మ ఔట్ చేయడంతో 78/7తో పాక్ ఓటమి ఖాయమైపోయింది. మిగతా ఆట లాంఛనమే.

ఒత్తిడి తెచ్చినా..: పరిస్థితుల్లో అంతకుముందు టీమ్‌ఇండియా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బంతి బాగా తిరుగుతున్న పిచ్‌పై పాక్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. భారత బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా టీమ్‌ఇండియా అంత స్కోరు చేసిందంటే కారణం ఇషాన్ ఇన్నింగ్స్. స్ట్రోక్‌ప్లేకు కష్టంగా ఉన్న పరిస్థితిల్లోనూ అతడు చెలరేగిపోయాడు. దూకుడు లోపించినప్పటికీ పరిస్థితుల దృష్ట్యా చూస్తే తిలక్ వర్మ (25; 24 బంతుల్లో 2×4, 1×6), కెప్టెన్ సూర్యకుమార్ (32; 29 బంతుల్లో 3×4)ల ఇన్నింగ్స్ కూడా విలువైనవే. ఆఖర్లో దూబె (27; 17 బంతుల్లో 3×4, 1×6) బ్యాట్ ఝుళిపించాడు. మంచి టర్న్ లభిస్తుండడంతో పాక్.. రికార్డు స్థాయిలో ఆరుగురు స్పిన్నర్లను ఉపయోగించింది. టీ20 ప్రపంచకప్‌లో ఇంతకుముందు ఏ జట్టూ ఆరుగురు స్పిన్నర్లతో బౌలింగ్ చేయించలేదు.

ఇషాన్ ధనాధన్: మందకొడి పిచ్‌పై టీమ్‌ఇండియా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. స్పిన్‌తో బౌలింగ్ దాడిని ఆరంభించిన పాకిస్థాన్ సత్ఫలితాన్ని రాబట్టింది. అస్థిర ప్రదర్శనను కొనసాగిస్తూ.. ఓపెనర్ అభిషేక్ ఖాతా అయినా తెరవకుండానే నిష్క్రమించాడు. సల్మాన్ ఆఘా అతణ్ని ఔట్ చేశాడు. అభిషేక్ స్థానంలో వచ్చిన తిలక్‌ను బ్యాట్ ఝుళిపించకుండా పాక్ బౌలర్లు అడ్డుకోగలిగారు. కానీ సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ఇషాన్ కిషన్‌ను ఆపలేకపోయారు. పరిస్థితులకు సంబంధం లేకుండా అతడు బ్యాట్ ఝుళిపించాడు. బంతి బాగా టర్నవుతున్నా అతడు తనవైన షాట్లు ఆడడానికి వెనుకాడలేదు. షహీన్ అఫ్రిది బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టిన అతడు.. ఆఘా ఓవర్లో ఫోర్, సయిమ్ ఓవర్లో ఫోర్, అబ్రార్ ఓవర్లో 6, 4తో విరుచుకుపడ్డాడు. అబ్రార్ మరో ఓవర్లో వరుసగా రెండు బంతులను బౌండరీ దాటించి అర్ధశతకం (27 బంతుల్లో) పూర్తి చేశాడు ఇషాన్. షాదాబ్‌నూ అతడు వదల్లేదు. అతడి బౌలింగ్‌లో వరుసగా 6, 4 దంచేశాడు. 8.3 ఓవర్లలో 88/2తో భారత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. భారీ స్కోరు దిశగా పరుగులు పెట్టింది. కానీ సయిమ్ అయూబ్ బౌలింగ్‌లో ఇషాన్ బౌల్డ్ కావడంతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఆ తర్వాత పరుగులు అంత తేలిగ్గా రాలేదు. పాక్ స్పిన్నర్లు.. బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడకుండా కట్టడి చేశారు. పరిస్థితులను అర్థం చేసుకున్న సూర్యకుమార్, తిలక్ ఎక్కువగా సింగిల్స్‌కే పరిమితమయ్యారు. అయితే 14 ఓవర్లలో 125/2తో భారత్ బలంగానే కనిపించింది. కానీ ఆ దశలో జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సయిమ్.. వరుస బంతుల్లో తిలక్, హార్దిక్‌లను ఔట్ చేశాడు. సూర్య, దూబె మరీ ధాటిగా బాదకపోయినా.. అయిదో వికెట్‌కు 33 పరుగులు జోడించడం ద్వారా స్కోరు 170 దాటడంలో తమ వంతు పాత్ర పోషించారు. దూబె.. నవాజ్ బౌలింగ్‌లో ఫోర్, అబ్రార్ బౌలింగ్‌లో సిక్స్ బాదేశాడు. మిస్టరీ స్పిన్నర్ తారిఖ్ ఓవర్లోనూ ఓ ఫోర్ కొట్టాడు. అయితే ధాటిగా ఆడే ప్రయత్నంలో తారిఖ్ బౌలింగ్‌లో సూర్య ఔటయ్యాడు. షహీన్ అఫ్రిది వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదడం ద్వారా రింకు (11 నాటౌట్) భారత్‌కు విలువైన పరుగులు అందించాడు.


బుమ్రా 2/17

8 టీ20 ప్రపంచకప్‌లో తొమ్మిది మ్యాచ్‌ల్లో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయాలు.


అక్షర్ 2/29

అంతా స్పిన్‌మయం

కొలంబో అంటే స్పిన్నర్లకు ఎంతో అనుకూలించే మైదానం. ఈ ప్రపంచకప్‌లో అక్కడి పిచ్ మరింతగా స్పిన్నర్లకు సహకరిస్తోంది. దీంతో ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్లు స్పిన్నర్లకే పెద్ద పీట వేశాయి. ఆటంతా స్పిన్ చుట్టూనే తిరిగింది. ఇప్పటిదాకా టీ20 ప్రపంచకప్‌లో ఏ జట్టూ ఓ ఇన్నింగ్స్‌లో ఆరుగురు స్పిన్నర్లతో బౌలింగ్ చేయించలేదు. పాక్ ఈ రికార్డును ఖాతాలో వేసుకుంది. భారత ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌ను ఆరంభించింది స్పిన్ ఆల్‌రౌండరైన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా. అతను కీలకమైన అభిషేక్ వికెట్ తీశాడు. మరో స్పిన్ ఆల్‌రౌండర్ సయిమ్ అయూబ్ 4 ఓవర్లు బౌలింగ్ చేసి 3 కీలక వికెట్లతో అదరగొట్టాడు. ఫాస్ట్‌బౌలర్ షహీన్ అఫ్రిది 2 ఓవర్లు వేసి 31 పరుగులు సమర్పించుకోగా.. మిగతా ఓవర్లన్నీ స్పిన్నర్లే వేశారు. భారత జట్టు ముగ్గురు స్పెషలిస్టు స్పిన్నర్లు వరుణ్, కుల్‌దీప్, అక్షర్‌లను తుది జట్టులో ఆడించింది. వీరికి తోడు పార్ట్ టైమ్ స్పిన్నర్లు తిలక్, రింకు బౌలింగ్ చేశారు. మొత్తంగా ఈ మ్యాచ్‌లో 31 ఓవర్లు వేసిన స్పిన్నర్లు.. 11 వికెట్లు పడగొట్టారు.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (బి) సయిమ్ 77; అభిషేక్ (సి) షహీన్ (బి) ఆఘా 0; తిలక్ ఎల్బీ (బి) సయిమ్ 25; సూర్యకుమార్ (సి) సయిమ్ (బి) తారిఖ్ 32; హార్దిక్ (సి) బాబర్ (బి) సయిమ్ 0; దూబె రనౌట్ 27; రింకు నాటౌట్ 11; అక్షర్ (సి) సయిమ్ (బి) షహీన్ 0; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **175; వికెట్ల పతనం:** 1-1, 2-88, 3-126, 4-126, 5-159, 6-175, 7-175; **బౌలింగ్:** ఆఘా 2-0-10-1; షహీన్ 2-0-31-1; సయిమ్ 4-0-25-3; అబ్రార్ 3-0-38-0; షాదాబ్ 1-0-17-0; నవాజ్ 4-0-28-0, తారిఖ్ 4-0-24-1

పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ (సి) రింకు (బి) హార్దిక్ 0; సయిమ్ ఎల్బీ (బి) బుమ్రా 6; ఆఘా (సి) హార్దిక్ (బి) బుమ్రా 4; బాబర్ (బి) అక్షర్ 5; ఉస్మాన్ (స్టంప్డ్) ఇషాన్ (బి) అక్షర్ 44; షాదాబ్ (సి) దూబె (బి) తిలక్ 14; నవాజ్ (సి) దూబె (బి) కుల్‌దీప్ 4; అష్రాఫ్ (సి) రింకు (బి) వరుణ్ 10; షహీన్ నాటౌట్ 23; అబ్రార్ ఎల్బీ (బి) వరుణ్ 0; తారిఖ్ (బి) హార్దిక్ 0; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (18 ఓవర్లలో ఆలౌట్) **114; వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-13, 4-34, 5-73, 6-78, 7-78, 8-97, 9-97; **బౌలింగ్:** హార్దిక్ 3-1-16-2; బుమ్రా 2-0-17-2; అక్షర్ 4-0-29-2; వరుణ్ 3-0-17-2; కుల్‌దీప్ 3-0-14-1; తిలక్ 2-0-11-1; రింకు 1-0-9-0


ఇషాన్ కిషన్ 77 40 బంతుల్లో 10×4, 3×6

అప్పుడు సచిన్.. ఇప్పుడు కిషన్

శివరాత్రి.. భారత్-పాకిస్థాన్ మ్యాచ్.. ఈ రెండూ కలిపి చదువుకుంటే ముందుతరం క్రికెట్ అభిమానులకు 23 ఏళ్ల ముందు ఓ అద్భుత జ్ఞాపకం కళ్ల ముందు కదలాడుతుంది. 2003 వన్డే ప్రపంచకప్‌లో భారత్, పాక్ మ్యాచ్ జరిగింది మార్చి 1న, శివరాత్రి రోజే. అప్పుడు భారత్ ముందు 274 పరుగుల లక్ష్యం నిలిచింది. ఆ రోజుల్లో అన్ని పరుగుల ఛేదన అంటే సవాలే. కానీ సచిన్ తెందుల్కర్ (75 బంతుల్లో 98) శివమెత్తడంతో పాక్ బౌలింగ్ కకావికలమైపోయింది. షోయబ్ అక్తర్, వకార్ యూనిస్ లాంటి మేటి పేసర్ల బౌలింగ్‌లో మాస్టర్ ఆడిన అప్పర్‌కట్‌లను, మొత్తంగా ఆ ఇన్నింగ్స్‌ను, ఆ మ్యాచ్‌ను అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. ఆదివారం మళ్లీ శివరాత్రి రోజే ప్రపంచకప్ (టీ20)లో భారత్, పాక్ తలపడ్డాయి. సచిన్ ఇన్నింగ్స్‌తో పోల్చలేం కానీ.. ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్‌తో పాక్ బౌలింగ్‌ను ఆటాడుకున్నాడు. భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

11 టీ20 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా సాధించిన విజయాలు. మొత్తంగా ఐసీసీ పరిమిత ఓవర్ల టోర్నీల్లో ఇది వరుసగా 16వ గెలుపు. చివరగా టీమ్‌ఇండియా 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది.

అనుకోకుండా ఒక హీరో

ఈనాడు క్రీడావిభాగం

భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో ఎవరు సత్తా చాటితే.. ఆ రోజుకు అతను ఆ దేశానికి జాతీయ హీరో. పాక్‌తో పోరు అంటే.. కొందరు ఆటగాళ్ల మీద భారీ అంచనాలుంటాయి. ఒకప్పుడు సచిన్ తెందుల్కర్, ఆ తర్వాత విరాట్ కోహ్లి మీద అందరి కళ్లూ ఉండేవి. కానీ 2024 ప్రపంచకప్ గెలిచాక కోహ్లి ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. రోహిత్ కూడా అదే బాటలో సాగాడు. దీంతో ఈసారి జట్టును గెలిపించేదెవరా అని అభిమానులు చూశారు. కానీ పెద్దగా అంచనాలు లేని ఇషాన్ హీరోగా మారాడు.

ఏడాదిగా భారత టీ20 జట్టులో అభిషేక్ శర్మనే అతి పెద్ద స్టార్. పాక్‌తో పోరు ముంగిట కూడా అతడి మీదే అందరి దృష్టి నిలిచింది. కానీ భారీ అంచనాలను తలకిందులు చేస్తూ అతను డకౌటైపోవడంతో జట్టు తీవ్ర ఒత్తిడిలో పడింది. ఈ స్థితిలో ఇషాన్ ఆడిన ఇన్నింగ్స్ భారత అభిమానుల మనసుల్లో చాన్నాళ్ల పాటు నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

అతనొక్కడు ఒకవైపు..: ఈ మ్యాచ్‌లో ఇషాన్ ఒక్కడు ఒకవైపు నిలిస్తే.. రెండు జట్లలోని బ్యాటర్లందరూ ఇంకోవైపు ఉంటారు. నెమ్మదిగా ఉండి, స్పిన్నర్లకు విపరీతంగా సహకరించిన కొలంబో వికెట్‌పై బ్యాటింగ్ ఎంత కష్టంగా సాగిందో మిగతా బ్యాటర్ల గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. మ్యాచ్‌లో ఇషాన్ కాకుండా మరే బ్యాటర్ అర్ధశతకం సాధించలేదు. 20 దాటిన బ్యాటర్లలో ఇషాన్ స్ట్రైక్ రేట్ 192.5 కాగా.. శివమ్ దూబె ఒక్కడే 150 మార్కును దాటాడు. ధాటిగా ఆడే సూర్యకుమార్ 29 బంతులాడి 110 స్ట్రైక్ రేటే నమోదు చేయగలిగాడు. షాట్లు ఆడడానికి అతనెంతో కష్టపడ్డాడు. తిలక్ సైతం అంతే ఇబ్బంది పడ్డాడు. ఇషాన్ ఆడుతున్నపుడు ప్రతి బంతికీ షాట్ ఆడాలని ప్రయత్నించడం, షాట్లు గురి తప్పడం, బంతి గాల్లోకి లేవడం చూసి అభిమానుల్లో అసహనం కలిగి ఉంటుంది. కానీ తిలక్, సూర్య ఆచితూచి ఆడే ప్రయత్నం చేస్తే.. బౌండరీలు రాలేదు. స్కోరు ముందుకు కదల్లేదు. బంతి బాగా స్పిన్ తిరగడం, బ్యాట్ మీదికి రాకపోవడం, ఔట్ ఫీల్డ్ కూడా నెమ్మదిగా ఉండడంతో ఎంత కొట్టినా బౌండరీలు రావడం కష్టమైంది. ఇలాంటి పరిస్థితుల్లో బంతిని అనుసరించి ఆడే పరిస్థితి లేకపోయింది. అడ్డదిడ్డంగా షాట్లు ఆడితే తప్ప బౌండరీలు సాధ్యం కాలేదు. ఇషాన్ అదే పని చేశాడు. అదే సమయంలో కొన్ని కచ్చితమైన షాట్లతో ఫోర్లు, సిక్సర్లు కొట్టిన తీరు అమోఘం. ఇషాన్ క్రీజులో ఉన్నంతసేపు పరిస్థితులు బ్యాటింగ్‌కు ఎంత కష్టంగా ఉన్నాయో అర్థం కాలేదు. తర్వాత బ్యాటర్ల తడబాటు చూస్తే.. తన ఇన్నింగ్స్ విలువ అందరికీ అర్థమైంది. అలా ఆడుతున్నాడేంటి అని ముందు అసహనం చెందిన వాళ్లు కూడా తర్వాత అభిప్రాయం మార్చుకుని ఉంటారు. ఇషాన్ ఇన్నింగ్సే లేకపోతే.. ఏకపక్షం అయ్యేదే కాదు. రెండు జట్ల మధ్య తేడా అతడే.

అంతా అనూహ్యం..: టీ20 ప్రపంచకప్ మొదలవడానికి రెండు నెలల ముందు భారత జట్టు ఛాయల్లోనే లేడు ఇషాన్. రెండేళ్లకు పైగా ఏ ఫార్మాట్లోనూ భారత్‌కు ఆడని అతను.. ప్రపంచకప్‌లో ఆడతాడని అప్పటికి ఎవ్వరూ ఊహించి ఉండరు. కానీ ముస్తాక్ అలీ టోర్నీలో అదరగొట్టడంతో అతడిని ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా న్యూజిలాండ్ సిరీస్, టీ20 ప్రపంచకప్‌నకు ఎంపిక చేశారు. అప్పటికే జితేశ్ జట్టులో ఉన్నప్పటికీ.. ఒకవేళ సంజు గాయపడితే అతడికి ప్రత్యామ్నాయంగా టాప్‌ఆర్డర్లో ఆడే బ్యాటరే కావాలని ఇషాన్‌ను ఎంచుకున్నారు సెలక్టర్లు. కానీ తిలక్ వర్మ శస్త్రచికిత్సతో కివీస్ సిరీస్‌కు దూరం కావడం ఇషాన్‌కు వరమైంది. తుది జట్టులోకి వచ్చాడు. కివీస్‌తో సిరీస్‌లో సెంచరీ కొట్టడంతో పాటు నిలకడగా రాణించడంతో ప్రపంచకప్‌నకు అతనే తొలి ప్రాధ్యాన్య వికెట్ కీపర్ అయిపోయాడు. వరుస వైఫల్యాలతో సంజు పక్కకు వెళ్లిపోయాడు. ఇప్పుడు పాక్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో జాతీయ హీరోగా అవతరించాడు ఇషాన్. ఇలా రెండు నెలల వ్యవధిలో తన కెరీర్ ఊహించని మలుపు తిరిగింది.

పాయింట్ల పట్టిక (గ్రూప్-ఎ)

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
భారత్	3	3	0	0	6	3.050
అమెరికా	4	2	2	0	4	0.788
పాకిస్థాన్	3	2	1	0	4	-0.403
నెదర్లాండ్స్	3	1	2	0	2	-1.352
నమీబియా	3	0	3	0	0	-2.443

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

నేపాల్‌పై ఘనవిజయం

సూపర్-8కు విండీస్


హోల్డర్ 4/27

ముంబయి: టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ దూసుకుపోతోంది. వరుసగా మూడో విజయం సాధించిన ఈ మాజీ ఛాంపియన్ ఈసారి సూపర్-8కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఆదివారం వాంఖడే స్టేడియంలో జరిగిన గ్రూప్-సి పోరులో విండీస్ 9 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' జేసన్ హోల్డర్ (4/27) విజృంభించడంతో మొదట నేపాల్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 133 పరుగులే చేసింది. దీపేంద్రసింగ్ ఐరీ (58; 47 బంతుల్లో 3×4, 3×6) ఆదుకోవడంతో నేపాల్ ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. అనంతరం విండీస్ 15.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ షై హోప్ (61 నాటౌట్; 44 బంతుల్లో 5×4, 3×6), హెట్‌మయర్ (46 నాటౌట్; 32 బంతుల్లో 4×4, 2×6) రెండో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించారు.

అగ్రస్థానంలో విండీస్: గ్రూప్-సిలో మూడు విజయాలతో అగ్రస్థానంలో నిలిచిన వెస్టిండీస్ (6 పాయింట్లు) మిగతా మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా సూపర్-8కు అర్హత సాధించింది. ఇంగ్లాండ్ (4), స్కాట్లాండ్ (2), ఇటలీ (2) పట్టికలో వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ గ్రూపులో మరో జట్టుకు మాత్రమే ఆరు పాయింట్లు సాధించే అవకాశముండటంతో విండీస్ బెర్తు ఖాయమైంది. మూడు మ్యాచ్‌ల్లో 4 పాయింట్లతో ఉన్న ఇంగ్లాండ్ రేసులో ముందుంది. ఆ జట్టు తన చివరి మ్యాచ్‌లో ఇటలీని ఢీకొంటుంది.

సంక్షిప్త స్కోర్లు: నేపాల్: 133/8 (దీపేంద్రసింగ్ 58, సోంపాల్ 26 నాటౌట్, హోల్డర్ 4/27); **వెస్టిండీస్:** 15.2 ఓవర్లలో 134/1 (బ్రాండన్ కింగ్ 22, హోప్ 61 నాటౌట్, హెట్‌మయర్ 46 నాటౌట్)

సత్తా చాటిన సంజయ్

నమీబియాపై అమెరికా గెలుపు


సంజయ్ 68 నాటౌట్

చెన్నై: టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశను అమెరికా విజయంతో ముగించింది. స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసిన ఆ జట్టు.. ఆదివారం గ్రూప్-ఎ పోరులో 31 పరుగుల తేడాతో నమీబియాను ఓడించింది. మొదట అమెరికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. సంజయ్ కృష్ణమూర్తి (68 నాటౌట్; 33 బంతుల్లో 4×4, 6×6), మోనాంక్ పటేల్ (52) సత్తా చాటారు. మైబర్గ్ (2/22), ఎరాస్మస్ (2/27) ఆకట్టుకున్నారు. ఛేదనలో నమీబియా 6 వికెట్లకు 168 పరుగులే చేసింది. లారెన్ స్టీన్‌కాంప్ (58; 39 బంతుల్లో 5×4, 3×6), స్మిట్ (31), ఈటన్ (28) పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. 4 మ్యాచ్‌ల్లో అమెరికాకు ఇది రెండో విజయం. ఆ జట్టు పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. ఆడిన మూడింట్లోనూ ఓడిన నమీబియా సూపర్-8 రేసు నుంచి నిష్క్రమించింది. పాకిస్థాన్ తన చివరి మ్యాచ్‌లో నమీబియా చేతిలో ఓడిపోతే.. అమెరికా సూపర్-8కు అర్హత సాధిస్తుంది.

సంక్షిప్త స్కోర్లు... అమెరికా: 199/4 (సంజయ్ కృష్ణమూర్తి 68 నాటౌట్, మోనాంక్ పటేల్ 52, మిలింద్ కుమార్ 28, జహంగీర్ 22; మైబర్గ్ 2/22, ఎరాస్మస్ 2/27) **నమీబియా: 20 ఓవర్లలో 168/6** (స్టీన్‌కాంప్ 58, స్మిట్ 31, లోఫ్టీ ఈటన్ 28; స్కాల్‌వాక్ 2/30)

రాహుల్, పడిక్కల్ శతకాలు

కర్ణాటక 355/2 ● ఉత్తరాఖండ్‌తో రంజీ సెమీస్

లఖ్‌నవూ: ఉత్తరాఖండ్‌తో రంజీ సెమీస్‌లో కర్ణాటక భారీ స్కోరు దిశగా సాగుతోంది. స్టార్ బ్యాటర్లు కేఎల్ రాహుల్ (141), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (148 బ్యాటింగ్) శతకాలతో కదం తొక్కడంతో తొలి రోజు ఆట ముగిసేసరికి కర్ణాటక 355/2తో నిలిచింది. పడిక్కల్‌కు తోడు కరుణ్ నాయర్ (37) క్రీజులో ఉన్నాడు. జమ్ముకశ్మీర్‌తో మ్యాచ్‌లో బెంగాల్ బ్యాటర్ సుదీప్‌కుమార్ ఘరామి (136 బ్యాటింగ్) అదరగొడుతున్నాడు. అతడు సెంచరీతో సత్తాచాటడంతో.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి బెంగాల్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 249 పరుగులు సాధించింది. అభిమన్యు ఈశ్వరన్ (49), షాబాజ్ (42) రాణించారు.



కరచాలనం లేదు

పాకిస్థాన్‌తో నో హ్యాండ్‌షేక్ విధానాన్ని భారత్ కొనసాగించింది. టాస్ సందర్భంగా పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘాతో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కరచాలనం చేయలేదు. మ్యాచ్ ముగిసిన అనంతరం కూడా రెండు జట్ల ఆటగాళ్లు సహాయ సిబ్బంది హ్యాండ్‌షేక్ చేసుకోలేదు. నిరుడు ఆసియాకప్ నుంచి భారత్-పాక్ క్రికెటర్ల మధ్య కరచాలనం జరగట్లేదు.

అరుంధతి అదరహో

- తొలి టీ20 భారత అమ్మాయిలదే
- వర్ష ప్రభావిత మ్యాచ్‌లో ఆసీస్ ఓటమి


అరుంధతి

సిడ్నీ: నిరుడు వన్డే ప్రపంచకప్ గెలిచాక మరింత ఆత్మవిశ్వాసంతో ఆడుతున్న భారత అమ్మాయిలు.. ఈ ఏడాది జూన్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ కోసం సన్నాహాలను ఘనంగా ఆరంభించారు. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించి మూడు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసింది హర్మన్‌ప్రీత్ సేన. ఆదివారం వర్ష ప్రభావిత తొలి టీ20లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి (4-0-22-4)తో పాటు రేణుక సింగ్ (4-1-14-2), శ్రీ చరణి (3-0-14-2) విజృంభించడంతో ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకే కుప్పకూలింది. జార్జియా వేర్‌హామ్ (30) టాప్‌స్కోరర్. అనంతరం వర్షం వల్ల ఆట ఆగిపోయే సమయానికి భారత్ 5.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. వర్షం పడేలా ఉండడంతో ఓపెనర్ షెఫాలి వర్మ (21; 11 బంతుల్లో 1×4, 2×6) వేగంగా ఆడింది. స్మృతి మంధాన (16), జెమీమా రోడ్రిగ్స్ (9) అజేయంగా నిలిచారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ 21 పరుగుల ముందంజలో ఉన్నట్లు తేలింది.

వైరల్ ఐరా..



ముంబయి: సోషల్ మీడియాలో ఫాలోవర్లను పెంచుకోవడం కోసం ఎంతో శ్రమిస్తుంటారు జనాలు. కొన్నిసార్లు వంద మందిని ఆకర్షించడం కూడా కష్టమే. కానీ ఈ అమ్మాయి మాత్రం అనూహ్యంగా.. రాత్రికి రాత్రి స్టార్ అయిపోయింది. ఆమె ఫాలోవర్ల సంఖ్య ఒక్కసారిగా 3 వేల నుంచి 3 లక్షల 50 వేలకు పెరిగింది. ఇందుకోసం ఆమె చేసిన పనల్లా టీ20 ప్రపంచకప్‌లో భారత్-అమెరికా మ్యాచ్‌కు హాజరు కావడమే. ఈ టీమ్‌ఇండియా అభిమాని పేరు ఐరా రావత్. ఈ నెల 7న మ్యాచ్ చూసేందుకు వాంఖడే స్టేడియానికి వెళ్లింది. ఆమె ఫొటోలు వైరల్ అయ్యాయి. మరునాడు ఉదయానికి ఐరా ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య మూడు వేల నుంచి మూడున్నర లక్షలకు చేరుకుంది. ఐరా.. కోహ్లి, సూర్యకుమార్‌లకు పెద్ద అభిమాని.

పాక్‌పై భారత అమ్మాయిల గెలుపు

బ్యాంకాక్: మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత్ 'ఎ' తొలి విజయాన్ని అందుకుంది. మొదటి మ్యాచ్‌లో యూఏఈ చేతిలో కంగుతిన్న రాధ బృందం.. ఆదివారం 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. మొదట భారత స్పిన్నర్ల ధాటికి పాక్ 18.5 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. షావాల్ (23) టాప్ స్కోరర్. రాధ యాదవ్ (2/11), ప్రేమ (2/16) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. బృంద (55 నాటౌట్; 29 బంతుల్లో 12×4) మెరుపులతో భారత్ 10.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అనుష్క శర్మ (24) రాణించింది.

కేవలం ద్రవం.. ఉపద్రవమే!



ఈ జ్యూస్ తాగితే అందం మీ సొంతం.. ఈ కషాయంతో నెల రోజుల్లో బరువు తగ్గడం ఖాయం. సామాజిక మాధ్యమాలు, ఈ కామర్స్ వెబ్‌సైట్లల్లో ఎక్కడ చూసినా ఇలాంటి వీడియోలు, ప్రకటనలే. వీటికి ఆకర్షితులయ్యేవారు చాలా మందే ఉంటారు. అయితే ఇలాంటి డీటాక్స్ డ్రింకులతో చిక్కులు తప్పవంటున్నారు నిపుణులు.

- తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల బాలుడు కళాశాలకు వెళ్లేలోపు సన్నగా కనిపించాలని భావించాడు. యూట్యూబ్‌లో చూసి గతేడాది దాదాపు మూడు నెలలు కేవలం పండ్ల రసాలే ఆహారంగా తీసుకున్నాడు. ఆహారంలో ఘన పదార్థాలను పూర్తిగా మానేశాడు. మూడు నెలల తర్వాత ఇంట్లో పూజ అనంతరం ఘన పదార్థాలు ఆహారంగా తీసుకున్నాడు. వెంటనే వాంతులు మొదలై, ఊపిరాడక, కుప్పకూలి చనిపోయాడు.

- కేరళకు చెందిన 18 ఏళ్ల యువతి బరువు పెరుగుతాననే భయంతో సరైన ఆహారం తీసుకోకుండా.. తీవ్రమైన వ్యాయామం చేసేది. సామాజిక మాధ్యమాలు, వివిధ వెబ్‌సైట్లలో చూసి ద్రవాహారం ఎక్కువగా తీసుకునేది. క్రమంగా రక్తంలో షుగర్ స్థాయులు పడిపోయి, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తాయి. ఆసుపత్రికి తీసుకెళ్లేటప్పటికి ఆమె బరువు 24 కిలోలే. వెంటిలేటర్‌పై పెట్టినా పరిస్థితి మెరుగుపడక ఆమె ప్రాణాలు కోల్పోయింది.

- కొందరు నిమ్మకాయ-దాల్చిన చెక్క నీరు, గ్రీన్ టీ, యాక్టివేటెడ్ చార్‌కోల్ వాటర్ వంటివి ఎక్కువగా తీసుకుంటున్నారు. వీటి వల్ల తొలుత కొంత బరువు తగ్గినా కొద్దిరోజులకే అలసట మొదలవుతుంది. పూర్తిగా మానేస్తే మళ్లీ బరువు పెరిగిపోవడంతోపాటు జీర్ణవ్యవస్థలో ఇబ్బందులు తలెత్తుతాయి.

- మరికొందరు ఆహారంలో ఘన పదార్థాలకు బదులుగా ఉదయం కొత్తిమీర నీరు, కూరగాయల రసం, మధ్యాహ్న భోజనానికి బదులుగా సూప్, హెర్బల్ టీ తీసుకుంటున్నారు. దీంతో ఫలితం కనిపించినా సాధారణ ఆహారపుఅలవాట్లు ప్రారంభించిన తర్వాత నీరసంతోపాటు గ్యాస్ట్రైటిస్ బారిన పడుతున్నారు. పైగా రెట్టింపు బరువు పెరుగుతున్నారు.

- పచ్చి కూరగాయల పానీయాలు, సలాడ్లు అందరి శరీర తత్వానికి సరిపడవు. జీర్ణవ్యవస్థలో ఇబ్బందులు, కడుపు మంట, ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ తదితర సమస్యలున్నవారు పచ్చివి తీసుకోకూడదు. పాలకూర, దుంపలు వంటి అధిక ఆక్సలేట్ ఆహారాలతో తయారుచేసిన రసాలను పెద్దమొత్తంలో తాగితే మూత్రపిండాల సమస్యలు వచ్చే అవకాశముంది.

- చాలా వరకు డీటాక్స్ పానీయాల్లో ప్రొటీన్లు, కొవ్వులు, కార్బొహైడ్రేట్లు ఉండవు. దాంతో ఇవి రోజువారీ కార్యకలాపాలకు సరిపడా శక్తిని అందించలేవు. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లను అందించినప్పటికీ సమతుల ఆహారాన్ని భర్తీ చేయలేవు.

- కొవిడ్ సమయంలో చాలా మంది రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి విపరీతంగా కషాయాలు తీసుకున్నారు. అది చాలా మందిలో తీవ్రమైన హెపటైటిస్, కాలేయ వైఫల్యానికి దారి తీసింది.

- గ్రీన్‌టీ మితంగా తాగితే యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. అదే అధిక మొత్తంలో తీసుకుంటే.. కాలేయానికి హాని కలిగిస్తుంది.

- కొన్ని జ్యూస్‌లు బ్యాక్టీరియా నిర్మూలనకు ఉపయోగపడకపోగా.. పిల్లలు, వృద్ధులు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిలో తీవ్ర సమస్యలకు దారి తీస్తాయి. నిర్జలీకరణం పెరిగి.. ఎలక్ట్రోలైట్ అసమతౌల్యతకు దారి తీస్తుంది.

అది సహజ ప్రక్రియ..

శరీరాన్ని ప్రత్యేకంగా డీటాక్స్ చేయాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. రోజువారీ పనితీరులో భాగంగా మూత్రపిండాలు, చర్మం, కాలేయం, ఊపిరితిత్తులు మలినాలను తొలగిస్తాయి. డీటాక్స్ డ్రింక్స్ బరువు తగ్గేందుకు పనిచేస్తాయనే వాదనలు నిరూపించేందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వారు స్పష్టం చేస్తున్నారు. వాటి కంటే వ్యాయామం, మంచి నిద్ర, సరైన పోషకాహారం తీసుకోవడం కీలకమని చెబుతున్నారు.

- నిజంగా బయటకు వెళ్లలేనంతగా శరీరంలో మలినాలు పేరుకుపోతే ఎలాంటి పానీయాలు పనిచేయవు. దీనిని వైద్యపరంగా నయం చేసుకోవాలి.
- అధిక కొవ్వులు, చక్కెరలు, ఆల్కహాల్ తీసుకోకుండా.. మితంగా తింటే మేలు.
- తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తింటే డీటాక్స్ ఉత్పత్తులు అందించే అన్ని ప్రయోజనాలనూ పొందే అవకాశముంది.

ఆరోగ్యంగా ఉంటే అవసరం లేదు...

ఆరోగ్యంగా ఉండే వ్యక్తులకు ఎలాంటి డీటాక్స్ జ్యూస్‌లు అవసరం లేదు. గ్యాస్, ఎసిడిటీ, కడుపుబ్బరం, నిద్రలేమి తదితర సమస్యలున్నవారు నిపుణుల సలహాతో కొన్నింటిని తీసుకోవచ్చు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే విటమిన్ సి ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచిస్తాం. కడుపుబ్బరం ఉంటే జీలకర్ర, వాము, ధనియాలు ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది. గ్యాస్ట్రిక్ సమస్య ఉంటే సోంపు, జీలకర్ర బాగా పనిచేస్తాయి. వీటితోపాటు సమతులాహారం తీసుకోవాలి.

– కస్తూరి కృష్ణవేణి, న్యూట్రిషనిస్టు

- ఈనాడు, విశాఖపట్నం

రాజావారి కోట కాదిది.. పోలీసు ఠాణానే



రాజుల కాలంలోని కోట తరహాలో కనిపిస్తున్న ఈ భవనం పోలీస్‌స్టేషన్ అంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. కాకినాడ జిల్లాలోని కోటనందూరు ఠాణా ఇది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి సమీపంలో ఉంటుంది. దృఢమైన రాళ్లతో, ఎత్తయిన గోడలతో ఇలా నిర్మించడం వెనుక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. మూడు దశాబ్దాల క్రితం రౌతులపూడి, నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో నక్సల్స్ ప్రాబల్యం తీవ్రంగా ఉండేది. దీంతో మావోయిస్టుల దాడులను తట్టుకునేలా, భద్రతే ప్రధాన లక్ష్యంగా ఈ విధంగా నిర్మించారు. 2001 మార్చి 9న శంకుస్థాపన చేయగా మరుసటి ఏడాది ఏప్రిల్ 9న నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం తగ్గినా ఇక్కడి నుంచి సేవలు అందిస్తున్నారు. మిగతా పోలీస్‌స్టేషన్లలో ఉన్నట్టు లాకప్ రూంలు, ఫిర్యాదుల స్వీకరణ, సీసీటీవీల పర్యవేక్షణ, రికార్డుల గదులు ఉన్నాయి.

– న్యూస్‌టుడే, కోటనందూరు


గుట్టల్లో మొలకెత్తిన మొక్కులు

భక్తుల విశ్వాసాలు పలు రకాలుగా ఉంటాయి. భగవంతుడు కొలువైన చోటును బట్టి పూజా విధానాలు, మొక్కులు నిర్వహిస్తుంటారు. అదే కోవలో గుట్టలు, కొండల్లో కొలువైన దేవుళ్ల వద్దకు వెళ్లినప్పుడు రాళ్లు పేర్చడం ఆనవాయితీగా ప్రసిద్ధికెక్కింది. ఆదివారం మహా శివరాత్రిని పురస్కరించుకుని తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు పక్కనే ఉన్న నాంపల్లి గుట్ట, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని బగుళ్ల శివాలయానికి భక్తులు పోటెత్తగా.. సమీపంలో వందల మంది రాళ్లు పేర్చడంతో ఆ ప్రాంతాలు రాళ్ల వనంలా మారిపోయాయి.



- ఈనాడు, కరీంనగర్

కర్నూలులో నల్లరెక్కల తెల్లడేగ



కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణ శివారులోని పంట పొలాల్లో నల్లటి రెక్కల తెల్ల డేగ కనిపించింది. రైతులు దీన్ని తమ నేస్తంలా భావిస్తారు. పంటలకు హాని చేసే ఎలుకలు, మిడతలు తదితర పురుగులను ఇది తినేస్తుంది. దీన్ని 'బ్లాక్ షోల్డర్డ్ కైట్' అంటారు. తెలుగులో 'రామదాసు' పక్షి అంటారని కర్నూలులోని కేవీఆర్ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకురాలు హేమలత తెలిపారు. ఆఫ్రికాలో ఎక్కువగా ఉండే ఈ విహంగం మన దేశంలోని సిక్కిం, నాగాలాండ్‌లలోనూ అక్కడక్కడ కనిపిస్తాయన్నారు. మన రాష్ట్రంలో వీటి ఉనికి అత్యంత అరుదని తెలిపారు.

- ఈనాడు, కర్నూలు



డ్రోన్.. విత్తనమేసెన్!

వ్యవసాయంలో డ్రోన్ల ద్వారా ఇప్పటివరకు పంటలపై పురుగు మందులు మాత్రమే పిచికారీ చేసేవారు. తొలిసారిగా తెలంగాణలోని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డ్రోన్‌లో కొన్ని మార్పులు చేసి ప్రయోగాత్మకంగా నువ్వుల విత్తనాలు వేశారు. ఈ పద్ధతి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే కూలీల కొరతను అధిగమించవచ్చని, రైతులకు మేలు జరుగుతుందని శాస్త్రవేత్త రాంగోపాల్‌వర్మ అంటున్నారు. వరుసకు వరుసకు మధ్య 30 సెం.మీ., మొక్కల మధ్య 8 నుంచి 10 సెం.మీ. దూరం వచ్చేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. సాధారణంగా ఎకరం భూమిలో రైతులు విత్తాలంటే ఒక రోజు పడుతుండగా, డ్రోన్‌తో అరగంటలోనే ఈ పని పూర్తయినట్లు వివరించారు. – ఈనాడు, ఆదిలాబాద్

రాకింగ్.. రామసుబ్బమ్మా!



జీవితంలో గెలవాలంటే ఏ వయసులోనైనా ప్రయత్నించి, విజయం సాధించొచ్చు అనడానికి ఈ బామ్మే ఉదాహరణ. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన 78 ఏళ్ల రామసుబ్బమ్మ గతంలో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా పనిచేసేవారు. ఆ సమయంలో ఆటల పోటీలు చూస్తూ తానూ పతకాలు సాధించాలని సంకల్పం తీసుకున్నారు. అలా 2016 నుంచి వెటరన్ క్రీడాకారిణిగా 500, 800, 1500 మీటర్ల పరుగు పందేలతోపాటు 3 వేల మీటర్ల నడక పోటీల్లోనూ పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయస్థాయుల్లో 12 బంగారు, 8 రజత పతకాలు సాధించారు. అలా అని రామసుబ్బమ్మకు ఆర్థిక దన్ను ఉందనుకున్నా పొరపాటే. ప్రస్తుతం జీవనం సాగడానికి తెలిసిన వారి ఇళ్లలో పని చేసుకుంటూనే అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నారు. అధికారుల సూచనతో పాస్‌పోర్ట్ కూడా సిద్ధం చేసుకున్నారు. భర్త చనిపోయారని, కుమారుడు నెల్లూరులో ఉద్యోగం చేసుకుంటున్నాడని ఆమె తెలిపారు.

– ఈనాడు-నెల్లూరు; న్యూస్‌టుడే-కావలి రూరల్

EENADU Vol: 52, Issue: 187 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



తులం బంగారం రూ.లక్ష లోపునకు?



- అంతర్జాతీయంగా ఔన్సు 3,000 డాలర్ల దిగువకు
- అమెరికా డాలర్లలో రష్యా వ్యాపారాన్ని పునఃప్రారంభిస్తేనే

బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల (తులం) మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు.

అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్ర బ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి.

పసిడి నిల్వల్లో 20% బ్రిక్స్ వద్దే

అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20% బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50% వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ విభజన



దిల్లీ: బర్మన్ కుటుంబ నేతృత్వంలోని రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ (ఆర్‌ఈఎల్) తన ఆర్థిక సేవలు, బీమా వ్యాపారాలను విడివిడి నమోదిత సంస్థలుగా విభజించే ప్రణాళికను ఆమోదించింది. ఇందువల్ల వాటాదార్ల విలువ పెరుగుతుందని పేర్కొంది. 2025 ఫిబ్రవరిలో ఆర్‌ఈఎల్‌ను బర్మన్ స్వాధీనం చేసుకున్నాక, ఈ సంస్థ ప్రకటించిన తొలి ప్రధాన పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదన ఇదే. దీని ప్రకారం..

● కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ లిమిటెడ్‌లో ఆర్‌ఈఎల్ వాటా నిలుపుకుంటుంది. ఇది బీమా కేంద్రీకృత సంస్థగా కొనసాగుతుంది. రుణాలు, బ్రోకింగ్, పెట్టుబడి కార్యకలాపాలు, సంబంధిత మద్దతు సేవలను కలిగి ఉన్న ఆర్థిక సేవల వ్యాపారం - అనుబంధ సంస్థ రెలిగేర్ ఫిన్‌వెస్ట్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌ఎల్)కు బదిలీ అవుతుంది. ఇది కూడా స్వతంత్ర, నమోదిత సంస్థగా మారుతుంది.

● ఈ ప్రక్రియలో భాగంగా, ఆర్‌ఈఎల్ వాటాదార్లకు ఆర్‌ఎఫ్‌ఎల్ ఈక్విటీ షేర్లు 1:1 ప్రాతిపదికన లభిస్తాయి. అంటే రికార్డు తేదీ నాటికి వాటాదారుల వద్ద ఉన్న ప్రతి ఆర్‌ఈఎల్ షేరుకు, ఒక ఆర్‌ఎఫ్‌ఎల్ షేరు లభిస్తుంది. ఆర్‌ఎఫ్‌ఎల్ షేరు బీఎస్‌ఈ-ఎన్‌ఎస్‌ఈలలో నమోదవుతుంది. ఆర్‌ఎఫ్‌ఎల్ షేరు యాజమాన్య విధానం అంతా, ఆర్‌ఈఎల్ తరహాలోనే ఉంటుంది.

● 2027-28 తొలి త్రైమాసికం నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి ఆర్‌ఎఫ్‌ఎల్ షేరును స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయాలని గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది.

చమురు, సహజవాయువులో అమ్మకాలు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి




పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.1,55,463 కంటే దిగువన ట్రేడయితే... దిద్దుబాటుకు అవకాశం ఉంటుంది. అయితే రూ.1,50,675 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,45,150; రూ.1,40,383కు దిగిరావచ్చు. రూ.1,58,225 కంటే పైన కదలాడితే సానుకూల ధోరణికి అవకాశం ఉంటుంది. రూ.1,60,987 స్థాయిని అధిగమిస్తే రూ.1,65,744; రూ.1,71,299 వరకు పెరగొచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు రూ.2,33,542 కంటే కిందకు వస్తే.. రూ.2,19,739; రూ.2,08,439 వరకు నష్టపోవచ్చు. ఈ స్థాయి నుంచి తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపడం మంచిది. ఒకవేళ రూ.2,85,324 ఎగువన చలిస్తే.. రూ.3,21,149 వరకు వెళ్లొచ్చు.

ప్రాథమిక లోహాలు



● రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.1,171.75 కంటే కిందకు వస్తే రూ.1,132.05 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.1,261.35 కంటే పైన కదలాడితే రూ.1,311.15 వరకు చేరొచ్చు.

● సీసం ఫిబ్రవరి కాంట్రాక్టులో లాభాల స్వీకరణ కొనసాగొచ్చు. రూ.186.15 లక్ష్యంతో రూ.191.15 సమీపంలో కాంట్రాక్టును షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహమే అవుతుంది.

● జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.318.65 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే, మరింతగా పెరిగే వీలుంది. అందువల్ల ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు.

● అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.315.65 కంటే పైన చలిస్తే రూ.322.05; రూ.327.85 వరకు వెళ్లొచ్చు. రూ.303.45 కంటే దిగువన ట్రేడయితే.. రూ.297.65; రూ.291.25 వరకు దిద్దుబాటు కావచ్చు.

ఇంధన రంగం



● ముడి చమురు మార్చి కాంట్రాక్టుకు రూ.5,961 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే.

● సహజవాయువు ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.327 కంటే దిగువన కదలాడితే.. మరింతగా దిద్దుబాటు కావచ్చు. అయితే రూ.254 వద్ద కొంత మద్దతు లభించొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఏప్రిల్ కాంట్రాక్టు సానుకూల ధోరణిలో కదలాడితే రూ.16,098 వద్ద నిరోధం ఎదురు కావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.16,841; రూ.17,432 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.14,764 కంటే కిందకు వస్తే రూ.14,173; రూ.13,431 వరకు దిద్దుబాటు కావచ్చు.

● జీలకర్ర మార్చి కాంట్రాక్టుకు రూ.22,500 వద్ద మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.22,045; రూ.21,430 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.23,570 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీనిని అధిగమిస్తే రూ.24,185; రూ.24,640 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

- ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/క్షీణత
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఏప్రిల్)	1,56,000	1,56,200	0.13
వెండి (మార్చి)	2,59,887	2,44,999	-5.73
రాగి (ఫిబ్రవరి)	1,245	1,211.50	-2.69
సీసం (ఫిబ్రవరి)	189.25	187.40	-0.98
జింక్ (ఫిబ్రవరి)	322.45	324.40	0.60
అల్యూమినియం (ఫిబ్రవరి)	312.90	309.25	-1.17
ముడి చమురు (మార్చి)	5,811	5,732	-1.36
సహజ వాయువు (ఫిబ్రవరి)	315	296.90	-5.75
పసుపు (ఏప్రిల్)	16,072	15,356	-4.45
జీలకర్ర (మార్చి)	23,700	22,955	-3.14

కృత్రిమ మేధలో అగ్రస్థానం భారత్ లక్ష్యం!



నేటి నుంచి దిల్లీలో 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'

ప్రపంచంలో విద్యుత్తు ఆవిష్కరణ, తర్వాత అంతటి సంచలనాత్మకమైనదిగా, ప్రస్తుత వ్యవస్థలపై అమిత ప్రభావం/అంతరాయం కల్పించేదిగా పరిగణిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ)పై ఉన్నతస్థాయి ప్రభుత్వ నేతలు, పరిశ్రమ అగ్రగాములు పాల్గొనే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు మన దేశం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 16-20 తేదీల్లో, దిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఈ సదస్సులో, వివిధ దేశాలు తమ ఏఐ ఎజెండాను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

● కృత్రిమ మేధ.. పరిశోధనా ప్రయోగశాలలు, బోర్డు రూమ్‌లను దాటి బాగా అభివృద్ధి చెందింది. ఇది ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల తీరును పునర్నిర్మిస్తోంది. వ్యవసాయాన్నీ మారుస్తోంది. ఆర్థిక మార్కెట్లను, విద్యా వ్యవస్థలను పునర్ నిర్వచిస్తోంది. కార్పొరేట్ వ్యూహాలను తిరిగి రాస్తోంది.

● మన దేశం విషయానికొస్తే ఈ సమ్మిట్ కేవలం భాగస్వామిగా ఉండటమే కాకుండా, ఏఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో కీలకంగా ఉండాలనే ఉద్దేశాన్ని నొక్కి చెబుతోంది. ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో అగ్రస్థానం సంపాదించడం, కృత్రిమ మేధ అభివృద్ధి తదుపరి దశను రూపొందించడంలో సాయపడటం దీని ప్రధాన లక్ష్యం. 'ఏఐతో ఏం జరిగినా అది మానవ కేంద్రీకృతమై ఉండాలి. ఏఐ వనరులకు ప్రజాస్వామ్యబద్ధంగా అనుసంధానం కాగలగాలి. ఈ ప్రక్రియలో ప్రజలు కేంద్రంగా ఉండేలా చూడాల'ని ఐటీ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వెల్లడించారు.

దేశాధినేతలు పాల్గొంటున్నారు

ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాతో పాటు అనేక మంది ప్రపంచ నాయకులు ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు హాజరు కానున్నారు. ఈ దేశాధినేతల హాజరు ఏఐ ఎజెండా చుట్టూ ఉన్న ఉన్నత స్థాయి అంతర్జాతీయ ఆసక్తిని నొక్కి చెబుతోంది. 45కు పైగా దేశాల నుంచి మంత్రుల ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి, అనేక అంతర్జాతీయ సంస్థల నుంచి ఉన్నతాధికార్లు కూడా ఈ చర్చల్లో పాల్గొంటారు.

ప్రధాని మోదీ ఈ సమ్మిట్‌లో ప్రసంగిస్తారు. ఎక్స్‌పోను సందర్శిస్తారు. ప్రముఖ కంపెనీల సీఈఓలతో మాట్లాడతారు. గతంలో యూకేలోని బ్లెచ్లీ పార్క్‌లో ఏఐ భద్రతా సమ్మిట్ (2023), సియోల్ సమ్మిట్ (2024), పారిస్ సమ్మిట్ (2025)లు సరిహద్దు ప్రమాదాలు, భద్రతా రక్షణలు, స్వచ్ఛంద నిబద్ధతలకు గణనీయ ప్రాధాన్యమిచ్చాయి. మన దేశం మాత్రం ఏఐ అభివృద్ధి ప్రభావం, ఆర్థిక వృద్ధి, సామాజిక చేరికపై దృష్టి సారిస్తోంది.

7 థిమాటిక్ వర్కింగ్ గ్రూపులు.. ఏఐ కామన్స్ కోసం ప్రతిపాదనలు, విశ్వసనీయ ఏఐ సాధనాలు, షేర్డ్ కంప్యూట్ మౌలిక సదుపాయాలు, ఏఐ వినియోగ కేసుల రంగాల వారీ నిర్దిష్ట సంకలనాలతో పాటు స్పష్టమైన డెలివరీలను అందించనున్నాయి. ఈ పెద్ద థీమ్స్‌ను సమ్మిట్‌లో ప్రధానంగా పరిశీలించాల్సి ఉంటుంది.

700కు పైగా సెషన్లు

ఇక్కడ అయిదు రోజుల పాటు 700కు పైగా శక్తిమంత సెషన్లు నిర్వహిస్తారు. ఇవి ఏఐ భద్రత, పాలన, నైతిక వినియోగం, డేటా రక్షణ, సార్వభౌమ ఏఐపై మన దేశం విధానం, వ్యూహాత్మక రంగాలకు స్వదేశీ పునాది నమూనాల అభివృద్ధిపైనా చర్చిస్తారు. ఏఐ, భవిష్యత్ పనిపై విస్తృతంగా చర్చించనున్నారు. మన దేశంలో 35 ఏళ్లలోపు వారు 65% మంది ఉన్నారు. కొత్త యుగంలో దేశానికి వీరు గణనీయ ప్రాధాన్యత తీసుకొస్తున్నారు. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కులైన శ్రామిక శక్తి కలిగిన దేశాల్లో మనదేశం ఒకటి. మన దేశ ఏఐ నిబంధనావళి, ఆవిష్కరణల సమతౌల్యం, నియంత్రణ, ఇటీవల సవరించిన ఐటీ నిబంధనలు, ఏఐ సృష్టించిన కంటెంట్‌పై ఎలా వ్యవహరించాలి, డీప్‌ఫేక్‌లు, ఏఐతో తప్పుడు సమాచార వ్యాప్తి వంటి వాటిపైనా చర్చలు జరగనున్నాయి.

ఈ ప్రముఖులంతా

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్, డీప్‌మైండ్ టెక్నాలజీస్ సీఈఓ డెమిస్ హస్సాబిస్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమొడె, మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్‌స్మిత్‌తో పాటు ఇంకా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

మేఘా గ్రూప్‌లోకి జేడీ లక్ష్మీనారాయణ



హైదరాబాద్: మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాజీ ఐపీఎస్ అధికారి వి.వి. లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా చేసినప్పటి నుంచి జేడీ లక్ష్మీనారాయణగా ఆయన ప్రసిద్ధులు. 1990 మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన లక్ష్మీనారాయణ విధుల్లో నిబద్ధతతో వ్యవహరిస్తూ, సంచలనాలకు కారణమయ్యారు. విద్యార్హతల్లో మెకానికల్ ఇంజినీరింగ్‌ను వరంగల్ ఎన్ఐటీలో, ఎంటెక్‌ను ఐఐటీ మద్రాస్‌లో ఆయన అభ్యసించారు. మేఘా గ్రూప్‌లోని విద్యుత్ వాహనాల నమోదిత సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ అనుబంధ సంస్థే ఈవీ ట్రాన్స్. వివిధ రాష్ట్రాలకు ఒలెక్ట్రా సంస్థ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో సరఫరా చేస్తున్న విద్యుత్ బస్సులకు అవసరమైన ఛార్జింగ్ వ్యవస్థలు నిర్మించడంతో పాటు ఆయా బస్సుల నిర్వహణ బాధ్యతలన్నీ చూసేదే ఈవీ ట్రాన్స్. ప్రస్తుతం 900కు పైగా బస్సులను ఈ సంస్థ నిర్వహిస్తోంది.

కోడి గుడ్డు — 16న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	520	తూ.గోదావరి	515
వరంగల్	522	విశాఖపట్నం	515
విజయవాడ	525	చిత్తూరు	593

ఈ వారమూ బేర్‌మనక తప్పదా?

స్టాక్ మార్కెట్ ఈ వారం

- సూచీల్లో ఒత్తిడి కొనసాగొచ్చు
- ఐటీ షేర్లలో ఊగిసలాటకు అవకాశం
- ఏఐ సదస్సు ప్రకటనలు కీలకం
- విశ్లేషకుల అంచనాలు



స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏఐ టూల్స్ నుంచి ప్రమాదం పొంచి ఉందన్న భయాందోళనల మధ్య ఐటీ షేర్లలో ఊగిసలాటలు వెంటాడొచ్చు. లోహ షేర్లకు అంతర్జాతీయంగా ఒత్తిడి ఎదురవుతోంది. దేశీయంగా బ్యాంకింగ్, వాహన, వినియోగ రంగాల వైపు మదుపర్లు మొగ్గుచూపొచ్చు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పంద సానుకూలతలను, ఏఐ టూల్స్ భయాలు తుడిచిపెట్టినట్లయిందని సాంకేతిక నిపుణులు అంటున్నారు. సోమవారం నుంచి దిల్లీలో మొదలయ్యే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. నిఫ్టీ-50కి 25,500 వద్ద నిరోధం ఎదురు కానుందని, 25,100 వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● ఇటీవలి నష్టాల నేపథ్యంలో పుంజుకోవడానికి ముందు **ఐటీ** షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. ఏఐ సమ్మిట్‌లో ప్రకటనలూ ప్రభావితం చేయొచ్చు. ఐటీ సూచీ 30,900 స్థాయి దిగువకు వస్తే మధ్యకాలానికి ప్రతికూలతలు కనిపించొచ్చు.

● కమొడిటీ ధరల్లో ఊగిసలాటల ప్రభావం **లోహ**, గనుల కంపెనీల షేర్లలో కనిపించొచ్చు. చైనా కొత్త సంవత్సర సెలవుల ప్రభావంతో పారిశ్రామిక గిరాకీ తగ్గొచ్చు. అమెరికా ఫెడ్ పరపతి విధాన అనిశ్చితుల ప్రభావమూ లోహ ధరలపై కనిపించొచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి 11,730-11,540 వద్ద మద్దతు లభించొచ్చు.

● డిసెంబరు త్రైమాసిక ఫలితాల్లో అంచనాలకు మించి బలహీనతలను ప్రదర్శించడంతో, **యంత్రపరికరాల** షేర్లు ఒక శ్రేణిలో చలించొచ్చు. అయితే ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు అధిక వ్యయాలు చేస్తాయన్న ఆశల వల్ల నష్టాలు పరిమితంగానే ఉండొచ్చు.

● నిఫ్టీ **బ్యాంక్** సూచీ ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. చాలా తక్కువ శ్రేణిలో చలించొచ్చు. ప్రధాన బ్యాంకుల ఫలితాలు రావడంతో తాజా సంకేతాల కోసం మదుపర్లు ఎదురు చూస్తున్నారు.

● **సిమెంటు** షేర్లు ఈ వారం లాభాలందించొచ్చు. సీజనల్ గిరాకీ మెరుగవడం ఇందుకు నేపథ్యం. అల్ట్రాటెక్ సిమెంట్ సమీప కాలంలో రాణించొచ్చు. పెరుగుతున్న నిర్వహణ సామర్థ్యం వల్ల రామ్‌కో సిమెంట్స్ షేరుకు సానుకూలతలు రావచ్చు.

● **టెలికాం** కంపెనీల షేర్లు స్వల్పకాలంలో స్థిరంగా కొనసాగొచ్చు. ఈ రంగంలో బలమైన నిధులున్నందున, వాటిని కంపెనీలు వేటికి కేటాయిస్తాయన్నదానిపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. జియో పబ్లిక్ ఇష్యూకు వస్తుండడం ఈ రంగానికి కలిసొచ్చే అంశం.

● బలహీన డిసెంబరు త్రైమాసిక ఫలితాల నడుమ, నిఫ్టీ **ఫార్మా** ఈ వారమూ స్థిరీకరణకే లోనుకావొచ్చు. ప్రస్తుతానికి ఔషధ ఎగుమతులపై అమెరికా టారిఫ్ నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ.. స్పష్టత కోసం వాణిజ్య ఒప్పందం అధికారిక అమలు కోసం ఈ రంగం ఎదురుచూస్తోంది.

● అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం అనంతరం నిఫ్టీ **ఆటో** తన దిద్దుబాటు స్థిరీకరణ నుంచి బయటపడి, బులిష్ సెంటిమెంటు వైపు పయనిస్తోంది. అశోక్ లేలాండ్‌లో స్ట్రక్చరల్ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. బజాజ్ ఆటో, టాటా మోటార్స్ షేర్లనూ పరిశీలించొచ్చని చెబుతున్నారు.

● **చమురు**-గ్యాస్ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. డెయిలీ చార్టుల్లో స్వల్పకాల బలహీనతలు కనిపిస్తుండడం ఇందుకు నేపథ్యం. నిఫ్టీ ఆయిల్-గ్యాస్‌కు తక్షణ మద్దతు 11,850 వద్ద, కీలక నిరోధం 12,200 వద్ద కనిపిస్తోంది.

● **ఎఫ్ఎమ్‌సీజీ** షేర్లు నష్టాలను కొనసాగించొచ్చు. హెచ్‌యూఎల్ బలహీన ఆర్థిక ఫలితాలతో తాజా విక్రయాల ఒత్తిడి కనిపిస్తోంది. ఈ కంపెనీ నుంచి విభజనకు గురైన క్వాలిటీ వాల్స్ షేర్లు సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానున్నాయి.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	204.63	216.20	198.00
బజాజ్ ఆటో	9760.00	9974.00	9613.00
ఐషర్ మోటార్స్	8065.00	8256.00	7791.00
హీరో మోటోకార్ప్	5584.00	5787.30	5458.30
ఎం అండ్ ఎం	3533.40	3626.30	3473.90
మారుతీ	15237.00	15531.00	15043.00
టాటా మోటార్స్	483.75	505.40	470.70
టీవీఎస్ మోటార్	3864.60	3925.40	3801.80

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5980.50	6146.20	5885.20
కోల్గేట్ పామోలివ్	2122.20	2147.10	2088.10
డాబర్ ఇండియా	512.45	522.70	505.00
ఇమామీ	489.60	500.60	481.70
హిందుస్థాన్ యునిలీవర్	2305.20	2434.90	2235.50
ఐటీసీ	313.75	320.30	310.00
మారికో	760.15	777.30	749.30

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	255.75	265.10	250.10
సీజీ పవర్	680.15	691.80	665.60
ఎల్ అండ్ టీ	4173.90	4233.90	4104.10
సీమెన్స్	3116.50	3229.40	3026.60
థెర్మాక్స్	2886.70	2989.00	2698.60

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	903.90	938.20	883.80
ఐసీఐసీఐ బ్యాంక్	1414.60	1443.60	1396.20
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	81.54	83.60	79.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	926.05	946.40	893.20
కోటక్‌మహీంద్రా బ్యాంక్	420.65	432.40	413.70
పీఎన్‌బీ	118.76	121.20	117.10
ఎస్‌బీఐ	1198.60	1211.20	1178.20

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1145.60	1173.90	1112.70
బయోకాన్	377.95	389.70	362.50
సిప్లా	1331.50	1348.10	1307.50
డాక్టర్ రెడ్డీస్	1268.10	1286.00	1254.60
గ్లెన్‌మార్క్ ఫార్మా	1997.60	2068.40	1956.60
నాట్కో ఫార్మా	823.85	841.00	810.50

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	909.00	945.90	882.60
హిందుస్థాన్ కాపర్	591.65	624.60	568.60
ఎన్ఎమ్‌డీసీ	79.43	82.90	77.40
సెయిల్	159.28	164.80	152.20
టాటా స్టీల్	203.18	208.50	199.90
వేదాంతా	673.65	696.20	651.30

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1455.20	1523.50	1361.90
ఇన్ఫోసిస్	1369.10	1438.40	1246.80
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5479.00	5739.70	5079.70
టీసీఎస్	2692.20	2791.40	2535.40
టెక్ మహీంద్రా	1534.40	1599.20	1432.00
విప్రో	214.09	220.70	205.70

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1419.60	1463.30	1394.50
బీపీసీఎల్	374.10	380.60	369.70
హెచ్‌పీసీఎల్	450.20	457.90	444.90
ఐఓసీఎల్	176.77	178.80	175.00
ఓఎన్‌జీసీ	267.40	273.60	262.90
ఆయిల్ ఇండియా	455.25	478.20	440.80

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1,637.10	1,691.00	1,605.00
అంబుజా సిమెంట్స్	519.45	535.70	509.20
ఇండియా సిమెంట్స్	442.35	455.60	431.50
శ్రీ సిమెంట్	26,130.00	26,550.00	25,540.00
అల్ట్రాటెక్ సిమెంట్	12,963.00	13,105.70	12,801.70

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,004.70	2039.20	1974.80
ఎమ్‌టీఎన్‌ఎల్	31.42	32.50	30.70
టాటా కమ్యూనికేషన్స్	1656.90	1713.60	1613.00
వొడాఫోన్ ఐడియా	11.30	11.60	11.10

హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు 8% పెరిగాయ్

గతేడాదిపై ప్రాప్‌టైగర్

హైదరాబాద్‌లో ఇళ్లు/ఫ్లాట్ల ధరలు గతేడాది సగటున 8% పెరిగాయని ప్రాప్‌టైగర్ తెలిపింది. చదరపు అడుగు సగటు ధర 2024లో రూ.7053 ఉండగా, 2025లో రూ.7644కు చేరిందని వివరించింది. దేశంలోని 8 ప్రధాన నగరాల్లో చూస్తే, ఇళ్ల చ.అ. సగటు ధర 6% అధికమైనట్లు తెలిపింది. 2024లో ఈ వృద్ధి 17 శాతంగా ఉంది. ధరలు పెరిగిన నేపథ్యంలో, ఇళ్ల అమ్మకాల్లో వృద్ధి కొంత నెమ్మదించిందని పేర్కొంది.

ఇతర నగరాల్లో ఇళ్ల ధరల పెరుగుదల (చ.అ.కు రూ.లలో)

నగరం	2025	2024	%లో
బెంగళూరు	8533	7536	13
అహ్మదాబాద్	4754	4402	8
దిల్లీ	8570	8105	6
ముంబయి	13164	12600	4
పుణె	7192	7108	1
కోల్‌కతా	5945	5633	6
చెన్నై	7200	7200	-

ప్రారంభ స్థాయి నియామకాలు నెమ్మదిస్తున్నాయ్

ఏఐ వినియోగిస్తున్న సంస్థలపై ఐసీఆర్ఐఈఆర్ అధ్యయనం

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్న సంస్థల్లో ప్రారంభ స్థాయి ఉద్యోగుల నియామకాలు నెమ్మదిస్తున్నాయని ఐసీఆర్ఐఈఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్) అధ్యయనం వెల్లడించింది. ఈ నివేదిక రూపకల్పనలో ఓపెన్ ఏఐ సహకరించింది. ఏఐ స్వీకరణ అన్ని రంగాల్లో నియామక ప్రాధాన్యతలను పునర్నిర్మిస్తోందని ఈ అధ్యయనం తేల్చింది. 2025 నవంబరు నుంచి ఈ ఏడాది జనవరి మధ్య నిర్వహించిన ఈ అధ్యయనానికి, మన దేశంలోని 10 నగరాల్లో ఉన్న 650 ఐటీ సంస్థల నుంచి వివరాలు లభించాయి. 'ఏఐ, ఉద్యోగాలు: ఈ సమయం భిన్నంగా లేదు' శీర్షికన రూపొందిన ఈ అధ్యయనం.. మన దేశంలో ఇప్పటి వరకు జెన్ ఏఐ స్వీకరణకు సంబంధించిన అత్యంత సమగ్రమైన కంపెనీ స్థాయి అంచనాల్లో ఒకటి. దీని ప్రకారం..



● డొమైన్ నైపుణ్యం, ఏఐ, డేటా నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులకు గిరాకీ పెరిగినట్లు 63% సంస్థలు నివేదించాయి. ప్రధాన విధుల్లో ఏఐను విలీనం చేసినందున, హైబ్రిడ్ నైపుణ్యాలకు పెరుగుతున్న గిరాకీని ఇది సూచిస్తోంది.

● సంస్థలు తమ నియామకాల్లో వృద్ధి మోస్తరుగా ఉన్నట్లు నివేదించాయి. ప్రారంభ స్థాయి నియామకాలు నెమ్మదించగా, మధ్య - సీనియర్ స్థాయుల నియామకాల్లో స్థిరత్వం ఉంది. ఈ నియామకాల ధోరణి ఐటీ పరిశ్రమలో కొవిడ్ తర్వాత పరిణామాలకు అనుగుణంగా ఉందని, ఏఐ స్వీకరణ మాత్రమే ఇందుకు కారణమని చెప్పలేమని పరిశోధకులు గమనించారు.

● ఏఐ కారణంగా ఎక్కువగా ప్రభావితమయ్యే ఉద్యోగాలైన సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, డేటాబేస్ నిర్వాహకుల వంటివి బలమైన వృద్ధిని సాధిస్తున్నాయి. అంటే వీరికి జెన్ ఏఐ ప్రత్యామ్నాయంగా కాకుండా, విశ్లేషణాత్మక పనికి - ఉత్పాదకతను పెంచేందుకు ఉపకరిస్తోందని ఈ పరిణామం సూచిస్తోంది.

● ఏఐ ద్వారా ఎక్కువగా ప్రభావితమవుతున్నట్లు గుర్తించిన 1900 కంటే ఎక్కువ వ్యాపార విభాగాల్లో ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. మూడింట ఒక వంతు విభాగాలు పెరిగిన ఉత్పత్తి, తగ్గిన ఖర్చులు రెండింటినీ నివేదించాయి. ఉత్పత్తి సమర్థంగా పెంచడానికి ఏఐ వీలు కల్పిస్తోందని ఇది సూచిస్తోంది. సర్వే చేసిన వాటిల్లో సగానికి పైగా సంస్థలు తమ సిబ్బందికి, ఏఐపై అవగాహన / శిక్షణ కార్యక్రమాల ద్వారా మద్దతు ఇస్తున్నాయి. మరో 38% సంస్థలు ఇదే ఆలోచనతో ఉన్నాయి.

● గత ఏడాది తమ ఉద్యోగుల్లో సగానికి పైగా ఏఐ సంబంధిత శిక్షణ పొందారని కొన్ని సంస్థలు మాత్రమే నివేదించాయి.

ఈనాడు సినిమా

ఎగస్పార్టీకి ధూపమెయ్యాలంటే.. ఈ మాత్రం మంటెట్టాల్లేరా!



"పెద్ది' పాత్ర చాలా ఏళ్ల పాటు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుంది" అంటున్నారు దర్శకుడు బుచ్చిబాబు సానా. ఆయన దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో రామ్‌చరణ్ టైటిల్ పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఆదివారం బుచ్చిబాబు పుట్టిన రోజు సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలుపుతూ చిత్ర బృందం ప్రత్యేక వీడియోను పంచుకుంది. అందులో ఈ సినిమా కోసం బుచ్చిబాబు తెర వెనుక పడుతున్న శ్రమను ఆసక్తికరంగా చూపించారు. ఆఖర్లో 'ఎగస్పార్టీకి ధూపమెయ్యాలంటే ఈ మాత్రం మంటెట్టాల్లేరా!" అంటూ పెద్ది పాత్ర డైలాగ్‌ను బుచ్చి చెప్పిన తీరు ఆకర్షణగా నిలిచింది. మరి ఇదే డైలాగ్ రామ్‌చరణ్ గళం నుంచి తూటాలా పేలితే థియేటర్లలో ఆ సందడి ఎలా ఉంటుందో చూడాలంటే ఏప్రిల్ 30వరకు వేచి చూడక తప్పదు. ఇక మరోవైపు చరణ్ కూడా బుచ్చిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ సెట్‌లోని ఓ వర్కింగ్ స్టిల్‌ను నెట్టింట పంచుకున్నారు. "సెట్స్‌పై బుచ్చి చూపించే ప్యాషన్, డీటైలింగ్, రూటెడ్ స్టోరీ టెల్లింగ్ ఎంతో స్ఫూర్తినిస్తుంటుంది. మనం కలిసి ఇంకా ఎన్నో మ్యాజికల్ కథల్ని సృష్టిద్దాం" అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడి ఉన్న ఈ రూరల్ యాక్షన్ డ్రామా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఇందులో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా.. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తున్నారు.

సైన్స్ ఫిక్షన్ కథలో?





త్వరలో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేమికులుగా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతున్నారు అందాల తార రష్మిక, బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్. ఈ సినిమాతో పాటు వీరిద్దరూ జంటగా మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా దీని గురించి మరో ఆసక్తికర వార్త నెట్టింట్లో సందడి చేస్తుంది. ఇంకా పేరు ఖరారు కానీ ఈ ప్రాజెక్టులో రష్మిక, షాహిద్ భార్యాభర్తలుగా కనిపించనున్నారని, సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రొమాంటిక్ కామెడీ డ్రామాగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు 'మైదాన్' ఫేమ్ అమిత్ శర్మ దర్శకత్వం వహించనున్నారని, ఈ ఏడాది ఆగస్టులో చిత్రీకరణను మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం రష్మిక ఖాతాలో 'మైసా' సినిమా ఉంది.

ఈటీవీ సమ్మోహన సృష్టి

అమ్మోరు



సోమవారం నుంచి శనివారం వరకు రాత్రి 7.30ని.లకు ఈటీవీలో

థియేటర్లు దేవాలయాలై.. ప్రేక్షకులు భక్తులై.. హాలు బయట వెలసిన అమ్మవారికి హారతులిస్తూ.. పూనకాలతో ఊగిపోతూ.. డప్పుల మోతతో.. జనం పట్టిన నీరాజనాలతో.. మూడు దశాబ్దాల క్రితం చరిత్ర సృష్టించింది 'అమ్మోరు'. అదొక సినిమా కాదు.. భక్తిరస ప్రవాహం! సౌందర్య అమాయకత్వం, రమ్యకృష్ణ రౌద్రం, ఆపై జగన్మాత విశ్వరూపం చూసి అంతా చేతులెత్తి మొక్కారు. నాడు వెండితెరపై కమనీయ దృశ్యకావ్యమై నిలిచిన అమ్మోరును. . నేడు బుల్లితెరపై రమణీయ దివ్య సాక్షాత్కారంగా ఆవిష్కరిస్తోంది మీ ఈటీవీ. ఆదిశక్తి సింహవాహనం, త్రిశూల విన్యాసాలు, రాక్షస సంహరణలు, భక్తిని రగిలించే సన్నివేశాలు, విజువల్స్ ఎఫెక్ట్స్ మాయాజాలంతో ఇంటిల్లిపాదినీ కట్టిపడేసేలా 'అమ్మోరు' మెగా డైలీ సీరియల్‌ను తీర్చిదిద్దింది మీ ఈటీవీ. అపూర్వ కథాబలం, అద్వితీయ సాంకేతిక విలువలు, భారీ సెట్టింగులతో సినిమాను మించిన స్థాయిలో ప్రతీ ఫ్రేమ్ ఉండబోతోంది. టీవీ స్క్రీన్‌పై ఆ దృశ్యాలు చూస్తుంటే సాక్షాత్తు ఆ పరాశక్తి మన నట్టింట్లో నడయాడుతున్న అనుభూతి కలగడం ఖాయం.

● నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు కావాల్సిన ధైర్యం, ఆ లోకపావని అనుగ్రహం ఎలా తోడవుతుందో చెప్పే అమోఘమైన కథనం. కష్టాల్లో ఉన్న ఆడబిడ్డలకు అండగా నిలిచే అమ్మోరిని చూస్తుంటే ప్రతి మహిళ గుండె ఆత్మస్థైర్యంతో నిండిపోతుంది. అప్పుడు 'అమ్మోరు'తో సిల్వర్ స్క్రీన్‌పై సెన్సేషన్ క్రియేట్ చేసిన మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణ సంస్థే.. ఇప్పుడు బుల్లితెరపై అదే పేరుతో మరో సంచలనానికి తెరతీయడం విశేషం. అందరి హృదయాలు భక్తితో ఉప్పొంగేలా.. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకై మీ ఇంటికే వస్తోంది 'అమ్మోరు'. ఈరోజు నుంచి రాత్రి 7.30ని. లకు ఈటీవీలో ప్రసారం కాబోయే ఈ దైవత్వ సౌరభాన్ని మిస్ అవ్వకండి.

అల్లు ఇంట పెళ్లి సందడి.. తొలి శుభలేఖ చిరుకే




అల్లు వారింట పెళ్లి సందడి మొదలైంది. అల్లు శిరీష్ - నయనికల వివాహ వేడుక మార్చి 6న జరగనున్న నేపథ్యంలో.. పెళ్లి పిలుపుల్ని మొదలు పెట్టారు నిర్మాత అల్లు అరవింద్. ఈక్రమంలోనే ఆచారం ప్రకారం తొలి శుభలేఖను శిరీష్ తన మావయ్య, కథానాయకుడు చిరంజీవికి అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. అల్లు అరవింద్ సతీసమేతంగా చిరు దంపతులకు నూతన వస్త్రాలు అందించి పెళ్లికి ఆహ్వానించారు. దీనికి సంబంధించిన ఫొటోల్ని శిరీష్ సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఇందులో చిరంజీవి ఎడమ చేతికి కట్టుతో కనిపించడం పట్ల అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఇటీవల ఆయన భుజానికి ఓ చిన్న సర్జరీ జరిగిన నేపథ్యంలోనే వైద్యుల సలహా మేరకు షోల్డర్ బ్యాగ్ వాడుతున్నట్లు తెలిసింది.



చిరునవ్వుల కావేరి

కథానాయకుడు రవితేజ నటిస్తున్న 77వ చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. ఆమె ఇందులో కావేరి అనే పాత్రలో అలరించనుందని తెలియజేస్తూ.. మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం తన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో ప్రియ బుగ్గపై రవితేజ ఆప్యాయంగా ముద్దు పెడుతుంటే. . ఆమె చిరునవ్వులు చిందిస్తూ ఆస్వాదించడం కనిపించింది. సినిమాలో వీళ్లిద్దరి కెమిస్ట్రీ ఎంత చూడముచ్చటగా ఉండనుందన్నది ఈ పోస్టర్‌తోనే తెలియజెప్పే ప్రయత్నం చేసింది చిత్ర బృందం. "తండ్రీ - కూతురు అనుబంధాలతో ముడిపడి ఉన్న కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. రవితేజ దీంట్లో గత సినిమాలకంటే భిన్నంగా కొత్త ఎమోషనల్ షేడ్స్ ఉన్న పాత్రలో అలరించనున్నారు. ఇది ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాలో సాయికుమార్, బేబీ నక్షత్ర తదితరులు నటిస్తున్నారు.

చూపుతిప్పుకోనివ్వని విజువల్స్‌తో 'నాగబంధం'



దైవత్వం.. విధి.. విధ్వంసం కలగలిసిన చిత్రంగా 'నాగబంధం' ఉండనుందని అంటోంది ఆ చిత్ర బృందం. విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్య మేనన్ కథానాయికలు. రిషబ్ సాహ్నీ, జగపతిబాబు, గరుడ రామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా కథానాయకుడు మహేశ్‌బాబు ఆదివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ చాలా బాగుందని.. సినిమా చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాని మహేశ్ తెలిపారు. రెండున్నర నిమిషాల నిడివితో సాగిన ఈ ప్రచార చిత్రంలో ఒక్క డైలాగ్ వినిపించకున్నా. . చూపుతిప్పుకోనివ్వని విజువల్స్‌తో ఈ చిత్ర కథా ప్రపంచాన్ని ఆకట్టుకునేలా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. హిమాలయాల్లో దాగి ఉన్న నాగబంధం దేవాలయం చుట్టూ తిరిగే కథ ఇది. హిమగిరుల్లో రహస్యంగా దాగి ఉన్న ఆ ఆలయం ఓ విశ్వశక్తిని కాపాడుతుందనేది నమ్మకం. అది చెడ్డవారి చేతుల్లో పడితే అణచలేని విధ్వంసం సంభవించే ప్రమాదముంటుంది. మరి అలాంటి ఆలయంపై అహ్మద్ షా అబ్దాలి అనే క్రూర అఫ్గాన్ నియంత కన్నుపడితే.. దాన్ని అడ్డుకునేందుకు విధి ఎంచుకున్న యోధుడిగా విరాట్ కర్ణ చేసిన సాహసాలు ఆసక్తిరేకెత్తించాయి. ముఖ్యంగా ఆయనిందులో త్రిశూలంతో శివుడిగా దర్శనమిచ్చిన తీరు ఆకర్షణగా నిలిచింది. మొత్తంగా ఈ చిత్ర కథా నేపథ్యం.. దాని స్కేల్. . విజువల్ ఎఫెక్ట్స్.. ఆర్ట్ వర్క్.. మ్యూజిక్ ప్రతిదీ సినిమాపై అంచనాలు పెంచేలా ఉన్నాయి. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలోకి రానుంది.

మరోసారి జంటగా..



సంతోశ్, మానస

ప్రస్తుతం 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో థియేటర్లలో జంటగా సందడి చేస్తున్నారు సంతోశ్ శోభన్, మానస వారణాసి. అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేమికుల రోజు సందర్భంగా విడుదలై.. ఆదరణ దక్కించుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సంతోశ్ - మానసలతో మరో ప్రేమ కథా చిత్రానికి శ్రీకారం చుట్టనున్నట్లు నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రకటించారు. యూవీ క్రియేషన్స్ సంస్థతో కలిసి నిర్మించనున్న ఆ సినిమా వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల కానుంది. ఈ విషయాన్ని ధీరజ్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'కపుల్ ఫ్రెండ్లీ' సక్సెస్‌మీట్‌లో తెలియజేశారు. ఈ సందర్భంగా హీరో సంతోశ్ శోభన్ మాట్లాడుతూ.. "ఈ చిత్ర విజయం నాపై ఓ బాధ్యతను పెంచింది. దాన్ని గుర్తు పెట్టుకుంటూ అందరికీ నచ్చే మంచి సినిమాలు చేయాలనుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో మానస, అశ్విన్, అజయ్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.


ఆలయాన్ని విచ్ఛిన్నం చేయొచ్చు.. విశ్వాసాన్ని కాదు



సంజయ్ లీలా భన్సాలీ

సోమనాథ్ ఆలయం ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటి. లక్షల మంది భక్తుల నీరాజనాలు అందుకున్న ఈ పుణ్యక్షేత్రంపై గజనీ మహమ్మద్ క్రూర, హింసాత్మక దండయాత్ర చేశాడు. ఈ దాడి, విధ్వంసం గురించి ఎన్నో పుస్తకాల్లో చదివాం. ఇప్పుడీ దండయాత్రను తెరపై ఆవిష్కరించబోతున్నారు బాలీవుడ్ దర్శకనిర్మాత సంజయ్ లీలా భన్సాలీ. ఆయన సమర్పణలో 'జై సోమనాథ్' అనే సినిమా రాబోతుంది. కేతన్ మెహతా తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు భన్సాలీ. "ఆలయాన్ని విచ్ఛిన్నం చేయొచ్చు.. కానీ విశ్వాసాన్ని కాదు. 'జై సోమనాథ్' ప్రపంచవ్యాప్తంగా 2027లో థియేటర్లలోకి రాబోతుంది" అనే వ్యాఖ్యల్ని జోడించారు.

మజాకో మల్లికా..



ఆంటోని వర్గీస్ ప్రధాన పాత్రలో పాల్ జార్జ్ తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రం 'కాటాలన్'. షరీఫ్ ముహమ్మద్ నిర్మిస్తున్నారు. దుషార విజయన్, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా మే 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. ''మజాకో మల్లికా" అంటూ సాగిన ఈ ప్రత్యేక గీతానికి అజనీశ్ లోక్‌నాథ్ స్వరాలు సమకూర్చగా.. వినాయక్ శశికుమార్ సాహిత్యమందించారు. ఆనంద్ శ్రీరాజ్, భద్ర ఆలపించారు. ఈ పాటలో సునీల్ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ' 'ఇదొక విభిన్నమైన మాస్ యాక్షన్ థ్రిల్లర్. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఇది నా మనసుకి దగ్గరగా ఉన్న కల!



మహా శివరాత్రి సందర్భంగా దేశవ్యాప్తంగా శివకీర్తనలు ప్రతిధ్వనిస్తున్నాయి. తాజాగా ఈ దైవానుభూతి సందడిని చిత్ర పరిశ్రమలోనూ తెచ్చి అందరిదృష్టిని ఆకర్షిస్తున్నారు కథానాయిక రాశీఖన్నా. శివుడిపై తన భక్తిని చాటుకునేలా 'శివ్ కైలాషోం కే వాసి' అనే గీతాన్ని ఆలపించి తన గాత్రంతో అందరినీ ఆశ్చర్యపరిచారు. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు అభిమానులు. ఈ గీతాన్ని రాశీ ఇన్‌స్టా వేదికగా పంచుకుంటూ.. "ఈ దివ్యమైన రోజున మహాదేవ్‌కు నా ప్రార్థనగా 'శివ్ కైలాషోం కే వాసి'ని అందిస్తున్నాను. ఇది విశ్వాసం, అంతరంగాన్ని మేల్కొల్పడం.. అతీంద్రియ శక్తి అయిన మహా దేవుడి మీద భక్తిని చాటే ప్రార్థనగా నిలుస్తుంది. నా మనసుకి దగ్గరగా ఉన్న కల ఇది. మహా శివరాత్రిలాంటి విశిష్టమైన రోజున ఈ పాట పాడటం ఎంతో ఆనందంగా ఉంది" అని క్యాప్షన్‌లో పేర్కొన్నారు.

ఎప్పుడూ రాయని నవల



నవీన్ చంద్ర

నవీన్ చంద్ర హీరోగా శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. 'భానుమతి అండ్ రామకృష్ణ', 'మంత్ ఆఫ్ మధు' చిత్రాల తర్వాత వీళ్లిద్దరి కలయికలో మూడో సినిమా ఇది. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. దీనికి 'నాట్ ఎ డాక్టర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు ఆదివారం టైటిల్ పోస్టర్‌ను బయటకు వదిలారు. "ఎప్పుడూ రాయని నవల ఆధారంగా" అనే ట్యాగ్‌లైన్‌తో తీర్చిదిద్దిన ఆ ప్రచార చిత్రం ఆసక్తిరేకెత్తించేలా ఉంది. ఈ కథ ప్రకృతితో పాటు కొన్ని మిస్టరీ అంశాల కలయికగా ఉండనున్నట్లు అర్థమవుతోంది. నవీన్ దీంట్లో ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

ఈతరం నరేశ్



అన్వేష్ మైఖేల్, కావ్య కల్యాణ్‌రామ్ జంటగా సీవీ విశాల్ తెరకెక్కించిన చిత్రం 'వాట్స్ అప్ నరేష్'. భాగ్యలక్ష్మి చింత నిర్మాత. కె. సాయి సంతోశ్, ఉషశ్రీ మురళీ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్ర గ్లింప్స్‌ను ఇటీవల విడుదల చేశారు. నాయకానాయికలు ఇద్దరూ ఓ కాఫీ షాప్‌లో కూర్చొని డేటింగ్ యాప్స్, రిలేషన్స్ గురించి మాట్లాడుకోవడాన్ని ఈ ప్రచార చిత్రంలో సహజంగా చూపించారు. దీన్ని బట్టే ఇది ఈతరం యువతకు కనెక్ట్ అయ్యే ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఉండనున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

మేము నమ్మింది.. ప్రేక్షకులకు చేరువైంది



అనూప్ రూబెన్స్, సాయిమాధవ్ బుర్రా, అర్జున్, ఐశ్వర్య, నిరంజన్

'మేము ఏం నమ్మి 'సీతా పయనం' సినిమా తీశామో.. అది ప్రేక్షకులకు కనెక్ట్ అయింది" అన్నారు నటుడు, దర్శక నిర్మాత అర్జున్ సర్జా. ఈ చిత్రం చూసిన ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని చూసుకున్నట్లు ఉందని చెప్తున్నారన్నారు. ఆయన కుమార్తె ఐశ్వర్యను నాయికగా పరిచయం చేస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమాలో నిరంజన్ హీరోగా నటించారు. ఇది ఇటీవలే విడుదలైన నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో థాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు, దర్శక నిర్మాత అర్జున్ మాట్లాడుతూ.. "నేను గొప్ప సినిమా తీశానని చెప్పడం లేదు. మేము ఏదైతే అనుకున్నామో.. అది ప్రేక్షకులకు చేరువైంది. మేమెంతో నిజాయతీగా తీసిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుండటం ఆనందాన్నిస్తోంది. దీన్నింకా చూడని వాళ్లు వెంటనే చూడండి" అన్నారు. "ఇది మాకెంతో ప్రత్యేకమైన సినిమా. దీనిపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ మాకు మరింత ప్రత్యేకంగా మారింది" అన్నారు నటి ఐశ్వర్య. ఈ కార్యక్రమంలో నిరంజన్, అనూప్ రూబెన్స్, సాయిమాధవ్ బుర్రా, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'బాషా' నిర్మాత తమిళ్ అళగన్ కన్నుమూత



తమిళ అగ్రహీరో రజనీకాంత్ నటించిన 'బాషా' చిత్ర నిర్మాతల్లో ఒకరైన తమిళ్ అళగన్ కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో శనివారం ఆయన చెన్నైలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన రజనీకాంత్ నటించిన 'మూండ్రు ముగం', 'పణక్కారన్', 'రాణువ వీరన్', 'బాషా', కమల్‌హాసన్ నటించిన 'ఖాకీచట్టై' తదితర చిత్రాలను నిర్మించారు. 'మందిరపున్నగై', 'నిలా పెన్నే' లాంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'బాషా' చిత్రాన్ని తన తల్లి రాజమ్మాళ్‌తో కలిసి నిర్మించగా తండ్రి ఆర్.ఎం.వీరప్పన్ సమర్పించారు. దివంగత ఆర్.ఎం.వీరప్పన్ సత్య మూవీస్ అధినేత, రాజకీయవేత్త కావడం గమనార్హం. తమిళ్ అళగన్ మృతికి రజనీకాంత్ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తనకు అత్యంత బాధాకరమని తెలిపారు. -న్యూస్‌టుడే, చెన్నై

సూడు సూడు సిత్తరాలు.. నట్టింట్లోకొచ్చే సినిమా హాలు



వేద, సాయితేజ్

హీరో కిరణ్ అబ్బవరం నిర్మాణంలో సాయితేజ్, వేద జలంధర్ నాయకానాయికలుగా పరిచయమవుతున్న చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. వి.మునిరాజు తెరకెక్కించారు. ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "సూడు సూడు సిత్తరాలు.. నట్టింట్లోకొచ్చే సినిమా హాలు" అంటూ సాగిన ఈ పాటకు వంశీకాంత్ రేఖన స్వరాలు సమకూర్చగా.. సనారే సాహిత్యమందించారు. స్వరాగ్ కీర్తన్ ఆలపించారు. టీవీ, డిష్ వచ్చిన తొలినాళ్లలో పల్లెటూరి ప్రజలు ఆ ప్రసారాల్ని ఎంత ఆసక్తిగా తిలకించేవారో ఈ పాటలో ఆకట్టుకునేలా చూపించారు. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ డ్రామా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు.

పరీక్షలు.. ఎలా సిద్ధం కావాలి?



మరి కొద్ది రోజుల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. దీంతో విద్యార్థుల్లో కొంత ఒత్తిడీ, ఆందోళన సహజమే. ఇవి పరిమితి మించితే మాత్రం ఇబ్బందే. సన్నద్ధత ఎంత బాగున్నప్పటికీ సరైన జవాబులు రాస్తేనే మెరుగైన ఫలితాలు పొందగలరు. ఇందుకోసం కొన్ని మెలకువలు పాటించాలి.

పరీక్షలు ఒక విషయం పట్ల మనకి ఉన్న అవగాహనను కొలిచేవి. అందులోని జ్ఞానాన్ని లేదా ఆ జ్ఞానాన్ని ఉపయోగించి సమస్యని పరిష్కరించడానికి వాడే నైపుణ్యాన్ని కొలుస్తారు. ఈ కొలవడం మొదలైనప్పుడు కొంత ఆందోళన సహజం. ఉత్తీర్ణత సాధిస్తానా, మంచి మార్కులు వస్తాయా, ఆశించిన గ్రేడు దక్కుతుందా, ఇంట్లో వాళ్లు కోరినన్ని మార్కులు వస్తాయా.. ఇలా చాలా ఆలోచనలతో ముందుగా భయం, దాంతో ఏకాగ్రత తగ్గిపోవడం, నిద్ర సరిగా పట్టకపోవడం, మొత్తానికి పరీక్ష రోజు అనుకున్నట్లుగా ప్రతిభ చూపలేకపోవడం జరుగుతుంది. ఇదంతా చాలా సాధారణమే. వీటికి తెలివైన, బాగా కష్టపడి చదివే విద్యార్థులూ అతీతం కాదు. ఏదైనా ఒక విషయంలో ప్రతిభ చూపించాలంటే దాని పట్ల అసలు కంగారు లేకపోయినా, లేదా అది బాగా ఎక్కువైనా ఫలితం తారుమారు అవుతుంది. అందువల్ల పరీక్షల పట్ల కొంత కంగారు ఉండాలి కానీ భయం అవసరం లేదు.

సమయ పాలన



మనం చాలాసార్లు వినుంటాం.. ర్యాంకర్లు రోజుకి 14-18 గంటలు చదువుతారని. అంతసేపు చదివినవన్నీ మెదడు గుర్తు పెట్టుకోలేదు. అకడమిక్ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలు.. ఇంకా ఏవైనా కావొచ్చు.. రోజుకి 8-9 గంటలు చదివితే సరిపోతుంది. అంతకు మించి చదివినా మెదడు గుర్తుంచుకోలేదు. ప్రతి గంట లేదా గంటన్నరకు పది నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. ఈ సమయంలో నీళ్లు తాగటం, అటూ ఇటూ తిరగడం, దూరంలో ఉన్నవి చూడటం లాంటివి చేయాలి. దీంతో మెదడుకీ, కళ్లకూ విశ్రాంతి ఇచ్చినట్లవుతుంది. అంతేకానీ మొబైల్ లేదా టీవీ చూడటం వల్ల అవి విశ్రాంతి పొందలేవు. ఈ 8-9 గంటలూ ఒకేసారి కాకుండా, మూడు నాలుగు విడతల్లో చదువుకోవడం వల్ల మెదడు ఆ అంశాలను గుర్తుంచుకోవడానికి వీలవుతుంది.

నిద్ర

నిద్ర తగ్గిస్తే ఎక్కువ సమయం చదవడానికి వీలవుతుందనుకోవడం పెద్ద పొరపాటు. మనం చదివేది వర్కింగ్ మెమరీ నుంచి పర్మనెంట్ మెమరీలోకి వెళ్లడానికి నిద్రతోనే సాధ్యం. సరైన నిద్ర లేకపోతే నేర్చుకున్నది గుర్తుకురాదు. అలాగే పరీక్షల్లో ప్రశ్నలను అర్థం చేసుకునే వేగం తగ్గుతుంది. జవాబులు సరిగా రాయలేము. అందువల్ల రోజుకు 6-8 గంటల నిద్ర అవసరం. కుదిరితే మధ్యాహ్నం పూట 30 నిమిషాలు కునుకు తీయడం మెదడుని ఉత్తేజం చేస్తుంది.

వ్యాయామం

పరీక్షల కోసం ఆటలన్నీ ఆపేస్తాం. అలా చేయడమూ మంచి పద్ధతి కాదు. ప్రతి రోజూ 30-60 నిమిషాలు కొంచెం అలిసేలా ఏదో ఒక ఆట ఆడటం లేదా నడక, పరుగు లాంటివి మంచిది. స్నేహితులతో ఆడితే ఇంకా లాభాలున్నాయి. వాళ్లతో కలిసి పరీక్షల కోసం సన్నద్ధం అయ్యే కబుర్లు చెప్పుకోవడం, చర్చించడం చేసుకోవచ్చు. వారితో ఆటలూ, మాటలూ మనసుని ఎంతో ఉల్లాసపరిచి, చదివేందుకు కొత్త ఉత్సాహాన్నిస్తాయి.

ఆహారం

పరీక్షల సమయంలో జంక్‌ఫుడ్, అధిక చక్కెరను పక్కన పెట్టాలి. వాటితో మెదడు చురుకుగా ఉండదు. ఆహారం మితంగా తీసుకోవాలి. అధికంగా తింటే మెదడుకి రక్తప్రసరణ తగ్గి మత్తు వస్తుంది. ఆహారాన్ని మూడు లేదా నాలుగు గంటలకొకసారి తీసుకోవాలి. సులభంగా తినగలిగే పండ్లు - అరటి, జామ, యాపిల్, బొప్పాయిలతో పాటు బాదాం, పిస్తా, జీడిపప్పు మొదలైనవి మెదడుకి మంచి శక్తినివ్వటమే కాకుండా ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. అలాగే పాలు, గుడ్లూ తీసుకోవచ్చు. టీ, కాఫీ అలవాటు ఉన్నట్లయితే వాటిని పరిమితం చేసుకోవాలి. శక్తినిచ్చే పానీయాల జోలికి వెళ్లొద్దు. అవి ఆందోళనని రెట్టింపు చేస్తాయి.

చదివే పద్ధతి

- ప్రశ్న-జవాబు రూపంలో వద్దు. ముందు పాఠ్యాంశాల వారీ పూర్తిగా చదవాలి. దీంతో పాఠాన్ని అర్థం చేసుకోవడం వీలవుతుంది. ప్రశ్న ఏ విధంగా అడిగినా తడబాటు లేకుండా సమాధానం రాయగలరు. అందుకే పాఠాలు చదివిన తర్వాతే ప్రశ్నలు-సమాధానాలు సాధన చేయాలి. ఇలా పాఠ్యపుస్తకం మొత్తం చదవడం వల్ల ప్రశ్న, సమాధానం పూర్వాపరాలు బాగా తెలుస్తాయి. గుర్తుంచుకోవడం సులువవుతుంది.
- సమ ఉజ్జీలైన నేస్తాలతో చదవటం వల్ల సులువుగా, వేగంగా నేర్చుకోవచ్చు. అలాగే సందేహ నివృత్తీ సులభమవుతుంది.
- మాదిరి ప్రశ్నాపత్రాలు రాయాలి. ఒక ప్రశ్నాపత్రం తీసుకుని పరీక్ష నిర్ణీత సమయం పెట్టుకుని ఎలాంటి అంతరాయం లేకుండా రాయాలి. దీంతో పరీక్ష రాయటానికి కావల్సిన సమయం, మనం రాసే వేగం మొదలైన వాటి పట్ల కచ్చితమైన అంచనా వస్తుంది. పరీక్షల్లో సమయ పాలనకు ఇబ్బంది ఉండదు. ఈ మాదిరి ప్రశ్నాపత్రాలు రాసేటప్పుడు మార్కులు కాకుండా సాధనే మొదటి లక్ష్యం కావాలి.
- పరీక్షల సన్నద్ధత కోసం ప్రణాళిక రూపొందించుకుని చదవాలి. దీన్ని కొంత వెసులుబాటుతో రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల కొన్ని చదవటం ఆలస్యం అయినా వాటిని కవర్ చేసేందుకు అదనపు సమయం ఉంటుంది.
- చేతిరాత అర్థమయ్యేలా ఉండాలి. పదాలు, వాక్యాల మధ్య అవసరమైన దూరం పాటిస్తే మూల్యాంకనం చేసేవాళ్లు మీ సమాధానాలు సులువుగా చదవడానికి వీలవుతుంది.
- కొందరు పొద్దున్నే లేచి బాగా చదవగలరు, మరి కొంత మంది సాయంత్రాలు, ఇంకొందరు రాత్రిళ్లు. కాబట్టి ఒకరిని చూసి ఇంకొకరు ఆ పద్ధతిని మార్చుకోవాల్సిన అవసరం లేదు. కానీ తగినంత నిద్ర మాత్రం ముఖ్యం.
- పరీక్షల కోసం కొత్త పుస్తకాలను ఈ దశలో ప్రయత్నించవద్దు. ఇప్పటివరకూ మీరు రాసుకున్న నోట్సు, పాఠాల్లోని ముఖ్యాంశాలనే మళ్లీ చదవండి.
- విశ్రాంతి తీసుకునేందుకు సంగీతం, ఆటలు, కాసేపు టీవీ పనికొస్తాయి. మొబైల్ వాడకం, అలాగే సామాజిక మాధ్యమాల్లో చిన్న చిన్న వీడియోలు చూడటం ఏకాగ్రతని దెబ్బతీస్తాయి.
- పరీక్షలంటే ఆందోళన, భయం ఉన్నవాళ్లు స్కూల్ కౌన్సెలర్లు లేదా మానసిక నిపుణులను కలిసి సలహా తీసుకోవాలి.

పరీక్షలు మన ప్రతిభని ఒకానొక సమయంలో కొన్ని ప్రశ్నలతో కొలిచేవే తప్ప అవి జీవితాన్ని పూర్తిగా అంచనా వేసేవి కాదు. ఒక్క పరీక్ష మన భవిష్యత్తుని నిర్ణయించలేదు. అవి మన జీవితంలో ఒక చిన్న భాగమే. వాటిలో విజయమే.. మన వ్యక్తిత్వం, ఉనికి కాదు. తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించాలి.



డా. మిర్యాల శ్రీకాంత్
మానసిక వైద్య నిపుణులు

ఏరోనాటికల్ ఇంజినీరింగ్ ఎలాంటి అవకాశాలు?



ఎంపీసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. బీటెక్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేయాలనుంది. పేరున్న సంస్థలు, ప్రవేశ వివరాలు, ఉద్యోగ అవకాశాలు తెలపండి. - **సంజీవ్**



■ ఎంపీసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు బీటెక్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ సవాలుతో కూడిందే. ఇది ప్రధానంగా విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు, రాకెట్లు లాంటి వాహనాల రూపకల్పన, నిర్మాణం, పరీక్షలు, నిర్వహణకు సంబంధించిన టెక్నాలజీని అందిస్తుంది. ఫిజిక్స్, మ్యాథ్స్‌ల పట్ల ఆసక్తి ఉన్నవారికి, ఆవిష్కరణాత్మక ఆలోచనలు కలిగినవారికి ఈ రంగం ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

✦ బీటెక్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో ఏరోడైనమిక్స్, ఎయిర్‌క్రాఫ్ట్ స్ట్రక్చర్స్, ప్రొపల్షన్ సిస్టమ్స్, ఫ్లైట్ మెకానిక్స్, ఏవియానిక్స్, మెటీరియల్ సైన్స్ లాంటి కీలక సబ్జెక్టులను బోధిస్తారు. ప్రయోగశాలలు, విండ్ టన్నెల్ టెస్టింగ్, ప్రాజెక్టులు, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్పుల ద్వారా ప్రాక్టికల్ నైపుణ్యాలూ అభివృద్ధి అవుతాయి. బీటెక్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారికి దేశీయం, అంతర్జాతీయంగానూ ఉపాధి అవకాశాలు ఉంటాయి.

✦ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో కనీసం 50 శాతం మార్కులు కావాలి. కొన్ని సామాజిక రిజర్వేషన్ వర్గాలకు కనీస మార్కుల్లో మినహాయింపులు ఉంటాయి. జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో ప్రవేశాలు జేఈఈ (మెయిన్స్/ అడ్వాన్స్‌డ్) లాంటి పరీక్షల స్కోరుతో ఉంటాయి. రాష్ట్ర సంస్థల్లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ ర్యాంకులతో అవకాశమిస్తారు. ప్రైవేటు/ డీమ్డ్ సంస్థలు జేఈఈ స్కోరు లేదా అవి ప్రత్యేకంగా నిర్వహించే పరీక్షలతో సీట్లు కేటాయిస్తాయి. భారతదేశంలో ఏరోనాటికల్/ ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌ను వివిధ ఐఐటీలతో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కూడా అందిస్తోంది.

> “ఏరోనాటికల్/ ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌తో పలు రకాల ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. విమాన తయారీ పరిశ్రమలు, అంతరిక్ష పరిశోధన సంస్థలు, రక్షణ రంగం, డ్రోన్ టెక్నాలజీ, ఆటోమోటివ్, హైటెక్ డిజైన్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఇస్రో, డీఆర్‌డీవో లాంటి ప్రభుత్వ సంస్థలు, ఎయిర్ బస్, బోయింగ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాంటి ప్రైవేట్ సంస్థలు ఏరోనాటికల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను నియమిస్తాయి.”

✦ వీరికి ప్రారంభ దశలో సుమారు ఐదు నుంచి ఎనిమిది లక్షల రూపాయల వరకు వార్షిక వేతనం లభిస్తుంది. అనుభవం, నైపుణ్యాలు, ఉన్నత విద్య (ఎంటెక్, పీహెచ్‌డీ)తో ఆకర్షణీయ వేతనాలు అందుతాయి. విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండటం ఈ రంగం ప్రత్యేకత.


కఠినమైన శ్రమ, నిరంతర అభ్యాసం అవసరమైనప్పటికీ, బీటెక్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ భవిష్యత్తు దృష్ట్యా అత్యంత ఆశాజనకమైన ప్రోగ్రామ్‌గా నిలుస్తుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

విద్యార్థులు నేర్చుకున్న ప్రతి అదనపు నైపుణ్యానికీ విలువ ఉంటుంది. చాలా సందర్భాల్లో విలువైన ఉద్యోగాలకు ఆ నైపుణ్యమే దారి చూపుతుంది. అలాంటి వాటిలో ముఖ్యమైంది. నేషనల్ క్యాడెట్ కోర్(ఎన్‌సీసీ). ఇందులో ‘సీ’ సర్టిఫికెట్ ఉన్నవారికి ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేకంగా కొన్ని సీట్లు, పోస్టులు కేటాయిస్తున్నారు. ముఖ్యంగా రక్షణ రంగంలో ఎన్‌సీసీ ఉన్నవారి కోసమే ప్రత్యేకంగా నియామకాలూ జరుపుతున్నారు. ఇటీవలే ఆ ప్రకటన వెలువడింది. డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆర్మీలో అధికారి ఎన్‌సీసీ దారి!

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఏడాదికి రెండుసార్లు ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టుల భర్తీకి ప్రకటనలు విడుదల చేస్తోంది. డిగ్రీతోపాటు ఎన్‌సీసీ అర్హత ఉన్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలూ అర్హులే. వచ్చిన దరఖాస్తులను అభ్యర్థులు పొందిన అకడమిక్, ఎన్‌సీసీ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్టు చేస్తారు. ఎన్‌సీసీ సీలో ఏ గ్రేడ్ ఉంటే 50, బీ గ్రేడ్‌కి 25 బోనస్ మార్కులు దక్కుతాయి. అలాగే గ్రాడ్యుయేషన్‌లో పొందిన మార్కులకూ గరిష్ఠంగా 50 బోనస్ మార్కులు కేటాయించారు. ఈ రెండు మార్కులూ కలిపి ఖాళీలకు కొంత మందిని చొప్పున సెలక్షన్ కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. ఏపీ, తెలంగాణ వారికి బెంగళూరు కేంద్రంలో ముఖాముఖి ఉంటుంది. సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. రెండు దశల్లో ఐదు రోజుల పాటు ఇంటర్వ్యూ కొనసాగుతుంది. తొలిరోజు స్టేజ్-1లో ఉత్తీర్ణులైన వారికే తర్వాతి 4 రోజులు నిర్వహించే స్టేజ్-2 ఇంటర్వ్యూకి అవకాశమిస్తారు. ఇందులో విజయవంతమైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణలోకి తీసుకుంటారు.



ఎంపికైతే

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ విధానంలో ఎంపికైనవారికి ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడెమీ, చెన్నైలో అక్టోబరు, 2026 నుంచి 49 వారాలు శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. అనంతరం లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇలా చేరినవారు పదేళ్లపాటు ఉద్యోగంలో కొనసాగవచ్చు. వ్యవధి పూర్తయిన తర్వాత సంస్థ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల ప్రకారం కొందరిని శాశ్వత ఉద్యోగం (పర్మనెంట్ కమిషన్) లోకి తీసుకుంటారు. మిగిలినవారికి మరో నాలుగేళ్లపాటు సర్వీస్ పొడిగిస్తారు. ఆ తర్వాత వీరు వైదొలగాలి. లెఫ్టినెంట్‌గా విధుల్లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్లకు మేజర్, 13 ఏళ్ల సేవలతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలకు చేరుకోవచ్చు. వీరికి మొదటి నెల నుంచే లెవెల్-10 రూ.56,100 మూల వేతనంతోపాటు మిలటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, పలు ఇతర అలవెన్సులూ అందుతాయి. వార్షిక వేతనం సుమారు 17-18 లక్షలు వీరు అందుకుంటారు.

పోస్టు: ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ మెన్/విమెన్.

ఖాళీలు: పురుషులకు 70. మహిళలకు 6.

అర్హత: ఏదైనా డిగ్రీ. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్‌లో కనీసం బీ గ్రేడ్ పొందాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ అవసరం లేదు.

వయసు: జులై 1, 2026 నాటికి 19 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలి. జులై 2, 2001 - జులై 1, 2007 మధ్య జన్మించినవారు అర్హులు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 16 మధ్యాహ్నం 3 వరకు స్వీకరిస్తారు.

ఇంటర్వ్యూలు: మే/జూన్‌లో.

వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in/Authentication.aspx

అగ్నివీర్

భారత సైన్యం అగ్నివీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
రిక్రూటింగ్ కార్యాలయాలు (హెడ్ క్వార్టర్స్): గుంటూరు, సికింద్రాబాద్, విశాఖపట్నం.
విభాగాలు, విద్యార్హతలు:
అగ్నివీర్ (జనరల్ డ్యూటీ): 45 శాతంతో పదో తరగతి.
అగ్నివీర్ (టెక్నికల్): 50 శాతంతో ఇంటర్మీడియట్ (ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్) లేదా సంబంధిత టెక్నికల్ డిప్లొమా ఉండాలి.
అగ్నివీర్ (క్లర్క్/ స్టోర్ కీపర్ టెక్నికల్): 60 శాతంతో ఇంటర్మీడియట్.
అగ్నివీర్ (ట్రేడ్స్‌మెన్): 8వ లేదా 10వ తరగతి ఉత్తీర్ణత.
వయసు: 17 1/2 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. 01.07.2005 - 01.07.2009 మధ్య జన్మించినవారు అర్హులు.
శారీరక ప్రమాణాలు: పోస్టుల ప్రకారం 162 సెం.మీ నుంచి 170 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు, ఊపిరి పీల్చినప్పుడు ఛాతీ 5 విస్తీర్ణం సెం.మీ. పెరగాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 01.04.2026
ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: జూన్ 01 నుంచి జూన్ 15, 2026 వరకు (ఈ తేదీల్లో మార్పులు ఉండొచ్చు).
వెబ్‌సైట్: https://www.joinindianarmy.nic.in/

ఆధార్ సూపర్‌వైజర్/ ఆపరేటర్లు

సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీస్ ఇండియా లిమిటెడ్.. జిల్లా కేంద్రాల్లో ఆధార్ సూపర్‌వైజర్/ ఆపరేటర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ఆధార్ సూపర్‌వైజర్/ ఆపరేటర్: 252 పోస్టులు

అర్హత: పదోతరగతి/ ఇంటర్/ ఐటీఐతో పాటు పని అనుభవం. **వయసు:** 18 ఏళ్ల పైన ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.03.2026.
వెబ్‌సైట్: https://csc.gov.in/careers

ప్రాజెక్ట్ పోస్టులు

ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, దేహ్రాదూన్ తాత్కాలిక ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
- సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 05
- జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో: 15
- జూనియర్ రిసెర్చ్ ఫెలో: 03
- ప్రాజెక్ట్ అసిస్టెంట్: 14
- ఫీల్డ్ అసిస్టెంట్: 15

అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, బీఎస్సీ, ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం.
వేతనం: సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000. జూనియర్ ప్రాజెక్ట్ ఫెలోకు రూ.24,000. జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000. ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.22,000. ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.20,000.
వయసు: సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు, జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో, జూనియర్ రిసెర్చ్ ఫెలోలకు 28 ఏళ్లు మించకూడదు.
వాక్‌ఇన్ తేదీలు: ఫిబ్రవరి 19, 20, 23, 24.
వేదిక: ఎఫ్‌ఆర్‌ఐ బోర్డ్ రూమ్, ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, దేహ్రాదూన్. **వెబ్‌సైట్:** fri.icfre.gov.in

ట్రేడ్ అప్రెంటిస్

హుబ్లీ ఎలక్ట్రిసిటీ సప్లయ్ కంపెనీ లిమిటెడ్, కర్ణాటక.. అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.
- ఎలక్ట్రీషియన్ ట్రేడ్ అప్రెంటిస్ - 388

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ. **వయసు:** 30 ఏళ్లు మించరాదు.
స్టైపెండ్: నెలకు రూ.9,600.
ఎంపిక: విద్యార్హతల మార్కులతో
దరఖాస్తు ఫీజు: జనరల్ విభాగాల వారికి రూ.100. ఎస్సీ, ఎస్టీలకు రూ.50.
పోస్టు ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 02.03.2026.
చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్, విద్యుత్ నగర్, కార్వార్ రోడ్, హుబ్బళ్లి - 580024.
వెబ్‌సైట్: https://hescom.karnataka.gov.in/

ఎన్‌ఐటీటీఆర్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్, చెన్నై.. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- టెక్నికల్ అసిస్టెంట్ గ్రూప్-2 (జూనియర్ ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్): 01
- టెక్నికల్ అసిస్టెంట్ గ్రూప్-2 (గ్రాఫిక్ అసిస్టెంట్): 01
- జూనియర్ సెక్రెటేరియట్ అసిస్టెంట్ (హిందీ టైపిస్ట్): 01

అర్హత: పదోతరగతి/ ఇంటర్/ డిప్లొమా లేదా బీఈ/ బీటెక్‌తో పాటు టైపింగ్ నైపుణ్యం, ఉద్యోగానుభవం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.29,200 - 92,300. జూనియర్ సెక్రెటేరియట్ అసిస్టెంట్‌కు రూ.19,900 - 63,200.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.03.2026.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.03.2026.
వెబ్‌సైట్: https://www.nitttrc.ac.in/nitttr/rec_staff.php

టీచింగ్ కొలువులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్), తంజావూరు ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతోంది.
- అసోసియేట్ ప్రొఫెసర్: 03
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 06

అర్హత: సంబంధిత విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ
వేతన శ్రేణి: నెలకు రూ.57,700 - 2,17,000.
వయసు: 47 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నోటిఫికేషన్ వెలువడిన తేదీ (01.02.2026) నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
వెబ్‌సైట్: https://niftem-t.ac.in/careers.php

పారాదీప్ రిఫైనరీలో

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోని పారాదీప్ రిఫైనరీ.. అప్రెంటిస్ కోసం దరఖాస్తులు కోరుతోంది.
- టెక్నీషియన్ అప్రెంటిస్: 164
- ట్రేడ్ అప్రెంటిస్: 178

ట్రేడులు: కెమికల్, ఫిట్టర్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, డేటా ఎంట్రీ ఆపరేటర్.
అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్, బీఎస్సీ.
వయసు: 31.01.2026 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: విద్యార్హతలు, వైద్య పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలనలతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.02.2026.(ఎన్‌ఏటీ/ ఎన్‌ఏపీఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి)
వెబ్‌సైట్: https://iocl.com/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

వీడియో ఎడిటర్
సంస్థ: సీఎస్‌టీఈ ఇంటర్నేషనల్
నైపుణ్యాలు: క్రియేటివిటీ, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: మార్చి 13
https://shorturl.at/jboG8

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: క్రేవెక్స్ ఫ్రెష్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఏఐ వీడియో జనరేషన్, ఏఐ వాయిస్ ఓవర్, గ్రాఫిక్ డిజైన్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-6,000
దరఖాస్తు గడువు: మార్చి 14
https://tinyurl.com/3rwhrzmw

యూఐ/ యూఎక్స్ టెస్టింగ్/ ఐఓఎస్ టెస్టింగ్
సంస్థ: అక్రాస్ ద గ్లోబ్
నైపుణ్యాలు: మాన్యువల్ టెస్టింగ్, పైథాన్, సెలీనియం, టెస్ట్ ఆటోమేషన్, యూజబిలిటీ టెస్టింగ్ స్టైపెండ్: రూ.2,500-8,000
దరఖాస్తు గడువు: మార్చి 14
https://tinyurl.com/2jc7jaaw

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: అడెక్స్ మీడియా హబ్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.15,000-30,000
దరఖాస్తు గడువు: మార్చి 13
https://shorturl.at/a2kD8

కంటెంట్ క్రియేటర్
సంస్థ: బిల్డ్ యువర్ ఇంగ్లిష్
నైపుణ్యాలు: క్రియేటివ్ థింకింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, స్టోరీటెల్లింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.2,000
దరఖాస్తు గడువు: మార్చి 13
https://tinyurl.com/4rm8m5yf

కమ్యూనిటీ మేనేజ్‌మెంట్
సంస్థ: స్కిల్ లెవెల్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, నెట్‌వర్కింగ్
స్టైపెండ్: రూ.6,000
దరఖాస్తు గడువు: మార్చి 31
https://tinyurl.com/bdcruzup

తమిళ్ కంటెంట్
సంస్థ: డాష్‌రూమ్
నైపుణ్యాలు: కంటెంట్ ఎడిటింగ్, తమిళ్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: మార్చి 13
https://tinyurl.com/4dwtmbwd

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: కృత్రిమ్ ఇన్‌సైట్స్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్
స్టైపెండ్: రూ.4,000-8,000
దరఖాస్తు గడువు: మార్చి 13
https://tinyurl.com/y64mnj56

కరెంట్ అఫైర్స్



◆ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తేజస్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎల్‌సీఏ) తొలి విమానయానం ఎన్నో వార్షికోత్సవాన్ని భారత్ వైమానిక దళం 2026, జనవరి 4న ఘనంగా నిర్వహించింది? **జ:** 25వ

◆ ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (దృష్టి లోపం ఉన్నవారి కోసం బ్రెయిలీ

మాదిరి ప్రశ్నలు

వ్యవస్థను కనుక్కున్న ఫ్రెంచ్ విద్యావేత్త లూయిస్ బ్రెయిలీ జయంతిని ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. 2019లో ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.) **జ:** జనవరి 4

◆ దేశంలోనే తొలిసారిగా మిషన్ మౌసమ్ కింద 3డీ-ప్రింటెడ్ ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లను ఎక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు?(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ నేతృత్వంలోని శాస్త్రవేత్తలు 3డీ ప్రింటెడ్ ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లను అభివృద్ధి చేశారు. మిషన్ మౌసమ్ అనేది భూ శాస్త్రాల మంత్రిత్వశాఖ రూ.2 వేల కోట్లతో వాతావరణపరిశీలన, అంచనా, వాతావరణ సేవలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమం.) **జ:** దిల్లీ

మరింత సమాచారం

◆ ఏ దేశాన్ని అధిగమించి భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించినట్లు కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇటీవల ప్రకటించారు? **జ:** చైనా (భారత్ బియ్యం ఉత్పత్తి 150.18 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు మంత్రి ప్రకటించారు. 145.28 మి.టన్నులుగా ఉన్న చైనాను భారత్ అధిగమించింది.)

ఈనాడు ప్రతిభ

సోమవారం, ఫిబ్రవరి 16, 2026

18 ◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రభుత్వ పరిపాలన, రాజకీయాలు, చట్టాలు, సామాజిక అంశాల్లో మత ప్రమేయం లేని విధానమే లౌకికవాదం. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది కనిపించని రక్షణ కవచం. అన్ని మతాలకు సమాన గౌరవమిస్తూ ప్రజల్లో సామరస్యాన్ని, సానుకూల ధోరణిని ప్రోత్సహిస్తుంది. శతాబ్దాలుగా బహుళ సంస్కృతులు, మతాలు ఉన్న భారతదేశంలో సహజ స్వభావంగా కలిసిపోయి సమాజంలో శాంతిని, మత సహనాన్ని కాపాడుతోంది. ఉదారవాద భావజాలమైన లౌకికవాదం ఆవిర్భావం, ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన తీరు, మారుతున్న కాలంలో మతతత్వ వాదంతో ఎదురవుతున్న సవాళ్లపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సమాజ సమస్యలను అర్థం చేసుకునే క్రమంలో దేశంలో లౌకికవాదానికి ఉన్న ఆదరణ, అసమానతలతో కలిగే ముప్పునూ అర్థం చేసుకోవాలి.



స్వేచ్ఛ.. సహనం.. సమానత్వం!

మతం - లౌకికవాదం

(మారుతున్న ప్రపంచ ధోరణులు)


ప్రపంచ నాగరికత పరిణామ క్రమంలో మానవజాతి సాధించిన అత్యంత ఉదాత్తమైన రాజకీయ, సామాజిక విలువల్లో 'లౌకికవాదం' ఒకటి. రాజ్యానికి ఎలాంటి అధికారిక మతం ఉండకూడదని, పరిపాలనలో మత ప్రమేయం నిషిద్ధమని ఆ వాదం స్పష్టం చేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచీకరణ, పెరిగిన వలసలు, డిజిటల్ విప్లవం కారణంగా సమాజాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ఒకప్పుడు పాశ్చాత్య దేశాలకు మాత్రమే పరిమితమైన లౌకిక భావనలు, ఇప్పుడు మారుతున్న ప్రపంచ ధోరణులకు అనుగుణంగా కొత్త నిర్వచనాలను సంతరించుకుంటున్నాయి. ఆధునిక కాలంలో లౌకికవాదం అంటే మతాన్ని తిరస్కరించడం కాదు, వైవిధ్యభరితమైన నమ్మకాలు ఉన్న ప్రజల మధ్య సమానత్వాన్ని, స్వేచ్ఛను, శాంతియుత సహజీవనాన్ని నిర్ధారించే ఒక ఆధునిక జీవన విధానం. పెరుగుతున్న సాంస్కృతిక జాతీయవాదం, మతపరమైన అతివాదం మధ్య ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి లౌకికవాదం ఒక రక్షణ కవచం మాదిరి నిలుస్తోంది. సెక్యులరిజం అంటే అన్ని మతాలను గౌరవించడం, అన్ని మతాలకూ సమదూరం పాటించడం.

> 'లౌకిక' అనే పదానికి మతం నుంచి వేరుగా ఉండటం లేదా మతపరమైన ఆధారం లేకపోవడం అని అర్థం. లౌకికవాదం అంటే జీవితంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల నుంచి మతాన్ని వేరు చేయడం. మతాన్ని పూర్తిగా వ్యక్తిగత విషయంగా పరిగణించడం. అలాగే రాజ్యాన్ని మతం నుంచి విడదీయడం, అన్ని మతాలకు పూర్తి స్వేచ్ఛ, అన్ని మతాల పట్ల సహనంతో ఉండటమే లౌకికవాదం. మతం ఆధారంగా వివక్ష, పక్షపాతం పాటించకూడదు.

భారతదేశ చరిత్రలో లౌకికవాదం

భారతదేశ చరిత్రలో లౌకిక సంప్రదాయాలు శతాబ్దాలుగా పాతుకుపోయాయి. భారతీయ సంస్కృతి అంటేనే వివిధ ఆధ్యాత్మిక సంప్రదాయాలు, సామాజిక ఉద్యమాల సమ్మేళనం. ప్రాచీన భారతదేశంలో సనాతన ధర్మం (హిందూ మతం) ప్రాథమికంగా విభిన్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను స్వాగతిస్తూ సమగ్ర మతంగా అభివృద్ధి చెందడానికి అనుమతిస్తుంది. నాలుగు వేదాల అభివృద్ధి, ఉపనిషత్తులు, పురాణాల వివిధ వివరణలన్నీ హిందూ మతానికి ఉన్న మతపరమైన బహుళత్వాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. క్రీస్తు పూర్వం మూడో శతాబ్దం నాటికే 'రాజ్యం అనేది ఏ మత శాఖను వ్యతిరేకించకూడదు' అని ప్రకటించిన మొదటి గొప్ప చక్రవర్తి అశోకుడు. తన 12వ శిలాశాసనంలో అన్ని మతాల సహనాన్ని మాత్రమే కాకుండా, వాటి పట్ల గౌరవ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశాడు. భారత్‌లో జైన, బౌద్ధ మతాలు ఆవిర్భవించాయి. అనంతర కాలంలో ఇస్లాం, క్రైస్తవ మతాలు వచ్చిన తర్వాత కూడా దేశంలో వివిధ విశ్వాసాలతో కూడిన మత సహనం, సహజీవనం కోసం అన్వేషణ కొనసాగింది. మధ్య యుగంలో సూఫీ, భక్తి ఉద్యమాలు వివిధ వర్గాల ప్రజలకు ప్రేమను, శాంతిని ప్రబోధించాయి. ఈ ఉద్యమాలకు ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ, బాబా ఫరీద్, సంత్ కబీర్ దాస్, గురునానక్ దేవ్, తుకారాం, మీరాబాయి మొదలైనవారు సారథ్యం వహించి సామరస్యాన్ని పెంచారు.

భారతీయ సమాజం




మీరాబాయి తుకారాం

◆ దుర్క్ హైమ్, కార్ల్‌మార్క్స్, వెబర్, స్పెన్సర్ల అభిప్రాయం ప్రకారం శాస్త్రీయ బద్ధమైన జీవన విలువలతో కూడినదిగా మార్పులను సంప్రదాయ మతం అంగీకరించింది. చరిత్రలో అన్ని రాజ్యాల్లో, రాచరిక ప్రభుత్వాల్లోనూ లౌకికత్వం కనిపిస్తుంది. మానవులు మతసంస్థలతో తక్కువ అనుబంధం కొనసాగిస్తూ, వారి జీవితం, నమ్మకాల విషయంలో మాత్రమే మత విశ్వాసాలను పాటిస్తుండటంతో మతం పాత్ర తగ్గుతూ వస్తోంది. ఆధునికీకరణ, ప్రపంచీకరణ ఫలితంగా నేటితరం నమ్మకాల్లోనూ శాస్త్రీయత, హేతుబద్ధతకు ప్రాధాన్యం ఇస్తోంది. అలౌకిక, అతీత శక్తులను అంతగా విశ్వసించడం లేదు.


ప్రపంచ మతాలు - పితృస్వామిక స్వభావం

సిల్వియా వాల్బీ అనే రచయిత్రి పితృస్వామ్య సిద్ధాంతీకరణ (1990) పుస్తకంలో పితృస్వామిక వ్యవస్థను నిర్వచించింది. సామాజిక నిర్మితి, ఆచార వ్యవహారాల్లో స్త్రీలను కేవలం పిల్లలను పెంచే వారిగానే గుర్తిస్తున్నారు. భారత సమాజంలో స్త్రీ పాత్రను మతం నిర్వచిస్తుంది. ఉమా చక్రవర్తి ప్రకారం మాతృత్వం మహిళల ప్రధాన కర్తవ్యం అని ఆచరణలో ఉంది. ఒకవైపు 'దేవి' అనే శిల్పాలను చెక్కి దేవతగా చూపిస్తూ, మరొకవైపు 'దాసి' అనే కోణంలో సేవలు చేయించుకుంటున్నారు. జుడాయిజం, క్యాథలిజాల్లో కేవలం పురుషులే మత బోధకులుగా వ్యవహరిస్తున్నారు. ఖురాన్‌లో స్త్రీలు, పురుషులు వేర్వేరుగా మత ప్రార్థనలు చేసుకోవాలని ఉంది. ఇవన్నీ మహిళల స్థాయిని తగ్గిస్తున్నాయని 'హెూమ్' (1994) అనే సామాజికవేత్త అభిప్రాయపడ్డారు. విడాకులు, దుస్తుల నియమావళి తదితర అంశాల్లోనూ మహిళలకు కొన్ని ఆంక్షలు ఉన్నాయి. అయినప్పటికీ నూతన సంస్కృతులు, నాగరికతల వల్ల పురుషులతో సమానంగా మహిళలు జీవించగలుగుతున్నారు. ప్రేమ వివాహాలు పెరుగుతున్నాయి. కుటుంబ విధుల్లోనూ మార్పులు వస్తున్నాయి. వర్తమాన పరిస్థితుల్లో లౌకికత్వ భావాలు పెరగడంతో పితృస్వామిక ఆధిక్యత మతంలో తగ్గుతూ వస్తోంది.



'సమస్యను సృష్టించే సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితుల వల్ల మతవాదం పెరగడమే మతతత్వం'
– బిపిన్ చంద్ర

సచార్ కమిటీ నివేదిక



రాజేంద్ర సింగ్ సచార్

స్వాతంత్ర్యానంతరం రాజేంద్ర సింగ్ సచార్ కమిటీ ముస్లింల స్థితిగతులపై నివేదిక రూపొందించింది. ముస్లింలు ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతో ఉన్నారని, గ్రామీణ శ్రామిక నిష్పత్తిలోనూ చాలా తక్కువగా ఉన్నారని చెప్పింది. స్వయం ఉపాధి పొందుతున్నవారు కూడా చిన్న వ్యాపారులుగా మాత్రమే మిగిలిపోయారని పేర్కొంది. బ్యాంకు రుణాలు పొందడంలో వీరికి తక్కువ అవకాశాలు లభిస్తున్నాయని, ఈ పరిస్థితులతో ముస్లిం యువత అసంతృప్తికి గురయ్యారని వివరించింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థిక సమానత్వం దిశగా అడుగులు వేయాలని కమిటీ సూచనలు చేసింది.



రచయిత: బద్దం పురుషోత్తం రెడ్డి

SENIOR INTER Maths–2A: Binomial Theorem

1. Find the number of terms is the expansion of $(2x + 3y + z)^7$.

Sol: Given expansion $(2x + 3y + z)^7$

number of terms in the given expansion $= \frac{(n+1)(n+2)}{2}$

(Here n = 7)

$= \frac{(7+1)(7+2)}{2} = 36$

2 Marks

2. Find the number of terms with non zero coefficients in $(4x - 7y)^{49} + (4x + 7y)^{49}$.

Sol: $(4x - 7y)^{49} + (4x + 7y)^{49}$

$= 2\left[{}^{49}C_0(2x)^{49} + {}^{49}C_2(2x)^{47}(7y)^2 + \ldots + {}^{49}C_{48}(2x)(7y)^{48}\right]$

= 25 terms

3. Find the 7th term in the expansion of $\left(\frac{4}{x^3} + \frac{x^2}{2}\right)^{14}$.

Sol: 7th term $= T_{6+1} = {}^{14}C_6\left(\frac{4}{x^3}\right)^{14-6}\left(\frac{x^2}{2}\right)^6 = {}^{14}C_6\frac{4^5}{x^{12}}$

4. Write down and simplify 6th term is $\left(\frac{2x}{3} + \frac{3y}{2}\right)^9$.

Sol: 6th term $= T_{5+1} = {}^9C_5\left(\frac{2x}{3}\right)^4\left(\frac{3y}{2}\right)^5 = 189\,x^4y^5$

5. Find the 3rd term from the end in the expansion of $\left(x^{-2/3} - x^{3/x^2}\right)^8$.

Sol: Give expansion has = n + 1 = 8 + 1 = 9 terms

3rd term from end = 7th term from the beginning

$T_7 = T_{6+1} = {}^8C_6\left(x^{-2/3}\right)^2\left(-x^{3/x^2}\right)^6 = \frac{28 \times 3^6}{x^{40/3}}$

Final Exams-2026 IMPORTANT Q & A

6. Find the middle term(s) in the expansion of $\left(\frac{3x}{7} - 2y\right)^{10}$.

Sol: Here n = 10 (even), middle term $= T_{\frac{10}{2}+1} = T_{5+1}$

$T_{5+1} = {}^{10}C_5\left(\frac{3x}{7}\right)^5(-2y)^5 = -{}^{10}C_5\left(\frac{6}{7}\right)^5x^5y^5$

Practice Questions

7. Find the middle term(s) in the expansion of $(4x^2 + 5x^3)^{17}$.

8. Find the coefficient of x^{-7} in $\left(\frac{2x^2}{3} - \frac{5}{4x^5}\right)^7$.

9. Find the coefficient of x^7 in $\left(\frac{3x^2}{7} + \frac{4}{5x^3}\right)^{11}$.

For more IMP Q & A

10. If the coefficient of $(2r + 4)^{th}$ term and $(3r + 4)^{th}$ term in the expansion of $(1 + x)^{21}$ are equal, then find r.



Writer: B. Eswar rao


అక్కడే ఆసియాలోనే అతిపెద్ద సౌర తటాకం!

అభివృద్ధి ఏదైనా, ఎలాంటిదైనా సహజ వనరులను ధ్వంసం చేయకుండా, భవిష్యత్తు తరాలు స్వచ్ఛమైన ప్రపంచంలో జీవించే విధంగా జరగాలన్నదే సుస్థిరాభివృద్ధి ధ్యేయం. ఈ క్రమంలో ప్రధానంగా రావాల్సిన మార్పు శిలాజ ఇంధనాల వినియోగం స్థానంలో కాలుష్యరహిత ఇంధనాలకు మారడం. సౌరశక్తి, పవనశక్తి తదితర పర్యావరణహితమైన ఇంధన వనరులతో వాయు కాలుష్యాన్ని తగ్గించి, వాతావరణ మార్పులను నివారించి, మానవాళితో పాటు సమస్త ప్రాణికోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రస్తుతం భారత్‌తో పాటు ప్రపంచ దేశాలన్నీ ఈ దిశగానే పయనిస్తున్నాయి. ఎన్నటికీ తరగని ఈ కాలుష్య రహిత ఇంధన వనరులు, జీవ ఇంధనాలు, జల విద్యుత్తు, తరంగ శక్తి ఉత్పత్తి, వినియోగం తీరుతెన్నులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. దేశంలో సంప్రదాయేతర ఇంధనాల వాడకం పరిణామక్రమం, ప్రధాన ఉత్పత్తి కేంద్రాలు, అందుకు ఉన్న అనుకూల ప్రాంతాలనూ తెలుసుకోవాలి.

సుస్థిరాభివృద్ధి

1. కాలుష్య రహిత ఇంధన వనరుల వినియోగంతో ఉపయోగాలు..
   1) కాలుష్య రహితమైనవి
   2) పర్యావరణ అనుకూలం
   3) తరిగిపోనివి 4) పైవన్నీ

2. సూక్ష్మజీవుల సమక్షంలో కిణ్వన ప్రక్రియకు గురిచేయడం ద్వారా శక్తి పొందే పదార్థాలను ఏమంటారు?
   1) జీవ ఇంధనాలు
   2) జీవ ఎరువులు
   3) జీవక్రియ సంహారకాలు
   4) పైవన్నీ




3. కింది వాటిలో జీవ ఇంధనాలు..
   1) బయోగ్యాస్ 2) బయో ఇథనాల్
   3) బయో డీజిల్ 4) పైవన్నీ

4. కింది వాటిలో జీవ ఇంధనం కానిది?
   1) బయో బ్యుటనాల్
   2) బయో హైడ్రోజన్ గ్యాస్
   3) ఎల్‌పీజీ 4) బయోగ్యాస్

5. పట్టణ వ్యర్థాల్లోని ఏ బ్యాక్టీరియాల ద్వారా బయోగ్యాస్ తయారుచేస్తారు?
   1) మిథనో మోనాస్ 2) మిథనో కోకస్
   3) 1, 2 4) ఏదీకాదు

6. బయోగ్యాస్‌లో ఉండనిది?
   1) మీథేన్
   2) కార్బన్ డై ఆక్సైడ్
   3) ఆక్సిజన్
   4) పైవన్నీ



7. బయోగ్యాస్‌లో మీథేన్ శాతం?
   1) 60% 2) 40% 3) 50% 4) 70%

8. బయోగ్యాస్‌లో కార్బన్ డై ఆక్సైడ్ శాతం?
   1) 60% 2) 40% 3) 35% 4) 15%

9. కింది వాటిలో బయోగ్యాస్ లక్షణం.
   1) కాలుష్య రహితం 2) చౌక
   3) దక్షత 4) పైవన్నీ

10. బయో ఇథనాల్‌ను ఏ మొలాసిస్ నుంచి తయారుచేస్తారు?
    1) మొక్కజొన్న 2) చెరకు
    3) 1, 2 4) ఏదీకాదు

11. ఇథనాల్ బ్లెండింగ్‌ను ప్రత్యామ్నాయంగా ఉపయోగించే దేశాలు?
    1) అమెరికా 2) భారత్ 3) బ్రిటన్ 4) పైవన్నీ

12. 10% ఇథనాల్, 90% పెట్రోలును కలిపి ఏమంటారు?
    1) గ్యాసోహాల్ 2) ఏరోసాల్
    3) మిథనాయిల్ 4) పెట్రోహాల్

13. గ్యాసోహాల్‌లో ఎంత శాతం ఇథనాల్ ఉంటుంది?
    1) 90% 2) 10%
    3) 70% 4) 60%



14. గ్యాసోహాల్‌లో ఎంత శాతం పెట్రోలు ఉంటుంది?
    1) 90% 2) 10% 3) 80% 4) 60%

15. బయో ఇథనాల్ తయారీ విధానంలో మొలాసిస్‌కు ఏది కలిపి కిణ్వన ప్రక్రియకు గురిచేస్తారు?
    1) సుక్రోజ్ 2) ఇన్వర్టేజ్
    3) 1, 2 4) ఏదీకాదు


16. బయోమాస్‌ను ఏ బ్యాక్టీరియా సమక్షంలో కిణ్వన ప్రక్రియకు గురిచేస్తే బయోహైడ్రోజన్ గ్యాస్ విడుదలవుతుంది?
    1) క్లాస్ట్రీడియం జాతులు 2) పెల్లాడియం
    3) క్లోరోజెట్ 4) విల్లేఖస్

17. మొలాసిస్‌ను ఏ బ్యాక్టీరియా సమక్షంలో కిణ్వన ప్రక్రియకు గురిచేస్తే బయో బ్యుటనాల్ ఏర్పడుతుంది?
    1) క్లాస్ట్రీడియం ఎనిటో బ్యుటరికం
    2) అజటోబ్యాక్టర్
    3) క్లోరోజెట్ 4) పెల్లాడియం

18. ఏ చెట్ల నుంచి బయో డీజిల్ తయారుచేస్తారు?
    1) గానుగ 2) జట్రోఫా
    3) 1, 2 4) ఏదీకాదు

19. జీవ ఇంధన ఉపయోగాలు?
    1) పునరుత్పత్తి చేయగలం
    2) పర్యావరణ స్నేహపూర్వక ఇంధనాలు
    3) చౌక 4) పైవన్నీ

20. 'ఎకోసిటీ' అనే భావన ఎవరు ప్రతిపాదించారు?
    1) బోస్లో 2) రిచర్డ్
    3) ఎల్లల్ 4) ట్రిచర్



21. 'ఎకోసిటీ' భావన ఎప్పుడు వచ్చింది?
    1) 1975 2) 1976 3) 1977 4) 1978

22. మొదటి జీరో – కార్బన్ పట్టణం?
    1) దిల్లీ 2) మస్దర్
    3) న్యూయార్క్ 4) బీజింగ్

23. హరిత నగర లక్షణాలు..
    1) ప్రణాళికాబద్ధమైన పట్టణ ప్రణాళిక
    2) కార్బన్ రహిత ఇంధన వనరుల వినియోగం
    3) వివిధ వాహనాలకు అనేక వరుసల రహదారులు
    4) పైవన్నీ

24. భారతదేశంలో సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1982 2) 1992 3) 2002 4) 2012

25. జల విద్యుత్తును మొదట ఎక్కడ ఉత్పత్తి చేశారు?
    1) విజయవాడ 2) లోనావాల
    3) అమరావతి 4) తిరుపతి

26. జల విద్యుత్తు కేంద్రాన్ని మొదట ఏ నదిపై ప్రారంభించారు?
    1) శరావతి 2) మూసీ 3) కోస్లి 4) చంబల్



27. మొదట జల విద్యుత్తు కేంద్రాన్ని మన దేశంలో ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) శివసముద్రం 2) రాజమండ్రి
    3) భోపాల్ 4) భద్రాచలం

28. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఎప్పుడు ఏర్పాటైంది?
    1) 1980 2) 1975 3) 1974 4) 1986

29. ఆసియాలోనే అతిపెద్ద సోలార్ పార్కును ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు?
    1) మహారాష్ట్ర 2) గుజరాత్
    3) రాజస్థాన్ 4) తెలంగాణ

30. దేశంలో మొదటి సౌరవిద్యుత్తు కేంద్రం ఎక్కడ ఉంది?
    1) కల్యాణ్‌పుర్ 2) కౌముది
    3) చార్నాఖా 4) సత్రి

జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

31. ఆసియాలోనే అతిపెద్ద సౌర తటాకం ఎక్కడ ఉంది?
    1) భద్ల 2) చోగ్లామ్‌సా
    3) కల్యాణ్‌పుర్ 4) పైవన్నీ

32. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ స్టీమ్ ఉన్న ప్రాంతం?
    1) కల్యాణ్‌పుర్ 2) భుజ్
    3) షిరిడి 4) చోగ్లామ్‌సా

33. ఆంధ్రప్రదేశ్‌లో సౌరశక్తి ద్వారా పూర్తిగా విద్యుదీకరించిన మొదటి గ్రామం?
    1) గానుగపాడు 2) బిసానివారిపల్లి
    3) కొత్తూరు 4) ఏదీకాదు

34. పవన విద్యుత్తును వాణిజ్యపరంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం?



    1) ఆంధ్రప్రదేశ్ 2) గుజరాత్
    3) మహారాష్ట్ర 4) తెలంగాణ

35. పవన విద్యుత్తును ఉత్పత్తి చేసే గాలి మరలు ఏర్పాటు చేసిన రాష్ట్రం?
    1) తమిళనాడు 2) కర్ణాటక
    3) గుజరాత్ 4) పైవన్నీ

36. వేలా శక్తికి అనుకూలమైన ప్రాంతం?
    1) గల్ఫ్ ఆఫ్ కంబట్ 2) సుందర్‌బన్స్
    3) గల్ఫ్ ఆఫ్ కచ్ 4) పైవన్నీ

37. దేశంలోని మొదటి తరంగశక్తి విద్యుత్తు కేంద్రం?
    1) కాండ్లా 2) సతారా
    3) భోగిమిట్ట 4) కయాత్తర్

38. భారత్‌లో ఓషన్ థర్మల్ ఎనర్జీ కన్వెన్షన్ ఏర్పాటుకు సహకరిస్తున్న దేశం?
    1) రష్యా 2) అమెరికా
    3) జపాన్ 4) బ్రిటన్

39. 'నేషనల్ మిషన్ ఫర్ గ్రీన్ ఇండియా' దేశంలో 23% ఉన్న అటవీ విస్తీర్ణాన్ని ఎంత శాతానికి పెంచాలని నిర్ణయించింది?
    1) 33% 2) 40% 3) 50% 4) 60%

40. మనదేశంలో కార్బన్ ట్యాక్స్ దేని మీద విధిస్తున్నారు?
    1) బొగ్గు 2) ఇనుము
    3) బంగారం 4) అల్యూమినియం

41. భారత్‌లో గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల్లో ప్రథమ స్థానంలో ఉన్న నగరం?
    1) చెన్నై 2) పుణె 3) ముంబయి 4) కోల్‌కతా

42. దేశంలో గ్రీన్‌హౌస్ వాయువుల పాదముద్రలు అధికంగా ఉన్న నగరం?
    1) చెన్నై 2) దిల్లీ 3) పుణె 4) ముంబయి

43. బీఎస్ఈ గ్రీనెక్స్‌లో ఎన్ని కంపెనీలకు చోటు లభించింది?
    1) 20 2) 30 3) 40 4) 60

44. పర్యావరణ అనుకూలమైన ఈక్విటీ ఇండెక్స్‌ను ఏమంటారు?
    1) బీఎస్ఈ గ్రీనెక్స్ 2) గ్రీన్ ఈక్విటీ
    3) గ్రీన్ కాస్ట్ 4) గ్రీన్ ఇండెక్స్

45. బీఎస్ఈ గ్రీనెక్స్‌లో లేని కంపెనీ?
    1) డా. రెడ్డీస్ ల్యాబ్స్ 2) సన్‌ఫార్మా
    3) రిలయన్స్ 4) టాటాస్టీల్

46. భారత ప్రభుత్వం సంయుక్త అటవీ నిర్వహణను ఎప్పుడు తీసుకువచ్చింది?
    1) 1990 2) 1995 3) 2000 4) 2005

47. 'ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్' ఎప్పుడు ఏర్పడింది?
    1) 1975 2) 1974 3) 1976 4) 1977

48. TERI ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) న్యూదిల్లీ 2) హైదరాబాద్
    3) బెంగళూరు 4) చెన్నై

49. TERI ప్రచురిస్తున్న పత్రిక పేరు?
    1) టెర్రా లెవల్ 2) టెర్రా గ్రీన్
    3) గ్రీన్ రైజ్ 4) గ్రీన్ లెవల్

50. TERI ఏ రంగాలపై పరిశోధనలు జరుపుతుంది?
    1) ఇంధన రంగం 2) పర్యావరణం
    3) సుస్థిరాభివృద్ధి 4) పైవన్నీ

51. 'హరిత ఆర్థిక వ్యవస్థ' అనే భావన ఏ సమావేశంలో ప్రవేశపెట్టారు?
    1) Rio + 10 2) Rio + 20
    3) Cop - 21 4) Rio + 5

52. 'ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా' కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయి?
    1) బెంగళూరు
    2) డెహ్రాడూన్
    3) సిమ్లా
    4) పైవన్నీ



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

సమాధానాలు

1-4, 2-1, 3-4, 4-3, 5-3, 6-3, 7-1, 8-2, 9-4, 10-3, 11-4, 12-1, 13-2, 14-1, 15-3, 16-1, 17-1, 18-3, 19-4, 20-2, 21-1, 22-2, 23-4, 24-1, 25-2, 26-1, 27-1, 28-2, 29-3, 30-1, 31-1, 32-3, 33-2, 34-3, 35-4, 36-4, 37-1, 38-2; 39-1, 40-1, 41-1, 42-2, 43-1, 44-1, 45-3, 46-1, 47-2, 48-1, 49-2, 50-2, 51-4, 52-4.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

పొరపాటును సవరిస్తే.. వచ్చేదే కావాల్సిన జవాబు

వర్గసమీకరణాలు - III

ముఖ్యాంశాలు

- $ax^2+bx+c=0$ మూలాలు α, β లు అయితే మూలాల మొత్తం $\alpha+\beta=\frac{-b}{a}$, మూలాల లబ్ధం $\alpha\beta=\frac{c}{a}$
- α, β మూలాలున్న వర్గసమీకరణం $x^2-x(\alpha+\beta)+\alpha\beta=0$
- α, β మూలాలున్న వర్గసమీకరణం $f(x)=ax^2+bx+c=0$ అయితే
  - i) $\frac{1}{\alpha}, \frac{1}{\beta}$ మూలాలున్న వర్గసమీకరణం $= f\left(\frac{1}{x}\right)=0$
  - ii) $-\alpha, -\beta$ మూలాలున్న వర్గసమీకరణం $= f(-x)=0$
  - iii) $\alpha+k, \beta+k$ మూలాలున్న వర్గసమీకరణం $= f(x-k)=0$

మాదిరి ప్రశ్నలు

1. $x=3+\sqrt{5}$ అయితే x^2-6x-6 విలువ ఎంత?

1) 10 2) −12 3) −10 4) 12

సాధన: $x=3+\sqrt{5} \Rightarrow (x-3)=\sqrt{5}$

$$x^2-6x-6=(x-3)^2-15=(\sqrt{5})^2-15=-10$$

సమాధానం: 3

2. $pq+qr+rp=0, (p, q, r \neq 0)$ అయితే $\frac{1}{p^2-qr}+\frac{1}{q^2-rp}+\frac{1}{r^2-pq}$ విలువ ఎంత?

1) 1 2) 0 3) −1 4) 2

సాధన: $pq+qr+rp=0 \Rightarrow p(q+r)=-qr$

$$=p^2-qr=p^2+p(q+r)=p(p+q+r)$$

ఇదేవిధంగా, $q^2-rp=q(p+q+r)$, $r^2-pq=r(p+q+r)$

$$\therefore \frac{1}{p^2-qr}+\frac{1}{q^2-rp}+\frac{1}{r^2-rp}$$

$$=\frac{1}{p(p+q+r)}+\frac{1}{q(p+q+r)}+\frac{1}{r(p+q+r)}$$

$$=\frac{qr+rp+pq}{pqr(p+q+r)}=\frac{0}{pqr(p+q+r)}=0$$

సమాధానం: 2

3. $\frac{\sqrt{x}+\sqrt{y}}{\sqrt{x}-\sqrt{y}}=5$ అయితే $\frac{x^2-3xy+y^2}{x^2+3xy+y^2}$ విలువ ఎంత?

1) $\frac{10}{203}$ 2) $\frac{11}{205}$ 3) $\frac{-10}{203}$ 4) $\frac{-11}{205}$

సాధన: $\frac{\sqrt{x}+\sqrt{y}}{\sqrt{x}-\sqrt{y}}=\frac{5}{1}$

$$\Rightarrow 5\sqrt{x}-5\sqrt{y}=\sqrt{x}+\sqrt{y} \Rightarrow 4\sqrt{x}=6\sqrt{y} \Rightarrow x=\frac{9}{4}y$$

$$=x^2=\frac{81}{16}y^2, 3xy=3\times\frac{9}{4}y\times y=\frac{27}{4}y^2$$

$$=\frac{x^2-3xy+y^2}{x^2+3xy+y^2}=\frac{\frac{81}{16}y^2-\frac{27}{4}y^2+y^2}{\frac{81}{16}y^2+\frac{27}{4}y^2+y^2}$$

$$=\frac{(81-108+16)\,y^2}{(81+108+16)\,y^2}=\frac{-11}{205}$$

సమాధానం: 4

4. $\frac{x+\sqrt{x^2-3}}{x-\sqrt{x^2-3}}+\frac{x-\sqrt{x^2-3}}{x+\sqrt{x^2-3}}=\frac{43}{3}$ అయితే x విలువ ఎంత?

1) $\pm\frac{7}{2}$ 2) $\pm\frac{3}{2}$ 3) $\pm\frac{5}{2}$ 4) $\pm\frac{7}{3}$

సాధన: $\frac{\left(x+\sqrt{x^2-3}\right)^2+\left(x-\sqrt{x^2-3}\right)^2}{x^2-(x^2-3)}=\frac{43}{3}$

$$\frac{2(x^2+x^2-3)}{3}=\frac{43}{3} \quad \left(\therefore (a+b)^2+(a-b)^2=2(a^2+b^2)\right)$$

$$=2(2x^2-3)=43 \Rightarrow 2x^2-3=\frac{43}{2}$$

$$\Rightarrow x^2=\frac{49}{4} \Rightarrow x=\pm\frac{7}{2}$$

సమాధానం: 1

5. $\frac{x+\sqrt{x^2+2}}{x-\sqrt{x^2+2}}-\frac{x-\sqrt{x^2+2}}{x+\sqrt{x^2+2}}=\frac{-3}{2}, (x \geq 0)$ అయితే x విలువ ఎంత?

1) $\frac{3}{2}$ 2) $\frac{1}{2}$ 3) $\frac{1}{3}$ 4) $\frac{2}{3}$

సాధన: దత్తాంశం $\Rightarrow \frac{\left(x+\sqrt{x^2+2}\right)^2-\left(x-\sqrt{x^2+2}\right)^2}{x^2-(x^2+2)}=\frac{-3}{2}$

$$(a+b)^2-(a-b)^2=4ab \Rightarrow \frac{4x\sqrt{x^2+2}}{-2}=\frac{-3}{2}$$

$$4x\sqrt{x^2+2}=3 \Rightarrow 16x^2(x^2+2)=9$$

$$16x^4+32x^2-9=0$$

$$=16x^4+36x^2-4x^2-9=0$$

$$=4x^2(4x^2+9)-1(4x^2+9)=0$$

$$(4x^2+9)(4x^2-1)=0 \Rightarrow =4x^2=-9, 4x^2=1$$

$$x \geq 0, 4x^2=1 \Rightarrow x^2=\frac{1}{4} \Rightarrow x=\frac{1}{2}$$

సమాధానం: 2

6. ఒక విద్యార్థికి ఒక సంఖ్యను 7తో భాగించి వచ్చిన భాగఫలానికి 21ని కలపమని చెప్పారు. అతడు పొరపాటున మొదటగా ఆ సంఖ్యకు 21 కలిపి తర్వాత 7తో భాగించాడు. దీంతో అతడికి సమాధానంగా 123 వచ్చింది. అయితే రావాల్సిన సరైన సమాధానం?

1) 144 2) 141 3) 145 4) 151

సాధన: సంఖ్యను x అనుకుందాం.

లెక్కప్రకారం, $\frac{x+21}{7}=123$

$$\Rightarrow \frac{x}{7}+3=123 \Rightarrow \frac{x}{7}=120$$

లెక్కలో కోరిన సమాధానం $=\frac{x}{7}+21=120+21=141$

సమాధానం: 2

7. వర్గసమీకరణం ఒక మూలం $7-2\sqrt{3}$ అయితే ఆ వర్గసమీకరణాన్ని కనుక్కోండి?

1) $x^2-14x+37=0$ 2) $x^2-14x-37=0$
2) $x^2+14x-37=0$ 4) $x^2+14x+37=0$

సాధన: వర్గసమీకరణం ఒక మూలం $\alpha=7-2\sqrt{3}$ అయితే మరొక మూలం $\beta=7+2\sqrt{3}$ అవుతుంది.

$$\therefore \alpha+\beta=7-2\sqrt{3}+7+2\sqrt{3}=14$$

$$\therefore \alpha\beta=(7-2\sqrt{3})(7+2\sqrt{3})=49-12=37$$

$\therefore$ లెక్కలో కోరిన వర్గసమీకరణం

$$x^2-x(\alpha+\beta)+\alpha\beta=0$$
$$=x^2-14x+37=0$$

సమాధానం: 1



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

Word of the Day

923

Severity

Telugu meaning: తీవ్రత, కఠినత

English meaning: The word severity (సివ్యారిటీ) is a noun that refers to the intensity, seriousness, or harshness of something.

Synonyms: Intensity, Seriousness ***Antonyms:*** Softness, Gentleness

Usage: **1.** The severity of the storm forced the authorities to close schools and advise people to stay indoors.

2. The judge considered the severity of the crime before announcing the final punishment.

కరెంట్ అఫైర్స్



నూతనంగా నిర్మించిన ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) - సేవా తీర్థ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ 2026, ఫిబ్రవరి 13న ప్రారంభించారు. సేవా తీర్థ్‌లో ప్రధాని కార్యాలయంతోపాటు జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, కేబినెట్ సెక్రటేరియట్ ఉంటాయి. దీంతో పాటు కేంద్ర సచివాలయ భవనాలైన కర్తవ్య భవన్-1, కర్తవ్య భవన్-2లనూ ఆయన ప్రారంభించారు. కర్తవ్య భవన్‌లు 1, 2లలో న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆరోగ్య, వ్యవసాయ శాఖలతోపాటు పలు శాఖల కార్యాలయాలుంటాయి. ఈ రెండు భవనాలు డిజిటల్లీ ఇంటిగ్రేటెడ్‌గా ఉంటాయి. 4 స్టార్ సౌకర్యాలతో నిర్మించిన ఈ కార్యాలయాల్లో పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను వినియోగించారు.



స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ పథకం రెండో దశ (2.0)కు రూ. 10,000 కోట్ల మూలనిధితో ప్రభుత్వం 2026, ఫిబ్రవరి 13న ఆమోదం తెలిపింది. ప్రారంభ దశల్లో, డీప్-టెక్ పరిశోధనల్లో ఉన్న అంకుర సంస్థలకు ఇది ప్రోత్సాహం ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నూతన కార్యాలయం 'సేవా తీర్థ్'లో మొదటి రోజున పేదలు, అణగారిన వర్గాలు, రైతులు, యువ శక్తి, నారీ శక్తికి సంబంధించిన దస్త్రాలపై మోదీ సంతకం చేశారు. స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మోదీ తెలిపారు.



జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు 1969లో ప్రవేశపెట్టిన లీడ్ బ్యాంక్ పథకం (ఎల్‌బీఎస్)లో మార్పులు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇందు కోసం కొన్ని నిబంధనలను సవరిస్తూ 2026, ఫిబ్రవరి 13న ముసాయిదాను విడుదల చేసింది. బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు, ఇతర అభివృద్ధి సంస్థలను సమన్వయం చేస్తూ, ప్రాధాన్య రంగాలకు రుణ మంజూరును పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఎర్నెస్ట్ హెకెల్


శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన జర్మనీకి చెందిన ప్రముఖ జంతు, జీవశాస్త్రవేత్త. జువాలజీ రంగంలో విశేష పరిశోధనలు చేశారు. భూమిపై అప్పటి వరకు గుర్తించని అనేక కొత్త రకం జాతులను కనుక్కుని, వాటికి పేర్లు పెట్టి, వాటి వంశానుక్రమాన్ని మ్యాప్ చేశారు. జీవశాస్త్రంలో అనేక కొత్త పదాలను సృష్టించారు. వాటిలో జీవావరణశాస్త్రం (ecology), ఫైలం (phylum), ఓంటోజెనీ (ontogeny) లాంటివి ఎంతో ప్రాచుర్యం పొందాయి. డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలను బలంగా విశ్వసించడంతోపాటు వాటి ఆధారంగానే తన పరిశోధనలు సాగించారు. ఈయన 'బయోజెనెటిక్ లా' (recapitulation theory)ను ప్రతిపాదించారు. ఆవరణ వ్యవస్థలో జీవజాతుల మనుగడ, సంబంధాలు మొదలైన విషయాలపై ఆయన ప్రయోగాలు నిర్వహించి వాటిని గ్రంథస్థం చేశారు. ఫిబ్రవరి 16న ఎర్నెస్ట్ హెకెల్ జయంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విశేషాల గురించి తెలుసుకుందాం..!

ముఖ్యాంశాలు

ఈయన పూర్తి పేరు ఎర్నెస్ట్ హెన్రిచ్ ఫిలిప్ ఆగస్ట్ హెకెల్. 1834, ఫిబ్రవరి 16న జర్మనీలోని పోట్స్‌డామ్‌లో జన్మించారు. చిన్నతనం నుంచే ఆయనకు జీవుల పుట్టుక, అందులోని వైవిధ్యం, వివిధ జాతులు మొదలైనవాటిపై ఆసక్తి ఉండేది. 1843లో ఆయన మెర్సెబర్గ్‌లోని డోమ్‌జిమ్నాసియం పాఠశాలలో చేరారు. 1852లో ఆయన వైద్యశాస్త్రం అభ్యసించేందుకు వర్జ్‌బర్గ్ యూనివర్సిటీకి వెళ్లారు. 1854లో ఆయన బెర్లిన్ యూనివర్సిటీలో చేరి, తన వైద్య విద్యను కొనసాగించారు.

- 1859-66 మధ్య కాలంలో రేడియోలేరియన్లు, పొరిఫెరాన్స్ (స్పాంజ్‌లు), అనెలిడ్స్ (సెగ్మెంటెడ్ వార్మ్స్) లాంటి అనేక ఫైలాలపై పరిశోధనలు చేశారు. మధ్యధరా సముద్రంపై పర్యటించి సుమారు 700 కొత్త జాతుల రేడియోలేరియన్లకు పేరు పెట్టారు.
- 1866లో ఆయన 'బయోజెనెటిక్ లా'ను ప్రతిపాదించారు. ఓంటోజెని (ఒక జీవి అభివృద్ధి) అనేది ఫైలోజెని (జాతుల పరిణామ చరిత్ర) సంక్షిప్త రూపం అని ఆయన పేర్కొన్నారు.
- జీవశాస్త్రంపై తనకున్న అభిరుచితోపాటు తాను పరిశోధించిన విషయాలతో ఆయన పలు రచనలు చేశారు. హెకెల్ 1919, ఆగస్టు 9న మరణించారు.



ఎర్నెస్ట్ హెకెల్ జీవితంలోని పలు అంశాలు, రచనలు, సృష్టించిన పదాలు, గతంలో అడిగిన ప్రశ్నలు, జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

ప్రాంతీయ రాజ్యాలు

మొగలులు సువిశాల భారత దేశాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుని పాలించారు. ఔరంగజేబ్ మరణించాక మొగల్ సామ్రాజ్యం అనేక స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయింది. మొగల్ చక్రవర్తుల కింద సుమారు 200 ఏళ్లుగా ఉన్న రాజకీయ ఐక్యత భగ్నమైంది. ఫలితంగా ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. 18వ శతాబ్దం నాటికి ఆంగ్లేయులు భారతదేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. దేశం అనేక చిన్న రాజ్యాలుగా విడిపోయింది. ఆ కాలంలో భారత్‌లోని స్వతంత్ర రాజ్యాలు, వాటి పాత్ర మొదలైన వాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.


1757లో జరిగిన ప్లాసీ యుద్ధంతో భారతదేశ చరిత్రలో బ్రిటిష్ యుగం మొదలైందని చరిత్రకారులు పేర్కొంటారు. అయితే కొందరు మాత్రం 1761లో మూడో పానిపట్ యుద్ధంతో ప్రారంభమైందని భావిస్తారు.

18వ శతాబ్దంపై అభిప్రాయాలు

భారతదేశ చరిత్రలో 18వ శతాబ్దాన్ని పతన, చీకటి యుగంగా పేర్కొంటారు. అయితే ఈ కాలాన్ని ఒక ముఖ్యమైన సంధి యుగంగా చరిత్రకారులు గుర్తించారు. "ఈ సమయంలోనే మొగల్ సామ్రాజ్యం పతనమై, అనేక చిన్న రాజ్యాల ఆవిర్భావానికి కారణమైంది. ఈస్టిండియా కంపెనీ ఒక రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది" అని వారు అభిప్రాయపడ్డారు.

ప్రాంతీయ రాజ్యాలు

- బెంగాల్
- మైసూర్
- పంజాబ్
- అవధ్ (అయోధ్య)
- హైదరాబాద్
- కేరళ (మలబార్)



దక్షిణ భారతదేశ రాజ్యాలు/ నాయకులు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సుల్లో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Graduate Apprentice Posts

Punjab National Bank Delhi (PNB) is inviting applications for Graduate Apprentice positions across all states in the country. Total no.of posts is 5138. Application Fee is Rs.600 - Rs.800. Last date for online application is 24 February 2026.

Posts in UCIL

Uranium Corporation of India Limited (UCIL) is inviting applications for ITI Trade, Diploma Technician, and Graduate Apprentice posts in various departments. Total no.of posts is 364. Last date for online applications is 28 February 2026.

Non-Teaching Posts

Visvesvaraya National Institute of Technology (VNIT), Nagpur is inviting applications for non-academic posts of Librarian, Senior Scientific/Technical Officer, Executive Engineer, Junior Engineer, Senior Engineer, and Technician. Total no.of posts is 45. Last date for online applications is 1 March 2026.

Did You Apply..?

Today (February 16) is the last date for the following Jobs

- 59 Jobs at PGIMER. ***Eligibility:*** 10th grade, ITI, Diploma, Degree, MBA, B.Tech, Pharmacy, or Postgraduate degree.
- Project Engineer Jobs in IIT Guwahati. ***Eligibility:*** Inter/Diploma/ BTech/ MBA/ MCA/ M.Sc/ CA/ CS.degree.

For more information and other notifications - scan QR code

SSC Exams
English

Misspelled words

Directions (Q.s. 1 - 42): *Identify the CORRECTLY spelt word from the following words.*

1. A) Misscelaneous B) Miscelleneous C) Miscillaneous D) Miscellaneous

2. A) Accommodation B) Acommodation C) Accomodation D) Accomadation

3. A) Ingrediant B) Ingrident C) Ingredient D) Ingredeint

4. A) Lathergy B) Lethagry C) Lethurgy D) Lethergy

5. A) Amnetia B) Amnnesia C) Amnesia D) Amnisia

6. A) Aberance B) Aberrance C) Abberance D) Abberrance

7. A) Antecedent B) Antecedant C) Antecedint D) Anticedent

8. A) Curousity B) Curiouctiy C) Curiousity D) Curiosity

9. A) Symetry B) Cemetery C) Cemetary D) Cemetry

10. A) Sanguine B) Sanguin C) Sangune D) Sanquin

11. A) Immedeacy B) Imediacy C) Immediacy D) Immedeacy

12. A) Restuarant B) Restaurent C) Restorant D) Restaurant



13. A) Phanacea B) Panaceya C) Panacea D) Panashiya

14. A) Fascimile B) Facsimile C) Faximile D) Fasimile

15. A) Aquarium B) Aquarim C) Aquerium D) Acquarium

16. A) Commendaton B) Commendation C) Commendation D) Commendation

17. A) Annurism B) Aneurysm C) Aneursym D) Anurism

18. A) Diffussion B) Difusion C) Diffusion D) Difussion

19. A) Circumlocution B) Circlocution C) Circumlocation D) Circumlocution

20. A) Predilection B) Predilition C) Predalection D) Predilecsion

21. A) Connesir B) Connisseur C) Connoisseur D) Connoiser

22. A) Surreptious B) Surreptitious C) Surreptous D) Sureptitious

23. A) Juvinile B) Juvenille C) Juvinnile D) Juvenile

24. A) Knowledgeable B) Knowledgeble C) Knowlegeable D) Knowledgable

25. A) Deterriorate B) Deteriorate C) Detariorate D) Deterorate

26. A) Complacency B) Cumplacency C) Complacensy D) Complency

27. A) Compullsory B) Compulsorry C) Compulsory D) Compelsory

28. A) Entusiasm B) Enthussiasm C) Enthusaism D) Enthusiasm

29. A) Profeser B) Professor C) Professer D) Proffesor

30. A) Nuisence B) Nuisanse C) Nuisance D) Nuisanse

31. A) Magnificent B) Magnificient C) Magnefesent D) Magnifisent

32. A) Plagearist B) Plegiarist C) Plagerist D) Plagiarist

33. A) Remarkebel B) Remarkabel C) Remarkeble D) Remarkable

34. A) Advertiez B) Adverties C) Advertise D) Adverttise

35. A) Riverberation B) Reverberation C) Revirbration D) Revarberation

36. A) Pedestrean B) Padestrian C) Pedistrean D) Pedestrien

37. A) Laboratary B) Laboratery C) Laboratory D) Labaratory

38. A) Humein B) Humane C) Humaen D) Humain

39. A) Equanimous B) Equanamous C) Ecuanimous D) Ecuanemous

40. A) Pattriotism B) Patrotism C) Patritism D) Patriotism

41. A) Adulation B) Adlation C) Aduletion D) Addulation


42. A) Geogrophy B) History C) Chemistry D) Commarce

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert







శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు ✦ ప్రయాగ్‌రాజ్‌లో శివలింగాలకు భక్తుల పూజలు ✦ అస్సాంలోని నౌగావ్‌లో మహా మృత్యుంజయ ఆలయంలో దర్శనానికి బారులుతీరిన భక్తులు

మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన ఉప రాష్ట్రపతి, ప్రధాని

దిల్లీ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశప్రజలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో శుభాకాంక్షలు తెలిపారు. ఆ మహాదేవుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ✦ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా మోదీ ఆయనకు నివాళులు అర్పించారు. "సేవాలాల్ మహారాజ్ ప్రేరణాత్మక జీవితం దేశ ప్రజలకు మార్గదర్శకంగా ఉంటుంది" అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

భారత్ ఆలోచనా ధోరణి మారాలి: బీఎన్‌పీ

ఢాకా: భారత్‌తో సంబంధాలపై బీఎన్‌పీ కీలక వ్యాఖ్యలు చేసింది. సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అయితే కొన్ని విషయాల్లో భారత్ ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఉందని పేర్కొంది. "షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో లేదన్న వాస్తవాన్ని భారత్ గ్రహించాలి. బీఎన్‌పీకి అనుకూలంగా ప్రజలు విస్పష్టమైన తీర్పు ఇచ్చారు. బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని తక్కువ చేసే కార్యకలాపాల విషయంలో భారత్ ఉదాసీనంగా వ్యవహరించకూడదు. అప్పుడే సాధారణ దౌత్య సంబంధాల పునరుద్ధరణ సాధ్యమవుతుంది" అని బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ సలహాదారుడు హుమాయూన్ కబీర్ తెలిపారు.

బిష్ణోయ్ ముఠాలోని ఐదుగురి అరెస్ట్

- దిల్లీ వ్యాపారవేత్త హత్యకేసు..

దిల్లీ: దేశ రాజధానిలో సంచలనం సృష్టించిన వ్యాపారవేత్త వైభవ్ గాంధీ హత్య కేసులో లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. ఈ నెల నార్త్ దిల్లీలోని జనావాస పారిశ్రామిక ప్రాంతంలో వైభవ్‌ను కాల్చి చంపిన ఘటనలో నిందితుల కదలికలపై సమాచారం అందుకున్న పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నిందితులు పోలీసులపైకి కాల్పులు జరిపి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఓ నిందితుడి కాలికి బుల్లెట్ గాయమైంది. ఘటనా స్థలంలో ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, తదుపరి విచారణలో మరో ఇద్దరిని అరెస్టేచేశారు.

ఏనుగు దాడిలో మహిళ మృతి

బహరాయిచ్: ఏనుగు దాడిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. లఖింపూర్ ఖేరీ జిల్లాలోని పరాస్ పూర్వా గ్రామానికి చెందిన మున్నీ దేవి(45). తన ఇద్దరు కుమారులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. వారిపై కటార్నియాఘాట్ అటవీ ప్రాంత సమీపంలో ఏనుగు దాడి చేసింది. దీంతో మున్నీ దేవి అక్కడికక్కడే మృతిచెందారు.

యూనస్ పయనమెటు?



ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. తన క్యాబినెట్ కూర్పుపై ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఇప్పటివరకు బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక సారథిగా వ్యవహరించిన మహ్మద్ యూనస్ తదుపరి పయనం ఎటువైపు అనే విషయం ఆసక్తిగా మారింది. క్లిష్ట సమయంలో దేశాన్ని ముందుండి నడిపించిన ఆయన, నూతన ప్రభుత్వంలో భాగస్వామి అవుతారా? ప్రత్యేక బాధ్యతలు అందుకుంటారా? అన్న విషయంపైనా చర్చ జరుగుతోంది.

ఉద్రిక్తతల వేళ మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్ వీడిన తర్వాత.. 2024 ఆగస్టులో తాత్కాలిక ప్రభుత్వానికి సారథిగా (ముఖ్య సలహాదారు) మహ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. దేశం అత్యంత అస్థిర పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో ఓ ప్రభుత్వ సంరక్షకుడిగా కొనసాగిన ఆయన.. 18 నెలల పాటు తన విధులను నిర్వర్తించారు. ఎన్నికల నిర్వహణలోనూ కీలకంగా వ్యవహరించారు. ఇవే కాకుండా రాజకీయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఒకే వ్యక్తికి ప్రధాని పదవిని రెండు పర్యాయాలకు పరిమితం చేయడం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, మహిళల ప్రాతినిధ్యం పెరుగుదల, ఎన్నికల సమయాల్లో తటస్థంగా వ్యవహరించే తాత్కాలిక ప్రభుత్వాల ఏర్పాటు సిఫార్సులను పొందుపరిచారు. ఈ రెఫరెండానికి సంబంధించి తాజా ఎన్నికల్లో మెజార్టీ ప్రజలు మద్దతు పలికారు.

అధ్యక్షుడు అవుతారా?

బంగ్లాలో బీఎన్‌పీ చీఫ్ రెహమాన్ నేతృత్వంలో ఏర్పడే కొత్త ప్రభుత్వంలో యూనస్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయంగా యూనస్‌కు ఉన్న బలమైన సంబంధాల కారణంగా అధ్యక్షుడిగా ఎంచుకునే అవకాశం ఉందని స్థానిక రాజకీయాలను విశ్లేషించే డేవిడ్ బెర్గ్‌మన్ అనే కాలమిస్ట్ అంచనా వేశారు. ప్రపంచ స్థాయిలో ఆయనకున్న గుర్తింపు మరో బంగ్లాదేశీ నేతకు లేదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే బీఎన్‌పీ, మహ్మద్ యూనస్ మధ్య చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చినప్పటికీ.. యూనస్ ప్రతినిధి మాత్రం వాటిని తోసిపుచ్చారు. ఆయనకు రాజకీయాలపై అంతగా ఆసక్తి లేదన్నారు. సంక్షోభ పరిస్థితుల్లో తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడిగా కొనసాగిన యూనస్ సేవలను తారిఖ్ రెహమాన్ ఉపయోగించుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నూతన ప్రభుత్వానికి రాజకీయ లేదా ఆర్థిక సలహాదారుగా నియమించుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. భవిష్యత్తుపై ప్రస్తుతానికి యూనస్ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ.. బీఎన్‌పీ చేసే ప్రతిపాదనను అంగీకరించే అవకాశాలే ఎక్కువని తెలుస్తోంది.

జంటల్లో జన్యుపరమైన జాగ్రత్తలకు చిట్టా

- బిహార్‌లో 700 ఏళ్ల ప్రాచీన పెళ్లి వ్యవస్థ


ఈటీవీ భారత్: ఒకే గోత్రం ఉన్నవారు, దగ్గరి రక్త సంబంధీకులు పెళ్లి చేసుకోవద్దని వందల ఏళ్ల క్రితమే మన పూర్వీకులు శాస్త్రీయంగా ఆలోచించారు. జన్యుపరమైన సమస్యల ముప్పు నుంచి భావితరాలను కాపాడే లక్ష్యంతో గొప్ప సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఈ దిశగా బిహార్‌లోని మిథిల ప్రాంతంలో గత 700 ఏళ్లుగా ప్రణాళికాబద్ధంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆధారాలు ఉన్నాయి. ఇందుకోసం శతాబ్దాలుగా కృషి చేస్తున్న వ్యవస్థ పేరే 'పంజీ ప్రథా'. రికార్డుల నమోదు అని దీనికి అర్థం. వివాహ వివరాలను సమగ్రంగా అక్షరబద్ధం చేసే మతం, సైన్సుల సంగమ వ్యవస్థే పంజీ ప్రథా. చారిత్రక మిథిల ప్రాంతం బిహార్‌లోని దాదాపు 20 జిల్లాల్లో విస్తరించి ఉంది. మధుబని, దర్భంగా, సీతామఢీ, సహర్సా, సుపౌల్, మాధేపురా జిల్లాలు వీటిలో ముఖ్యమైనవి. మిథిలలోని కర్ణాట్ వంశానికి చెందిన చివరి రాజుగా హరిసింగ్ దేవ్ (1304 - 1325) వ్యవహరించారు. ఈయనే పంజీ ప్రథా వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. మైథిల్ బ్రాహ్మణులు, కర్ణ కాయస్థ వర్గం వారిలో చాలామంది నేటికీ ఇదే వివాహ వ్యవస్థను అనుసరిస్తున్నారు. వివాహ సంబంధాలను చూసే క్రమంలో పంజీకార్‌ను సంప్రదిస్తారు. పంజీకార్ అంటే వివాహ వివరాలను నమోదు చేసి, ఆ రికార్డులను నిర్వహించే నిపుణుడు. వచ్చిన పెళ్లిసంబంధం వివరాలను పంజీకార్‌కు చూపితే, ఆయన తన దగ్గరున్న పాత రికార్డుల చిట్టాను విప్పుతారు. గోత్రం ఆధారంగా వరుడి ఏడు తరాలు, వధువు తాలూకు అయిదు తరాల సమాచారాన్ని సేకరించి విశ్లేషిస్తారు. ఏక గోత్రం, రక్తసంబంధం వంటి సమస్యలేవీ లేకపోతే.. పెళ్లికి అభ్యంతరం లేదంటూ 'అస్వజన్' ప్రమాణపత్రాన్ని పంజీకార్ జారీ చేస్తాడు. అనంతరం ఆ వధూవరుల పెళ్లికి ఏర్పాట్లు మొదలవుతాయి. ఇలా పెళ్లికి కొన్ని రోజుల ముందు వధువు తండ్రికి పంజీకార్ అందించే వివాహ నిరభ్యంతర ధ్రువపత్రాన్ని సిద్ధాంత పత్రం అంటారు.



వివాహాలకు సంబంధించిన పాత రికార్డులు పరిశీలిస్తున్న పంజీకార్

✦ బిహార్‌లోని జిల్లా కేంద్రం మధుబనికి 6 కి.మీ.ల దూరంలో సౌరథ్ సభ అనే చారిత్రక గ్రామం ఉంది. ఈ ఊరిలోనే విశాలమైన స్థలంలో పంజీకార్‌ల కార్యాలయ భవనం ఉంది. సౌరథ్ సభ గ్రామంలోని దాదాపు 22 ఎకరాల భూమిని సామూహిక వివాహ వేడుకల కోసం వినియోగిస్తుంటారు. ఏటా జ్యేష్ఠ - ఆషాఢ మాసాల సీజనులో ఇక్కడ పెద్దసంఖ్యలో మైథిల్ బ్రాహ్మణుల సామూహిక వివాహాలు జరుగుతుంటాయి. ఈ 22 ఎకరాల భూమిని పంజీకార్‌లకు దర్భంగా మహారాజు దానం చేశారని చెబుతుంటారు. నేటికీ ఈ ఊరు కేంద్రంగా మిథిల ప్రాంతంలో పంజీకార్ (వివాహ రిజిస్ట్రార్) వ్యవస్థ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఆరోగ్యకరమైన భావితరాల సాధనకు పాటుపడుతోంది. పంజీప్రథా రికార్డుల వ్యవస్థను డిజిటలైజ్ చేయాలని పలువురు కోరుతున్నారు. సాధారణంగా పంజీకార్‌లుగా పనిచేసినవారి పిల్లలే మళ్లీ ఆ వృత్తిలోకి వస్తుంటారు. ఇప్పుడీ పని చేసేవారికి అరకొర వేతనాలే లభిస్తున్నాయి. దీనివల్ల పంజీకార్ అయ్యేందుకు చాలామంది యువత ఆసక్తి చూపడం లేదు.

గ్రహాంతర జీవులు ఉన్నాయి.. కానీ.. : ఒబామా



ఇంటర్నెట్ డెస్క్: అంతుచిక్కని రహస్యంగా మారిన గ్రహాంతరవాసులపై ఎన్నో ఊహాగానాలు వస్తుంటాయి. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువుల వంటి వాటితో అమెరికాలోని 'ఏరియా 51'కు బలమైన సంబంధాలున్నాయన్న ప్రచారమూ ఉంది. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏదో ఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను ఏరియా 51లో అమెరికా నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని స్పష్టంచేశారు. దీనిని నిరూపించడానికి ఎటువంటి ఆధారాలు కూడా లేవన్నారు. దశాబ్దం క్రితం అమెరికా వైమానిక దళం రీపర్ డ్రోన్లు సేకరించిన రాడార్ రికార్డింగ్‌లలో పశ్చిమాసియా కొన్ని ప్రాంతాలపై అసాధారణ జీవుల ఉనికి కనిపించిందని పలు నివేదికలు సూచిస్తుండడంపై ఒబామా స్పందించారు. గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తాను అధికారంలో ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు.

ఏమిటీ ఏరియా 51?

అమెరికాలోని నెవాడలో ఉన్న 'ఏరియా 51' అత్యంత రహస్య ప్రాంతం. ఇక్కడ అమెరికా సైన్యం, శాస్త్రవేత్తలు ఆయుధాలు సహా పలు రకాల సాంకేతిక పరిజ్ఞానాలపై పరీక్షలు చేస్తుంటారు. ఇక్కడ సైనిక శిక్షణ కూడా ఇస్తారు. ఈ స్థావరాన్ని 1955లో ఏర్పాటు చేశారు. నెవాడ ఎడారిలో 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇది ఉంది. ఇక్కడ గతంలో లాక్‌హీడ్ మార్టిన్ యూ-2 నిఘా విమానాలను పరీక్షించారు. ఆ తర్వాత నుంచి పలు రహస్య యుద్ధ విమానాల పనితీరును ఇక్కడ అంచనా వేశారు. ఒకప్పుడు ఇక్కడ ఉపగ్రహ చిత్రాలు తీయడంపై నిషేధం ఉండేది. కానీ, ఇప్పుడు దానిని తొలగించారు.

ట్యాంకర్ నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా బలగాలు

వాషింగ్టన్: ఆంక్షలు ఎదుర్కొంటున్న చమురు రవాణా నౌక వెరానికా-3లోకి అమెరికా బలగాలు ప్రవేశించాయి. హిందూ మహాసముద్రంలో ఈ ఘటన జరిగింది. వెనెజువెలాతో సంబంధమున్న అక్రమ చమురును లక్ష్యంగా చేసుకోవడంలో భాగంగా అమెరికా బలగాలు ఈ చర్యను చేపట్టాయి. సంబంధిత రవాణా నౌకపై కరీబియన్ సముద్రం నుంచి వెంటాడుతూ వెళ్లాయి.

వెనెజువెలా చమురుపై కొన్నేళ్లుగా అమెరికా ఆంక్షలు కొనసాగుతున్నాయి. అయినా 'షాడో ట్యాంకర్ల'తో ముడి చమురును ఇతర దేశాలకు ఆ దేశం ఎగుమతి చేస్తోంది. వెనెజువెలా నాటి అధ్యక్షుడు నికోలస్ మదురోపై ఒత్తిడి పెంచేందుకు.. ఆంక్షలు ఎదుర్కొంటున్న ట్యాంకర్లను తీరానికే పరిమితం చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిసెంబరులో అమెరికా బలగాలను ఆదేశించారు. జనవరి 3న అమెరికా బలగాలు ఒక ఆపరేషన్‌ను నిర్వహించి మదురోను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వెరానికా-3 సహా ఆంక్షలు ఎదుర్కొంటున్న అనేక ట్యాంకర్ నౌకలు వెనెజువెలా తీరాన్ని వీడాయి. వాటిపై అమెరికా బలగాలు కన్నేశాయి. గత వారం ఆక్విలా-2 అనే నౌకను స్వాధీనం చేసుకున్నాయి. తాజాగా పట్టుబడ్డ వెరానికా-3 నౌకలో 20 లక్షల బ్యారళ్ల ముడి చమురు ఉంది.

'అన్సార్ ఇంటరిమ్'... ఇది వైద్యుల ఉగ్రసంస్థ

శ్రీనగర్: దిల్లీ ఉగ్రపేలుడు కేసుకు సంబంధించి జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్న వైద్యులు 2016 నుంచి ఉగ్రవాదంవైపు మళ్లినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఆదివారం వెల్లడించింది. ఈ వైద్యులంతా కలిసి కొన్నేళ్ల క్రితమే 'అన్సార్ ఇంటరిమ్' పేరుతో ఓ ఉగ్రసంస్థను ఏర్పాటు చేసుకుని పలు ప్రాంతాల్లో విధ్వంస కార్యకలాపాలు జరిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని తెలిపింది. గతేడాది నవంబరు 10న ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుడులో కీలక నిందితుడైన ఉమర్ నబీ 2016, 2018 సంవత్సరాల్లో వివిధ ఉగ్రవాద సంస్థల్లో చేరేందుకు విఫలయత్నాలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు సేకరించిన ఆధారాల ప్రకారం...ముజమ్మిల్ గనీ, ఉమర్ నబీ, ఆదిల్, ముజఫర్, మౌల్వీ ఇర్ఫాన్, కారీ ఆమిర్, తౌఫిల్ గాజి కలిసి 2022 ఏప్రిల్‌లో శ్రీనగర్‌లో సమావేశమయ్యారు. అదే సమయంలో వారు 'అన్సార్ ఇంటరిమ్' అనే సంస్థను ప్రారంభించారు. దీనికి ఆదిల్ చీఫ్‌గా, ఉమర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ ముఠా 2023లో పేలుళ్లకు అవసరమైన ఎరువులను హరియాణాలోని సోనా, నూహ్ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసింది. ఉమర్ సూచనల మేరకు ఫరీదాబాద్‌లోని ఓ రసాయన దుకాణం నుంచి పొటాషియం నైట్రేట్‌ను తెప్పించారు. ఐఈడీల తయారీ కోసం ఉమర్ ఆన్‌లైన్ వీడియోలను చూసేవాడని దర్యాప్తులో తేలింది. శ్రీనగర్‌లో పోలీసులు జరిపిన సోదాల్లో గనీ పట్టుబడటంతో ఆందోళనకు గురైన ఉమర్...దిల్లీలో పేలుడుకు పాల్పడ్డాడు.

ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించిన నలుగురు వ్యోమగాములు

కేప్ కెనావెరాల్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి నలుగురు వ్యోమగాములు ప్రవేశించారు. దీంతో ఆ కేంద్రం పూర్తి సామర్థ్యాన్ని సాధించినట్లయింది. గత నెలలో వైద్యపరమైన అత్యవసర పరిస్థితి కారణంగా నలుగురు వ్యోమగాములు అర్ధాంతరంగా భూమికి తిరిగొచ్చిన సంగతి తెలిసిందే. వారి స్థానాన్ని ఇప్పుడు మరో నలుగురితో భర్తీ చేయాల్సి వచ్చింది. ఐఎస్ఎస్‌లోకి చేరిన వారిలో అమెరికాకు చెందిన జెస్సికా మెయిర్, జాక్ హాథవే, ఫ్రాన్స్ వ్యోమగామి సోఫీ ఆడెనాట్, రష్యాకు చెందిన ఆండ్రెయ్ ఫెద్యయేవ్‌లు ఉన్నారు. ఇప్పటికే ఈ కేంద్రంలో ఉన్న వ్యోమగాములు వీరికి స్వాగతం పలికి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. తాజాగా ఐఎస్ఎస్‌కు చేరినవారు 8-9 నెలల పాటు రోదసిలో ఉంటారు.

గాజా పునర్నిర్మాణానికి 500 కోట్ల డాలర్లు!

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వెస్ట్ పాం బీచ్: యుద్ధంతో ధ్వంసమైన గాజా పునర్నిర్మాణానికి తాను నెలకొల్పిన శాంతి మండలి సభ్య దేశాలు 500 కోట్ల డాలర్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతోపాటు అంతర్జాతీయ సుస్థిరత, భద్రతా దళాల కోసం సభ్య దేశాలు వేల సంఖ్యలో సిబ్బందిని అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. గురువారం జరిగే శాంతి మండలి తొలి సమావేశంలో ఈ సాయంపై అధికారిక ప్రకటన చేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఏయే దేశాలు ఆర్థిక వితరణ చేయనున్నాయనే వివరాలను ఆయన వెల్లడించలేదు. ఇదిలా ఉండగా జూన్ చివరినాటికి గాజాలో శాంతి స్థాపన, సహాయక కార్యక్రమాల కోసం తమ దేశం నుంచి 8 వేల మంది సిబ్బందిని తరలించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఇండోనేసియా ఆదివారం ప్రకటించింది.

ప్రకృతి సాగే బాగు.. పోషణ్ వాటికల్లో శిక్షణ



రాజస్థాన్‌లోని జైపుర్ జిల్లా బిచూన్ గ్రామ పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతు సురేంద్ర అవానా. ఈ పద్ధతిలో ప్రస్తుతం గోధుమలు, బార్లీ, ఆవాలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలను ఆయన పండిస్తున్నారు. నిత్యం ఎంతోమంది రైతులకు సురేంద్ర విలువైన సూచనలు చేస్తూ ప్రకృతి సాగు వైపు మళ్లేలా ప్రోత్సహిస్తున్నారు. ఇందుకుగాను ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు ఆయనను వరించాయి. ఆహార స్వచ్ఛతను మెరుగుపర్చడం కోసం భారత ప్రభుత్వం సైతం ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్' (ఎన్ఎంఎన్ఎఫ్) అనే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2024 నవంబరు నుంచి అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎంపికయ్యే రైతులకు రూ.4 వేల చొప్పున రెండేళ్లపాటు ప్రోత్సాహకాన్ని అందిస్తారు. తాజా కూరగాయలను పండించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో 'పోషణ్ వాటికలు' పేరిట సామాజిక వనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పై పథకం కింద ఎంపికైన రాజస్థాన్ రైతులకు ఈ పోషణ్ వాటికల్లో ప్రకృతి సాగుపై శిక్షణ ఇస్తున్నట్లు సురేంద్ర తెలిపారు.

మహారాష్ట్రలో కులరహిత గ్రామం!



మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లా పరిధిలో గల సౌందాలా గ్రామ పంచాయతీ విభిన్న తీర్మానాన్ని ఆమోదించింది. "మాది కులరహిత గ్రామం, మా అందరిది మానవ కులం" అని ఆ గ్రామస్థులు ప్రకటించారు. రెండు వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో ఫిబ్రవరి 5న ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి కులమతాలకు అతీతంగా గ్రామస్థులంతా తరలివచ్చి రక్తదానం చేశారు. ఆ వెంటనే జరిగిన గ్రామసభలో సర్పంచి శరద్ అర్గాడే కీలక ప్రకటన చేశారు. మనుషులందరి రక్తం ఎరుపు రంగులోనే ఉన్నందున, ఊరిని కులరహితంగా మారుద్దామని ప్రతిపాదించారు. ఈ తీర్మానానికి గ్రామస్థులు అందరూ ఆమోదముద్ర వేశారు. "మతపరమైన ఘర్షణలు, కులవివక్ష, మానవహక్కుల ఉల్లంఘనలకు మా గ్రామం దూరంగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. దీనికి విరుద్ధంగా ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటాం. ప్రజల మధ్య సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావాన్ని పెంపొందించాలనే భారత రాజ్యాంగం కూడా చెబుతోంది. మా గ్రామ సభ తీర్మానం కాపీని మహారాష్ట్ర ప్రభుత్వానికి పంపుతున్నాం" అని శరద్ అర్గాడే 'ఈటీవీ భారత్'కు తెలిపారు. వరకట్న నిషేధం అమలులో ఉన్న ఈ గ్రామంలో ప్రతిరోజు ఉదయం 10 గంటలకు లౌడ్ స్పీకర్లలో జాతీయగీతాన్ని వినిపిస్తారు.

ఏప్రిల్ 22న తెరచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు



రుద్రప్రయాగ్: ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు భక్తుల దర్శనార్థం ఏప్రిల్ 22న మళ్లీ తెరచుకోనున్నాయి. ఉత్తరాఖండ్‌లోని ఈ పవిత్ర క్షేత్రాన్ని శీతాకాలం నేపథ్యంలో దాదాపు 6 నెలలుగా మూసి ఉంచారు. ఈ ఆలయాన్ని ఏప్రిల్ 22న ఉదయం 8 గంటలకు తెరవనున్నట్లు అధికారులు వెల్లడించారు. మహాశివరాత్రి సందర్భంగా ఓంకారేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. పంచాంగం, హిందూ క్యాలెండర్‌ల ప్రకారం ఈ ముహూర్తాన్ని ఖరారు చేసినట్లు తెలిపారు. దీంతో గర్వాల్ హిమాలయాల్లో చార్‌ధామ్ యాత్ర షెడ్యూల్ కూడా ఖరారైంది. బద్రీనాథ్ ఆలయం ఏప్రిల్ 23న తెరచుకోనుండగా.. గంగోత్రి, యమునోత్రి ఆలయాలు ఏప్రిల్ 19న అక్షయ తృతీయ నాడు తిరిగి తెరచుకోనున్నాయి.

పేలుళ్లను నియంత్రించే స్మార్ట్ గ్యాస్ లీక్ డిటెక్టర్

- మేఘాలయ విద్యార్థి ఆవిష్కరణకు అవార్డు

షిల్లాంగ్: మేఘాలయలోని తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గ్యాస్ లీక్‌ను గుర్తించి ప్రమాదాన్ని నివారించే పరికరాన్ని రూపొందించాడు. ఇందుకుగానూ అతనికి నార్త్ ఈస్ట్ సైన్స్ ఫెయిర్ అండ్ ఇన్నోవేషన్ ఫెస్టివల్‌లో జ్యూరీ అవార్డు లభించింది. గువాహటిలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్-నేషనల్ సైన్స్ సెంటర్ నిర్వహించిన కార్యక్రమంలో జేమ్స్ డొనాల్డ్ ఖార్కొంగోర్‌కు ఈ అవార్డు లభించింది. ఈ స్మార్ట్ ఎల్‌పీజీ సేఫ్టీ అండ్ హజార్డ్ ప్రివెన్షన్ సిస్టమ్.. గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి అధునాతన గ్యాస్ సెన్సర్లను ఉపయోగిస్తుంది. గ్యాస్ సాంద్రత సురక్షిత స్థాయిలను దాటినప్పుడు అలారంను మోగిస్తుంది. పేరుకుపోయిన వాయువును చెదరగొట్టడానికి అందులోని ఆటోమేటెడ్ ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఆన్ అవుతుంది. ఆటోమేటిక్ సోలనాయిడ్ వాల్వ్ ఈ పరికరం ప్రత్యేకత. ఇది లీక్‌ను గుర్తించిన వెంటనే గ్యాస్ సరఫరాను నిలిపివేస్తుంది. పేలుడు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది. ఈ పరికరాన్ని ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)తో అనుసంధానించడం వల్ల దూరప్రాంతం నుంచే దీన్ని పర్యవేక్షిస్తూ, రియల్ టైమ్ నోటిఫికేషన్లు అందుకోవచ్చు.



